


# మురళి వూదే పాపడు

మరికొన్ని కథలు

దాదాహయాత్

పి. శ్రీదేవి నారాయణ గారికి,



శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి సంకలనానికి
సంపాదకత్వ భాధ్యత వహించి అందంగా
అందించినందుకు కృతజ్ఞతాభివందనాలతో

# మురళి వూదే పాపడు

**దాదా హయాత్**

ఇది
భవదీయుడు
కె. దాదా ఖలందర్

# రచయిత గురించి

దాదాహయాత్ పూర్తిపేరు నదీంసాహెబ్ గారి దాదాహయాత్.

తండ్రి: ఎన్. బాబ్‌జాన్

తల్లి: ఎన్. ఛోటీ రసూల్ బీ

పుట్టింది: వెంకటగిరి, నెల్లూరుజిల్లా

స్వస్థలం: ప్రొద్దుటూరు, కడపజిల్లా

పుట్టినతేది: 10-10-1960

చదివింది: బి.ఏ, బి.ఎల్.

వృత్తి: న్యాయవాది

ఇప్పటిదాకా రాసినవి: 'ఆంధ్రజ్యోతి', 'ఆంధ్రప్రభ', 'ఉదయం', 'మయూరి' ఇత్యాది వివిధ పత్రికల్లో సుమారు అరవై కథలు ప్రచురితమైనాయి. ఇవికాక ఆకాశవాణిలో మరో పదిహేను కథలు దాకా వచ్చాయి. తొలికథ 'అహింస' భారతీయ భాష లన్నింటిలోనూ అనువాదమై జ్ఞానపీఠం వారి కథాసంకలనంలో చోటు చేసుకుంది. 'మురళి వూదే పాపడు' సాహిత్య అకాడెమీ వారి సంకలనంలో వచ్చింది. కథాసాగర్‌వారి నూరు కథల సంకలనం, విశాలాంధ్రవారి నూరు కథల సంకలనం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి నూరు కథల సంకలనం, వాసిరెడ్డి నవీన్ గారి కథాసిరీస్ వంటి అనేక సంకలనాలలో కథలు చోటు చేసుకున్నాయి.

పురస్కారం: 2016లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు భాషా పురస్కారంతో సత్కరించారు.

ప్రస్తుత చిరునామా: 4/182, నెహ్రూరోడ్, ప్రొద్దుటూరు.

# మురళి వూదే పాపడు

22 కథల సంపుటి

**దాదా హయాత్**

అమరావతి పబ్లికేషన్స్
సాయిబాబారోడ్, గుంటూరు-522007

# మురళి వూదే పాపడు

**మరికొన్ని కథలు**

---

**దాదా హయాత్**


ప్రథమ ముద్రణ: అక్టోబర్ 2017

ముఖచిత్రం: బాపు

లే అవుట్ డిజైన్: **కె. రామకృష్ణ**

ప్రచురణ:

**అమరావతి పబ్లికేషన్స్**

4-21-81, చైతన్యపురి, సాయిబాబా రోడ్,

గుంటూరు-522 007 ఫోన్: 92915 30714

సోల్ డిస్ట్రిబ్యూటర్స్:

**విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, విజయవాడ,**

**నవచేతన పబ్లిషింగ్‌హౌస్, హైదరాబాద్**

ప్రతులకు:

**విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచీలు**

విజయవాడ, విశాఖపట్నం, అనంతపురం, గుంటూరు,

తిరుపతి, ఒంగోలు, కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం

**నవచేతన బుక్‌హౌస్ బ్రాంచీలు**

హైదరాబాద్, హనుమకొండ, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం

ముద్రణ:

**రెయిన్‌బో ప్రింట్ ప్యాక్, హైదరాబాద్**

వెల: రూ. **150/-**

అంకితం

**మా అమ్మకు**

జీవితాన్ని చదవడం నేర్పినందుకు.

# కథా రచనలో నిగ్రహభార్గవుడు

దాదాహయాత్ న్యాయవాది, కథా రచయిత. రచయితగానే గాక వ్యక్తిగా కూడా హయాత్ నెమ్మదస్తుడు. తన వ్యక్తిత్వం ద్వారా గాని, తన రచనల ద్వారా గాని సమాజంలో ఉద్రిక్తత కలిగించడం ఆయన ఉద్దేశం కాదు, ఆలోచనలు కలిగించడం ఆయన రచనా లక్ష్యం. ఆయన తాను ముస్లిం గనుక కథలన్నీ ముస్లిముల మీదనే రాయలేదు. తాను న్యాయవాది గనుక కథలన్నీ న్యాయవ్యవస్థ పైనే రాయలేదు. తాను రాయలసీమ వాసి గనుక కథలన్నీ రాయలసీమ పైనే రాయలేదు. దాదాహయాత్‌లో స్థలకాలబద్ధుడైన ఒక సంపూర్ణ భారతీయుడున్నాడు. తనను గురించీ, తన జాతిని గురించీ రాస్తూ, తన చుట్టూ ఉన్న మిగతా సమాజం గురించి రాసే రచయిత సంపూర్ణ భారతీయ రచయిత.

ఈ సంపుటిలో 22 కథలున్నాయి. వీటిని 1983-2001 మధ్య ప్రచురించారు హయాత్. దాదాపు రెండు దశాబ్దాలలో ఆయన రాసిన కథలవి. పరిమాణంలో పరిమితంగా కనిపిస్తున్నా, సామాజిక పరిణామాలను, సామాజిక వాస్తవికతను చిత్రించడంలో రచయిత నిజాయితీగా వ్యవహరించారు. హయాత్ సమస్యలు లేని సమాజం కావాలన్న ఆకాంక్ష ఉంది. మనుషులందరూ పసిపిల్లల్లాగా నిష్కల్మషంగా ఉండాలని ఆయన అభిలాష. సంపన్నులంతా పేదవాళ్ళలాగా మానవీయంగా ఉండాలని ఆయన ఆశ. ఆడవాళ్ళను మగవాళ్ళు మనుషులుగా చూడాలని, తమతో సమానంగా చూడాలని ఆయన తపన. కళ ధనపిశాచి కోరల్లో ఇరుక్కోరాదని ఆయన దృఢమైన అభిప్రాయం. పేదరికాన్ని మన సమాజంనుండి తరిమి కొట్టాలని ఆయన సంకల్పం. పేదరికం పేదవాళ్ళ ఉనికికి ఊనం తేకూడదని, ధనిక పేద వర్గాలున్న సమాజంలో కాకుల్ని కొట్టి గద్దలకు వేసే దుర్మార్గం నశించాలని ఆయన అభిప్రాయం. ఆయన కలలన్నీ ఇలా ఉంటాయి. ఇవన్నీ అభ్యుదయ కలలు.

ఈ కథలు భారతదేశ చరిత్రలో స్వాతంత్ర్యానంతర రెండవ దశకు చెందినవి. అంటే అత్యవసర పరిస్థితి చీకటి రోజుల తర్వాతి కాలానికి చెందినవి. స్వాతంత్ర్యానంతర రెండవ

దశలో భారతదేశంలో రాజకీయంగా చాలా చాలా పరిణామాలు వచ్చాయి. ప్రాంతీయ పార్టీల సుడిగాలి వీచింది. అణగారిన వర్గాల ప్రజల కుల, మత, జండర్, ప్రాంత, భాషా చైతన్యాలు పెల్లుబికాయి. ఆధిపత్య ధోరణి కూడా తక్కువ తినలేదు. రాజకీయ అస్థిరత పెరిగింది. ఏవేవో రాజకీయ పరిణామాలు సంభవిస్తున్నా సామాజిక సమస్యలు మాత్రం అలాగే ఆగిపోయాయి. పాలకులు మారుతున్నా, నినాదాలు, విధానాలు మారుతున్నా సమస్యలు సమస్యలు గానే కొనసాగుతున్నాయి. కుర్చీలలో కూర్చొనేవాళ్ళు మారుతున్నారు గానీ, కుర్చీ స్వభావం మారలేదు. పునాదిలో మార్పు లేని రాజ్య స్వభావం ఇలాగే ఉంటుంది. ఈ రాజ్య స్వభావాన్నే హయాత్ తన కథల్లో చిత్రించారు. శాసన, కార్య నిర్వాహణ, న్యాయవ్యవస్థలనీ మూడు స్తంభాల కింద నలిగిపోతున్న మనుషుల బతుకుల చిత్రాలు హయాత్ కథలు.

వర్తమాన రాజకీయ మరణంమీద హయాత్ ఎక్కువ కథలు రాశారు. గాంధీ పేరు చెప్పి ఆధిపత్య కులాలవాళ్ళు ఒక దళితవాడను నిర్మూలించి అడ్డం తొలగించుకునే రాజకీయ కుట్రను ప్రదర్శన కథలో వాస్తవికంగా చిత్రించారు. దళితులకు భూమి పంపకం నెపంతో భూములను లాక్కుని, చివరికి ఆధిపత్య కులాలవాళ్ళు భూమిని తమ భూములలో కలుపుకునే రాజకీయ ఆర్థిక కుట్రను 'ఎల్లువ' కథలో ఆవిష్కరించారు. 2014 సార్వత్రిక ఎన్నికలలో మద్యం ఏరులై పారితే డబ్బు కట్టలై పారింది. భారతీయ రాజకీయాలు అనారోగ్యకర పెట్టుబడి రాజీ దశ చేరుకున్న వాస్తవం రుజువైంది. హయాత్ ఎన్నికలలో డబ్బు పాత్రను రుజువు చేస్తూ 1995లోనే 'సెగమంటలు' కథ రాశారు. ఎన్నికల రాజకీయాలలో సామాన్యులు శలభాల్లా ఆహుతై పోయిన వాస్తవానికి ఈ కథ ప్రతిబింబం. కోర్టులు పోలీసులు అన్నీ మీవైపే అన్నారు శ్రీశ్రీ. హయాత్ గ్రామ రాజకీయాలలో చితికిపోయే సామాన్యుల వైపు ఉండవలసిన కార్యనిర్వాహక వర్గం సంపన్నత వైపు నిలవటాన్ని 'ఏటి ఒడ్డు చేపలు' కథలో హయాత్ ప్రతిఫలించారు. అసమసమాజం గతంలో ఉంది. ఇప్పుడూ ఉంది. అసమసమాజ నిర్మూలనకు ప్రజా ఉద్యమాలే సాధనాలు. అవి నిరంతరాయంగా కొనసాగాలి. ఈ బాధ్యతను గుర్తు చేసే కథ 'చరిత్ర'!

ఆర్థిక దారిద్ర్యం, ఆర్థిక అసమానత సామాజిక జీవితంలో ఎంత క్రూరమైన పాత్ర నిర్వహిస్తుందో దాదాహయాత్ కొన్ని కథలలో ఆవిష్కరించారు. పేదరికంతో బాలికలు బొంబాయి వేశ్యా గృహాలకు వెళ్ళిపోయే దుస్థితిని 'జడ్జిమెంట్' ప్రతిబింబించగా, దీపావళి వంటి ముఖ్యమైన పండుగ చేసుకోవడానికి ఒక పేదవాడు పడే వేదనను 'పేదవాడి దీపావళి' ప్రతిఫలించింది. పేదరికం వల్ల ఆర్థిక సమస్య చుట్టుముట్టినప్పుడు జోస్యం,

లాటరీ వంటి మౌఢ్యాన్ని వ్యామోహాన్ని ఆశ్రయించవలసి వచ్చే అనివార్యతను భావితరం కథ ఆసక్తికరంగా చిత్రించింది. మురికి శరీరంతో మూర్తీభవించిన దైన్యంగా కనిపిస్తూ సంచి వీపుకు తగిలించుకొని చిత్తు కాగితాలు ఏరుకునే పిల్లవాడిలో ఉండే జ్ఞాన తృష్ణకు కథారూపం 'వ్యర్థజీవి'. అలాంటి వ్యక్తిలోనూ మానవత్వాన్ని ఆవిష్కరించారు హయాత్.

సమాజంలో ఎంతో మార్పు వస్తున్నా, ఎన్ని ఉద్యమాలు నడుస్తున్నా స్త్రీ వివక్ష ఏదో ఒక రూపంలో కొనసాగుతున్న వైనాన్ని 'ప్రసూతి వార్డు'లో ప్రతిబింబించారు హయాత్. వివాహ వ్యవస్థలో ధనం పాత్ర రోజు రోజుకూ బలపడుతూ సకల మానవీయ నాగరిక విలువలు ధ్వంసమై పోతూ ఉండడం 'ఆశీర్వాదం' కథలో కళాత్మకంగా దర్శనమిస్తుంది.

ప్రతి ఉద్యోగి ఒక పెన్షనర్ అవుతాడు (ఇప్పుడు వ్యవస్థను రద్దు చేశాయి ప్రభుత్వాలు, రాజకీయ నాయకులకు మాత్రం పెన్షన్ రద్దు కాలేదు). మూడు దశాబ్దాలకు పైగా ఉద్యోగం చేసిన మాజీ ఉద్యోగులకు పెన్షన్ చెల్లించడంలో సాటి ఉద్యోగులు అవినీతికి పాల్పడే దుర్గార్మం మీద రచయిత ఝుళిపించిన కొరడా 'మాజీలు'. ఈ కథను చదివి సంస్కారాన్ని సవరించుకునే సౌకుమార్యం ఉన్నవాళ్ళెవరూ మాజీ ఉద్యోగులను పీడించరు. అమానవీయత ప్రధాన జీవన స్రవంతిగా రూఢి అవుతున్న సమాజంలో ఉత్తమ మానవీయ కుటుంబ సంబంధాలను ప్రతిపాదించే కథ 'రెండణాల గుగ్గిళ్ళు'.

కళకు ధనానికి మధ్య గల వైరుధ్యాన్ని 'విషాద గాత్రి' కథ ఆవిష్కరించింది. మత కక్షలలోని అసంబద్ధతను 'మసీదు పావురం' కళ్ళ ముందు నిలిపింది. స్వతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా తాగునీటి సమస్యను పరిష్కరించలేని రాజకీయ వైఫల్యాన్ని 'గుక్కెడు నీళ్ళు' కథ ప్రతిబింబించింది.

దాదాహయాత్ కథలలో అగ్రగామి – వస్తు, శిల్ప పరంగా, 'మురళి వూదే పాపడు'. ఇది పర్యావరణ కథ. అలాగే 'వారసత్వం'. రాయలసీమలోని ముఠా రాజకీయాలపై రచయిత ఎక్కుపెట్టిన విమర్శ. ఒకతరం నుంచి తర్వాత తరానికి జ్ఞానం, సంపద, మానవత్వం వంటివి సంక్రమించాలి. కాని బాంబుల సంస్కృతి వారసత్వంగా రావడం మీద అధిక్షేపం ఈ కథ. రాయలసీమను వర్షాభావం ఎంత విధ్వంసం చేస్తుందో, అపుడపుడు అకాలవర్షం కూడా అంత విధ్వంసం సృష్టిస్తుంది. ఏట్లో కరబూజ కాయల సేద్యం చేసుకునే పేద రైతుల జీవిత విషాద పరిణామాలకు ఆర్ద్రమైన అక్షర రూపం 'ఎడారి సేద్యం', 'దోబూచి', 'అహింస' చిన్న పిల్లలు పాత్రలుగా హయాత్ అల్లిన అందమైన కథలు.

ఇవాళ మన సమాజానికి అక్కర లేని కథలు రాసే వాళ్ళకు కొదవ లేదు. అవసరమైన కథలు రాసే రచయితలలో దాదా హయాత్ ఒకరు. ఈయన కథలు 'సాగిపోయే నీరు'

వంటివి. సామాజిక మార్పును ప్రతిపాదిస్తాయి. దాదా అంటే మనం రౌడీగా అర్థం చేసుకుంటాం. దాదాగిరి అని అంటుంటాం. దాదా అంటే తాత అని, హయాత్ అంటే ఆయుష్షు అని కరీముల్లాను అడిగితే చెప్పారు. దాదా హయాత్ తాతల కాలం నాటి కథలు చెప్పలేరు గాని తాతలాగా ఎదుటివాళ్ళను ఒప్పించే కథలు చెప్పారు. సమాజం మారేదాకా ఈ కథలు ప్రాసంగికత కలిగి ఉంటాయి.

దాదాహయాత్ కథలు కథలుగా ఉంటాయి. కథంతా చెప్పాలి, కథ తప్ప ఇంకేమీ చెప్పకూడదు. నిర్మాణ ఐక్యత ఉండాలి అని కొడవటిగంటి కుటుంబరావు నిర్దేశించిన ఉత్తమ కథా సూత్రాలకు అనుగుణంగా ఉంటాయి ఈ హయాత్ కథలు.

సమాజంలోని ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, తాత్త్విక రంగాలన్నిటినీ అర్థం చేసుకొని, సమాజంలోని అవలక్షణాలనూ, వాటికి మూలాలు గుర్తించి ఆవిష్కరించే అభ్యుదయ సాహిత్య ధోరణికి రాయలసీమ ప్రతినిధి దాదాహయాత్. అక్కడకక్కడ కొంత ఊహలో విహరించే ఆదర్శీకరణ గుణమున్నా అది అపాయకరం కాదు. కాని దాదాహయాత్ కథలలో కొట్టొచ్చే గుణం ఏ సామాజికాంశం పట్ల కూడా పాఠకులను భ్రమకు లోను చెయ్యకపోవడం. వాస్తవికతా హద్దులు దాటకపోవడం, కథాశిల్పిగా పాఠకులతో చెలగాట మాడకపోవడం, కథలో పాత్రలలోకి పరకాయ ప్రవేశం చేసి నిమిష నిమిషానికి ఒక తత్వం చెప్పడం, వ్యాఖ్యానాలు చేయడం వంటి అనాలోచిత సాహసాలకు పూనుకోకపోవడం దాదాహయాత్ లోని మరో సుగుణం. కథా రచనలో నిగ్రహం వాస్తవిక వాద రచయితకు ఉండవలసిన ముఖ్య లక్షణం.

దిగంబర కవులను 'ఆగ్రహభార్గవులు' అన్నారు. కథకుడుగా దాదాహయాత్ నిగ్రహ భార్గవుడు. వస్తువు ఎన్నికలో, దాని అవగాహనలో, దానికి రూపకల్పన చేయడంలో రచయిత ఎక్కడా ఆబగా ప్రవర్తించలేదు. దీనినే కథ సిద్ధాంత కర్తలు 'క్లుప్తత' అన్నది. పైకి ప్రజాస్వామికంగా కనిపిస్తున్న వ్యవస్థలోని అప్రజాస్వామికతనూ, పైకి అంతా బాగుంది అన్నట్లు కనిపించే వ్యవస్థలోని డొల్లనూ, పాఠకులకు స్నేహితునిలాగా కథానికా రూపంలో విడమరచి చెప్పే రచయిత దాదాహయాత్. దాదాహయాత్ కథల సంపుటం వస్తున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు.

16-10-2016 —రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

# ఎందుకీ కథలిప్పుడు?

నేనీ కథ ఎక్కడో చదివాను-

పూర్వం ఓ శిల్పి వుండేవాడు. కొన్ని వందల శిల్పాలు చెక్కాక చివరికతనో శిల్పాన్ని ఆవిష్కరించాడు. తీరా శిల్పం చెక్కడం పూర్తయ్యాక అతనా శిల్పం నడుం పట్టుకుని ఏడవనారంభించాడు. అక్కడే వున్న శిష్యుడు "అందరూ ఇది పరిపూర్ణ శిల్పమని పొగుడుతూ వుంటే మీరెందుకేడుస్తున్నా"రని అడిగాడు.

"అదే నా బాధ! ఇంతకంటే పరిపూర్ణ శిల్పం నేనిక చెక్కలేను," అని మరింత ఏడ్చాడట శిల్పి.

ఈ కథ చదివినప్పుడు నాకో ప్రశ్న తలెత్తింది - తను చెక్కిన శిల్పం పరిపూర్ణమైనదని ఆ శిల్పికి ఎలా తెలుసు?

శిల్పులకి బహుశా తమ శిల్పకళ గురించి తమకే బాగా తెలుస్తుందేమో! కానీ, కథకుడికి అలా తెలీదని ఉదాహరణతో సహా నేను చెప్పగలను. ఆ ఉదాహరణ వీడే!

నా కథ గురించి నాకే తెలీకపోతే నేనీ ముందుమాట రాయడానికి ఎందుక్కూర్చున్నాను?

చెప్పగలిగేది ఏమీ లేకపోయినా చెప్పాల్సింది చాలా వుంది.

నేనీ కథలు రాస్తున్నప్పుడు ఈ ప్రపంచం ఇలా లేదు. ఈ దేశం ఇలా లేదు. ఈ తెలుగు ప్రజ ఇలా లేదు. నేనూ ఇలా లేను. నాతోపాటుగా ఇవన్నీ ఒక నాలుగు రోడ్ల కూడలిలో నిలబడి వున్నప్పుడు నేనీకథలు రాశాను.

ఒకసారి మావూరి ప్రధాన కూడలి దగ్గర నిలబడి చూస్తే ఇదసలు మా వూరు కాదనిపిస్తుంది. కాలంతోపాటు ఊరు మారొచ్చు. మనుషులు మారొచ్చు. ప్రపంచం మారొచ్చు. కానీ, ఎందుకో నాకీ మార్పు సహజమైందిగా అనిపించడం లేదు.

ఈ కథలు రాసినప్పుడు నన్ను ప్రభావితం చేసిన విలువలు ఏపాటివి?

ఇప్పటి విలువలతో సరిపోల్చుడానికైనా ఈ కథలు పనికొస్తాయనుకుంటాను.

మీ

**దాదా హయాత్**

# కృతజ్ఞతలు

ఈ కథలపైన తమ అమూల్యమైన అభిప్రాయం రాసిచ్చిన సుప్రసిద్ధ విమర్శకులు డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారికి...

మిత్రులు మధురాంతకం నరేంద్రగారికి, తమ కథల సంపుటికన్నా ఎక్కువ ఆదరణతో పట్టుబట్టి ఈ పుస్తకం వచ్చేలా చేసినందుకు – వీరు పూనుకోకపోతే ఈ సంపుటి ఇప్పటికైనా వెలువడేది కాదు.

నాకిప్పుడు భౌతికంగా దూరమైన మిత్రులు శశిశ్రీ గారికి – అసలు ముందుగా నేను కృతజ్ఞతలు తెలియజేసుకోవలసినవారు వీరు. నా కథలన్నీ ఎంతో శ్రమపడి డి.టి.పి చేయించి నా చేతికిచ్చారు. అవి నేను చెదలపాలు చేసినందుకు నామీద శాశ్వతంగా అలిగి వెళ్ళిపోయారు.

ముఖ చిత్రాలంకరణ చేసిన 'బాపు' గారికి, వీరితోపాటు ఈ మహారచయితల ప్రోత్సాహం లేకపోయివుంటే నేను రచయితగా మిగిలేవాడినే కాను.

పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారు, మధురాంతకం రాజారాం గారు, స్మైల్‌గారు, భరాగో గారు, వల్లంపాటి వెంకట సుబ్బయ్య గారు, సొదుం జయరాం గారు, చిలుకూరి దేవపుత్రగారు, చలసాని ప్రసాద్‌గారు...

కారా మాస్టారు, సింగమనేని నారాయణగారు, కె. శివారెడ్డి గారు, డా॥ ఎం.వి. రమణారెడ్డిగారు, భమిడిపాటి కామేశ్వర రావుగారు, ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డిగారు, బండి నారాయణ స్వామిగారు, శాంతినారాయణ గారు, వి. రాజారామ్మోహన

రావుగారు, ఖాదర్ మొహియుద్దీన్ గారు, అఫ్సర్‌గారు, గులాం గౌస్ (శాతవాహన) గారు, యాకూబ్ గారు, మునిపల్లె రాజుగారు....

అవధానం చంద్రశేఖరశర్మగారు, డా॥ కోడూరు ప్రభాకరెడ్డిగారు, నరాల రామారెడ్డిగారు, రాజన్న కవిగారు, డా॥ మల్లెమాల వేణుగోపాలరెడ్డి గారు, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డిగారు, పాలగిరి విశ్వప్రసాద్‌గారు, కుప్పిలి పద్మగారు, మహమ్మద్ ఖదీర్‌బాబుగారు, సై్కబాబా గారు, వేంపల్లె షరీఫ్‌గారు. వి. వరలక్ష్మి గారు (విరసం), ఎస్పీ మహమూద్‌గారు, డా॥ సి. రామచంద్రగారు.

పుస్తక పఠనం మనవారికి పూర్తిగా మందగించిన ఈ గడ్డుకాలంలో ధైర్యం చేసి ఈ సంపుటి తెస్తానన్న వల్లూరు శివప్రసాద్ గారికి...

"మీరు పుస్తకం వెయ్యకపోతే నేనే ఎప్పుడో అడక్కుండానే వేసేస్తా"నని పోట్లాడిన నూకా రాంప్రసాద్ – నీ ఆత్మీయత మర్చిపోలేను.

**–దాదా హయాత్**

# కథల వరస


1. వారసత్వం .............................. 15
2. మసీదు పావురం .............................. 24
3. సెగమంటలు .............................. 32
4. దోబూచి .............................. 39
5. మాజీలు .............................. 43
6. ఎల్లువ .............................. 52
7. సాగిపోయే వాగునీరు .............................. 65
8. రెండణాల గుగ్గిళ్ళు .............................. 75
9. విషాదగాత్రి .............................. 87
10. ఎడారి సేద్యం .............................. 104
11. ఆశీర్వాదం .............................. 114
12. ప్రదర్శన .............................. 127
13. అహింస .............................. 134
14. భవితవ్యం .............................. 143
15. జడ్జిమెంట్ .............................. 150
16. గుక్కెడు నీళ్ళు .............................. 159
17. ప్రసూతి వార్డు .............................. 169
18. వ్యర్థజీవి .............................. 181
19. ఏటి ఒడ్డు చేపలు .............................. 189
20. పేదవాడి దీపావళి .............................. 204
21. మురళి వూదే పాపడు .............................. 208
22. చరిత్ర .............................. 214

# వారసత్వం

"ఏమిరా, తెచ్చినావా?" అడిగాడు అశ్వత్థరెడ్డి.

బుడ్డోడు తలూపాడు.

"సంచి ఆడబెట్టు," అన్నాడు అశ్వత్థరెడ్డి.

బుడ్డోడు జాగ్రత్తగా సంచి తీసుకెళ్ళి ఓ మూలన పెట్టాడు.

అది పాతకాలం నాటి సవుడు మిద్దె. ఇంకా గట్టిగానే వుంది. సూమంచిపల్లెరాళ్లతో కట్టిన గోడలు. కోట గోడల్లా బలంగా ఉన్నాయి. ఆ రోజే కొద్దిగా జల్లు పడిపోయింది. కప్పుమీది సవుడు తడిసి మట్టివాసన ఇంపుగా ముక్కుపుటాలకు సోకుతోంది.

అప్పుడే, "ఏం, అశ్వత్థరెడ్డీ!" అంటూ లోపలికొచ్చాడు శౌరెడ్డి.

"రా శౌరెడ్డీ! సరింగా సమయానికొచ్చినావేబ్బా!" హుషారుగా కేకేశాడు అశ్వత్థరెడ్డి.

"తెప్పించినావా?" వస్తూనే అడిగాడు శౌరెడ్డి.

"ఇంగానా! ఇదో, వచ్చేసినాయి," బుడ్డోడు తెచ్చిపెట్టిన సంచివైపు చూపించాడు అశ్వత్థరెడ్డి.

శౌరెడ్డి ఆ సంచివంక చూస్తూనే చేతులు రుద్దుకున్నాడు.

"ఏం శౌరెడ్డీ, సంచి సూస్తానే అప్పుడే చేతులు నొవ్వ పెడుతుండాయా?" హాస్యమాడాడు అశ్వత్థరెడ్డి.

శౌరెడ్డి నవ్వి, "ఎందుకైనా మంచిది, తలుపులు మూసి గెడమానుబేస్తా," అన్నాడు.

"వార్నీ, ఈ మాత్తరానికేనా? తలుపు ముయ్యకపోతే ఏమైతాది?" నిర్లక్ష్యంగా అడిగాడు అశ్వత్థరెడ్డి.

"పంచాయితికి బొయ్యేముందు బాంబులుగానీ, ఇంకేదిగానీ త్యామని మాటిస్తిమిగదబ్బా! ఇప్పుడెవరైనా సూసినారంటే......" సందేహం వెలిబుచ్చాడు శౌరెడ్డి.

"మాటిచ్చే ఏమైతాది? నారాయణ రెడ్డోల్లు త్యామన్నారు. నమ్మాల్నా? ఎవరి జాగర్త వాల్లది శౌరెడ్డీ," అన్నాడు అశ్వత్థరెడ్డి.

శౌరెడ్డి తలూపాడు. అతని దృష్టి బుడ్డోడిమీద పడింది. "ఏం రా బుడ్డోడా, బాగుండావా?" దట్టమైన కనుబొమలు ఎగరేస్తూ అడిగాడు.

బుడ్డోడు సిగ్గుపడుతూ తలొంచుకున్నాడు.

శౌరెడ్డి వాడికి మేనమామ వరసకావాలి. అంచేత ఎప్పుడూ ఉడికిస్తూ మాట్లాడతాడు. అతని దగ్గర బిడియం బుడ్డోనికి.

"ఏమిరా, అప్పుడే మేనమామ బిడ్డనిచ్చినట్టు సిగ్గు పడతావ్?" నవ్వాడు అశ్వత్థరెడ్డి.

శౌరెడ్డికి నిజంగానే బుడ్డోడి ఈడుదే ఓ కూతురుంది. ఇద్దరికీ మంచి దోస్తీ కూడా. ఇద్దరూ ఆ వూళ్లోని పంచాయితీ బోర్డు స్కూల్లో అయిదో తరగతి చదువుతున్నారు.

"ఏందిరా బుడ్డోడా! మీ నాయన నువ్వు పుట్నెప్పుడు మొగసిరి మొగ్గ పుట్టినాడని యాటకోసి మాకు బువ్వ పెట్టినాడు గదరా! నువ్వేమో ఆడపిల్ల మాదిరి సిగ్గుపడతాండావ్! ఏదిరా నీ మొగసిరి?" ఉడికించాడు శౌరెడ్డి.

అశ్వత్థరెడ్డి మీసం మెలేశాడు. "మావోని మొగసిరి గురించి నువ్వేంది మాటాడ్తాండావ్ శౌరెడ్డీ! సంచి తెచ్చింది ఎవరనుకున్నావ్? మా బుడ్డోడే!" సగర్వంగా అన్నాడు.

శౌరెడ్డి నోరు తెరిచేశాడు. "ఏంరా బుడ్డోడా! నువ్వేనా తెచ్చినావు సంచి?" అడిగాడు.

బుడ్డోడు అవునన్నట్టు తలూపాడు.

శౌరెడ్డి కాస్త మందలింపుగా అశ్వత్థరెడ్డి వంక చూశాడు. "ఏమైనా తెలివుండాల అశ్వత్థరెడ్డీ! నిండా పన్నెండేండ్లు గుడకాలేవు పిల్లోనికి – వానితోనా బాంబులు తెప్పిచ్చేది? సేతుల్లోనే పేలినాయంటే ఏం చేసేటోనివి?" అన్నాడు.

అశ్వత్థరెడ్డి నిర్లక్ష్యంగా అతని మాట తోసి పారేశాడు. "అప్పుడే ఏం చూసినావు శౌరెడ్డీ! మా వాడు బాంబుల్తో ఆడుకోవాల. ఈ సుట్టుపక్కలకంతా వాన్ని పెద్దపాలేగాన్ని సేస్తా సూస్తాండు. అప్పుడు నువ్వే పెద్ద కట్నంతో కూతుర్ని తీస్కరావాల," అన్నాడు.

"ఏంది పరాసికమబ్బా! పాలేగాన్ని సేసేదేమోగాని, బాంబు పేలి కాలో సెయ్యో పోతే వాల్లమ్మ కడుపులో అగ్గిపడతాది. ఒక్కడే కొడుకు. యాల సెడగొట్టుకుంటావ్?" అన్నాడు శౌరెడ్డి.

అశ్వత్థరెడ్డి ఆ మాట కూడా పట్టించుకోలేదు. "సూస్తూతే మావాని మొగసిరి! ఏమిరా అబ్బీ, ఆ సంచిలోవున్నయి తీసి లోపల పెట్టుపో," అన్నాడు విలాసంగా.

శౌరెడ్డి ఏదో అనబోయి ఊరుకున్నాడు.

బుడ్డోడు మాట్లాడకుండా వెళ్లి సంచి చేతిలోకి తీసుకొని ఇంట్లోకి నడిచాడు. శౌరెడ్డి చూస్తుండగానే ఇంటి గోడలో ఏర్పాటు చేసిన గాదెమీద రాతిమూత తీసి దాన్నిండా

వరిపొట్టు నింపాడు. తర్వాత సంచిలోని బాంబు ఒక్కొక్కటే తీసి జాగ్రత్తగా పొట్టులోపల పేలకుండా అమర్చాడు.

అశ్వత్థరెడ్డి 'చూస్తున్నావా?' అన్నట్టు సగర్వంగా ఓసారి కనుబొమలు ఎగరేసి, "వాడు నా కొడుకు శౌరెడ్డీ! తండ్రి పౌరుషమే వానికి వచ్చింది," అన్నాడు మీసం మెలేస్తూ.

శౌరెడ్డి మొహం ముడుచుకున్నాడు. "ఏదో లెబ్బా! పిల్లకాయను బాగా సదివిచ్చి పైకి దెస్తావనుకుంటే ఇయ్యన్నీ ఇయ్యాల్నించే నేర్పబట్టినావు. ఇంగేమనాల?" అన్నాడు. బుడ్డోనికి భవిష్యత్తులో కూతుర్నిచ్చి పెళ్ళి చేయాలనే ఆలోచన అతనికీ అంతరాంతరాల్లో వుంది.

అశ్వత్థరెడ్డి కొడుకుని దగ్గరికి పిలిచాడు. "ఓరి బుడ్డోడా! నేను సెప్పేది జాగర్తగా ఇను. ఇయ్యాల సాయంకాలం నారాయణ రెడ్డోల్లకూ మనకూ పంచాయితీ జరుగుతాది. రాజీ సామరస్యంగా జరిగినాదా సరేసరి. లేదా.......... నువ్వాడనేవుండు. నారాయణ రెడ్డోల్లు ఏందైనా కెలికానారంటే ఈడికొచ్చి మాకు బాంబులు తెచ్చియ్యాల. అర్థమైందా?" అన్నాడు.

బుడ్డోడు హుషారుగా తలూపాడు. శౌరెడ్డి చివరి ప్రయత్నం చేశాడు. "పెద్దోల్ల రచ్చులోనికి పిల్లోన్ని దింపుతుండావు. ఇదేం బాగాలేదు అశ్వత్థరెడ్డీ! నా మాటిని పిల్లోన్ని వాల్లమ్మ కాడికి పంపేయ్," అన్నాడు.

బుడ్డోని తల్లి ఏవో పెళ్ళిపనులకని ప్రస్తుతం పుట్టింటికి పోయింది. అశ్వత్థరెడ్డి కొడుకుని తల్లివెంట పోనీయకుండా తన దగ్గర అట్టే పెట్టుకున్నాడు.

"నీకు తెల్దులే శౌరెడ్డీ! నారాయణ రెడ్డోల్లు మనకాడ సంచులుంటే అనుమానపడ్తారు, పిల్లోనికాడుంటే అనుమానం రాదు," కొడుకుని దగ్గరుంచుకోవడంలోని అసలు రాజకీయం బయటపెట్టాడు అశ్వత్థరెడ్డి.

శౌరెడ్డి మరింకేం అనలేకపోయాడు.

కాసేపటి తర్వాత అక్కడ్నించి తప్పించుకుని బయటికి పరిగెత్తిన బుడ్డోడు ఆగమేఘాల మీద వెళ్ళి లక్ష్మిని కలుసుకున్నాడు. లక్ష్మి శౌరెడ్డి కూతురు.

"ఇయ్యాల నేను బాంబులు తెచ్చినా తెలుసా?" అన్నాడు వీరుడిలా కాలరెగరేస్తూ – తను చేసి వచ్చిన ఘనకార్యం లక్ష్మికి చెప్పందే వాడికి మనసు తీరేట్టు లేదు.

లక్ష్మి ఆ సమయంలో సీరియస్‌గా గుడ్డతో చేసిన పెళ్ళికూతురి బొమ్మకు చేతులు కుడుతోంది.

"ఓస్, అంతేగదా! ఎన్ని బాంబులు చూళ్ళా!" అంది నిర్లక్ష్యంగా.

బుడ్డోనికి ఆ నిర్లక్ష్యం ఎంతమాత్రం నచ్చలేదు.

"ఒకటో రెండో అనుకొంటివా? ఇరవై బాంబులు," అన్నాడు చేతుల్తో ఇరవై బాంబుల సైజు చూపిస్తూ.

"పొగబాంబులా?" సాగదీస్తూ అడిగింది తను.

"కాదు, అసలు బాంబులే!" గర్వంగా చూశాడు బుడ్డోడు.

"అయితే మంచిది. పగిల్తే పండ్లు రాల్తాయిలే."

"నేను ఆడుకునేది నీ మాదిరిగా బొమ్మల్తో అనుకున్నావా? బాంబుల్తో!"

"ఎవరన్నారు?" అంది లక్ష్మి.

"మా నాయన."

"ఆడుకోపో బాంబుల్తోనే. నాకు పనుండాది."

బుడ్డోడు ఆమె చేతుల్లో వున్న బొమ్మవైపు సీరియస్‌గా చూశాడు. "ఇది బొమ్మా? సేతులేందిట్లుండాయి? ఓ సెయ్యి పెద్దది, ఓ సెయ్యి చిన్నది. కాలేమో కుంటిది. లచ్చుమ్మోవ్! నీ పెండ్లి కూతురు గుడ్డిది గుడకానే!" వెక్కిరించాడు.

"బుడ్డోడోవ్, ఎల్లి పని చూస్కో. నా పెండ్లి కూతురి మాట నీకేల? ఎల్లి బాంబులేస్కో" అంది లక్ష్మి.

బుడ్డోడు ఆమె చేతుల్లో బొమ్మను లాగి కిందపడేసి పెద్దగా నవ్వుతూ అక్కడ్నించి ఒక్క పరుగు తీశాడు.

లక్ష్మి శాపనార్థాలు పెడుతూ వాడి వెంటే కొంత దూరం పరిగెత్తి మళ్ళీ తిరిగొచ్చి బొమ్మ చేతిలోకి తీసుకుంది.

ఆ సాయంత్రానికల్లా మళ్లీ వాళ్లు దోస్తులైపోయారు. పంచాయితీ జరిగే చోటుకు ఇద్దరూ చెట్టాపట్టాలు వేసుకు బయల్దేరారు.

"పంచాయితీకాడ రచ్చయితాది. బాంబులు వేసుకుంటారు," దార్లో చెప్పాడు బుడ్డోడు.

లక్ష్మి దిగులుగా చూసింది. "నువ్వు గుడకా బాంబులెయ్యాల్నా?" అడిగింది.

"నేను గుడకాబేస్తా!" అభిమన్యుడిలా ఫోజు పెట్టి చెప్పాడు బుడ్డోడు. లక్ష్మి ఆగిపోయింది.

"వద్దు, మనకు బాంబులొద్దు," ఆ పిల్ల కళ్ళల్లో సన్నటి భయం తొంగిచూస్తోంది.

కాసేపు ఆమె మొహంలోకి చూస్తూండిపోయిన బుడ్డోడు ఫక్కున నవ్వాడు. "శౌరెడ్డి మామ కూతురు బయపడ్తాంది," అన్నాడు వేళాకోళంగా.

లక్ష్మి ఆ వేళాకోళానికి నవ్వలేదు.

"నిజంగా బుడ్డోడా! మనకు బాంబులొద్దు. గలాటాలొద్దు," అంది.

బుడ్డోడు వీరోచితంగా నవ్వేసి, "వద్దులే," అన్నాడు.

"అట్టా కాదు. వొట్టు వేసి చెప్పు."

"సరే, వొట్టు వేస్తాండా! మనకు బాంబులొద్దు! గలాటాలొద్దు! సరేనా?"

"చేయి గిచ్చి చెప్పు!" అంది లక్ష్మి.

బుడ్డోడు ఆమె అరచెయ్యి గిల్లాడు.

"అమ్మయ్య!" గుండెమీద చెయ్యి వేసుకుని ఏదో పెద్ద బరువు దిగిపోయినట్టు చూసింది లక్ష్మి.

"ఇంగ పా," అంది బుడ్డోనికంటే ముందు తనే పంచాయితీ వైపు దౌడు తీస్తూ.

నారాయణరెడ్డికి, అశ్వత్థరెడ్డికి మధ్య పంచాయితీ ప్రారంభమైంది.

"అది కాదు అశ్వత్థరెడ్డీ! రోంత ఆలోచించు. సారా కాంచడంలో నారాయణ రెడ్డి నీకేం అడ్డు రాల్యా. కాంట్రాక్టులు మాత్రం మొదట్నుంచీ ఆయప్పే చేస్తావుండాడు కదా! నువ్వు మద్దెన రావడం ఏమైనా బాగుండాదా?" అంటున్నాడు ఓ పెద్ద మనిషి.

"ఎందుకు బాగాలేదు? ఆయప్ప టౌనుకు బోయినాడు. టౌను కాంట్రాక్టులు చేస్కోమను. ఊర్లో వుండేది నేను. ఈ కాంట్రాక్టు మాత్రం నాకే రావాల," అంటూ పాయింటు లేవదీశాడు అశ్వత్థరెడ్డి.

నారాయణరెడ్డి అరవై ఏళ్ళుపైబడ్డ వృద్ధుడు. ఇరవై ఏళ్ళక్రితం అతనికీ అశ్వత్థరెడ్డి తండ్రికీ మధ్య పార్టీ నడిచింది. చేతులు నరుక్కోవడాలూ, బాంబులు వేసుకోవడాలూ అయినాయి. ఓ ఖూనీ కేసు కూడా జరిగింది. పై చేయి ఎవరిదో మాత్రం ఇంకా తేలనేలేదు. అశ్వత్థరెడ్డి తండ్రి పోయాడు. ఇప్పుడు అశ్వత్థరెడ్డి తన గుంపుకు నాయకత్వం వహిస్తున్నాడు.

అయితే ఒక అయిదారేళ్ళుగా నారాయణరెడ్డి వైఖరిలో కొంత మార్పు వచ్చింది. ఇదివరకటిలా అతను తమ శత్రుత్వం గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. దానికి కారణం కాంట్రాక్టులు చేస్తూ డబ్బు తినమరగడమే.

పూర్వం ఊరి పెత్తనం కోసం రెండు గుంపుల మధ్య శత్రుత్వం కొనసాగింది. అప్పుడు ఇన్ని కాంట్రాక్టులు లేవు. ఒక సారా కాంట్రాక్టు కోసమే ఇద్దరి మధ్యా వైరం వుండేది. ఇప్పుడు రకరకాల కాంట్రాక్టులు వచ్చి పడుతున్నాయి. తెలుగు గంగ కాంట్రాక్టులు, థర్మల్ కేంద్రం కాంట్రాక్టులు, సిమెంటు ఫ్యాక్టరీ కాంట్రాక్టులు, మునిసిపల్ కాంట్రాక్టులు, పంచాయితీ కాంట్రాక్టులు – అది ఇదీ అనకుండా అన్నింట్లో నారాయణరెడ్డి ఏదో విధంగా వేలు పెడుతూనే వస్తున్నాడు. అంతలోకే ప్రొహిబిషన్ వచ్చింది. సారా కాంట్రాక్టు లేకపోయేసరికి నారాయణరెడ్డి ప్రొద్దుటూరికి మకాం మార్చేసి అక్కడే కాంట్రాక్టరుగా స్థిరపడిపోయాడు. అప్పట్నుంచీ తమ వూళ్లో దొంగసారా మీద పెత్తనం అశ్వత్థరెడ్డి పరమైంది. నారాయణరెడ్డి దాని గురించి పట్టించుకోను కూడా లేదు.

అశ్వత్థరెడ్డి అది చూశాడు. కాంట్రాక్టుల్లో డబ్బుందనే విషయం అతనికి బాగా అర్థమైంది. ఈలోగా తమ వూరికి కొత్త రోడ్డు శాంక్షనైంది. నారాయణరెడ్డికి ఆ కాంట్రాక్టు మామూలుగా అయితే నల్లేరు మీద బండి నడక. అయితే అశ్వత్థరెడ్డి ఈసారి అతనికి అడ్డు తగిలాడు. అంతవరకూ శాంతంగా వున్న వైరం మళ్ళీ రాజుకుంది.

చాలాసేపు ఇరుపక్షాల మధ్య వాదం నడిచింది.

"సర్లెబ్బా! నేనో పరిష్కారం చెప్తా, ఇద్దరూ ఇనుకోండి. కాంట్రాక్టు మీరిద్దరూ సొగం సొగం చేస్కోండి," అన్నాడో పెద్దమనిషి చివరికి.

నారాయణరెడ్డి ఇటీవల లౌక్యం బాగా నేర్చుకున్నాడు. వైరంలో సొమ్ము లేదని అతనికి బాగా తెలుసు. దాంతో ఆ పెద్దమనిషి చెప్పిన మాటలకు వెంటనే ఒప్పుకున్నాడు.

అశ్వత్థరెడ్డి ఆలోచనలో పడ్డాడు.

"ఒప్పుకోవాకు," రహస్యంగా హెచ్చరించాడు శౌరెడ్డి. కానీ అశ్వత్థరెడ్డికి కొన్ని నాయకత్వ లక్షణాలున్నాయి. పట్టువిడుపుల గురించి అంతా కాకపోయినా కొంత తెలుసు.

"సరే, అట్నే గానీరి. పెద్దమనుషులు మీరు చెప్తాండారు గదా!" అన్నాడు చివరికి.

పెద్దమనుషులు ఒక్కసారి తేలిగ్గా వూపిరి పీల్చుకున్నారు. ఉరుములు మెరుపుల్తో వడగళ్ల వాన కురవాల్సింది. కారుమేఘాలే పక్కకు తప్పుకున్నట్టయింది. ఎన్ని బాంబులు పడాల్నో, ఎన్ని తలకాయలు పగలాల్నో అనుకున్నది అంతా ఒక్కసారి చప్పగా చల్లారిపోయింది.

"ఏమైంది! బాంబులు పడ్తాయా?" బుడ్డోని చెవిలో గుసగుసగా అడిగింది లక్ష్మి.

"యాడిది? రాజీ కుదిరిపాయ!" అన్నాడు బుడ్డోడు.

"హై హై!" అంటూ లక్ష్మి చప్పట్లు కొట్టబోయి శౌరెడ్డి సీరియస్‌గా చూడ్డంతో ఆగిపోయింది.

ఆ సాయంకాలమంతా ఊళ్ళో ఆ పంచాయితి గురించే చర్చ. అయితే ఒకరకంగా తీరిందనుకున్న శని మరోరకంగా ఆ వూరిని చుట్టుకుంది. అలా జరుగుతుందని ఎవరూ వూహించలేదు.

ఆ రాత్రి వాన కురిసింది. పెద్దవాన, చెనిక్కాయ పంట ఆ వానతో తుడిచిపెట్టుకు పోతుందని రైతులంతా దిగాలుగా కూర్చున్నారు. అశ్వత్థరెడ్డి మాత్రం పంట గురించి ఆలోచన పెట్టుకోకుండా కాంట్రాక్టు విషయమే ఆలోచిస్తూ పడుకున్నాడు.

అంతలో, "అశ్వత్థరెడ్డీ!" అనే పిలుపు వినిపించింది.

అశ్వత్థరెడ్డి మంచంమీద లేచి కూర్చున్నాడు.

"ఎవరు?"

"నేనే, శౌరెడ్డిని," అంటూ గొడుగు పట్టుకుని లోపలికొచ్చాడు శౌరెడ్డి.

"రా శౌరెడ్డీ! ఏంది, ఇయ్యాలప్పుడొచ్చినావు?" అన్నాడు అశ్వత్థరెడ్డి.

"ఏం లేదులే, మాటాడాలనొచ్చినా," అంటూ గొడుగు కింద పెట్టి బుడ్డోడు నిద్ర పోతున్న మంచం మీద కూర్చున్నాడు శౌరెడ్డి. "భోం చేసినావా అశ్వత్థరెడ్డీ?"

"అత్తగారింటికి బోయి తినొచ్చినాం," చెప్పాడు అశ్వత్థరెడ్డి.

"అయితే అమ్మి రాల్యా?"

అమ్మి అంటే బుడ్డోడి తల్లి.

"ల్యా! ఇంగా ఆడ్నే వుండాదిలే గానీ, ఏంది సంగతి శౌరెడ్డీ?" అన్నాడు అశ్వత్థరెడ్డి.

శౌరెడ్డి నెమ్మదిగా విషయం ప్రస్తావించాడు. "అది గాదబ్బా, అశ్వత్థరెడ్డీ! ఇంగ నువ్వు గుడకా కాంట్రాక్టుల్లోనికి దిగినావ్. సారా కాంచడం నాకే వదిలేయరాదా అని అడగనీ కొచ్చినా," అన్నాడు.

అశ్వత్థరెడ్డి అతనికేసి కళ్ళప్పగించి చూశాడు.

సరిగ్గా అప్పుడే కరెంటు పోయి అంతా చీకటైపోయింది. అప్పుడొకటీ అప్పుడొకటీ మెరుస్తున్న మెరుపుల వెలుగులో ఒకరి ముఖ కవళికలు చదవడం మరొకరికి సాధ్యం కావడం లేదు.

"ఇప్పుడేమైంది శౌరెడ్డీ? సారాబట్టీల్లో సగం వాటా నీకూ వుండాది గదా?" నెమ్మదిగా అన్నాడు అశ్వత్థరెడ్డి.

"నీకేం, మగపిల్లోడు అశ్వత్థరెడ్డీ! నాకు ఆడబిడ్డ. లెక్కతో నాకేగదబ్బా అవుసరం. సారాబట్టీలు పూర్తిగా నాకొదిలేయ్."

ఒక్కసారిగా ఇద్దరి మధ్యా నిశ్శబ్దం అలుముకుంది.

కాసేపటి తర్వాత–

"ఇప్పుడీ బుద్ధి నీకేల పుట్టింది శౌరెడ్డీ?" వస్తున్న కోపాన్ని అణుచుకుంటూ అడిగాడు అశ్వత్థరెడ్డి.

"నీకేంబా, కాంట్రాక్టుల్లో మస్తుగా సంపాయిస్తావుగాని, సారా నాకుండనీ! ల్యాకుంటే కాంట్రాక్టులో నాకూ భాగమీ," అన్నాడు శౌరెడ్డి.

అశ్వత్థరెడ్డి సహనం కోల్పోకుండా వుండాల్సింది. కోల్పోయాడు.

"ఈకుంటే ఏం జేస్తావ్?" అన్నాడు దిగ్గున లేచి నిలబడిపోతు.

శౌరెడ్డి కూడా లేచి నిలబడిపోయాడు.

క్రమంగా ఇద్దరికీ మాటా మాటా పెరిగిపోయింది. చివరికి మాటలు కాస్తా కేకల్లోకి దిగాయి.

బుడ్డోడు అదిరిపడి లేచి కూర్చుండిపోయాడు.

తెల్లవారేసరికి వాన కురిసి వెలిసిపోయింది.

రైతుల మొహాల్లో కూడా ఆసరికి చిరునవ్వు వెలిసిపోయింది. ఆ అకాల వర్షంతో చెనిక్కాయపంటంతా సర్వనాశనమై పోయింది.

బుడ్డోడు పొద్దునే లక్ష్మిని కలుసుకున్నాడు.

"మీ నాయనా మా నాయనా రేత్తిరి తగూలాడుకున్నారు" వస్తూనే రిపోర్టు చేశాడు.

"దేనికి?" అడిగింది లక్ష్మి చింతచెట్టు కింద బురదలో ఎగుర్లాడుతూ.

"ఏమో!" అన్నాడు బుడ్డోడు.

రాత్రి వాడు కళ్ళు తెరిచి చూస్తూనే కనబడింది చిమ్మచీకటి. అంతలోకే ఓ మెరుపు మెరిసింది. ఆ మెరుపు వెలుగులో శౌరెడ్డితో తన తండ్రి గొడవ పడుతుండటం కనిపించింది. బయట హోరున వర్షం. ఆ వానకు తమ ఇంట్లో కేకలు బయటికి పోవడం లేదు.

ఆ వాదులాట ఎందుకో బుడ్డోడికి అర్థం కాలేదు. చివరికి, చూసుకుందాం అంటే చూసుకుందాం అని ఇద్దరూ ప్రతిజ్ఞలు చేసుకోవడం మాత్రం అర్థమయ్యింది. ఆ తర్వాత శౌరెడ్డి పొగలు సెగలు కక్కుతూ ఆ వానలో బయటికి వెళ్ళిపోయాడు.

తను మేలుకోవడం తండ్రి కూడా గమనించలేదు.

అశ్వత్థరెడ్డి తనలో తనే ఏదో వదురుకుంటూ కోపం పట్టలేక ఇంట్లో అటూ ఇటూ పచార్లు చేస్తుండటం కాసేపు చూస్తుండిపోయి అంతలోనే మళ్ళీ నిద్రపోయాడు బుడ్డోడు.

పొద్దున లేచి చూస్తే తండ్రి పక్కమీద లేడు.

లక్ష్మితో రాత్రి జరిగిన సంగతి చెప్పడానికి తను చక్కా వచ్చాడు.

బుడ్డోడు లక్ష్మితో మాట్లాడుతుండగానే తమకు తెలిసిన వాడొకతను రొప్పుతూ పరిగెత్తుకుంటూ రావడం కనిపించింది. "ఒరే బుడ్డోడా! నువ్వీడుండావా? మీ నాయన మీద బాంబులు బేసినార్రా!" దూరం నుంచే అరిచాడతను.

పిల్లలిద్దరికీ ఆ మాట అర్థం కావడానికి కాసేపు పట్టింది.

"ఎప్పుడు?" అన్నాడు బుడ్డోడు చివరికి.

"ఎప్పుడో తెల్దు. మీ నాయన్ని పొద్దుటూరు ఆస్పత్రికేసుకు బోతాండారు. బతుకుతాడో లేదో తెల్దు."

"ఇప్పుడు యాడుండాడు?"

"మీ ఇంటికాడికే కొండబోయినారు. నువ్వు బిర్న పో," తొందర చేశాడతను.

పిల్లలిద్దరూ ఒకేసారి పరిగెత్తారు.

అప్పటికే బుడ్డోడి ఇంటిదగ్గర బీభత్సమైన వాతావరణం నెలకొని వుంది. స్పృహ తప్పిన అశ్వత్థరెడ్డిని అరుగుమీద పడుకోబెట్టారు. కుడి కాలు, కుడి చేయి రక్తసిక్తమై పోయాయి. తలకు కూడా గాయాలు తగిలాయి. ఆసుపత్రికి తీసుకు వెళ్ళడానికి అశ్వత్థరెడ్డిని బండికెత్తే ప్రయత్నాలు జరుగుతున్నాయి. పోలీసులు ఇంకా రాలేదు. రక్తం ఆగకుండా స్రవిస్తోంది.

అక్కడ జనం చెప్పుకుంటున్నదేమంటే అశ్వత్థరెడ్డి పొద్దున్నే బయలుకు వెళ్ళడానికి ఊరవతల కంపచెట్లవైపు నడుస్తున్నాడు. అక్కడే ఎవరో కాపు కాసి అతని మీద బాంబులు వేశారు.

ఆ పని నారాయణరెడ్డి మనుషులదని జనం అనుకుంటున్నారు.

అంతలోకే బుడ్డోడి తల్లిని ఆగమేఘాల మీద ఎవరో బండి మీద పిల్చుకొచ్చేశారు. రక్తపు ముద్దలా పడున్న భర్తను చూస్తూనే ఆయమ్మ ఒక్కసారిగ గొల్లుమంటు విరుచుకు పడిపోయింది.

"నాకు తెలుసు ఈ పని ఎవరు చేసినారో" అన్నాడు బుడ్డోడు.

"ఎవరు?" అంది లక్ష్మి.

బుడ్డోడు ఆ మాటకు సమాధానం చెప్పలేదు.

వాడి కళ్ళు గొల్లుమంటున్న తల్లివైపే చూస్తున్నాయి. ఆ దృశ్యం చూసి వాడి మనసులో ఏం రగులుతోందో వాడికి ఒక్కడికే తెలుసు.

హఠాత్తుగా బుడ్డోడు లక్ష్మి చెయ్యి వదిలేశాడు.

"యాడికి?" కంగారుగా అంటోంది లక్ష్మి.

బుడ్డోడు తను బాంబులు దాచిన గాదెవైపు పరిగెత్తాడు.

*సీమసాహితి, మే-జులై 1996*

# మసీదు పావురం

అది కళ్ళు విప్పి చూసేసరికి దాని చిన్ని గుండెలో కలిగిన మొట్టమొదటి భావం భయం.

రోజూ తెల్లవారుజామున మైకులో వినిపించే ప్రార్థనాహ్వానం దానిమటుకు దానికి అలారం టైంపీసు మోతలాంటిది. అదా రోజు దాన్ని మేలుకొలపలేదు. అది లేచేవేళకే దాని ఫ్రెండ్సన్నీ లేచి కోలాహలం చేస్తున్నాయ్. చివరికి రోజూ బద్ధకంగా నిద్రలేచే దాని జత పావురం కూడా దానికంటే ముందే లేచి తాపీగా గట్కుం గట్కుం అనే శబ్దాలు చేస్తోంది.

సరిగ్గా వారం రోజుల క్రితం ఆ మగపావురంతో దానికి జత కలిసింది. అంతకుముందు మరో మగపావురం దానికి జోడీగా వుండేది. అయితే ఆర్నెల్లపాటు తనతో జల్సాగా కాపురం చేశాక ఆ మగపావురం మరో ఆడ పావురంతో చక్కా లేచిపోయింది.

ఆ మగపావురం లేచిపోయిన్రోజున దీనికి జీవితం మీదే విరక్తి పుట్టింది. మసీదు కొలనులో దూకుదామా లేక ఆత్మహత్య చేసుకోవడానికి వేటగాడి వలలో చిక్కి పోదామా అనాలోచించింది. తను చిక్కితే చాలు, ఎంచక్కా నిప్పుల మీద కాల్చుకుతింటానికో కుర్రకుంక సిద్ధంగా వున్నాడు. రెండు మూడుసార్లు వాడు దొంగచాటుగా మసీదులోకొచ్చి తనని పట్టుకుపోవడానికి ప్లాను వేశాడు గానీ తనే వాడికి టస్సా యిచ్చేసి అందకుండా యెగిరిపోయింది.

అయితే బాగా ఆలోచించిన మీదట ఆత్మహత్య చేసుకోవడం దానికి శుద్ధ దండగనిపించింది. ఛీ, అది మగబుద్ధి చూపించి మరో పావురంతో యెగిరిపోయినంత మాత్రాన తనెందుకు బేలగా ఆత్మహత్య చేసుకోవాలి? తనూ మరో జోడీ వెతుక్కుంటుంది.

ఆ ఆలోచన పుడుతూనే అంతవరకూ ఆ లేచిపోయిన మగ పావురం కోసం అంగలారుస్తూ చెట్టూ పుట్టా పట్టుకు తిరిగిందల్లా అది ఆ వెతుకులాట మానేసి తిన్నగా మసీదు గోపురం మీదికి యెగిరి పోయింది. ఆ మసీదు గోపురం మీది దానికి ఒకటి

కాదు, రెండు మగ పావురాలు కనిపించాయి. తన మచ్చలేని తెల్లరంగు చూసి అవి రెండూ కళ్లు తిరిగి బోల్తా పడబోయి నిలదొక్కుకున్నాయి. తనేమో ఆ రెండింట్లో దేంతోనైనా సరే జత కట్టడానికి సంసిద్ధత వ్యక్తం చేస్తూ నునులేత సిగ్గుతో ఓసారి అందమైన నల్లని కళ్లు రెపరెపలాడించి వాటితోపాటు రెక్కలు కూడా నైస్‌గా టపటపలాడించింది.

ఒక్క వొరలో రెండు కత్తులు ఇమడవు గదా! ఆ రెండు మగపావురాలూ తనకోసం మసీదు గోపురం మీదే బరిలోకి దూకాయి. పావుగంటసేపు ఆ రెంటిమధ్యా హోరాహోరీ పోరాటం జరిగింది. చివరికి యీకలన్నీ వూడగొట్టుకుని భంగపాటుతో ఓ మగపావురం పలాయనం చిత్తగించింది. గెలిచిన మగపావురం విజయగర్వంతో తోక నిక్కబెట్టుకుంటూ రెక్కలాడించి తనని దగ్గరికి రమ్మన్నట్టుగా చూసింది. తనేమో బోలెడు సిగ్గుపడిపోతూ నెమ్మది నెమ్మదిగా పక్కకు జరిగి దాని సరసన వెళ్ళి కూచుంది. అది సగర్వంగా ఓసారి తలపైకెగరేసి ముక్కుతో తన మెడ రాస్తూ ప్రేమ ప్రకటించింది.

అది మొదలు తను దాంతో కలిసి మసీదు ఆవరణంతా ఆనంద విహారాలు సాగించింది. మసీదు కొలను పక్కన కాసేపూ, అదే ఆవరణలో వున్న మగ్బిరాల మీద కాసేపూ, అక్కడికి చేరువలోనే వున్న చార్మినార్ మీద కాసేపూ ప్రేమలో గడిపేసింది.

అయితే రెండు మూడు రోజులు గడిచాక తనకి ఆ మగ పావురంలో వున్న లోపాలన్నీ బాగా తెలిసిపోయాయి. దాన్లో అన్నింటికన్నా పెద్ద లోపం ఏవిటంటే అన్ని విషయాలకీ బద్ధకం. పొద్దున్నే నిద్ర లేవడం దగ్గర్నుంచీ తిండి గింజలు సంపాయించుకోవడం వరకూ దానికి అంతా బద్ధకమే. అయితే తనతో శృంగారం చేయడానికి మాత్రం ఎక్కడలేని హుషారు  పుట్టుకొచ్చేస్తుంది. వారం రోజులకే దాని బద్ధకంతో తనకు మొహం మొత్తింది. సమయం చూసుకుని ముక్కుతో దాని నెత్తినోటి గట్టిగా యిచ్చుకుందామా అనాలోచిస్తుండ గానే అనుకోకుండా ఈ వుపద్రవం జరిగిపోయింది. రోజూ మోగే లౌడ్ స్పీకర్లు ఆ రోజు మోగలేదు!

అది నెమ్మదిగా తన గూట్లోంచి బయటికొచ్చి భయం భయంగా ఓసారి అటూ యిటూ చూసింది. తన జత పావురం యెదురుగానే కనిపించేసరికి ఎగురుకుంటూ వెళ్ళి లౌడ్ స్పీకర్లు మోగకపోవడానికి కారణం ఏమిటన్నట్టు ప్రశ్నార్థకంగా మొహం పెట్టింది. అయితే దాని జత పావురం, 'ఈ రోజు నీకంటే నేనే ముందు లేచాను చూశావా?' అన్నట్టు గీరగా మొహం పెట్టిందే తప్ప తన కళ్ళలోని భయాన్ని మాత్రం పట్టించుకోలేదు.

ఇలా లాభం లేదనుకొని అది తిన్నగా లౌడ్‌స్పీకర్ల దగ్గరికి యెగురుకుంటూ వెళ్ళింది. అమ్మయ్య! లౌడ్ స్పీకర్లకేం కాలేదు, అవి వుండాల్సిన చోటే వున్నాయ్. అయితే పొద్దునే అవి మామూలుగా యెందుకు మోగలేదో దానికర్థం కాలేదు. అది ఓ లౌడ్ స్పీకర్ దగ్గర్నుంచి

మరో లౌడ్ స్పీకర్ దగ్గరికి ఎగుర్తూ ముక్కుతో ఒకటి రెండు సార్లు వాటిని తట్టి చూసింది. అప్పటికీ యేమీ అర్థం కాలేదు. రోజూ జరగాల్సినవి టైం ప్రకారం జరక్కపోతే దానికి చాలా భయం వేస్తుంది. ఇప్పుడు కూడా అలాగే దాని మనసేదో కీడు శంకించడంతో ఓ లౌడ్‌స్పీకర్ పక్కన దిగులుగా కూర్చుండిపోయింది.

తరతరాల నుంచీ దాని వంశానికి మక్కామసీదులోని పావురాయి గూళ్ళలోనే నివాసం. తన వయసెంతో దానికి తెలీదుగానీ, గుడ్డు పగలగొట్టుకుని బైటికొచ్చింది మొదలు అదెన్నడూ ఆ లౌడ్ స్పీకర్లు మూగపోవడం చూడలేదు. ఏదో ఉపద్రవమే ముంచుకొచ్చింది. లేకపోతే ఈ లౌడ్‌స్పీకర్లు వున్నట్టుండి దేనికి మూగవోతాయి?

అది యెండ బాగా నెత్తిమీద కొచ్చేంతవరకూ అలాగే దిగులుగా కూచుండిపోయింది. నెమ్మదిగా దానికి ఆకలిదప్పులు రెండూ ప్రారంభమైపోయాయి. ఇక లౌడ్‌స్పీకర్ల గురించిన ఆలోచన మానేసి కడుపాత్రంతో రెక్కలాడించుకుంటూ మసీదుకొలను దగ్గర దిగింది.

అక్కడికి దిగి వెళ్ళేసరికి దానికి మరో విడ్డూరం యెదురైంది. దాని తోటి పావురాలన్నీ అప్పటికే ఆందోళనగా కొలనుమీద యెగురుతున్నాయి. ఆ ఆందోళనకు కారణం తెలుసుకోవడానికి దానికి క్షణం పట్టలేదు.

మసీదు ఆవరణలో మానవమాత్రుడన్నవాడు లేడు!

చాలా విశాలమైన ఆవరణ అది. ఆ ఆవరణలో వుండే పావురాల వైభవమే వైభవం. హాయిగా ఎగరడానికి కావల్సినంత స్థలం. ఆకలిదప్పులకు కటకటలాడాల్సిన అవసరం యెప్పుడూ లేదు. ఆ మసీదు చూడ్డానికొచ్చే జనం తమకు మేత వేస్తూనే వుంటారు. ఇక దప్పిక తీర్చుకోవడానికి కొలనులో కావల్సినంత నీరు.

ఈ రోజెందుచేతనో ఒక్క మానవమాత్రుడు లోనికి రాలేదు! అంటే యీ రోజు తమకింక తిండి గింజలు దొరకవన్నమాటే!

తిండిగింజల గురించి ఆలోచించడానికి ముందు దప్పిక తీర్చుకోవాలి. అది నేరుగా కొలను దగ్గరకెళ్ళి కడుపు నిండా నీళ్ళు తాగింది. నీళ్ళతో తాత్కాలికంగా కడుపు నిండేసరికి కొలని గట్టున కూచుని ఆ రోజున జనమెందుకు రాలేదో ఆలోచనలో పడింది.

యేవిటో ఈ రోజంతా విపరీతంగానే వుంది!

మొదట లౌడ్‌స్పీకర్లు మోగలేదు, యిప్పుడు జనం తమకు తిండిగింజలేయడానికి రాలేదు.

యేం జరుగుతోంది?

ఆ ప్రశ్నకు సమాధానం తెలీక చివరికి బద్ధకస్వామి అయిన తన జత పావురం కూడా కంగారు పడిపోతోంది.

యెందుకిలా జరుగుతోందో తెలుసుకోవడానికి మసీదు ప్రహరీగోడ మీదికి యెగురుకుంటూ వెళ్ళింది తను.

ఈసారి అది పూర్తిగా తికమక పడిపోయింది. మసీదు వెలుపల రోడ్డుమీద కూడా ఒక్క మానవ మాత్రుడు కనిపించలేదు. అది చూస్తూనే దానికి కడుపులో యేదో ఖాళీ యేర్పడినట్లై యింక కుదురుగా కూచోలేక ఒకేసారి ఆకాశంలో కెగిరింది.

యెదురుగా చార్మినార్ నాలుగు కొమ్ముల భూతంలా కనిపించింది. అది ఆ నాలుగు కొమ్ముల్లో ఓ కొమ్ముమీది కెగిరి కూచుంది. అంతెత్తు నుంచి ఆ చుట్టుపక్కల ప్రాంతాలన్నీ దానికి స్పష్టంగా కనిపిస్తున్నాయ్.

రోజూ జనసముద్రంలో మునకలు వేసే చార్మినార్ ప్రాంతం నలువైపులా పూర్తిగా బోసిపోయింది. అంగళ్ళన్నీ మూసేసి వున్నాయ్. వీధుల్లో జనం తిరగడం లేదు. చేతుల్లో తుపాకులు పట్టుకుని అక్కడ గస్తీ కాస్తున్న పోలీసుదళాలు మాత్రం దానికి కనిపించాయి. వాళ్ళంతా యెవరో తెలుసుకోగల జ్ఞానమైతే దానికి లేదుగానీ, వాళ్ళు రోజూ తనకు కనిపించే సామాన్య జనం మాత్రం కాదని అది అర్థం చేసుకోగలిగింది.

దాని మనసులో రకరకాల భయాందోళనలు మెదిలాయి.

ఇక్కడ జనమంతా ఒకేసారి యెలా మాయమైపోయారు? ఎక్కడికి మాయమైపోయారు?

అక్కడి భయంకరమైన నిశ్శబ్దం చూసి దానికి అంతులేని బెదురు పుట్టుకొచ్చింది. జనమంతా మాయమై గప్‌చిప్‌గా వున్న ఆ కూడలిలో ఒంటిగా ఆకాశాన్నంటుతూ నిలబడ్డ చార్మినార్ నిజంగానే నాలుగు కొమ్ముల భూతంలా వుంది. అదింక చార్మినార్ మీదెక్కువ సేపు కూచోలేక మళ్ళీ యెగురుకుంటూ వెళ్ళి తన తోటి పావురాల మధ్య వాలిపోయింది.

అప్పటికే అక్కడి పావురాల పరిస్థితి దయనీయంగా తయారైంది. యెప్పుడూ తిండిగింజల కోసం కష్టపడాల్సిన అవసరం రాకపోవడం వల్ల ప్రస్తుతం అవి సామాన్యుల తిరుగుబాటుకు గురైన భూస్వాముల్లా వున్నాయ్. యేం చెయ్యాలో తోచక చకచకా మెడ తిప్పుతూ ప్రతి పావురం ఆందోళన కనబరుస్తోంది.

అది తన జతపావురం దగ్గరికి వెళ్ళి దిక్కులేనట్టు నలువైపులా దీనంగా చూస్తూ నిలబడింది. దాని జతపావురం ఆకలికి తట్టుకోలేక తింటానికేమైనా దొరుకుతుందేమోనని నేలమీద అటూ యిటూ చూస్తోంది. నేలంతా శుభ్రంగా తుడిచేసినట్టుంది.

కాసేపటి తర్వాత వాటిలో ఒక్కోటీ ఒక్కోటీ ఆకాశంలోకెగరనారంభించాయ్. తను చూస్తుండగానే తన జతపావురం కూడా వాటితో పాటు ఆకాశంలో కెగిరిపోయింది.

యెగిరే ముందు తన జత పావురం కనీసం మొహమాటానికైనా ఓసారి తనకేసి చూడకపోవటంతో తనకు ఆత్మాభిమానం దెబ్బతినేసింది. ఛ, యీ మగజాతంతా యింతే!

తమ స్వార్థం తాము చూసుకుంటారు తప్ప పెళ్ళామనేది వుందన్న ఆలోచన కూడా వాళ్ళకు రాదు. తనే పిచ్చిది. తన మొగుడు తిండిగింజలేరుకోవడానికి బద్ధకించినప్పుడు తను యెన్నిసార్లు దానిచుట్టూ యెగిరి తనతోపాటు దిగిరమ్మని రెక్కలాడించి హెచ్చరించలేదు! ఇప్పుడేమో అది తనని పట్టించుకోకుండా దాని మానాన అది యెగిరిపోయింది. ఇంకెప్పుడూ దాన్తో జత కట్టగూడదు.

మొగుడి మీద కోపంతో అది చాలా సేపటి వరకూ కొలనుగట్టున ముభావంగా కూచుండిపోయింది. మళ్ళీ తల తిప్పి చూసేసరికి చుట్టుపక్కల ఒక్క పావురం కూడా దానికి కనిపించలేదు.

అది విరక్తిగా తల పంకించింది. ఈ లోకంలో యెవరికి యెవరు తోడు? యెవరి కడుపాత్రం గురించి వాళ్లాలోచించాల్సిందే. కష్టాల్లో మరొకరెవరూ జతకు రారు. మొగుడి మీద మంటతో భోజనం మానుకుంటే కాలేది తన కడుపే గానీ వాడి కడుపు కాదు. వాడికేం, తన గురించి ఆలోచన లేకుండా జల్సాగా తిని తిరుగుతాడు.

అది నెమ్మదిగా యెగరుకుంటూ వెళ్ళి మసీదు ప్రహరీ గోడమీద వాలింది. గేటు దగ్గర కొందరు పోలీసులు తుపాకుల్తో కాపలా కాస్తున్నారు. గేటు మూసి వుంది. వాళ్ళలో యెవరైనా తనకు తిండిగింజలు విసరకపోతారా అనే ఆశతో అది కొద్దిసేపు అక్కడే కూచుండిపోయింది. అయితే వాళ్ళలో ఆ లక్షణాలు యే కోశానా కనబడకపోవడంతో మరోసారి తల పంకించి యిక లాభం లేదనుకుంటూ హుప్‌మంటూ ఆకాశంలో కెగిరిపోయింది.

దానికా అనుభవం కొత్త. యెప్పుడైనా సరదాగా షికారుకెళ్ళడమే తప్ప యిలా తిండిగింజల కోసం పొట్ట చేతబట్టుకొని ఆకాశవీధిలో పడాల్సిన ఖర్మ తనకెప్పుడూ కలగలేదు.

చూపులన్నీ నేలమీద పరిచి తిండి గింజల కోసం చూస్తూ అది చాలా దూరం యెగిరింది. ఒక యింటి కప్పు మీద నుంచి మరో యింటి కప్పుమీద వాలుతూ బిచ్చగత్తెలా తిరిగింది. అదేం ఖర్మో, దానికి తిండిగింజలు దొరక్కపోగా వీధుల్లో ఒక్క నరమానవుడు కూడా దర్శనమివ్వలేదు. అయితే చాలా చోట్ల పోలీసులు మాత్రం తుపాకులు పట్టుకునుండడం మాత్రం కనిపించింది. వాళ్ళలో యెవరూ తనకు తిండి గింజలు వేయరని ముందే నిర్ణయం చేసుకోవడంతో అది వాళ్ళున్న చోట యెక్కడా ఆగలేదు.

అలా యెగరగా యెగరగా చివరికో చోట దానికి బోలెడు మంది జనం కనిపించడంతో ప్రాణాలు లేచి వచ్చాయ్. అమ్మయ్య! ఇంక తనకు తిండి గింజలు దొరికినట్టే!

అయితే త్వరలోనే దాని ఆశ నిరాశగా మారిపోయింది. ఆ జనంలో యెవ్వరూ తనకు తిండి పెట్టే మూడ్‌లో లేరు. రెండు గుంపులుగా విడిపోయి ఒకళ్ళతో ఒకళ్ళు యుద్ధం చేస్తున్నారు. కొందరు రాళ్ళు విసురుతుంటే కొందరు పెట్రోలు సీసాలు అవతలివాళ్ళమీదికి విసురుతున్నారు. పెట్రోలు సీసాలు పగుల్తూనే కొందరు అగ్గిపుల్లలు గీసి ఆవైపు మునివేళ్ళతో సంధించి కొడుతున్నారు. ఆ అగ్గిపుల్లలు వెళ్ళి పడుతూనే భగ్గున నలువైపులా మంటలు కమ్ముకుంటున్నాయి. పసిపిల్లలు, ఆడవాళ్ళూ, ముసలివాళ్ళూ హాహాకారాలు చేసుకుంటూ దిక్కు తోచనట్టు నలువైపులా పరిగెడుతున్నారు.

కేకలు!

పెడబొబ్బలు!

ఏడుపులు!

గందరగోళం!

భయంకరమైన గందరగోళం!

ఆ అలజడి అంతా చూస్తూనే దానికి గుండె కంపించిపోయింది. ఒక్క క్షణం కూడా అక్కడ నిలువకుండా మళ్ళీ యెగిరిపోయింది.

ఆ రోజంతా అది పస్తులుండిపోవలసి వచ్చింది.

చీకటి పడబోతోంది.

ఆ మసకచీకట్లో యెక్కడికి వెళ్ళాలో తోచక ఓ చిన్న గోపురానికున్న గూట్లో ఆ రాత్రికి తల దాచుకుంది.

మసీదుపావురం గుడికొచ్చిందేమని దాన్నెవరూ ఆక్షేపించలేదు. దేవుడికి సకల ప్రాణులూ సమానమో కాదో ఆ దేవుడికే తెలుసుగానీ దానికి మాత్రం గుడిగోపురం, మసీదు మినారూ, చర్చి శిఖరం అన్నీ ఒక్కటే. వాటికోసం కొట్టుకు చచ్చేన్ని తెలివితేటలు, మనుషులకు మల్లే దానికి లేవు.

ఆ రాత్రంతా దానికి కాళరాత్రిగానే గడిచింది. కన్ను మూతబడుతున్న క్షణంలో దూరం నుంచి యెక్కడో భయంకరమైన కేకలూ, ఆర్తనాదాలూ వినిపిస్తాయి. అంతలోనే మరోవైపున మంటలు భగ్గున లేస్తాయి. అవన్నీ చూసి అది గజగజా వణికిపోతూ గూట్లో మరింత లోపలికి ముడుచుకుపోవడానికి ప్రయత్నిస్తుంది.

యెలాగో తెల్లవారింది. తూర్పు కిరణాలు సోకుతూనే అది మెల్లగా గూట్లోంచి బయటికొచ్చింది. ఓసారి బిక్కు బిక్కుమంటూ చుట్టూ చూసింది. యెక్కడా యెలాంటి కేకలూ వినిపించడంలేదు. ఆ ప్రదేశమంతా పూర్తిగా నిర్మానుష్యమైపోయింది.

తోటి పావురాల కోసం మనసు అప్పటికే అంగలార్చనారంభించింది. తన జత పావురం చేసిన తప్పిదాన్ని యెప్పుడో క్షమించేసింది. వాటికోసం వెతుక్కుంటూ అక్కడ్నించి బయల్దేరింది.

అయితే దానికి తోటి పావురాలు యెక్కడా కనిపించలేదు. వెతికినంతసేపు వాటికోసం వెతికి చివరికి ఓ చెట్టు మీద వాలింది. అకస్మాత్తుగా దానికి బోలెడు దిగులు ముంచుకొచ్చేసింది. దిగుల్తోపాటు ఆశ్చర్యం కూడా వేసింది.

యేంవైంది యీ పాడు మనుషులకి?

హఠాత్తుగా యేం మాయరోగం ముంచుకొచ్చింది?

ఇంతకి తన తోటి పావురాలన్నీ యేమైపోయాయి?

అదలా దిగులుగా కూచుని ఆలోచిస్తుండగానే వున్నట్టుండి పెద్ద పెట్టున యెవరిదో వెఱ్ఱి కేక వినిపించింది. దాంతో అది ఉలిక్కిపడి తల అటువైపు తిప్పి చూసింది.

యెవరో ఆడపిల్ల. నిండా పన్నెండేళ్ళు కూడా వుండవు. భుజం మీద నుంచి వేలాడుతున్న తుండుగుడ్డలో యేదో మూట గట్టుకుని వెఱ్ఱికేకలు పెట్టుకుంటూ తను కూచున్న చెట్టువైపు పరిగెత్తుకుంటూ వస్తోంది. ఆమె పెడుతున్న కేకలకు తన వంట్లోని రక్తమంతా గడ్డ కట్టుకుపోతున్నట్టనిపించింది దానికి.

ఆ పిల్ల వెనుకే నలుగురు దున్నపోతుల్లాంటి మగాళ్ళు పెడబొబ్బలు పెట్టుకుంటూ వస్తున్నారు. ఆ నలుగురి చేతుల్లోనూ బారాటి కత్తులున్నాయి.

"కొట్టండి... నరకండి... చంపండి..." – ఇవీ ఆ నలుగురూ పెడుతున్న పెడబొబ్బలు.

ఆ పిల్ల వాళ్ళకందకుండా పరిగెడుతోంది.

అయితే ఆమె చెట్టుకిందికొచ్చేసరికే వాళ్ళ చేతుల్లో చిక్కిపోయింది. వెంటనే వాళ్ళ కరవాలాలు పైకి లేచాయి.

చివరిసారిగా ఆ పిల్ల ఒక్క వెఱ్ఱికేక పెట్టింది.

హృదయ విదారకంగా వినిపించిన ఆ కేక మధ్యలోనే ఆగిపోయింది.

ఆ పిల్ల తలా, మొండెం వేరు వేరుగా నేలమీద పడ్డాయ్.

వెంటనే ఆ నలుగురూ పిశాచాల్లా నవ్వుతూ ఆ శవం చుట్టూ కరవాలాలు తిప్పుకుంటూ రాక్షస తాండవం చేశారు. ఆ తర్వాత అదృశ్యమై పోయారు.

అంతవరకూ ఆ చెట్టుమీద మంచుముద్దలా గడ్డకట్టుకుపోయిందల్లా కాసేపటికి దాని వంటిమీద తెలివొచ్చి నట్టైంది. తక్షణం అక్కణ్ణించి పారిపోవాలన్న ధ్యాసలో గబుక్కున రెక్కలు విప్పింది.

అయితే అంతలోకే దాని చూపులు నేలమీద ఒకచోట అట్టే నిలిచిపోయాయి.

ఆ పిల్ల శవం పక్కనే నూకలు చెల్లాచెదురై పడున్నాయి.

ఆ నూకలకోసమే ఆ పిల్ల ప్రాణాలకు తెగించి తన ఇంట్లోంచి బయటికొచ్చింది. యెలాగో అవి సంపాయించగలిగింది గానీ వాటిని తుండుగుడ్డలో మూట కట్టుకుని యింటికి తెస్తుండగానే ఆ నలుగురు రాక్షసుల చేతుల్లో చిక్కిపోయింది. చివరి క్షణం వరకూ ఆమె ఆ నూకల్ని మాత్రం వదల్లేదు. ఆమె ప్రాణాలు పోతూనే ఆ నూకలన్నీ చెల్లాచెదురై కింద పడిపోయాయి.

చనిపోయిన ఆ పిల్ల మతం యేదైనా కావచ్చు. ఆమెను చంపిన నలుగురి మతం యేదైనా కావచ్చు. కానీ, మృత్యువుకు మాత్రం మతం లేదు. ఆమె పక్కనే నేలమీద పడున్న ఆ నూకలక్కూడా మతంలేదు.

ఆ నూకల్ని చూస్తూనే అది చెట్టు మీదనుంచి రివ్వున దిగొచ్చి ఆవురావురుమంటూ వాటిని యేరుకొని తినెయ్యడం మొదలెట్టింది. ఆ పక్కనే రెండు ముక్కలై పడున్న ఆ పిల్ల శవం దాన్నింక యెంత మాత్రం భయపెట్టలేదు.

ఆకలి మీదుండడంతో ఆ నూకల్నేరుకు తింటంలో యెంతగా అది మునిగిపోయిందంటే వెనకనుంచి తనవైపే చప్పుడు చేయకుండా వస్తున్న గండుపిల్లిని యెంతమాత్రం గమనించలేకపోయింది. ఆ గండుపిల్లి కూడా బహుశా దాన్లాగే ఆకలిమీదుందేమో ఒక్కసారిగా వచ్చి ప్రళయంలా దానిమీద పడిపోయింది. యేం జరుగుతుందో అర్థం చేసుకునేలోపలే దాని మెడ గండుపిల్లి కోరలకు చిక్కిపోయింది.

తప్పించుకోవడానికి అది గిజగిజలాడింది.

అయినా లాభం లేకపోయింది.

రెక్కలు టపటపా కొట్టుకుంది.

అయినా లాభం లేకపోయింది.

కాళ్ళు రెండూ తన్నుకుంది.

అయినా లాభం లేకపోయింది.

ఆ పిల్ల శవం పక్కనే దాని ఈకలు కుప్పలుగా పడ్డాయి.

తెల్లని దాని రంగు ఎర్రగా మారిపోయింది.

యెవరి నోటికీ అందని ఆ నూకలు మట్టిలో కలిసిపోయాయి.

*ప్రజాసాహితి, మే 1991*

# సెగమంటలు

మాల ఓబులేసు నీరసంగా రిక్షా తోసుకుంటూ వచ్చి తన ఇంటి ముందాపాడు. ఇల్లంటే ఇల్లు కాదది. బోద వసారా. పేరుకు మాత్రం చుట్టూ నాలుగు మట్టి గోడలుంటాయి. ఆ నాలుగు గోడలు కూడబలుక్కొని కూడా ఆ ఇంటికో మంచి కొట్టం రూపైనా ఇవ్వలేకపోతున్నాయి.

ఓబులేసు ఇంటికాడ రిక్షా ఆపుతూనే బిలబిలమంటూ అతని ఆరుగురు సంతానం వచ్చి చుట్టేశారు.

"నాయన! నాయన!"

"య్యా! యేందే సీదర! పాండి," కసిరాడు ఓబులేసు.

అతని భార్య లక్ష్మి ముసిముసిగా నవ్వుకుంటూ కొట్టంలోంచి బయటికొచ్చింది. "మాపిటాలైతే నువ్వు మనిసివి కావా యేంది? పిల్లోల్లు యాల నీకాడికొచ్చినారో గుడ్కా అడగవా?" అంది తెచ్చిపెట్టుకున్న కోపంతో.

"యేంది సంగతి?" అన్నాడు ఓబులేసు రిక్షా చక్రంకాడ గోడవారగా కూలబడుతూ.

సాయంకాలం మసక చీకట్లు కమ్ముతున్నాయి. లక్ష్మి కొట్టంలోకెళ్ళి దీపం తెచ్చి గుమ్మం దగ్గరుంచింది. ఏదో ఖాళీ మందుల సీసాలో గబ్బునూనె పోసి అందులో పాత గుడ్డపీలిక వేసి మూతకు రంధ్రం పెట్టి వెలిగించిన దీపమది. ధగద్ధగాయమానంగా వెలుగుతోంది.

"యేందో సెప్పవ్?" అన్నాడు ఓబులేసు.

లక్ష్మి చేతులు ముందుకు తెచ్చి మురిపెంగా అతనికి చూపించింది. ఆ చేతుల్నిండా కొత్త గాజులున్నాయ్.

"యాడియో చెప్పుకో."

"యాడియి?" అడిగాడు ఓబులేసు.

"మద్దేన్నం ఓట్లడుగుతా సంగిరెడ్డోల్లు వచ్చిపోయినారు. ఓటుకు ఇరభై రూపాయ లిచ్చినారంటే! అందుకే పిల్లోల్లు గుడ్కా ఈ పొద్దు వుషారుగా వుండారు," చెప్పింది లక్ష్మి.

"ఓటుకు ఇరభై రూపాయలిచ్చినారా! లెక్కేడ బెట్టినావ్?" హడావుడిగా లేవబోయాడు ఓబులేసు.

అతనింట్లో మొత్తం అయిదు ఓట్లున్నాయి. ఓబులేసు, లక్ష్మి, ఓబులేసు తల్లిదండ్రులు, ఓబులేసు పెద్ద కూతురు వీరమ్మ. ఆ పిల్లకు ఇంకా పదిహేనే సరిగ్గా నిండలేదు. అయినా పద్దెనిమిది నిండినట్లు రాయించారు. ఇక ఓబులేసు తల్లిదండ్రులు చనిపోయి చాలా కాలమైంది. అయినా ఓటర్ల లిస్టు నుంచి వాళ్ళ పేర్లు తొలగించడం జరగలేదు. ఈ తిరకాసులన్నీ ఓబులేసుకి తెలిపి వుండాల్సిన అవసరం లేదు. అన్నీ నాయకులే శ్రద్ధగా చూసుకుంటారు. ఎటొచ్చీ ఆ ఓటు తమకు పడాలి – అంతే. ఓటుకు ఇరవై రూపాయలంటే అయిదు ఓట్లకు నూర్రూపాయలు. ఓబులేసు అంత డబ్బు ఒకేసారి కళ్ళజూసి చాలా రోజులైంది.

లక్ష్మి అతన్ని లేవనియ్యకుండా వెనక్కి తోసింది.

"పోయి దొంగసారా తాగుతావా? లెక్క నీకియ్యనుగా".

"నాకియ్యకపోతే ఎవనికిస్తావే? నీ రొండో మొగునికిస్తావా?" కోపంగా అన్నాడు ఓబులేసు.

"అదో, అట్లాంటి మాటలంటేనే నాకు మండుతాది. నేనేం జేస్తా లెక్క? నీ మాదిరిగా దొంగసారా తాగుతానా? ఏదో నేనింత తిని పిల్లోల్ల కింత పెడ్తా. అంత దానికి నాకు రొండో మొగుడుండాడంటావా?"

ఓబులేసు ఆ మాటతో కొంత తగ్గాడు. "సర్లేయే! లెక్క యాడ బెట్టినావ్?" అన్నాడు బతిమాలుకుంటూ.

"ఉండాదిలే పెట్టిన కాడ. అయినా ఇయ్యాల నీకు లెక్క పెట్టి దొంగ సారా తాగాల్సిన కర్మేమి? మనందరికీ సారా సంగిరెడ్డోల్లే యేపిస్తుండారు."

"నిజమా?" అన్నాడు ఓబులేసు నోరు తెరిచేసి.

నిషేధం తర్వాత ఓబులేసుకి సారా దొరకడం లేదు. దొరకడం లేదంటే దొరుకుతుంది. వారుణ వాహినీ మయం గానే ఎంత కావాలంటే అంత దొరుకుతుంది. అయితే అందుకు డబ్బు చాలా అవుతుంది. అందుకే ఓబులేసు ఈ మధ్య సాయంకాలమైతే సచ్చిన పాయలో అన్నట్టు నీరసంగా వుంటున్నాడు. ఉచితంగా ఆ రోజు సారా వస్తుందంటే అప్పటికప్పుడే అతని నాలుక పీకనారంభించేసింది.

"నేను అపద్దం చెప్తానా యేంది? రేత్రికి సియ్యలు గుడ్కా వుండాయి," అంది లక్ష్మి వగలు బోతూ.

ఓబులేసు ఈసారి హుషారుగా లేవబోయాడు. అయితే అంతలోకే ఏదో గుర్తుకొచ్చి మళ్ళీ సాలోచనగా కూర్చుండిపోయాడు.

"ఏమాయె?" అడిగింది లక్ష్మి.

"అది కాదు. సంగిరెడ్డి కాడ లెక్క దీసుకుంటే దస్తగిర్రెడ్డి ఏమనడా అని."

లక్ష్మికి అతని అనుమానం అర్థమైంది.

"దస్తగిర్రెడ్డి యాడుండాడులే. రాముడుంటే దస్తగిర్రెడ్డి. ల్యాకుంటే లేడు. పోలీసోల్లు రామునితో పాటే దస్తగిర్రెడ్డి అల్లున్ని గుద్కా లోపలేసినారంట. ఈసారి దొంగఓట్లు పడవంటనే? పోలీసోల్లు గట్టిగా వుంటారంట," అంది.

"అంతేనంటావా? సరే, సూద్దాంలే," అంటూలేచి నిలబడ్డాడు ఓబులేసు. సారా మీద ఆశ అతన్ని అంతకంటే ఎక్కువ ఆలోచించనివ్వలేదు. ఇంట్లోకెళ్లి తప్పెట చేతిలోకి తీసుకుని అది సరిగ్గా వుందో లేదో చూశాడు.

ఆ రాత్రి మాలవాడలో సెగమంటలు వేశారు. మగాళ్ళంతా మంట చుట్టూ చేరి తప్పెట్లకు సెగ చూపిస్తున్నారు. ఆడవాళ్ళూ పిల్లలూ మరో వంక బారులు తీరి కూర్చున్నారు. ప్లాస్టిక్ బకెట్లలో సారా సీసాలు సిద్ధంగా వున్నాయి. ఇంకో వైపు నిప్పుల మీద మాంసం కడ్డీలు కాలుతున్నాయి. సారా తాగేవాళ్ళు తాగుతున్నారు. చియ్యలు తినేవాళ్ళు తింటున్నారు.

"తాగండ్రా తాగండి. సియ్యలు బాగా బాగా తినండి. రేపు ఒక్కోడూ తక్కవంటే పదోట్లు బేసి రావాల. ఎంత కావాల్నో తాగండి," అంటున్నాడు అడ్డోడు. సంగిరెడ్డి తరపున అతనే అక్కడ కార్యనిర్వాహకుడు.

అంతవరకు తన తప్పెట్లో మోత ఎలా వస్తోందో పరీక్షించుకుంటున్న ఓబులేసు మెల్లగా అడ్డోని పక్కలో చేరాడు.

"అది కాదన్నా అడ్డోడన్నా! ఈసారి దొంగఓట్లు పడవంటనే?" అన్నాడు.

"ఎందుకు పడవు లేరా. వూకే అంటాంటారు గానీ ఈ పోలీసోల్లు. అందుకే చెప్తాండా, రేపు ఒక్కోడూ పదోట్లన్నా బేసి రావాల," అన్నాడు అడ్డోడు.

"సంగిరెడ్డికి ఓట్లేసి మండలాధ్యచ్చున్ని చేస్తే మాకు పక్కా ఇండ్లు కట్టిపిస్తాడా? బోద కొట్టాల్లో సచ్చాండాం. ఎండల కాలమొస్తే అగ్గెంటుకుంటాదని గుండె సేతుల్లో పెట్టుకోని బతుకుతాండాం."

"ఊం, అందులో నీకు అనుమానం యేమిటికి? సంగిరెడ్డి మీ అందరికీ పక్కా ఇండ్లు కట్టిపిస్తాడు. మరేం భయం లేదు పో. అందరూ వెచ్చంగా పక్కా ఇండ్లల్లో బాగుందురుగాని."

"అది కాదన్నా! పోయినసారి దస్తగిర్రెడ్డి పక్కా ఇండ్లు కట్టిపిస్తానని చెప్పినాడు. ఏదీ, కట్టిపిల్యా."

"దస్తగిర్రెడ్డికీ, సంగిరెడ్డికీ ఒకటేనేందిరా? ఇప్పుడా కాలం పాయ గదా. మీకేం కావాల్నో నాకు చెప్పండి. సంగిరెడ్డికి చెప్పి నేను చేపిస్తా మీ పనులు. పక్కా ఇండ్లూ వస్తాయ్, అన్నీ

వస్తాయ్. రేపు మీ ఓట్లు మాత్రం మర్చిపోకుండా సంగిరెడ్డికే వేయండి. ఒక్కోడూ పది ఓట్లు వేయండి."

ఆ మాటతో ఓబులేసుకు హుషారొచ్చేసింది. బాగా తాగేసి తప్పెట వాయిస్తూ పాటందుకున్నాడు-.

"వచ్చెర వచ్చెర సంగిరెడ్డెన్న!
తెచ్చెర తెచ్చెర పక్కా ఇండ్లు!
వచ్చెర వచ్చెర సంగిరెడ్డన్న!
వచ్చెర వచ్చెర! తెచ్చెర తెచ్చెర!"

ఓబులేసు పాటకు వంత పాడుతూ మిగతావాళ్ళు కూడా తప్పెట్లు వాయించడం మొదలెట్టారు. ఆడవాళ్ళు నవ్వుతున్నారు. పిల్లలు కేరింతలు కొడుతూ సెగమంటల చుట్టూ వలయాలు కట్టి తిరుగుతున్నారు. వాతావరణం పండగలా వుంది. దేవరలో గానీ అలాంటి పండగ వుండదు. ఆ రాత్రంతా తప్పెట మోతలతో మాలవాడంతా మారుమోగిపోయింది.

తెల్లారింది.

ఎవరిళ్ళలో వాళ్ళు అంతా తాగి పడుకున్నారు.

అంటరానితనం తెలీని సూర్యకిరణాలు మిగతా లోకమంతటితో పాటు మాలవాడను కూడా ప్రేమగా స్పృశిస్తున్న సమయంలో అక్కడ ఒక్కసారిగా అలజడి చెలరేగింది.

ఎవరో వచ్చి ఓబులేసు కొట్టం తలుపు దబదబా బాదేస్తున్నారు.

"ఒరే, ఓబులేసూ! ఇంగా పండుకున్నావా! రాముడొచ్చేసినాడ్రా! రాముడొచ్చేసినాడ్రా!" ఎవరిదో ఆక్రోశిస్తున్న ఆడగొంతు.

ఓబులేసుకు మెలకువొచ్చింది. తల దిమ్ముగా వుంది. వెళ్ళి తలుపు తీశాడు.

"ఎవరే?"

నాలుగిళ్ళ అవతలుండే ముసల్ది. తనని లేపినట్టే అందర్నీ తలుపులు బాది నిద్ర లేపుతోంది. తన కొడుకుని రాముడు చెట్టుకు కట్టేసి కొడుతున్నాడని లబలబా మొత్తుకుంటోంది.

రాముడు వచ్చేశాడన్న మాట బుర్రలో ఇంకగానే ఓబులేసు మత్తంతా దిగిపోయింది.

"ఓట్లయిపోయినంత వరకు పోలీసోల్లు వదలమన్నారే! ఎట్లా వదిల్నారబ్బా?" అని బిగ్గరగానే అనుకుంటూ భార్యని సమీపించాడు.

అతనింకా లక్ష్మిని నిద్ర లేపనే లేదు.

ఎక్కడ్నించి వచ్చారో కొందరు మనుషులు ధనామంటూ తలుపు తోసుకుంటూ వచ్చి అతనింట్లో జొరబడ్డారు. అడ్డంగా నేలమీద పడుకున్న పిల్లల్ని కాళ్ళతో తన్నుకుంటూ వెళ్ళి ఓబులేసు వీపు మీద నాలుగు పిడిగుద్దులు వేశారు.

గుండె అదిరినట్లనిపించి, "అమ్మా!" అన్నాడు ఓబులేసు.

లక్ష్మి తత్తరపాటుతో లేచి కూర్చుంది.

పిల్లలు అప్పటికే పెద్దగా ఏడుస్తున్నారు.

వచ్చినవాళ్ళు ఓబులేసుని చొక్కా పట్టుకుని ఈడ్చుకుపోనారంభించారు.

"ఓర్నాయనో! నా మొగున్నిగ్గకు పోతాండా(ర్రా!" అని వె(రిగా అరుస్తూ లక్ష్మి ఆ వెనకాలే పరుగెత్తింది.

రాముడు ఒక చింత మానుకు మంచి వయసులో వున్న నలుగురు మాల కుర్రాళ్ళని కట్టేసి కర్రతో గొడ్లను బాదినట్టు బాదుతున్నాడు. అక్కడే వుండి అతన్ని ఎగదోస్తున్న దస్తగిర్రెడ్డి అల్లుడు కుల్లాయిరెడ్డి శివమెత్తినట్టు మాలజాతినంతటినీ బండ బూతులు తిడుతున్నాడు.

కుల్లాయిరెడ్డి మనుషులు ఓబులేసుని ఈడ్చుకొచ్చి అతని ముందు పడేశారు.

ఓబులేసు గభాల్న కుల్లాయిరెడ్డి కాళ్ళు పట్టుకున్నాడు.

"కొట్టాకన్నా! మమ్మల్ని కొట్టాకన్నా!"

కుల్లాయిరెడ్డి కాలు పైకెత్తి ఓబులేసు గుండెమీద తన్నాడు.

ఓబులేసు వెనక్కి పడ్డాడు. తల ధనామంటూ నేలకేసి కొట్టుకుంది.

"ఏమిరా! సంగిరెడ్డికాడ లెక్క తీసుకుంటారా?" అన్నాడు కుల్లాయిరెడ్డి ఓబులేసు మొహం మీదికి వంగుతూ.

"లేదన్నా!" ఏడుస్తూ అన్నాడు ఓబులేసు.

"నీ సంగతేంది? సంగిరెడ్డి మింద పాట గుడ్కా పాడ్నావంటనే!"

"లేదన్నా! లేదు!"

"అయితే పో. సంగిరెడ్డి లెక్క యెనక్కిచ్చేసిరా పో. మీకు లెక్క కావాల్నంటే దస్తగిర్రెడ్డి ఈనన్యాడా? సారా యేపిచ్చమంటే యేపిచ్చనన్యాడా? ఓటుకు ఇరభై ఇస్త్యానన్నాడు కదా సంగిరెడ్డి? వోటుకు దస్తగిర్రెడ్డి యాభై ఇస్తాడు పాండి. ఓట్లు మాత్తరం దస్తగిర్రెడ్డికే పడాల. పడకపోయినాయా, తోలొలిపిస్తా. పో, లెక్క ఇచ్చేసి రా పో."

ఆ రోజే మాలవాడ మాలవాడంతా కదిలి అడ్డోడి ఇంటికి వెళ్ళారు.

"ఏందిరా వచ్చినారు?" అన్నాడు అడ్డోడు ఒక్కసారిగా అంత మందిని చూసి బెదిరిపోతూ.

ఓబులేసు ముందుకొచ్చాడు.

"అన్నా, ఏమనుకోవాకు, రామున్నీ, కుల్లాయిరెడ్డినీ పోలీసోల్లు ఇడిసేసినారు. నీకు దండం పెడ్తా సామీ, సంగిరెడ్డెన్నని యేమనుకోవాకని చెప్పు. ఇదో మీరిచ్చిన లెక్క."

ఓబులేసుతో పాటు ఒక్కొక్కరూ ముందుకొచ్చి ఎవరికిచ్చిన డబ్బు వాళ్ళు అడ్డోడి ముందర పెట్టి వెళ్ళిపోతున్నారు. లక్ష్మి ఆ డబ్బుతో తాను కొన్న గాజుల్ని కూడా వలిచేసి అడ్డోడి ముందర పెట్టేసింది. గాజులు వలుస్తుండగా ఆమెకు కన్నీరు ఆగింది కాదు.

ఆ మర్నాడు పొద్దునే ఏడు గంటలకు ఎలెక్షన్ ప్రారంభమైపోయింది.

దొంగఓట్లు వేయడానికి వెళ్ళిన ఓబులేసు భార్యాబిడ్డలు బిక్కమొహాలతో వెనక్కి తిరిగి వచ్చేశారు.

ఆ సమయంలో కుల్లాయిరెడ్డి ఒకింట్లో ఓట్ల అంగడి పెట్టుక్కూర్చున్నాడు. రాముడు కూడా అక్కడే వున్నాడు. దొంగ ఓట్లేసి వచ్చిన వాళ్ళంతా అక్కడ సిరా గుర్తు తుడిపేసుకునే ప్రయత్నంలో వున్నారు. కొందరు కిరసనాయిల్తో, కొందరు స్పిరిట్‌తో, ఇంకొందరు అగ్గిపుల్లల్తో తంటాలు పడుతున్నారు.

"ఏమ్మే, ఓట్లు బేసొచ్చినారా?" గద్దించాడు రాముడు.

ఆ హూంకారానికి బెదిరిపోతూ తల్లీకూతుళ్ళిద్దరూ ఒక మూలకు ఒదిగిపోయారు.

"లేదన్నా, మాయన్నీ దొంగఓట్లని ఆడ తరిమేస్తాండారు," దీనంగా అంది లక్ష్మి.

"వాల్లు తరిమినారా, మాకు ఓట్లు బేయాల్సి వస్తాదని మీరే ఎల్లబారొచ్చేసినారా? డ్రామాలేస్తాండావేమే?"

"లేదన్నా, సత్తెం చెప్తాండాం," చేతులు నులుముకుంటూ అంది లక్ష్మి.

"నీ మొగుడెవరని అడుగుతాండారాన్నా ఆడ. నేను బద్రిగాడని చెప్పినా. వాల్లు నమ్మలా. నీ మొగుని పేరు ఓబులేసు గదేమే. మాకు తెల్సులే. దొంగఓటు కోసం ఇంగెవర్నో మొగుడని చెప్పుకోను సిగ్గు లేదేమే లంజల్లారా మీకు అని కూడా తిట్టినారన్నా," కన్నీరు పెట్టుకుంది.

కుల్లాయిరెడ్డి ఓబులేసు వంక చూశాడు.

"రేయ్, ఇలారా."

ఓబులేసు చేతులు కట్టుకుని ముందుకొచ్చాడు.

కుల్లాయిరెడ్డి ఓటరు చీటీ ఒకటి అతని చేతిలో పెట్టి, "ఈ ఓటు బేసి రాపో. బేయకుండా ఎనక్కొచ్చినావా, నీ పెండ్లాం నీది కాదు," అన్నాడు.

ఓబులేసు వణికిపోతూ ఆ చీటీ పట్టుకుని బయల్దేరాడు.

పోలింగ్ బూతు దగ్గర క్యూలో అరగంట నిలబడ్డాక అతని వంతొచ్చింది.

"వరస నెంబర్ మూడొందలా పది," అరిచాడు పోలింగ్ అసిస్టెంట్.

ఇందాక లక్ష్మికి అబ్జెక్షన్ చెప్పిన సంగిరెడ్డి తరపు పోలింగ్ ఏజెంటే ఓబులేసుని చూసి కనుక్కున్నాడు.

"ఏమిరా ఓబులేసూ! ఎంకటయ్య ఓటు బేసేదానికొచ్చినావా? దొంగ నా కొడకా! ఇందాకనే నీ పెండ్లాం వచ్చి పాయగదరా! ఇప్పుడు నువ్వొచ్చినావా? మీ కుటుంబం కుటుంబం అంతా దొంగఓటు బతుకేనేమిరా? పోరా, బయటికిపో!"

ఓబులేసు కదల్లేదు.

"పొమ్మంటే పోవేమిరా?" గర్జించాడు ఏజెంటు.

ఓబులేసు అప్పటికీ కదల్లేదు. తల వంచుకుని నిలబడ్డాడు.

డ్యూటీ కానిస్టేబుల్ అతను కదలకపోయేసరికి మెడ పట్టుకున్నాడు.

"కదులూ," హాలు దద్దరిల్లిపోయేట్టు పెనుకేక వేశాడు.

ఓబులేసుని కొంత దూరం వరకు కానిస్టేబుల్ ఈడ్చుకుపోగలిగాడు. అయితే గుమ్మం ఎటుందో అతనికి చూపించక ముందే ఓబులేసు ఆ పట్టులోంచి తప్పించుకుని పరుగెత్తుకుంటూ వచ్చి పోలింగ్ ఆఫీసర్ ముందు మోకాళ్ళ మీద కూలబడ్డాడు.

"సామీ! మాల నా కొడుకుని సామీ! ఎవనికోపం వచ్చినా కాలు ఎగ్గేసి ఎగ్గిసి నన్నే తంతారు. ఈ ఓటు నన్ను బేయనీయండి సామీ! నిజమే సామీ, నాది దొంగ ఓటు బతుకే. సంగిరెడ్డి గెల్చినప్పుడూ దొంగఓటే బేసినా. దస్తగిర్రెడ్డి గెల్చినప్పుడూ దొంగ ఓటు బేసినా. ఇప్పుడూ దొంగఓటు బేయనీకే వచ్చినా. నా ఒక్కన్దే దొంగఓటేమి సామీ? ఈడ పెట్టెలో పడ్తాండేయన్నీ మంచి ఓట్లేనా సామీ? ఎవనికి తెల్దు సామీ! దొంగ వోటు బేయకుంటే మమ్మల్ని సంపుతారు సామీ! ఈ దొంగ ఓటు బేయకుంటే పెండ్లాం నాది కాదు సామీ! బేయనీయండి సామీ! ఈ దొంగఓటు బేయనీయండి సామీ!".

ఓబులేసు ఆ మాటలంటున్నప్పుడు ఒక్కసారిగా వరదొచ్చిన పెన్నలా హెూరుమన్నాడు. అనేశాక పెన్నలాగే చివర ఎండిపోయాడు. రెండు చేతులూ కడుపులో పెట్టుకుని ఆఫీసరు కాళ్ళ దగ్గర ఉంగలు చుట్టుకుని పడిపోయాడు.

ఒక్కసారిగా అక్కడ భయంకరమైన నిశ్శబ్దం అలుముకుంది.

ఓబులేసు గుండెలో సెగమంటలు రగుల్తున్నాయి.

*ప్రజాసాహితి, జులై 1995*

# దోబూచి

"దా...దా...దా!" అంది పాప.

చంద్రుడు రాలేదు. అక్కడే ఆకాశంలో వేలాడుతూ మబ్బుల్తో దోబూచులాడుతున్నాడు.

"దా...దా...!" అంది పాప.

పొత్తిళ్ళలో పడుకుని కాళ్ళూ చేతులూ గబగబా ఆడించింది.

"దా..దా...!"

చంద్రుడు నవ్వుతూ మబ్బు చాటుకెళ్ళాడు.

కాళ్ళూ చేతులాడించడం ఆపేసింది పాప.

బిక్కమొహం వేసింది.

తల నిక్కించడం రాక కాళ్ళతో పక్కను దభీ దభీ తన్నింది.

చంద్రుడు బయటికి రాలేదు.

మబ్బులు నడుస్తున్నాయి.

మబ్బుల్తో ఆకాశం నడుస్తోంది.

"దా...!" అంది పాప.

చంద్రుడు అప్పటికీ రాలేదు.

చుక్కలు పోటీపడి మినుకు మినుకుమంటున్నాయి.

ఎక్కడో ఉల్క రాలింది.

అది తనవైపొస్తుందా?

రాలేదు.

ఎక్కడో పడిపోయింది.

చంద్రుడు నెమ్మదిగా మబ్బు చాటునుంచి బయటికొచ్చాడు.

పాప కళ్ళలో వెన్నెల కాసింది.

ఉత్సాహంతో పాప కాళ్ళూ చేతులూ దబదబా ఆడించేసింది.

"దా...దా....దా...!"

తెల్లగా గుండ్రంగా వున్నాడు–చంద్రుడు. అమ్మలా వున్నాడు.

పాప బోసిగా నవ్వింది.

"కూచి...కూచి...!" అన్నాడు చంద్రుడు ఎక్కడో కీచురాయి గొంతులో దూరిపోయి.

"దా...దా...!"

"కూచి....కూచి!"

"దా...దా...!"

"కూచి...కూచి...కూచి...కూచి...!"

సంభాషణ సాగుతోంది.

అమ్మలాగే మాట్లాడుతున్నాడు చంద్రుడు.

పాప ఉత్సాహం అవధులు దాటింది.

కాళ్ళూ చేతులూ మహాజోరుగా ఆడించేసింది.

అమ్మ పక్కనే పడుకునుంది. అమ్మ కొంగు చేతికందింది. గుప్పిట్లో పట్టేసింది పాప. మొహం మీదకు లాక్కునేసింది.

చంద్రుడు మాత్రం తక్కువ తిన్నాడా!

తనూ మబ్బుకొంగు మొహం మీదికి లాగేసుకున్నాడు.

"మ్మ...మ్మ...," పిలిచింది పాప.

అమ్మ పలకలేదు. నిద్రపోతూనే వుంది. పాప మొహంనిండా అమ్మ కొంగు పరుచుకుంది.

చంద్రుడి మొహం నిండా మబ్బు కొంగు పరుచుకుంది.

కొంగులో దాంకుని ఓ పక్కనుంచి దొంగచాటుగా చూసింది పాప.

చంద్రుడు కూడా దొంగచాటుగానే చూశాడు.

మబ్బు కొంగుపైనుంచి అలా మెడ రిక్కించి తొంగి చూశాడు.

దబ దబా అమ్మ కొంగు తన్నేసింది పాప.

అమ్మ పక్కలో మెత్తగా హాయిగా వొదిగింది.

కదలకుండా చూస్తూ పడుకుంది కాసేపు.

చల్లగాలి మెల్లగా పాపబుగ్గలు పుణికి తల నిమిరి సున్నితంగా జారిపోయింది.

చంద్రుడు మళ్ళీ నెమ్మదిగా బయటికొచ్చాడు.

పాప బొజ్జలో చిన్నగా ఆకలేసింది.

మొహం చిట్లించి ఏడవబోతూ ఆగింది.

చంద్రుడు మబ్బు చాటునుంచి పూర్తిగా బయటికి వచ్చేశాడు.

ఆకలి మర్చిపోయింది పాప.

"దా...దా...!"

గాలి మళ్ళీ వచ్చి అమ్మ కొంగులా పాపను కమ్మి చెట్ల ఆకుల్లోకి రయ్యిన లేచింది. ఆకుల చాటునించి కొమ్మలోకి, కొమ్మల్లోంచి మళ్ళీ పాపకేసి వీచింది.

చెట్లన్నీ పాపకు వింజామర వీస్తున్నాయి.

ఆ వేళప్పుడు కూడా కొమ్మల చాటున కోయిల 'కూ' అంది.

చేతులు కదిలించి కోయిల పాటను గబుక్కున పట్టుకోబోయింది పాప.

పాట చేతుల్లో చిక్కలేదు.

మళ్ళీ "కూ" అంది కోయిల.

కాళ్ళూ చేతులు దబాదబా ఆడించింది పాప.

పాట మాత్రం చేతికి చిక్కలేదు.

"కూ...కూ...!"

చంద్రుడే పాడేస్తున్నాడు!

అరచేతులు విప్పి ఆకాశాన్నంతా తన గుప్పిట్లోకి తీసుకోబోయింది పాప.

ఆకాశమంతా చేతుల్లోకొచ్చింది.

చంద్రుడు మాత్రం జారిపోయాడు.

చంద్రుడితో ఆకాశం కూడా చేతుల్లోంచి జారిపోయింది.

కాలు పైకెత్తి తన్నబోయింది పాప చందమామని.

చంద్రుడు బంతిలాగయ్యాడు కానీ కాలికి తగల్నే లేదు. ఆకాశంలోనే ఆడుకుంటున్నాడు.

కాళ్ళూ చేతులాడించడం ఆపి చంద్రుణ్ణి తదేకంగా చూస్తుండిపోయింది పాప. ఎదురుగానే ఉన్నాడు. చేతుల్లోకి రాడు. చిక్కనే చిక్కడు. ఎలా?

ఎక్కడ్నించో మబ్బు మళ్ళీ నడుచుకుంటూ వచ్చింది. చంద్రుడు మళ్ళీ దాంకున్నాడు. ఎక్కడికెళ్ళాడు వీడు? కనిపించడేం? పాప మొహం చిన్నబోయింది.

"దా...దా...!" బిక్కమొహంతో పిలిచింది. చంద్రుడు రానే లేదు.

"దా...దా...!" అప్పటికీ రాలేదు వాడు.

పాపకు కోపం వచ్చేసింది. అప్పుడే బొజ్జలో ఆకలీ వేసింది. గుక్కపట్టి ఏడ్చేసింది పాప.

పక్కలో లేచి కూర్చుండిపోయిందమ్మ.

"మా అమ్మ....! నా పాపే!" అమ్మ పాపను చేతుల్లోకి తీసుకుంది. చంద్రుడి మీద కోపమంతా అమ్మమీద చూపించేసింది పాప. గుక్కపట్టి గట్టిగా ఏడ్చేసింది.

"నా తల్లే...! మా అమ్మే...! ఆకలేసిందా చిన్నా!" ముద్దులాడిందమ్మ.

అన్ని ముద్దులు అమ్మ అంతవరకు దాచుకున్నందుకు ఇంకా కోపం వచ్చేసింది. గోము మరీ పెరిగిపోయింది. కేరు కేరున ఏడ్చేసింది పాప.

అమ్మ పాపను గుండెకు హత్తుకుంది. "లేదు రాజా! ఏడవకు చిన్నా! అమ్ముందిగా!" అమ్మ పైటకొంగు కప్పేసి పాలు పట్టేసింది.

ఏడుపు టక్కునాపేసింది పాప. చంద్రుడు మబ్బు చాటునించి అప్పుడే పైకొచ్చేశాడు. ఏదీ పాప? ఈసారి పాపం చంద్రుడు చిన్నబోయాడు.

అమ్మ పాలు పడుతుండగానే పాప చేతులాడించి కొద్దిగా కళ్ళమీద నుంచి కొంగు తప్పించుకుంది.

పాప మొహం కొద్దిగా పైట చాటునుంచి బయటికి వచ్చింది. చంద్రుడు మొహం పెద్దగా వెలిగిపోయింది.

కిరణాల చేతులు చాచి "పాపా! రావా!" అన్నాడు.

చిన్ని అరచేయి అటూ ఇటూ తిప్పి రాను పొమ్మంది పాప.

"నేను పాపా! చందమామను, రావా?"

అమ్మదొరకంగానే చందమామతో ఏం పని? పాప అసలు లక్ష్యపెట్టనే లేదు.

చంద్రుడు బతిమాలుకుంటున్నాడు.

ఇందాక పిలిచినప్పుడే రానందుకు సారీ కూడా చెప్పుకుంటున్నాడు.

పాప కళ్ళు నక్షత్రాల్లా మెరిశాయి.

చెయ్యి తిప్పి రానని టాటా చెప్పేసి మళ్లీ అమ్మ కొంగులోకి దూరిపోయింది పాప.

చంద్రుడు పూర్తిగా చిన్నబోయాడు.

నక్షత్రాలు నవ్వాయి.

కోయిల జోలపాట మొదలెట్టింది.

అమ్మవడి పాపకు ఉయ్యాలలూపింది.

లాభం లేదనుకున్నాడు చంద్రుడు.

దూరం నుంచి టాటా చెప్పి క్రమంగా ఎటో వెళ్ళిపోయాడు.

అమ్మ గుండెల్లో పాప వెచ్చగా నిద్రపోయింది.

*ఆదివారం వార్త -11, ఫిబ్రవరి 2001*

# మాజీలు

అలసిపోయిన మొహాలు. ఆశగా కిటికీ వంక చూసే కళ్ళు. నిలబడే సత్తువ లేక వరసగా గోడవార మోకాళ్ళు ముడుచుకు బిచ్చగాళ్ళలా కూర్చున్న కొందరు. నేలకు పాదాలంటించేసి కదలామెదలక నిలబడ్డ వెలసిపోయిన చారిత్రక శిలా విగ్రహాలు మరికొందరు. వీళ్ళు మగవాళ్ళు. వీళ్లకు కొంచెం దూరంలో భుజాల నిండా చెంగులు కప్పుకొని చెంపకు చేతులానించి దేవుడి రాక కోసం ఎదురుతెన్నులు చూస్తున్న భక్తురాళ్ళలా ఒకచోట చేరిన ఆడవాళ్ళు కొందరు. వీళ్ళంతా మాజీలు – కొందరు ప్రభుత్వోద్యోగాలకీ, కొందరు ఆనందమయమైన జీవితాలకీ.

రాముకి ఈ వాతావరణం పూర్తిగా కొత్త. ఇది తన ప్రపంచం కాదు. జీవితం గురించి చీకూ చింతా లేక క్లాసు రూములో స్నేహితుల మధ్య ఉల్లాసంగా సాగిపోతున్న రోజులు తనవి. జీవితంలో ఉదయ మధ్యాహ్నాలు గడిచిపోయాక పడమటి వైపు వాలుతున్న బతుకులు వాళ్ళవి. తనకూ వాళ్ళకూ ఒక జీవితకాలం తేడా వుంది. అది అర్థం చేసుకోగలిగినంత శక్తి లేదు రాముకి. అందుకే అక్కడి స్తబ్ధత చూసి అతనికి కొంత విసుగ్గానూ కొంత ఇబ్బందిగానూ అనిపించింది. ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా అక్కడి పని పూర్తి చేసుకుని బయటపడాలనే ఆదుర్దా కలిగింది. అయితే షరాబు ఇంకా కిటికీ దగ్గరకే రాలేదు.

రాముా తన తల్లికి రావల్సిన పెన్షన్ కోసం మొదటిసారిగా ట్రెజరీకి వచ్చాడు. అంతకు ముందు తల్లి వెంట కూడా ఎప్పుడూ రాలేదక్కడికి. ఇప్పుడు కూడా వచ్చేవాడు కాదు. తల్లికి జ్వరం రావడం వల్ల తప్పనిసరిగా రావలసి వచ్చింది.

"రాముా! ఈరోజు ట్రెజరీకి నువ్వెళ్ళిరా నాన్నా! డబ్బిస్తారు."

"అబ్బా! నేను పోనమ్మా. క్రికెట్ ఆడ్డానికి వెళ్ళాలి."

"ఎక్కడి పిల్లాడివి దొరికావురా బాబూ! ఇంటిపని ఒక్కటీ చెయ్యవు. అన్ని పనులూ ఆడపిల్లలే చేయాలి. నీకంటే చిన్నవాళ్ళైనా వాళ్ళే నయం."

"ఏమిటమ్మా సోది! క్రికెట్ ఆడ్డానికి వెళ్ళాలంటుంటే."

"అవునవును. నా మాటలు నీకు సోదిగానే వినిపిస్తాయి. అంతా నా ఖర్మ. మీ నాన్నగారే వుండుంటే నాకీ అవస్థే వుండేది కాదు."

ఆమెకు తరచూ ఆ మాట అనడం అలవాటైపోయింది. రామూకి వినడం మాత్రం అలవాటు కాలేదు. తల్లి ఆమాట అన్నప్పుడల్లా ఉడుకెత్తి పోతుంటాడు.

"ఏం, ఇప్పుడేమైంది?" అన్నాడు ఉక్రోషంగా.

"ఏమైందో అర్థం చేసుకునే తెలివితేటలే నీకుంటే నాకీ తిప్పలెందుకు? పూచిక పుల్లంత ఇంటిపని కూడా చేయవు. అన్నింటికీ నేనే చావాలి. పోనీ, నీ చెల్లెలు - అదైనా కొంచెం పెద్దదై వుండుంటే ఈ పనులన్నీ దాని చేతనే చేయిద్దును. ఇంటికి పెద్దవాడివన్న మాటేగానీ వట్టి ఉత్సవ విగ్రహానివి."

రామూకి కోపం వచ్చేసింది.

"నువ్వలా అంటేనే నేనే పనీ చెయ్యను. నేనెక్కడికీ వెళ్ళను ఫో!" అంటూ అలిగి వెళ్ళి పెరట్లో కూర్చున్నాడు.

అతనికి చాలా అశాంతిగా అనిపించింది. అమ్మచేత తిట్లు పడ్డం అతనికి బొత్తిగా ఇష్టం లేదు. అయినా అదే జరుగుతూ వుంటుంది. అమ్మ తిట్టిందన్న ఉక్రోషమే తప్ప అమ్మ మాట వినాలనే ఆలోచనే కలగదు. కలిగే వయసు కూడా కాదతనిది. ఆ ఏడాదే పదో తరగతి పాసై ఇంటర్మీడియట్‌లో చేరాడు. పసితనం పోలేదు. పెద్దరికమూ రాలేదు. రెంటి మధ్యా సంధిలో అల్లాడుతున్న మానసికావస్థ.

రామూ తల్లిదండ్రులకు చాలా ఆలస్యంగా కలిగిన సంతానం. అందువల్లే అబ్బురంగా పెరిగాడు. అతని తర్వాత ఇద్దరాడపిల్లలు పుట్టారు కానీ ఇంట్లో రామూ పరపతే వేరు. తండ్రి అతని భవిష్యత్తు గురించి చాలా కలలు కనేవాడు. పెద్ద చదువులు చదివించాలనీ, గొప్పవాణ్ణి చేయాలనీ ఆశపడేవాడు. అయితే ఆరోజు కళ్ళజూసే అవకాశం వచ్చేలోగానే గుండెపోటు వచ్చి అకస్మాత్తుగా మరణించాడు.

చనిపోయేనాటికి ఆయన ఓ గవర్నమెంటు ఆఫీసులో సీనియర్ అసిస్టెంటుగా పని చేస్తున్నాడు. భర్త చనిపోయాక రామూ తల్లికి ఫ్యామిలీ పెన్షన్ అంత సులువుగా రాలేదు. ఆమె చదువుకోని కారణంగా అధికారులు ఆమెను ముప్పుతిప్పలు పెట్టారు. ఇవాళ వస్తుంది రేపొస్తుంది అంటూనే సుమారు ఏడాది వరకూ పెన్షన్ విషయంలో ఆమెను ఏడిపించుకుతిన్నారు. ఆఫీసు చుట్టూ తిరిగి ఆమె కాళ్ళరిగిపోయాయి. రోజుకోసారి మొరపెట్టుకుంటే గోడైనా కరుగుతుందేమో గానీ ప్రభుత్వాధికారులు మాత్రం కరగరు.

చివరికి ఉన్న నగలూ డబ్బూ అంతా అయిపోయి పస్తులుండాల్సిన ప్రమాదం ఏర్పడుతున్న తరుణంలో ఆమె పెన్షనూ, ఇన్సూరెన్సు డబ్బులూ అన్నీ మంజూరై వచ్చాయి.

తండ్రి చనిపోయాక ఇల్లు గడవడం కోసం, తన చదువుకు పుస్తకాలు కొనివ్వడం కోసం తల్లి పడిన బాధలు రామూకి తెలియవు. ఒకవేళ తెలిసినా అర్థం చేసుకోలేకపోయాడు. అతని బాల ప్రపంచంలో తండ్రి ఉన్నప్పటికీ లేనప్పటికీ వున్న తేడా ఏమిటో తెలుసుకోగల వివేకం కొరవడింది. తల్లి కూడా ఎన్ని బాధలు పడ్డా తండ్రి లేని లోటు అతనికి తెలియకుండా పెంచడానికే ప్రయత్నించింది. భర్త వుండగా రాకపోకలు సాగించిన బంధువర్గం అవసర కాలంలో దూరమైంది. అయినా చలించకుండా ఆమె రోజులు నెట్టుకుంటూ వచ్చింది. కొడుకు గురించి భర్త కన్న కలలు నెరవేర్చడానికే కృషి చేసింది. ప్రతి నెలా పెన్షన్ తేవడానికి ఆమే వెళ్తుంది. అందువల్ల రామూకి ఆ బాధ్యత కూడా లేదు.

అతనలా పెరట్లో కూర్చుని తల్లి తిట్టినందుకు మధనపడుతుండగానే ఆమె నెమ్మదిగా అతనున్న చోటికి వచ్చింది. కొడుకుని అనడమైతే అన్నది గానీ, అన్నాక ఆమె గుండె తల్లడిల్లిపోయింది.

"ఇక్కడ కూర్చుని ఏం చేస్తున్నావు బాబూ? పోనీ ట్రెజరీకి వెళ్ళొద్దులే. ఇంట్లోకి రా."

"నే రాను."

"రా నాన్న! నన్నేడిపించకు. సున్నుండలు పెడతారా."

"నేనేం చిన్నపిల్లాణ్ణి కాదు, సున్నుండలు చూపి ఆశపెట్టడానికి."

"పెద్ద పిల్లాడివి కాబట్టే చెప్పిన మాట వినాలి," అంటూ అతని చెంపలు నిమిరింది.

రామూ ఒక్క క్షణం వూరుకుని తల్లి చేతులు పట్టి చూశాడు.

"నీ చేతులింత వేడిగా వున్నాయేమ్మా?" అడిగాడు.

"పొద్దున్నుంచీ ఒకటే జ్వరంగా వుంది. అందుకే నిన్ను ట్రెజరీకి వెళ్ళమన్నాను".

రామూ లోలోపలే సిగ్గుపడ్డాడు. జ్వరంతో వుండగా తల్లితో వాదులాడినందుకు అతనికి పశ్చాత్తాపం కలిగింది.

"సరే, ట్రెజరీకి నేనే వెళ్తాను. కానీ, నాకు కేన్వాసు బూట్లు కావాలి. కొనిపిస్తావా?" గోముగా అడిగాడు.

"వచ్చే నెల కొందూలే బాబూ."

"కాదు, నాకిప్పుడే కావాలి."

తల్లి మొహంలో సన్నని చిరునవ్వు వెలిగింది.

"సరే, అలాగేలే. సున్నుండలు తినకుండా వెళ్ళేవు," అంది.

ఆ విధంగా బాధ్యత తలకెత్తుకుని పెన్షన్ కోసం ట్రెజరీకి వచ్చాడు రాము.

భుజం మీద ఎవరిదో చెయ్యి పడ్డంతో ఆవైపు తిరిగి చూశాడు. తమ వీధిలోనే వుండే జానకిరామయ్య ఎదురుగా కనిపించాడు. జానకిరామయ్య గవర్నమెంటు ఉద్యోగం చేసి రిటైరయ్యాడు. ట్రెజరీలో పెన్షను కోసం ప్రతినెలా హాజరయే వాళ్ళలో ఆయన కూడా వున్నాడు.

“ఏం ఇలా వచ్చావు? మీ అమ్మ పెన్షను కోసమా?” అడిగాడు.

రాము బిడియంగా నవ్వి తలూపాడు.

“మీ అమ్మ రాలేదేం?”

“అమ్మకు జ్వరంగా వుందండీ.”

“అయ్యో పాపం! నువ్వెప్పుడూ పెన్షను కోసం రాలేదు కదూ?”

రాము తల అడ్డంగా వూపాడు.

“నువ్వెవరివో తెలియకపోతే షరాబు నీకు డబ్బెందుకిస్తాడు?”

రాము గుండె జారిపోయింది.

“మరెలా?” అన్నాడు అయోమయంగా.

“మరేం ఫరవాలేదులే. నువ్వెవరివో షరాబుకి నేను చెబుతాను.”

రాము కృతజ్ఞతగా చూసి అలాగేనన్నట్లు తలూపాడు.

“ఈ షరాబు ఎప్పుడూ వేళకి రాడు,” పక్కనున్న ముసలాయన గొణిగాడు. జానకి రామయ్య నవ్వాడు.

“డబ్బు తేవడానికి వెళ్ళుంటాడు. కాసేపు ఓర్చుకోవాలి మరి,” అన్నాడు.

“డబ్బు పొద్దునే తెస్తారండీ. ఇనప కొట్లో పెడతారు. ఈ షరాబుగారికే ఎవరన్నా లెక్కలేదు. టైమెంతైందో చూడండి,” అక్కడే వున్న మరొకాయన అన్నాడు.

“ఏం చేస్తాం? తప్పదు.”

“ఇవాళ డియ్యే తాలూకు అరియర్సు కూడా ఇస్తారు. మామూళ్ళు దండిగా పడతాయి. అయినా రాలేదు చూడండి”.

“రాజ్యం వాళ్ళది బాబూ! మనం డబ్బు అడుక్కోవడానికి వచ్చాం.”

“డబ్బు అడుక్కోవడానికి మనమేం ముష్టివాళ్ళమా? నేను ముప్ఫై ఏళ్ళు ప్రభుత్వ సేవ చేశానండీ”.

“ప్రభుత్వ సేవ నేనూ చేశానయ్యా? షరాబు కూడా చేస్తున్నాడు.”

“చేస్తున్నాడు, చేస్తున్నాడు. ముసలాళ్ళని నిలబెట్టి చంపుతున్నాడు.”

“ట్రెజరర్ని అడుగదామా?”

"చెవిటివాడి ముందు శంఖం వూదినట్లే. ఆ ఘటం జవాబివ్వదు." – ఆయన ఆమాట అంటుండగా షరాబు కారా కిళ్ళీ నములుతూ అక్కడికొచ్చాడు.

"షరాబు గారూ! చాలా ఆలస్యం చేశారు."

"మీకేం, కూడు తినకుండా మమ్మల్ని పని చేయమంటారు. ఇంటికి కూడా వెళ్ళలేదు. హెూటలు మెతుకులే కతికొచ్చాను," విసుక్కున్నాడు షరాబు.

"ఇంటికి వెళ్తే మరింక పడకేసి రాడేమో. హెూటల్ పక్కనే కాబట్టి బతికి పోయాం," ఎవరో వ్యాఖ్యానించారు.

"ఇష్షో! రామచంద్రా!" అంటూ జానకిరామయ్య మరింక ఎక్కువ సేపు నిలబడలేక గోడకానుకుని నేలమీద కూర్చుండిపోయాడు.

అంతవరకూ కళ్ళు విప్పార్చి అక్కడ జరుగుతున్నదంతా గమనిస్తున్న రాము నెమ్మదిగా అక్కడినుంచి కదిలి షరాబు కిటికీ దగ్గరికొచ్చి నిలబడ్డాడు.

షరాబు వచ్చేసరికి పింఛనుదార్లంతా కిటికీ దగ్గర గుంపుగా మూగారు. అందరి మొహాల్లో ఆత్రం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. షరాబు ఇక్కడివాళ్ల గురించి పట్టించుకోకుండా గజగమనంతో తాపీగా ట్రెజరర్ దగ్గరికి వెళ్ళి స్ట్రాంగ్ రూం తాళం చెవులు తీసుకున్నాడు. స్ట్రాంగ్ రూంలోకి వెళ్ళి డబ్బు తీసుకురావడానికి అతనికి పావుగంట పట్టింది.

"ఎంత నిదానంగా చేస్తున్నాడో చూడు. మన గురించి ఆలోచనే లేదు."

"షరాబుకేం మహారాజు. అత్తగారిచ్చిన ఆస్తి దండిగా వుంది. ఉద్యోగం చేయాల్సిన అవసరమే లేదు."

"అవసరం లేకపోతే ఎందుకు చేయాలి ఉద్యోగం? మధ్య మన ప్రాణాలు తీయడానికా?"

"నాకు బీపీ, షుగరూ. రెస్టు తీసుకోమన్నాడు డాక్టరు. ఇక్కడే తల తిరుగుతోంది. పడిపోతానేమో."

"ఏం కాదులెండి. అయినా ఎవరికి లేదు బీపీ? నాకైతే గుండె జబ్బు కూడా వుంది."

అద్దీ! మనలో ఎవరికైనా హార్టెటాక్ వచ్చి పడిపోతే అప్పుడైనా కలుగుతుందేమో షరాబుగారికి దయ."

"వస్తున్నాడొస్తున్నాడు. షరాబు వస్తున్నాడు."

కిటికీ దగ్గర తొక్కిసలాట ప్రారంభమైంది.

"షరాబు గారూ! ఈనెలైనా మాకు అరియర్సు ఇస్తున్నారా!" ఒక గొంతు.

"డియ్యే అనౌన్సు చేసి ఆర్నెల్లైందండీ. తమరింకా ఇవ్వనేలేదు," మరో గొంతు.

"నాకు అరియర్సు ఎంతిస్తున్నారు బాబూ?"

"ఈనెల్లో పండగుంది. మాకు రావాల్సిన అరియెర్సు ఇవ్వకపోతే ఎలా?"

"ఆగండయ్యా ఆగండి," దాదాపు అరిచాడు షరాబు. "ఒకసారి ఎందరికి సమాధానా లివ్వను?"

"ఇంతకీ మాకు అరియర్సు ఇస్తున్నారా లేదాండీ?"

"ఇస్తున్నాం బాబో, ఇస్తున్నాం. ఇక్కడ మూగకండి. గాలాడక ఛస్తున్నాను."

పింఛనుదార్లంతా దాదాపు ఒకేసారి నిట్టూర్చారు. అందరి మొహాలూ ప్రసన్నమయ్యాయి.

"రామసుబ్బమ్మా!" మొదటి పేరు కేకేశాడు షరాబు.

"అయ్యా! ఆడవాళ్ళ వైపు నుంచి వినిపించింది.

"రావమ్మా! వచ్చి పింఛను తీస్కో."

రామసుబ్బమ్మకు ఒకటే మోకాళ్ళ నొప్పులు.

అడుగు తీసి అడుగు వేయలేదు. పదిహేను సంవత్సరాలుగా ఆమె ఫ్యామిలీ పెన్షన్ మీదే జీవిస్తోంది. ఆమె భర్త చనిపోయి పదహారేళ్ళయింది.

"త్వరగా రావమ్మా," ఆమె నడవలేదని తెలిసీ కసిరాడు షరాబు.

"ఆఁ ఆఁ, వస్తున్నాబాబూ," అంటూ వడివడిగా అడుగులు వేయబోయి పడబోయింది రామసుబ్బమ్మ. అక్కడే వున్న రాము ఆమెను పడకుండా పట్టుకున్నాడు.

"ఇదిగో నీకు రావల్సిన డబ్బు," అంటూ పెన్షను పుస్తకంతో పాటు డబ్బు ఆమె చేతిలో పెట్టాడు షరాబు.

"ఎంత ఇస్తున్నారు బాబూ?" ఆశగా అడిగింది రామసుబ్బమ్మ.

"ఇంతవరకూ నీకు ఏడొందలొచ్చేది. ఈనెల నుంచీ ఏడొందల యాభై వస్తుంది."

"అది కాదు బాబూ, ఇప్పుడంతా కలిపి ఎంతిస్తున్నారు?"

"వెయ్యి రూపాయల చిల్లర. అందులో పదిరూపాయలు మాకు మామూలు."

"పది రూపాయలా!" హతాశురాలై అంది రామసుబ్బమ్మ.

"ఇంకా నయం, అందుకు సంతోషించు," వ్యంగ్యంగా అన్నాడో పెన్షనరు. "పాతిక రూపాయలు గుంజుకున్నా అడిగే నాథుడు లేడు."

షరాబు రుసరుసలాడుతూ చూశాడు.

"ఎప్పుడో ఏడాదికో ఏణ్ణర్థానికో ఓ పది రూపాయలు మా మొహాన కొట్టడానికి ఏడ్చిపోతారెందుకయ్యా? మేమేం కష్టం చేయడం లేదా?" అన్నాడు.

"అదేనండీ, మేమూ అదే అంటున్నాం. ఏడాదికో ఏణ్ణర్థానికో ఎప్పుడో మాకో డియ్యే వస్తుంది. వెంటనే ఇస్తే మీకు మామూళ్ళు తగ్గిపోతాయని అర్నెల్లు మురగబెట్టుకుంటారు. పోయినసారి అయిదు రూపాయలు మాత్రమే మామూలు వసూలు చేశారు. ఈసారి పది రూపాయలు చేశారు. వచ్చేసారి ఇరవై రేటు పెడతారా?"

షరాబు మొహం ముడుచుకున్నాడు.

"మూడొందలిస్తున్నాం. పది రూపాయలు మాకు మామూలిస్తే అరిగి పోతుందా?' అన్నాడు.

"మీరు మాకేం మీ జేబులోంచి తీసివ్వడం లేదు. మాకు రావాల్సిందే ఇస్తున్నారు. ఏడొందల రూపాయల పెన్షను మీద బతికే మనిషికి పది రూపాయలెంత విలువ చేస్తాయో మీకేం తెలుసండీ? మూడున్నర వేలు నెలకు జీతం తీసుకునే మీకే పది రూపాయల మీద ఇంత కక్కుర్తి ఉంటే మాకెంత ఉండాలి?"

షరాబు లోలోపల ఉడుక్కున్నాడే గానీ రామసుబ్బమ్మకు పది రూపాయలు మాత్రం తిరిగివ్వలేదు. ఆమె ఇమ్మని అడగనూ లేదు.

"నీకు డబ్బులిచ్చాగా, ఇక కదలవమ్మా తల్లీ. మీ ఆయన చేసిన సర్వీసుకంటే పెన్షనరుగా నీ సర్వీసే ఎక్కువ" అన్నాడు.

"అవును బాబూ! రేపు నువ్వు చచ్చిపోతే నీ భార్య గతి కూడా ఇంతే," అనేసి మరీ వెళ్ళింది రామసుబ్బమ్మ.

షరాబు ఖంగుతినేశాడు.

'దొంగముండ ఎంత మాటనేసింది!' అని లోలోపల గొణుక్కుని ప్రశాంతంగా, "ఏళ్ళతరబడి ఆమెకు పింఛను నా చేతులమీదుగానే ఇస్తున్నాను. ఇప్పుడు చూడండి ఎంత తిట్టు తిట్టిపోయిందో!" అన్నాడు.

"అననేల? పడనేల?" గుంపులోంచి ఎవరో అన్నారు.

షరాబు కిక్కురుమనకుండా మరో పేరు పిలిచాడు. అవినీతి సిగ్గెరుగదు.

రాముకు తల తిరుగుతోంది. నెల నెలా తన తల్లి ఇక్కడినుంచా పెన్షను తెచ్చుకుంటుంది! తన తల్లిని ఇక్కడ ఊహించుకుని వణికిపోయాడు.

ఇక్కడున్న వాళ్ళంతా ఎప్పుడో ఉద్యోగాలు చేసిన వాళ్ళే. రేపు రిటైరైతే ఈ షరాబు కూడా వీళ్ళతో పాటు లైనులో నిలబడవలసిన వాడే. అయినా ఈ మాజీలంటే ఇతనికెంత చిన్నచూపు! నిజంగా ముష్టివేస్తున్న వాడిలా ప్రవర్తిస్తున్నాడు.

షరాబు ఒక్కొక్కర్నే పిలుస్తున్నాడు. ఆ పెన్షనర్లలో కొందరికి వంద రూపాయలే ఆరియర్సు వచ్చాయి. కొందరికి ఆరొందలూ ఏడొందలూ వచ్చాయి. షరాబు ఆరొందలు వచ్చిన వాళ్ళదగ్గరా అదే మామూలు, వంద రూపాయలు మాత్రమే వచ్చిన వాళ్ల దగ్గరా అదే మామూలు వసూలు చేస్తున్నాడు.

రాము మరింక అక్కడ నిలబడకుండా మెల్లగా జానకిరామయ్య కూర్చున్న చోటికి వచ్చాడు. జానకిరామయ్య అతని ముఖ కవళికలు గమనించి నవ్వాడు.

"నీకిదంతా చూస్తుంటే ఆశ్చర్యంగా వుంది కదూ?" అన్నాడు.

రాము జవాబు చెప్పలేదు. సరిగ్గా అతని మనసులో మెదలుతున్న ప్రశ్న గ్రహించిన వాడిలాగే అన్నాడు జానకిరామయ్య.

"మనిషి చచ్చిపోతాడు. చచ్చిపోయాక ఏమీ మిగల్దని తెలుసు. అయినా చెడ్డపనులు చేయడం మానుకుంటాడా? ఈ షరాబు కూడా అంతే. రిటైరైతే ఇతనూ మాలాగే మాజీ అయిపోతాడు. అప్పుడు మరో షరాబు వస్తాడు. ఇతని దగ్గర ఆ షరాబు మాములు వసూలు చేస్తాడు. ఆ షరాబు పోతాడు. మరో షరాబు వస్తాడు. ఆ వచ్చే షరాబు ఆ పోయే షరాబు దగ్గర మామూలు వసూలు చేస్తాడు. ఇది మన నిత్య జీవితంలో ఒక భాగం నాయనా! పెద్దవాడివైతే నీకే తెలుస్తుంది."

ఇంతలోకే షరాబు రామూ తల్లి పేరు పిలిచాడు.

"కృష్ణవేణీ! కృష్ణవేణీ! కృష్ణవేణి ఎక్కడ?"

రాము తల్లి స్థానంలో వెళ్ళి నిలబడ్డాడు.

"కృష్ణవేణీ! కృష్ణవేణీ!" ఇంకా పిలుస్తూనే వున్నాడు షరాబు.

"నేనే కృష్ణవేణి," అన్నాడు రాము తడబడుతూ.

షరాబు అతని వంక ఎగాదిగా చూశాడు.

"నువ్వే కృష్ణవేణివా? ఏదీ, నీకు జడలేదే?" అన్నాడు.

అక్కడున్న వాళ్ళంతా నవ్వారు. రాముకి ఉక్రోషం ముంచుకొచ్చింది.

"అది కాదండీ, కృష్ణవేణి మా అమ్మ."

"మీ అమ్మా? అయితే మీ అమ్మనే రమ్మను."

"మా అమ్మ రాలేదు. పెన్షను నన్నే తెమ్మంది."

"ఎవరు పడితే వాళ్ల చేతికి పెన్షనివ్వరయ్యా!"

రామూకి ఏం చెప్పాలో తోచలేదు.

అంతలో జానకిరామయ్య అతని వెనకొచ్చి నిలబడ్డాడు.

"ఈ అబ్బాయి నాకు తెలుసండీ. కృష్ణవేణమ్మ కొడుకు," అన్నాడాయన.

"అయితే నన్నేం చేయమంటావయ్యా? పెన్షను కోసం వాళ్ళమ్మే రావాలి."

"ఏదో అవాంతరం వచ్చి రాలేదండీ. ఇతను వాళ్లమ్మకు తీసుకెళ్ళిస్తాడు."

"ఏమో! ఇస్తాడో ఖర్చు పెట్టుకుంటాడో!"

"నేనలాంటివాణ్ణి కాదు," కోపంగా అన్నాడు రాము. అనవసరంగా మాటపడాల్సి వచ్చినందుకు అతనికి కళ్ళనీళ్ళు తిరిగాయి.

"ఇదిగో, నువ్వెలాంటి వాడివో నాకు తెలీదు గానీ, వెళ్ళి మీ అమ్మను పంపించు."

ఈసారి జానకిరామయ్యకు కోపం వచ్చింది. "అయ్యా! తమరంతా పెన్షనర్ల చేతికే డబ్బిస్తున్నారా? పెన్షనర్ల తరఫున మరొకరు రావడానికే వీల్లేదా?" అన్నాడు.

"నీతో వాదించడానికి నాకు టైము లేదయ్యా. కావాలంటే ట్రెజరర్నే అడుగు."

రాముని జానకిరామయ్య ట్రెజరర్ ముందుకు తీసుకెళ్ళి నిలబెట్టాడు. అతను చెప్పిందంతా విన్నాక ట్రెజరర్ షరాబుని కేకేసి పిలిచాడు.

"ఇదిగో షరాబూ! ఈ అబ్బాయికి వాళ్ళమ్మ పెన్షనిచ్చి పంపించు."

"అది కాదు సార్..," కూర్చున్న చోటునుంచే ఏదో అనబోయాడు షరాబు.

"ఇవ్వవయ్యా పర్వాలేదు. కావలిస్తే ఇంకో పది రూపాయలు ఎక్కువిస్తాడులే మామూలు. వెళ్లు బాబూ, పెన్షను తీసుకో," అన్నాడు ఎంతో ప్రేమ వున్నవాడిలా.

జానకిరామయ్య అతన్ని బతిమాలి బామాలి అందరూ ఇస్తున్న రేటుకే కుదిర్చాడు మామూలు.

అక్కడి నుంచి వచ్చేస్తున్నప్పుడు రాము గేటుదగ్గరాగి వెనక్కి తిరిగి ఉమ్మేశాడు.

అతనింటికి వేళ్ళేసరికి అతని తల్లికి జ్వరంతో వళ్ళు పేలిపోతోంది.

"అమ్మా," అంటూ పక్కన చేరాడు రాము.

అలాంటి స్థితిలోనూ కళ్ళు తెరిచి అతనికేసి చూసి నవ్వింది తల్లి.

"వచ్చావా బాబూ! పెన్షన్ తెచ్చావా?"

"తెచ్చానమ్మా."

"బూట్లు కొన్నావా?"

రాము తలవంచుకుని, "లేదు," అన్నాడు మెల్లగా.

"ఏం? వచ్చేప్పుడే దార్లో కొనుక్కోవలసింది."

రాము తలెత్తాడు.

అతని కళ్ళల్లో తల్లిపట్ల అంతులేని గౌరవం తొంగి చూస్తోంది.

"నాకు బూట్లు అవసరం లేదమ్మా! నీకు మందు తెచ్చాను," అన్నాడు.

*'సరికొత్త కథ' కథాసంకలనం*

# ఎల్లువ

"యెంకటేస్వర సామీ, కాపాడు తండ్రీ!" కోర్టు హాల్లోకి వెళ్తూ తిరుపతి కొండ వున్న దిక్కుకు తిరిగి దండం పెట్టుకున్నాడు గొల్లనారాయణ.

దావా గెలిస్తే కొండకొస్తానని మొక్కుకున్నాడతను. ఆ రోజే తీర్పు. కొద్దిసేపటి క్రితమే అతని వకీలు అతనికి ధైర్యం చెప్పాడు. "మరేం పరవాలేదు. దావా గెల్చేది మనమే. నువ్వు నిమ్మళంగా వుండు," అన్నాడు.

గొల్లనారాయణ అలాగేనని బుర్రూపాడు. అయితే అంతటితో అతనికి ధైర్యం చిక్కలేదు. "అన్నింటికీ నువ్వే వుండావు సామీ," తిరుపతి వెంకన్నను తల్చుకుని అప్పుడే మనసులో దండం పెట్టుకున్నాడు. అతని భార్య కూడా అతను కోర్టుకు బయల్దేరే ముందు అదే చెప్పింది. "సామి సల్లంగా సూడాల్నే గాని, ఈ వకీల్లతో యేమైతాది? కోరటుకాడ నిన్ను బిల్సినప్పుడు యెంకటేశ్వర సామిని తల్సుకో," అని హితబోధ చేసింది. గొల్లనారాయణ ఇప్పుడలాగే చేశాడు. దాంతో మనసుకు కొంత ధైర్యం చిక్కింది. 'అన్నింటికీ బగమంతుడే వుండాడు. యెవలికీ ఆయన అన్యాలం సేయడు,' అనుకున్నాడు. దాంతో మరికొంత ధైర్యం చిక్కింది. జడ్జిగారి ముందు వణక్కుండా నిలబడగలిగాడు.

"గొల్లనారాయణ నువ్వేనా?" అడిగాడు బెంచి గుమాస్తా.

"నేనే సామీ," అన్నాడు నారాయణ.

"నీ దావా కొట్టేసినారు పో!" అన్నాడు బెంచి గుమాస్తా. నారాయణకి అతనేం చెబుతున్నాడో తెలీలేదు. దావా కొట్టేసినారంటే గెల్చినట్టో ఓడినట్టో అర్థం కాలేదు.

"అంటే దావా గెల్చినానా సామీ?"

ఆ ప్రశ్నకు కోర్టు హాలంతా గొల్లున నవ్వింది.

"ఓడిపోయినావు పోవయ్యా. నీ దావా పోయింది," అన్నారెవరో.

గొల్లనారాయణ కళ్ళముందు చీకటి వ్యాపించినట్లయింది.

"అన్యాలం స్వామీ, ఆ భూమి నాదే!" మొరపెట్టుకున్నాడు.

జడ్జి మొదటిసారిగా నోరు విప్పాడు. "భూమి నీదేనంటే అప్పీలు చేస్కో. ఇంక నేను చెయ్యగలిగిందేమీ లేదు."

నారాయణ కోర్టు హాల్లోంచి ఎలా బయటికొచ్చాడో అతనికే తెలీదు.

"యెంకటేస్వర స్వామీ, నువ్వు గుడ్కా మోసం జేస్తివా!" బిగ్గరగానే అనుకున్నాడు.

అతని వకీలు ఎక్కడా కనిపించలేదు. మాల ఈరిగాడు మాత్రం కనిపించాడు.

"ఈరిగా, మీకేం జేసినానరిరా నన్నీమైన సతాయిస్తావుండారు?" కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా అడిగాడు.

ఈరిగాడు అతనివైపు జాలిగా చూశాడు.

"మాదేం లేదన్నా. గవర్నమెంటోల్లు ఈ భూమి మాకిస్తామంటే తిరుగుతుండాం," అన్నాడు.

"ఆ భూమి నాదిరా!" వాపోయాడు నారాయణ.

"గవర్నమెంటుదంట గదన్నా! నీది కాందాని కెందుకు గస పెట్టుకుంటా తిర్గుతావ్? లెక్కంతా కొండబోయి వకీల్ల నోట్లో యెందుకు బోస్తావ్? దావా వదిలేయరాదా?" సలహా ఇచ్చాడు ఈరిగాడు.

"యెంత మాటంటివిరా ఈరిగా! ఆ భూమి నాదన్నా!" ఏడుపొక్కటే తక్కువగా అన్నాడు నారాయణ.

ఈరిగాడు అతని మొహంలోకి చూడకుండా కళ్ళు తిప్పుకున్నాడు.

"వస్తాన్నా. నే బోతాండా. ఈ పొద్దు ఎమ్మార్వో రమ్మన్నాడు," అంటూ మళ్ళీ అతనివైపు చూడకుండా వెళ్ళిపోయాడు.

నారాయణ హతాశుడై ఒక చెట్టు కింద ముడుచుకుని కూర్చుండిపోయాడు. ఎదురెండకు కళ్ళు బైర్లు కమ్ముతున్నట్లనిపించి భుజంమీది పైగుడ్డ దులిపి నెత్తికి చుట్టుకున్నాడు. సూర్యకిరణాలు అప్పటికీ అతన్ని వదలకపోవడంతో నుదుటి మీద అరచేతులు చేర్చుకుని కూర్చున్నాడు.

కాసేపటికి అతని వకీలు అటుగా వెళ్తుండడం కనిపించింది. గొల్ల నారాయణ చెట్టు కింద నుంచి లేచి అతనివైపు పరిగెత్తాడు.

"సామీ!"

పరబ్రహ్మేశ్వర శాస్త్రి ఆగి అతనివైపు తిరిగాడు.

గొల్లనారాయణ ఆయనకు రెండు చేతులూ జోడించాడు.

"దావా గెలుస్తామంటిరి గద సామీ! ఓడిపోతిమి."

పరబ్రహ్మేశ్వర శాస్త్రి ఇబ్బందిగా మొహం పెట్టాడు. ఆయనకు బదులు ఆయన వెనకే దావా కట్టలు పట్టుకొస్తున్న వకీలు గుమాస్తా చంద్రాయుడు నోరు తెరిచాడు. "సారుదేం తప్పులేదు నారాయణా! మన కేసు బలంగా వుండింది. ఆ మాల నాకొడుకులే జడ్జీకి లంచమిచ్చారు," అన్నాడు.

పరబ్రహ్మేశ్వర శాస్త్రి ఆ ట్రిక్కుతో కొంచెం తేరుకున్నాడు.

"అవునవును. చేసిందంతా వాళ్ళే. అందులోనూ ఆ జడ్జీ పరమనీచపు ముండాకొడుకు. లంచమిస్తే చాలు, లొంగిపోతాడు," అన్నాడు.

"ఆ మాలోల్ల కాడ లంచమిచ్చినంత లెక్క యాడిది సామీ? అదే వుంటేగిన ఉద్దరగొచ్చే భూమి కోసరం యెంపర్లాడతారా?" ఆశ్చర్యం ప్రకటించాడు నారాయణ.

"వెర్రి గొల్లోనివి నీకేం తెలుసులే నారాయణా! వెనకటి కాలం కాదు. ఈ కాలం మాలోళ్లకాడ ఎంత డబ్బుందో నీకేం తెలుసు. ఉద్యోగాలు వాళ్లవే. ఊళ్ళో భూములు వాళ్ళవే. అన్ని సదుపాయాలు వాళ్ళకే. అంత దూరం ఎందుకు, నీ భూమి కూడా వాళ్ళకే పోతోంది చూశావా! అడిగే నాధుడేడి? కోర్టులు కూడా వాళ్ళకు అనుకూలంగానే తీర్పులు చెబుతున్నాయి," తన ఆర్గుమెంటు వినిపించాడు పరబ్రహ్మేశ్వరశాస్త్రి.

"ఇప్పుడేం చేయాల సామీ?" అడిగాడు నారాయణ.

"ఏం చేసేదేముంది? సబ్ కోర్టులో అపీలు చేసుకోవాలి," అన్నాడు చంద్రాయుడు.

"అలా చేస్తే నా భూమి నాకు తిరిగొస్తాదా సామీ?"

"ఎందుకు రాదు? మన కేసులో బలం వుందని చెప్తిని గదా."

"అందుకెంతైతాది సామీ?" పరబ్రహ్మేశ్వర శాస్త్రి వైపు తిరిగి అడిగాడు నారాయణ.

"ఆ విషయం చంద్రాయుడు చెప్తాడు. నాకవతల ఇంకో కేసుంది," అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు పరబ్రహ్మే శ్వర శాస్త్రి.

నారాయణ చంద్రాయుడి వైపు చూశాడు.

"ముందో పది రూపాయలు త్యా చెప్తాను," అన్నాడు చంద్రాయుడు.

"ఇప్పుడు లేవు సామీ. జేబులో లెక్క లేదు."

"అయితే సాయంత్రం ఆఫీసుకురా, ఆడ చెప్తాను," అంటూ వెళ్ళిపోయాడు చంద్రాయుడు.

నారాయణ కాసేపు దిక్కు తోచని వాడిలా అక్కడే తచ్చాడి నెమ్మదిగా కోర్టు ఆవరణలోంచి బయటికొచ్చాడు.

"ఏం నారాయణా, యేమైంది కేసు?" అడిగాడు రాముడు.

కోర్టు వెలుపల టీ బంకు అతనిదే. అక్కడికి వచ్చినప్పుడల్లా నారాయణ రాముని టీయే తాగుతాడు.

"పోయిందన్నా, దావా కొట్టేసినారు," దిగులుగా అన్నాడు నారాయణ.

రాముడు అతని మొహం చూసి ఆ మాట ముందే గ్రహించాడు. ఏళ్ళ తరబడి కోర్టు ముందు టీ బంకు నడుపుతుండటం వల్ల ఎవరి కేసు ఏమైందో మొహం చూసి చెప్పగల అనుభవం సంపాయించుకున్నాడతను. నారాయణ ఆ మాట చెప్పగానే గమ్మున గ్లాసులో టీ పోసి అతని వైపు చాచాడు.

"ఇదో, టీ తాగు."

"వద్దులే," అన్నాడు నారాయణ.

"పరవాలేదు తీస్కోన్నా! కోర్టులో కేసు గెలవాల్నంటే అంత సులభంగా అయితాదా? అవసరమైతే హైకోర్టుగ్గుడ్కా పోవాల్సొస్తాది. ముందు టీ తాగు."

నారాయణ టీ గ్లాసందుకున్నాడు. అతనికి టీ తాగాలని లేదు. కడుపులో దహించుకుపోతోంది. అయినా నెమ్మదిగా టీ చప్పరించడం మొదలెట్టాడు.

రాముడు పిస్టన్ కొట్టి కిరసనాయిలు స్టవ్ మంట ఎక్కువ చేస్తున్నాడు. బుస్‌మని శబ్దం చేస్తూ మంట క్రమంగా పెరుగుతోంది. స్టౌమీదున్న పాత్రలో టీ మరింత వేగంగా మరగనారంభించింది.

నారాయణ ముభావంగా స్టౌ మంట కేసి చూస్తూ కూర్చున్నాడు. తన పరిస్థితి ఆ స్టౌ మీద మరుగుతున్న టీ పరిస్థితి ఒకటేననిపించిందతనికి. చూస్తుండగానే చేజారిపోతున్న తన నాలుగెకరాల భూమి గుర్తుకొచ్చింది. ఇక టీ తాగబుద్ధి కాలేదు. గ్లాసు పక్కనే బల్లమీద పెట్టేసి శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడు.

ఆ నాలుగెకరాల భూమినే నమ్ముకు బతుకుతున్న సన్నకారు రైతు అతను. వాన సరిగ్గా వస్తేగానీ అది కూడా సరిగ్గా పండదు. చాలాకాలం క్రితం అతనికా భూమికి పంపుసెట్టు వేయించాలనే ఆలోచన వుండేది. తన భూమికి పక్కనే వున్న రామిరెడ్డి పంపుసెట్టు కోసం బ్యాంకు ఋణం ఇప్పిస్తానని కూడా చెప్పాడు.

అయితే ఋణం తీసుకుని పంపు సెట్టు వేయిస్తే ఏమవుతుందో నారాయణకు తెలుసు. రామిరెడ్డి ఆ వూళ్ళోకల్లా పెద్ద పాలెగాడు. ముప్పై ఎకరాల ఆసామి. తన పల్లెలో పెత్తనమంతా అతన్దే. అతని మాట విని తను పంపుసెట్టు వేయించుకుంటే ఋణం ఇప్పించిన నెపం మీద పంపు నీళ్ళు తన నాలుగెకరాల సంగతేమో కాని అతని ముప్పై ఎకరాలకు నీళ్ళు సప్లై చేయడానికే తన జీవితకాలం సరిపోతుంది. ఆ భయంతో పంపుసెట్టు

గురించి ఆలోచన మానుకున్నాడు. నీళ్ళ సదుపాయం వుంటే వరి సైతం పండే పొలం అతన్ది. వేరుశెనగ, పొద్దు తిరుగుడు పూలు అలాంటి వ్యాపార పంటలతోనే కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. అంతలోనే పొలాన్ని వదిలిపెట్టి పొమ్మని గవర్నమెంటు ఆర్డరు పిడుగులా వచ్చి పడింది.

ఫలానా సర్వే నంబరు ప్రకారం గవర్నమెంటు పోరంబోకుగా వుంటూ వున్న భూమిని చట్ట వ్యతిరేకంగా నువ్వు దురాక్రమణచేసి సాగు చేస్తున్నట్టు మాకు తెలియవచ్చింది కావున వెంటనే భూమిని వదిలిపెట్టి పోవలసింది. అట్లు కాని యెడల నీపై చట్టపరమైన చర్యలు తీసుకొనబడును – అదీ ఆర్డరు.

అలాంటి ఆర్డరు రావడంతో నారాయణకు మతి పోయినట్లయింది. ఇదేం న్యాయం! తను సాగు చేస్తున్న భూమి గవర్నమెంటు పోరంబోకు కాదు. తాతదండ్రులనుంచి తనకు సంక్రమించింది. లబోదిబోమంటూ అతనా ఆర్డరు పట్టుకుని ఎమ్మార్వో ఆఫీసుకు వెళ్ళాడు. వాళ్ళ కాళ్ళు పట్టుకుని వీళ్ళ కాళ్ళు పట్టుకుని ఎలాగో తన భూమికి సంబంధించిన రికార్డులు బయటికి లాగించాడు.

"రికార్డుల్లో ఆ భూమి గవర్నమెంటు పోరంబోకనే వుంది. కాబట్టి నువ్వా భూమి వదులుకోవలసిందే," అన్నారు వాళ్ళు.

ఆ రికార్డులు పుట్టకముందునుంచీ ఆ భూమిని వంశానుగతంగా తామే సాగుచేస్తూ వస్తున్నారు. అలాంటిది రికార్డుల్లోకి ఆ భూమి గవర్నమెంటు పోరంబోకని ఎందుకు ఎక్కిందో ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా అతనికి అర్థం కాలేదు.

"ఇదంతా కరణమయ్య పనే అయ్యుండాల. మీ నాయన బతికుండగా చానా పితలాటకం చేసిందాయప్పే కదా. ఇప్పుడంటే ఈ ఎమ్మార్వోలూ వీల్లంతా వచ్చినారు. అప్పుడంతా కరణమయ్యేగదా. పోయి అడుగు," అని సలహా ఇచ్చింది నారాయణ భార్య.

లక్షుమ్మ చెప్పింది నిజమే. ఇది కరణమయ్య చేసిన పితలాటకమే అయ్యుండాలి. నారాయణ పిల్లప్పుడు నారాయణతండ్రికి తీవ్రంగా జబ్బు చేసింది. దాంతో భూమి సాగుచేసే వాళ్ళెవరూ లేకపోయారు. అప్పుడు కరణమయ్యే ఒక ప్రతిపాదన తెచ్చాడు.

"చూడు శేషన్నా! ఈ పరిస్థితిలో భూమి నువ్వెలాగా సాగు చేసుకోలేవు. కాబట్టి నాకు గుత్తకిచ్చేయ్. వచ్చిన పంటలో ఎంతో కొంత నీకిస్తాను. దాంతో నీకు దిగులుండదు," అన్నాడు.

నారాయణ తండ్రికి కూడా ఆ పరిస్థితిలో అంతకంటే చేయగలిగిందేం లేదనిపించింది. దాంతో కరణమయ్యకే ఆ పొలం గుత్తకిచ్చేశాడు. కరణమయ్య ఒక రెండేళ్ళు బాగానే

వున్నాడు. ఆ తర్వాత మనిషే మారిపోయాడు. ఆ భూమి తనదేనని ప్రచారం చేసుకోవడం మొదలెట్టాడు. గుత్త ఎగ్గొట్టేశాడు.

అలా కొన్నేళ్ళు గడిచాయి. ఈలోగా నారాయణ తండ్రి జబ్బు నుంచి కోలుకున్నాడు. కరణమయ్య సంగతి పదిమంది పెద్దల్లో పంచాయితీకి పెట్టించాడు. ఆ భూమి తనదేనని కరణమయ్య మంకుపట్టు పట్టి కూర్చున్నాడు. ఒకసారి అది తన తాతల కాలంనాటిదని బుకాయిస్తాడు. ఒకసారి శేషన్నే అది తనకు అమ్మేశాడంటాడు.

ఆ సమయంలో ఆ ఊరి రెడ్డిగా వున్న భూమిరెడ్డి, శేషన్న పక్షాన నిలిచాడు. అంతకుముందు కొద్ది రోజులుగా కరణమయ్యకూ రెడ్డికీ ఏదో విషయమై కీచులాట జరిగింది. అదే శేషన్నని రక్షించింది. లేకపోతే భూమి కరణమయ్యదేనని తీర్పు చెప్పేసేవాడు రెడ్డి. శేషన్న భూమి శేషన్నకు ఆవిధంగా తిరిగి ఇవ్వక తప్పలేదు కరణమయ్యకు. అప్పట్నుంచీ శేషన్న కుటుంబం మీద గుర్రుగానే వుంటూ వచ్చాడు. ఎలాగైనా ఆ భూమి కాజేయాలని ఆ తర్వాత కూడా పథకాలు వేస్తూనే వున్నాడు.

శేషన్న తదనంతరం ఆ భూమి నారాయణకు వచ్చింది. ఆ తర్వాత కరణమయ్య పరిస్థితి కూడా మారిపోయింది. ప్రభుత్వం రెడ్డి కరణం పోస్టులు రద్దుచేసి మండల కార్యాలయాలు తెరిచింది. కరణం తన కొడుక్కి విలేజ్ ఆఫీసర్ ఉద్యోగం తెచ్చుకోవాలని చాలా ప్రయత్నించి విఫలమయ్యాడు. ఆ తర్వాత ఆయనకు పక్షవాతం కూడా వచ్చింది. నారాయణకు శ్రీముఖం చేతికొచ్చే సమయానికి కరణమయ్య మంచాన పడున్నాడు. నారాయణ గవర్నమెంటు ఆర్డరు పట్టుకుని కరణమయ్య దగ్గరికి వెళ్ళాడు.

"చూడు కరణమయ్యా, ఏందిది?" అన్నాడు నారాయణ. కరణమయ్య పరిస్థితి దారుణంగా వుంది. కుడిచెయ్యి, కుడికాలు పడిపోయాయి. మూతి కూడా వంకర తిరిగింది. అయినా మాట్లాడగలిగే స్థితిలోనే వున్నాడు. నారాయణ పట్టుకొచ్చిన ఆర్డరు చూసి వంకర మూతితో అసహ్యంగా నవ్వాడు.

"ఇలాంటిది ఏదో రోజున జరుగుతాదని నాకు తెలుసురా. నేనే ఆ పని చేసింది," అన్నాడు ఏమాత్రం సిగ్గు పడకుండా.

నారాయణ గుడ్లు మిటకరించి, "ఏం చేసినావు కరణమయ్యా?" అన్నాడు.

"మీ నాయన నాకు చేసిందానికి రెండింతలు చెయ్యాలనుకున్నా. రికార్డుల్లో ఆ భూమి గవర్నమెంటు పోరంబోకని నేనే నా స్వహస్తాలతో రాసినా."

'న్యాయం కోసం పోట్లాడ్డమే మా నాయన చేసిన నేరమా కరణమయ్యా?' అని నారాయణ అడగడలేదు.

"నీ కోపం మా నాయినమిందైతే నేనేం జేసినా కరణమయ్యా? బీదనాకొడుకుని నన్నన్యాయం చేస్తివే!" అన్నాడు గుండె బాదుకుంటూ.

"నువ్వు మాత్రం? మీ నాయన కొడుకువి కావేమిరా?" అన్నాడు కరణమయ్య.

"ఎప్పటిదో పగ ఇప్పుడు నామీద ఎందుకు తీర్చుకుంటావు కరణమయ్యా? ఈ కుడిసేత్తో ఎన్ని దొంగరాతలు రాసి ఎందరి కొంపలు ముంచినావో బగవంతుడా చెయ్యి పడిపోయినట్టు చేశ. ఇంకనైనా కనికరించి ఈ భూమి గొల్ల నారాయణదని సాచ్చెం చెప్దూరా," కడుపుమంట ఆపుకోలేక అనేశాడు నారాయణ.

కరణమయ్య తల అడ్డంగా వూపాడు, "నువ్వన్నెట్టు ఎన్నో పాపాలు చేసిన చెయ్యి పడిపోనే పడిపోయింది. అయితే మాత్రం నీకు నేనెందుకు సాయం చెయ్యాల? నా చెయ్యి నాకు తిరిగొస్తాదా? ఇప్పుడీ భూమి నీదని సాక్ష్యం చెబితే దొంగ రికార్డులు రాసినందుకు నా గొంతు మీదికొస్తాది. పో, పోయి కోర్టులో కేసేసుకో," అన్నాడు.

"అంతేనంటావా కరణమయ్యా?" ఖిన్నుడై అడిగాడు నారాయణ.

"అంతే పో. నేనేం చేయలేను."

నారాయణ వకీల్ని చూడ్డానికి వెళ్ళాడు.

ఈలోగా మరొకటి జరిగింది.

ముప్పై సంవత్సరాల క్రితం ఎప్పుడో కుందేరు పొంగి చుట్టుపక్కల పల్లెలు కొన్ని మునిగిపోయాయి. ఆ ముంపులో బాగా దెబ్బతిన్నవి హరిజన కుటుంబాలు. వాళ్ళంతా కూడబలుక్కుని ఆ పల్లెలు వదిలేసి ఎగువ ప్రాంతాలకు వలస వెళ్ళారు. వాళ్ళంతా నారాయణ వుండే వూరు చివర కొట్టాలు వేసుకున్నారు. అప్పట్లో వాళ్ళని కొట్టాలు వేసుకోనిచ్చింది ప్రస్తుతం నారాయణ భూమికి పొరుగువాడైన రామిరెడ్డి తాతగారే. అప్పట్లో ఆయన పంచాయితీ బోర్డు ప్రెసిడెంటుగా వుండేవాడు. ఆ వూరి రెడ్డి అయిన భూమిరెడ్డి నుంచి తీవ్రమైన పోటీ ఎదుర్కొంటున్నాడాయన.

"మరేం పర్వాలేదు. ఇవన్నీ మన స్థలాలే. మీరంతా కొట్టాలు బేస్కోండి. మీ పేర్లు ఓటర్ల జాబితాలో ఎక్కిస్తాను. ఓట్లు నాకు వేయండి," అన్నాడు రామిరెడ్డి తాత.

హరిజనులు సరేనన్నారు.

రామిరెడ్డి తాతగారి రాజకీయాస్త్రం బ్రహ్మాండగా పనిచేసింది. కొత్తగా తెచ్చుకోగలిగిన ఓట్లతో పంచాయితీ బోర్డు ఎన్నికల్లో ఆయన భూమిరెడ్డి అభ్యర్థిని చిత్తుగా ఓడించాడు. అప్పట్నుంచీ హరిజనులు అక్కడే వుంటున్నారు. వాళ్ళ ఓట్లన్నీ ఎప్పుడూ రామిరెడ్డి తాతకే పడేవి. దాంతో ఆయన జీవిత కాలంలో రాజకీయ పలుకుబడికి తిరుగులేకపోయింది.

ఆయన తదనంతరం రామిరెడ్డి హయాం వచ్చింది. అతనూ పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు కావాలని ఆశ పడ్డాడు. అయితే చాలాకాలం పాటు ప్రభుత్వం ఎన్నికలు జరపనే లేదు. ఇప్పుడు మళ్ళీ ఎన్నికలు జరుగుతాయనే అలికిడి వినిపించసాగింది.

ఈసారి ఎన్నికల్లో హరిజనుల ఓట్లు రామిరెడ్డికి పడవనే విషయం ముందే తేలిపోయింది. రామిరెడ్డి హరిజనుల్ని ఎప్పుడూ మనుషులుగా చూసినవాడు కాదు. మాల నా కొడుకులు అనే పదం తప్ప వాళ్ళను గురించి అతని నోటివెంట మరో మాట దొర్లిపడదు. దానికి తోడు అతని మనుషులు కూడా హరిజనుల పట్ల నీచంగా ప్రవర్తించడం మొదలెట్టారు. హరిజనుల ఆడవాళ్ళు కనిపిస్తే ఏడిపించడం, ఒంటరిగా దొరికితే పైట లాగడం వంటివి నిత్యకృత్యాలయినాయి. దాంతో హరిజనులు ఈసారి ఎన్నికల్లో రామిరెడ్డికి బాగా బుద్ధి చెప్పాలనే కృత నిశ్చయంతో వున్నారు.

రామిరెడ్డితో ఎవరు పోటీ చేస్తారో ఇంకా తేలలేదు. అతని తాతగారి కాలంలో గట్టి పోటీ ఇస్తూ వచ్చిన భూమిరెడ్డి ఇప్పుడు లేడు. అతను బతికుండగా తన కుటుంబం నుంచి ఎవర్నో ఒకర్ని పోటీగా నిలబెట్టే వాడు. వాళ్ళలోనే ఎవరైనా పోటీకి నిలబడవచ్చు. అదే జరిగితే ఈసారి ఎన్నికల్లో హరిజనుల ఓట్లు అవతలకి పోవడం ఖాయం. రామిరెడ్డి ఓడిపోవడము ఖాయమే.

దాంతో హరిజనుల్ని, స్థలాలు ఖాళీ చేయమని పట్టుబట్టాడు రామిరెడ్డి. "మాయబ్బ ఉద్దరకిచ్చిన స్థలాలు. ఎల్లకాలం ఆడనే వుంటారేమిరా మాల నా కొడుకుల్లారా? ఖాళీ చేయండి" అంటూ తాఖీదు ఇచ్చాడు.

ఆ తర్వాత చాలా కథ జరిగింది. విషయం కలెక్టరు దాకా వెళ్ళింది. ఎప్పుడో ముప్పై సంవత్సరాల క్రితం ఆక్రమించుకున్న స్థలాలు ఇప్పుడు హరిజనులు వదలడమేమిటని కలెక్టరు అడగలేదు. అలా అడగటానికి బదులు ఒక నిర్ణయం చేశాడు. హరిజనులకు వేరేచోట స్థలాలు చూపిస్తానన్నాడు. వాళ్ళూ అందుకు ఒప్పుకున్నారు.

ఇక వాళ్ళకు వేరే స్థలం చూపించే విషయం వచ్చేసరికి ఎమ్మార్వోగారికి గబుక్కున దొరికింది నారాయణ సాగు చేస్తున్న భూమే. దాన్ని హరిజనులకు అలాట్ చేస్తూ ఆర్డర్లు కూడా జారీ అయిపోయాయి.

నారాయణ దాంతో మరీ బెంబేలెత్తి పోయాడు.

వకీలు పరబ్రహ్మేశ్వరశాస్త్రి నారాయణకు అభయం ఇచ్చేశాడు. "మరేం పరవాలేదు, నీ భూమి ఎక్కడికీ పోదు. టైటిల్ డిక్లరేషన్‌కి సూటుపడేద్దాం. దాంతో అటు గవర్నమెంటు వాళ్ళూ ఇటు మాలవాళ్ళూ ఇద్దరూ అణిగిపోతారు. నీ భూమి నీకొస్తుంది," అన్నాడు.

నారాయణ సరేనన్నాడు.

కోర్టులో దావా మూడున్నర సంవత్సరాలు నడిచింది. నారాయణ ఓడిపోయాడు. తన కళ్ళముందే తన భూమి అన్యాక్రాంతమైపోయే పరిస్థితి దాపురించింది.

"ఏమన్నా ఇంకో టీ ఇమ్మంటావా?" అన్నాడు రాముడు.

స్టౌ మంటకేసి చూస్తూ కూర్చున్న నారాయణ నిట్టూర్పుతో లేచి నిలబడ్డాడు. "వద్దులే".

అక్కడ్నించి తను తన వూరికి వెళ్ళలేదు. ఆ పూట భోజనం కూడా చేయలేదు. భోం చేయడానికి ఆకలిగా కూడా అనిపించలేదు.

సాయంకాలందాకా పిచ్చివాడిలా అటూ ఇటూ తిరిగి పరబ్రహ్మేశ్వర శాస్త్రి ఆఫీసుకు వెళ్ళాడు.

"రారా, కూర్చో," అన్నాడు పరబ్రహ్మేశ్వరశాస్త్రి.

"అపీలు చేసుకుంటావా?" అడిగాడు చంద్రాయుడు.

నారాయణ బుర్రూపాడు.

"సర్లే, రేపు లెక్క తెచ్చీ, ముందు కాపీ స్టాంపులు పడేయాల. జడ్జిమెంట్ కాపీ వచ్చినాక సబ్‌కోర్ట్‌లో అపీలు చేసుకోవాల," అన్నాడు చంద్రాయుడు.

"అపీలుకెంతైతాది సామీ?" అడిగాడు నారాయణ.

"ఎంతవుతుంది, సూటుకెంతైందో దాదాపు అంతే అవుతుంది," అన్నాడు పరబ్రహ్మేశ్వర శాస్త్రి.

నారాయణ గుండె గుభేల్మంది.

"అంతనా?" అన్నాడు నోరు తెరుచుకుని.

"అంతే మరి. కోర్టా మజాకా?" అన్నాడు పరబ్రహ్మేశ్వర శాస్త్రి.

నారాయణ మొహం వేలాడేసుకుని తన వూరు తిరిగొచ్చాడు.

వస్తూనే అతను నేరుగా తన ఇంటికి పోలేదు. కరణమయ్య ఇంటికి వెళ్లాడు.

ఈ మూడు నాలుగేళ్ళలోనూ కరణమయ్య పరిస్థితి మరింత క్షీణించింది. ఇది వరకు మాట్లాడగలిగేవాడు. ఇప్పుడదీ లేదు. అతనికి అన్నీ మంచంమీదనే జరుగుతున్నాయి.

నారాయణ వెళ్లే సమయానికి కరణమయ్య మంచం దగ్గర ఎవరూ లేరు. నారాయణ తిన్నగా వెళ్ళి ఆ మంచం పక్కనే నేలమీద కూర్చున్నాడు.

"నీ పగ తీరినాది కరణమయ్యా! కోర్టు కూడా నువ్వు రాసిన దొంగ లెక్కే ఒప్పుకున్నాది. ఇంగ మాలోల్లు నా భూమి ఇగ్గుకుంటారు," అన్నాడు.

కరణమయ్య కదల్లేదు. గాజు కళ్ళతో నారాయణ కేసి చూస్తున్నాడు.

"మీరంతా ఒకటే కరణమయ్యా. రెడ్డి కూడా యాపొద్దూ నాకాడ పన్ను తీసుకున్నాక రసీదు యీల్యా. ఒక పనికిమాలిన నోటు పుస్తకంలో రాసిస్తావున్న్యాడు. ఆ రెడ్డీ సచ్చినాడు. ఇంక నువ్వు సస్తావ్," కసిగా అన్నాడు నారాయణ.

కరణమయ్య గాజుకళ్ళతో ఇంకా చూస్తూనే వున్నాడు.

"ఎఱ్ఱిగొల్లోన్ని చేసి ఈ భూమ్మీద నాకింత అన్యాయం చేస్తే బగమంతుడు మాత్రం మిమ్మల్ని చమిస్తాడా కరణమయ్యా? మీరంతా సక్కంగా నరకానికి పోతారు."

నారాయణ గొంతులో క్రమంగా దుఃఖం చోటు చేసుకోసాగింది.

"నా భూమి నాక్కాకుండా చేస్తావా కరణమయ్యా? భూమి పోయినాక కూలి పన్జేసి నా బిడ్డల్ని సాక్కుంటా. కానీ నాకింత చేసినావు నీ బిడ్డలు మాత్తరం అడక్కదింటారు. చేతిలో చిప్ప పట్టుకోని ఇంత ముద్ద కోసరం ఇల్లిల్లూ తిరిగేరోజు నీ పిల్లలకి వచ్చి తీర్తాది కరణమయ్యా! నా ఉసురు నీ పిల్లలకి తగుల్తాది," నారాయణ గుండె దబదబా బాదుకున్నాడు. "నా ఉసురు తగుల్తాది ఇంకా తగుల్తాది. ఇంకా తగుల్తాది."

అతని మంచం దగ్గర్నించి దిగ్గున లేచి పోబోతూ మళ్ళీ ఆగాడు. వెనక్కొచ్చాడు. కరణమయ్య మొహంలో మొహం పెట్టి చూశాడు.

"ఇప్పుడు నీ మంచం కాడ యెవులూ లేరు కరణమయ్యా! ఇప్పుడు నీ గొంతు పిసికి సంపినా నా కడ్డమొచ్చేటోల్లు ఎవులూ లేరు," రెండు చేతులూ కరణమయ్య గొంతు దగ్గరికి తీసుకెళ్ళాడు.

కరణమయ్యలో మొదటిసారిగా కొంత చలనం కనిపించింది. ఎడం చెయ్యి ఎడం కాలు ఆడించడానికి ప్రయత్నిస్తూ గొంతులోంచి కీచుమనే శబ్దం మాత్రం తేగలుగుతున్నాడు.

నారాయణ అతని గొంతు దగ్గరగా పోనిచ్చినవాడల్లా మళ్ళీ చేతులు వెనక్కి తీసుకున్నాడు.

"ఛీ!" అంటూ ముప్పావు వంతు నిర్జీవంగా వున్న ఆ మొహం కేసి అసహ్యంగా చూసి చరచరా అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

ఇంటికెళ్ళాక భార్యాబిడ్డల్ని దగ్గరికి తీసుకుని ఏడ్చాడు నారాయణ. "ఉండే ఆధారం పాయ. ఇంగ మనం ఎవల్దగ్గర్నో కూలి చేసి బతకాల," అంటూ బావురుమన్నాడు.

అతని భార్య అతనంత బేల కాదు.

"ఛా, వూర్కో! పిల్లలు బెదిరిపొయి సూస్తుండారు. మింది కోర్టుకు దావా తీస్కెల్లాలని వకీలు చెప్పినాడంటివి గదా! మన భూమి యాటికీ పోదులే," అని ధైర్యం చెప్పింది.

ఆమె ప్రోద్బలం మీదనే ఆ మర్నాడు నారాయణ మళ్ళీ టౌనుకు వెళ్ళి కాపీ స్టాంపులు పడేయించి వచ్చాడు.

అతన్లో ఇప్పుడే మాత్రం ఉత్సాహం లేదు. అపీల్లో కూడా తను గెలుస్తాడని నమ్మకం కుదరడం లేదు. దేవుడే తననింక రక్షించాలి.

ఇంట్లోంచి బయటికి రావడం కూడా అతను మానేశాడు.

అతని భార్య అతన్ని ఓదార్చడానికి ప్రయత్నించి ప్రయత్నించి విఫలమై ఇక తన చేతకాదని వూరుకుండిపోయింది.

ఒక వారం రోజులు గడిచాయి.

నారాయణ ఇంట్లో మంచంమీద పడుకొని పై కప్పు కేసి చూస్తూ భూమి తన చేయి దాటిపోయాక ఏం చేయాలని ఎడతెగని ఆలోచనల్లో మునిగిపోయి వున్నాడు.

అదే సమయంలో బయట్నించి ఒక పిలుపు వినిపించింది.

"నారాయణా!"

నారాయణ లేచి కూర్చున్నాడు.

"ఎవరు?"

"నేను రామిరెడ్డిని."

ఆ పేరు వింటూనే నారాయణలో బద్ధకం వదిలిపోయింది. గబగబా బయటికి పరిగెత్తాడు.

"నువ్వా అన్నా! రా, లోపలికి రా!" అన్నాడు కంగారు కంగారుగా.

"ఏం లేదు, నీతో మాట్లాడేదుంది," అన్నాడు రామిరెడ్డి.

"రాన్నా, లోపలికి రా," అంటూ లోపలికి దారి తీశాడు నారాయణ.

చెట్టంత మనిషి రామిరెడ్డి. ఎత్తుకు తగ్గ లావు. నారాయణ ఇంటి పొట్టి గుమ్మంలోంచి బాగా వంగి లోపలికొచ్చాడు.

నారాయణ నులకమంచం మీద దుప్పటి పరిచాడు.

"కూకోన్నా."

రామిరెడ్డి హుందాగా కూర్చున్నాడు.

మంచం కీళ్ళు కరకరమన్నాయి.

నారాయణ అతని ఎదురుగా నేలమీద కూర్చున్నాడు.

"మరేం లేదు నారాయణా, నీ భూమి నాకమ్ముతావేమోనని వచ్చినా," రామిరెడ్డి మాట్లాడుతుంటే గొంతు ఖణేల్ ఖణేల్ మంటుంది.

నారాయణ తన చెవుల్ని తానే నమ్మలేక నోరు తెరిచేశాడు. రామిరెడ్డి నుంచి ఇలాంటి ప్రస్తావన వస్తుందని అతను కల్లో కూడా అనుకోలేదు.

"అది కాదన్నా...," అంటూ ఏదో చెప్పబోయాడు.

రామిరెడ్డి అతన్ని మాట్లాడనివ్వకుండా చెయ్యి అడ్డు పెట్టాడు. "నువ్వేసిన దావా కొట్టేసినారు, నాకు తెల్సు. అందుకే నేనొచ్చినా నారాయణా! ఆ భూమి నువ్వు నిలుపుకోలేవు. నువ్విస్తానంటే ఎకరా పదివేలకు నేను రాపిచ్చుకుంటా. ఏమంటావు?"

నారాయణకు వెంటనే నోటివెంట మాట వూడిపడలేదు. బుర్ర గోక్కుంటూ వుండిపోయాడు.

"నాకు తెల్సు నారాయణా!" మళ్ళీ చెప్పనారంభించాడు రామిరెడ్డి. "నీ భూమి ఎకరా పదైదు వేలు పలుకుతాది. పదివేలు ధర అగ్గువే. కానీ దావాలో ఇరుక్కొనిపోయిన భూమికి పది రూపాయలు పెట్టైనా ఎవులు కొంటారు? నా మాటిని ఒప్పుకో, ఆ లెక్కతో ఇంగోచోట యాడైనా భూమి కొనుక్కో. నాకు మాత్రం ఈ నాలుగెకరాలు ఇచ్చేయి. నీ మంచికోరే చెప్తాండా...."

"అది కాదన్నా...!" మళ్ళీ బుర్ర గోక్కున్నాడు నారాయణ.

"నాకు తెల్సులే నువ్వేందనాలనుకుంటుండావో! చెప్తా, యిను. నీభూమి పక్కనే నా భూమి వుండాది. నీ భూమి కొంటే నా భూమి ఇంగా పెరుగుతాది. అవునా? అందుకే నీ భూమి కొందామనుకుంటాండా."

కొద్ది క్షణాలు నిశ్శబ్దం.

"అసలు కారణం ఇంగోటుండాదిలే నారాయణా! సరే, అది గుడ్కా చెప్తా, యిను. నీ భూమి గవర్నమెంటోల్లకు బోతే ఆల్లు మాలోల్లకిస్తారు. ఇంతకాలం ఈ మాలనా కొడుకుల్ని ఊరవతల బరిస్తావస్తిమి. ఇప్పుడు నా భూమి పక్కనే వస్తానంటాండారు కొడుకులు. సూడు నారాయణా, నువ్వు గొల్లోనివి నేను రెడ్డిని. ఉంటే ఈ భూమి మనమద్దెనే వుండాల. మద్దెన ఈ మాలనాకొడుకులెవరంట? ఈల్లకు మల్లా ఓట్లు! వాల్లు నా పక్కకు రానీకి లేదు. నేను రానివ్వను. ఇంక కోర్టు అంటావా? కోర్టులంటే నాకు భయం లేదు. కావాల్నంటే మండలాఫీసులో రికార్డులే తిరగరాపిస్తా. అదంతా నీకు తెల్వదులే. చెప్పు మరి, భూమి నాకమ్ముతావా? ఎప్పుడో ఎల్లువొచ్చి ఈ వూరి మిందొచ్చి వడితే ఈ మాలనాకొడుకులందర్కీ మాయబ్బ కొట్టాలేపిచ్చుకోనిచ్చినాడు. అయ్యి బట్కోని ఇప్పుడాల్లు నామింద ఎగుర్లాడతాండారు. నువ్వుగిన భూమి నాకమ్మితే యెట్లా ఎల్లువొచ్చి ఈనా యాల్లంతా పూర్వం పల్లెల్నొదిలేసి లేచినారో అట్టే మల్లా లేపిస్తా. నీ భూమి మాత్రం నాకు ఉద్దరగొద్దులే. ఎకరాకి పదివేలు ఇస్తానంటాండా. చెప్పు. న్యాయమైన మాటేగా?"

నారాయణ ఏదో అనడానికి మళ్ళీ నోరు తెరిచాడు.

అప్పటికీ పెరట్లో వున్న అతన భార్య తలుపు చాటుకొచ్చి ఆ సంభాషణంతా వింటోంది. మొగుడు నోరు తెరుస్తూనే ఏం అనేస్తాడోనని గబగబా ఆమె వాళ్ళ ముందుకొచ్చేసింది.

"అన్నా! రామిరెడ్డన్నా! ఆ దేముడే మిమ్మల్ని మాకాడికి పంపినాడు. నా మొగునికి ఒకటంటే ఒకటి తెల్వదు. అట్నే తీస్కోన్నా. ఎకరా పదివేలకిచ్చేస్తాం," అంది.

రామిరెడ్డి ఇంకేమనడానికి నారాయణకు అవకాశం ఇవ్వలేదు.

"అదీ మాట. నీకంటే నీ ఇంటిదానికి తెలివి జాస్తిగా వుండాది. యాడున్నా బతికిపోతావుపో. ఇంకేమనాకు. ఎకరా పదివేలు. రేపే రిజిస్టరు చేయించుకుంటా. అగ్రిమెంటూ గిగ్రిమెంటూ యేమొద్దు. ఈ అడ్వాన్సు నీకాడుంచు," అంటూ జేబులోంచి పదివేల రూపాయల కట్టలు రెండు తీసి నారాయణ చేతిలో వుంచేశాడు.

నారాయణ వెర్రివాడిలా ఆ కట్టల వంక చూస్తుండగా ఎలా వంగి లోపలికొచ్చాడో అలాగే వంగి గుమ్మంలోంచి బయటికి వెళ్ళిపోయాడు రామిరెడ్డి.

ఆ రాత్రి నారాయణకు కలొచ్చింది.

కల్లో పెన్నానది పొంగింది. తమ ఊళ్ళోకి ఎల్లువొచ్చింది. ఆ ముంపులో తనూ హరిజనులూ కొట్టుకుపోతున్నారు.

ఈరిగాడు గూడా తన పక్కనే కొట్టుకుపోతుండడం నారాయణకు స్పష్టంగా గుర్తు.

❖

# సాగిపోయే వాగునీరు

చలమయ్య కాఫీ హొటల్ మారిపోయింది. శ్రీ శ్రీనివాస పిక్చర్ ప్యాలెస్ మారిపోయింది. మస్తాన్ సాహెబ్ కిళ్లీ కొట్టు లేచిపోయింది. అంతెందుకు, తరాల నాటి శివాలయం కూడా పద్దెనిమిదేళ్ళలో గుర్తు తెలీకుండా మారిపోయింది.

ఆ రోజుల్లో ఎలా వుండేదీ వూరు! ఎంతందంగా ఎంత ప్రశాంతంగా, ఎంత హాయిగా వుండేదీ వూరు! పూరవతల ఆనందంగా ఆహ్లాదంగా సాగిపోయే వాగులా ఎంత హుందాగా, ఎంత సాఫీగా, ఎంత సాదాగా వుండేది!

ఇప్పుడేమిటింత రద్దీగా వూపిరి సలపనట్టు పరిగెత్తే మనుషుల్తో ఇలా నిండిపోయింది?!

ఆ రోజుల్లో నేను నడిచిన రోడ్లు ఇవి కావు. ఆనాటి మట్టిరోడ్లమీద నా పాదాల గుర్తుల్ని సమాధి చేసి వాటి మీద తారు మరిగించి పోశారు. రోడ్ల వైశాల్యం కూడా పెరిగింది. అయితేనేం, ఈ తారురోడ్లకంటే ఆనాటి మట్టిరోడ్లే అందంగా వుండేవి. ఇన్ని గతుకులు, ఇంత రద్దీ ఆ మట్టిరోడ్ల మీద వుండేవి కావు. వానాకాలంలో టపటపా చినుకులు పడ్డప్పుడు ఆ మట్టివాసన నాసికా రంధ్రాలకు పూల సుగంధం కంటే కమ్మగా సోకేది.

చలమయ్య కాఫీ హొటల్ ఇలా వుండేదా! నాలుగు తడికల మధ్య నాలుగు టేబుళ్ళు, వాటి చుట్టూ గూడకట్టు పంచెలు కట్టుకున్న పెద్ద మనుషులు కూచుని చలమయ్య హాట్‌హాట్‌గా సప్లై చేసే టిఫిన్ లాగించేసి స్ట్రాంగ్ కాఫీ చప్పరిస్తూ దినపత్రికల్ని ముక్కలు ముక్కలుగా పంచుకుని రాజకీయాలు చర్చిస్తూ వుండేవారు. గొట్టాం ప్యాంటు తొడుక్కున్న కుర్రకారు వాళ్ళ సమక్షంలో అక్కడ చేరడానికి బిడియపడి హొటల్ బయటే నుంచుని కాఫీలు తాగేసి చక్కా పోతుండేవారు.

ఆనాటి చలమయ్య హొటల్ ఇప్పుడూ వుంది. అయితే ఇప్పుడు దాని పరిస్థితి వేరు. తడికెల పాక స్థానంలో కొత్త ఆర్సీసీ బిల్డింగ్ వెలిసింది. ఇప్పుడది మిలిటరీ హొటల్

కూడా. గూడకట్టు పంచె పెద్దమనుషుల జాడే లేదు. అసలు కౌంటర్లో చలమయ్యే అయిపు లేడు. వేరెవరో బిజీగా వున్నారు.

శ్రీ శ్రీనివాస పిక్చర్ ప్యాలెస్‌లో సినిమా చూడాలంటే ఒకనుభవం. ఆ హాల్లో ఎప్పుడూ డబ్బా సినిమాలే ఆడుతూ వుండేవి. అది కూడా పది నిమిషాలకోసారి కరెంటు వస్తూ పోతూ ఆడవాళ్ళ రణగొణ ధ్వనుల్తో పిల్లల కేకల్తో, నేలక్లాసు లోంచి వినిపించే ఈలల్తో అదో ప్రపంచంలా వుండేది. ఇప్పుడు శ్రీ శ్రీనివాస పిక్చర్ ప్యాలెస్ పూర్తిగా రీమోడల్ చేశారు. ఆ రోజుల్లో హాల్లోపల స్తంభాలుండేవి. ఇప్పుడు లేవు. జనరేటర్ రావడంతో కరెంటు కూడా ఇప్పుడు మధ్యలో పోతుందన్న సమస్య లేదు.

అప్పట్లో చిన్న గుడిగా వుండిన శివాలయానికి ఇప్పుడు చాలా కళొచ్చింది. .ధర్మకర్తలు గుడికి అందమైన గోపురం కట్టించారు. అంతేకాదు, రాతిమీద శిల్పాలు చెక్కించి గుడిబయట ద్వారతోరణం నిర్మించారు. అదొక్కటే ఇప్పుడా వూళ్ళో ఆహ్లాదకరంగా వున్న కట్టడం. మిగతావన్నీ సాదాసీదా సిమెంటు బిల్డింగులు. అందంగానీ అభిరుచిగానీ కనిపించడం లేదు.

అసలా రోజుల్లో ఇన్ని కార్లూ, ఇన్ని స్కూటర్లూ ఈ వూరి రోడ్లమీద ఎక్కడుండేవి? రిక్షాలు కూడా అంతంతమాత్రంగానే వుండేవి. జట్కాబళ్ళే సామాన్యుడి రాజవాహనాలూ పూలరథాలూ అన్నీనూ. అసలు జట్కా బండికుండే హుందా కారుకెక్కడ్నించి వస్తుంది? కొంచెం కుదుపుతుందన్న మాటే గానీ జట్కాబండిలో కూచుంటే ఎంత హాయిగా వుంటుంది! బండి లోపల పచ్చగడ్డి ఒత్తుగా పరిచి, ఆ పచ్చగడ్డిమీద లావాటి జంపఖానా పరిచి... ఓహ్, జట్కాబండిలో కూచుంటే ఆ మెత్తదనమూ, ఆ పచ్చగడ్డి వాసనా, పరిగెడుతున్నప్పుడు వినిపించే ఆ గుర్రపు డెక్కల చప్పుడూ, అప్పుడప్పుడూ బండివాడు గుర్రం వీపుమీద ఝుళిపించే చర్నాకోలా మెరుపులూ అన్నీ నా మస్తిష్కంలో తియ్యని జ్ఞాపకాలుగా రికార్డయిపోయాయి.

అప్పట్లో మా శీనూ మావయ్య ఈ వూరి పంచాయితీలో పనిచేస్తుండేవాడు. దరిమిలా హైస్కూలు చదువుకోసం నన్నీ వూళ్ళో మా నాన్నగారు విడిచిపెట్టారు. ఇప్పట్లా అప్పుడు పల్లెటూళ్ళలో కూడా హైస్కూళ్ళుండేవి కావు. రెండు సంవత్సరాలు ఇక్కడే చదువుకుని, మా వూరికి కూడా హైస్కూలు రావడంతో ఇక్కడ్నించి వెళ్ళిపోయాను. చదువైపోయింది. హైదరాబాదులో ఏదో చిన్న వుద్యోగం వచ్చింది. వుద్యోగం వస్తూనే పెళ్ళాడేసి హైదరాబాదులో మకాం పెట్టేశాను.

ఇన్ని సంవత్సరాలుగా ఈ వూళ్ళో వుండిన ఆ రెండేళ్ళూ, ఆ రెండేళ్ళలోనూ కలిగిన అనుభవాలూ నా మనసును గులాబీరేకుల్లా మృదువుగా, ఆహ్లాదకరంగా తాకుతూనే

వున్నాయి. జీవితంలో మరొక్కసారి ఈవూరు మళ్ళీ చూడాలనే ఆకాంక్ష అప్పుడప్పుడూ తీవ్రంగా తలెత్తుతూనే వుంది. దాంతో మూడురోజుల సెలవు పెట్టేసి ఎలాగైతేనేం మళ్ళీ ఈ వూరొచ్చాను. మా ఆవిడ నాతో రాలేదు. ఆవిడ ప్లానింగు వేరే. నేనిక్కడుండడానికి ప్లానేసిన మూడు రోజులూ తను పుట్టింటికెళ్తానంది. సరేనని తనని వాళ్ళ పుట్టింట్లో దిగబెట్టి నేనిలా చక్కా వచ్చాను.

లెస్ లగేజీ ఈజ్ మోర్ కంఫర్టబుల్ కాబట్టి సామాన్తో చికాకులు పెట్టుకోకుండా హాయిగా ఈ వూళ్ళో ఆ పాత ప్రదేశాలన్నీ తిరగాలనుకున్నాను. కాబట్టి నావెంట ఒక బ్రీఫ్‌కేసు తప్ప వేరే సామానేం తెచ్చుకోలేదు.

ఆ రోజుల్లో ఈవూరి బస్టాండు పక్కన ఒకే ఒక్క చిన్న లాడ్జింగుండేది. ఆ దారెంట పోయినప్పుడల్లా ఆ లాడ్జింగులో ఏముంటుందో చూడాలనే కుతూహలమూ, దాంతోపాటే లోపలికి వెళ్ళడానికి అంతులేని బిడియమూ! మొత్తానికి ఆ లాడ్జింగులో ఏముంటుందో అప్పుడు నేను చూడనేలేదు. అప్పుడే కాదు, బాగా పెద్దవాడినయ్యేంతవరకూ అసలు లాడ్జింగనేది ఎలా వుంటుందో ఒక్కసారి కూడా నేను చూడలేదు. ఆ రోజుల్లో నా దృష్టిలో లాడ్జింగంటే పెద్దపెద్దవాళ్ళు దిగే ఓ ఇంద్రభవనం అనే ఫీలింగుండేది. దాంతో ఆ లాడ్జింగ్ వైపు చూసినప్పుడల్లా ఒక అపురూపమైన భావం కలుగుతూ వుండేది. ఇప్పుడా వూళ్ళో ఖరీదైన లాడ్జింగులు వున్నాయి. అయినా నా చిన్నతనంలో నన్నెంతగానో ఆకర్షించిన ఆ లాడ్జింగులోనే దిగాను. ఆ లాడ్జింగులో మాత్రం అప్పటికీ ఇప్పటికీ ఏమీ మార్పు లేదు. అప్పట్లో బయట్నించి ఎలా వుండేదో ఇప్పుడూ అలాగే వుంది. దానిపేరు వీరాంజనేయ లాడ్జి. ఆ లాడ్జింగులో దిగుతుండగా నాలో ఒక విచిత్రమైన అనుభూతి కలిగింది. దాంతోపాటే కాకిగూటి లాంటి ఆ లాడ్జింగుని ఇంద్రభవనంగా భావిస్తూ వుండినందుకు నవ్వు కూడా వచ్చింది.

లాడ్జింగులో దిగుతూనే బ్రీఫ్‌కేసక్కడ పడేసి ఆ పాత ప్రదేశాలన్నీ తిరిగాను. ఒక్క శివాలయం తప్ప ప్రతిచోటూ నన్ను నిరాశపర్చింది. వూరంతా వూపిరి సలపని రద్దీ. కార్లూ స్కూటర్లూ విడిచే నల్లని విషపూరితమైన పొగ, దుమ్మూధూళి. మిట్ట మధ్యాన్నం పూట కూడా జనం రోడ్లనిండా వున్నారు. ఆ జనాన్ని చూస్తుంటే భారతదేశంలో జనాభా సమస్య ఎందుకింత తీవ్రమైపోతోందో ప్రత్యక్షంగా అర్థం చేసుకున్నట్లైంది. రోడ్లమీద మచ్చుకి ఒక్క జట్కాబండి కూడా కనిపించడం లేదు.

ఆ మధ్యాన్నం శ్రీ శ్రీనివాస మహల్లో మ్యాట్నీ షో చూశాను. నా చిన్నతనంలో ఈ హాల్లో మ్యాట్నీ షో లుండేవి కావు. రోజుకి రెండే ఆటలు. ఇప్పుడందులో మాట్నీ షోలే

కాదు, మార్నింగ్ షోలు కూడా వున్నాయి. తెలుగు సినిమాలే కాదు ఇంగ్లీషు సినిమాలు కూడా ఆడుతున్నాయి. నేను వెళ్ళిన షో సూపర్‌హిట్ తెలుగు సినిమాది. అయినా హాలు సగమే నిండింది. నాకు నా చిన్నతనం గుర్తుకొచ్చింది. ఇదే హాల్లో ఎంత డబ్బా సినిమా వచ్చినా కిక్కిరిసి పోయే జనసమ్మర్థం గుర్తుకొచ్చింది. దాంతో పాటే ఆ రణగొణధ్వనులూ, ఆ పిల్లల ఏడుపులూ, నేలక్లాసులోంచి ఆ ఈలలూ గుర్తుకొచ్చాయి. అవన్నీ గుర్తుకొచ్చి మనసు ఉదాసీనమై పోయింది.

దేవుడు మనిషికి వయసు ఇస్తే ఇచ్చాడు. జీవితంలో ఒడిదుడుకులూ, కష్టనష్టాలూ, సుఖ దుఃఖాలూ ఇస్తే ఇచ్చాడు. కానీ పసితనంనాటి అనుభూతులూ ఆ పచ్చని మనసూ ఎందుకు లాగేసుకుంటాడు? పెద్దయితే ప్రపంచం ఎందుకు పాతబడిపోతుంది? పసితనంలోలా లోకమంతా ఎందుకంత పచ్చగా, హాయిగా అపురూపంగా కనిపించ గూడదు? అమ్మ వడిలోని హాయీ, నాన్న వడిలోని వెచ్చదనమూ కలిగించే అనుభూతీ జీవితాంతమూ ఎందుకలాగే వుండిపోగూడదు?

ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం కూడా అప్పుడే తట్టింది. పసితనంతోపాటే ఆ అనుభూతులు కూడా మనిషిని విడిచిపెట్టి వెళ్ళకపోతే మనిషి జ్ఞాపకాల్లో ఆ సుగంధం ఎక్కడ్నించి వస్తుంది? ఏది గుర్తు చేసుకుంటూ మనిషి తన వృద్ధాప్యాన్ని హాయిగా గడపగలుగుతాడు? అందుకు పసితనం మనిషిని విడిచి పెట్టిపోవలసిందే! ఆ ఆలోచనలతో మనసుకు కాస్తంత తృప్తి కలిగింది. దేవుడేం చేసినా తెలివితోనే చేస్తాడు లెమ్మనే వూహ కలిగింది.

సినిమా విడుస్తూనే లాడ్జింగు కెళ్ళి చన్నీళ్ళు స్నానం చేసి ఫ్రెష్‌గా రమణమూర్తి గారింటికి వెళ్ళాను. ఆ వూళ్ళో నాకుండిన ఒక్కగానొక్క ప్రాణ స్నేహితుడు రమణమూర్తే. ఒకరిద్దరి కంటే ఎక్కువమందితో స్నేహం చేయడం అప్పుడే కాదు, ఇప్పుడూ నాకూ చేతకాదు. స్నేహం చేస్తే అది ప్రాణ స్నేహమే.

రమణమూర్తి ఇంట్లోనే వున్నాడు. ఇప్పుడు వాడి లెవెలే మారి పోయింది. చిన్నప్పుడు స్నానం చేయడానికీ, తల దువ్వుకోవడానికీ వాళ్ళమ్మని తెగ సతాయించేవాడు. చింపిరి జుట్టుతో మాసిన బట్టల్తో వూరేగేవాడు. ఇప్పుడు తలకు నూనె రాసుకుని నీట్‌గా పక్కపాపిడితో జుట్టు వెనక్కి దువ్వుకున్నాడు. కళ్ళకి గోల్డ్ ఫ్రేం కళ్ళద్దాలొచ్చేశాయి. వాడి వేషధారణ నన్నన్నింటి కంటే ఎక్కువ ఆశ్చర్య పరిచింది. గ్లాస్కో మల్లుపంచె, గంజీ పెట్టి ఇస్త్రీ చేసిన పట్టులాల్చీ తొడుక్కున్నాడు. నాలా పాంటూ షర్టూ వేసుకోలేదు. ఆ వేషంలో అతని వయస్సు ముప్పై అయిదు సంవత్సరాలుగా కనిపించడం లేదు. ఏ నలభై అయిదేళ్ళ పెద్దమనిషిలాగో

వున్నాడు. నన్ను చూస్తూనే మొదట గుర్తుపట్టలేదు. గుర్తుపట్టాక ఆప్యాయంగా ఇంట్లోకి పిల్చుకెళ్ళాడు.

అంతే తప్ప వాణ్ణి చూస్తుంటే నాలో కలుగుతున్న వెర్రి ఆనందం లాంటిదేదీ నన్ను చూస్తుంటే వాడిలో కలుగుతున్న దాఖలాలేం కనిపించలేదు. అన్నింటికంటే విచిత్రమేమిటంటే వాడ్ని నేను 'ఒరే' అని పిలవలేక పోవడమే. దానిక్కారణం వాడి ధోరణే. వాడూ నన్ను ఒరే అని పిలవలేదు. నాతో చాలా మర్యాదగా మాట్లాడాడు. ఆ మర్యాదే నన్ను చాలా ఇబ్బంది పెట్టింది. స్నేహితుల మధ్య వుండవలసింది స్నేహమే తప్ప మర్యాద కాదు. వాడు నన్ను ఒరే అని పిలవలేక పోయినందుకూ నాకు చాలా మనస్తాపం కలిగింది. అంతే కాకుండా వాడి మాటల్లో డబ్బుతో పాటే వచ్చిపడిన ఆడంబరం కూడా కొంత తొంగి చూడటం నాకు మరీ ఇబ్బంది కలిగించింది.

వాడి అమ్మానాన్న పోయారు. వాళ్ళ నాన్నలాగే వాడూ కాంట్రాక్టరై పోయాడు. డబ్బు గడించాడు. పెళ్ళి చేసుకున్నాడు. ఇద్దరు మగపిల్లలు. మూడో కాన్పుకు వాడి భార్య పుట్టింటికి వెళ్ళడంతో ఆమెని నేను చూడలేకపోయాను. వాడి పిల్లలు కూడా తల్లితోపాటే వూరెళ్ళడంతో వాళ్ళనీ చూడలేకపోయాను.

వాడికి నా సంగతులు కూడా చెప్పాను. వుద్యోగం రావడం, పెళ్ళి కావడం, ఇంకా పిల్లలు కలగకపోవడం అన్నీ చెప్పాను. నేను వుద్యోగం చేస్తున్నాననగానే వాడు నవ్వాడు. ఈ రోజుల్లో వుద్యోగాలు చేయడం శుద్ధ దండగ, నువ్వు వ్యాపారం చేసుండాల్సిందని చిన్న లెక్చరిచ్చాడు. వ్యాపారం చేయాలి సరే, కానీ వ్యాపారం చేయడానికి నా దగ్గర డబ్బేదీ? నా తర్కం వాడికి నచ్చలేదు. తెలివుంటే డబ్బు దానంతటదే పుట్టుకొచ్చేస్తుందన్నాడు. ఎలా పుట్టుకొచ్చేస్తుందో నాకు మాత్రం అర్థం కాలేదు. అది నీకంటే నేను పై అంతస్తులో వున్నాననే దెప్పి పొడుపులా అనిపించి మనసంతా చేదుగా అయిపోయింది.

నేను రమణమూర్తిని మళ్ళీ కలుసుకున్నప్పుడు జరుగుతుందని వూహించుకున్న అద్భుతమైన సీన్ ఇది కాదు, నేను వాడితో ముచ్చటించాలని అనుకున్న మాటలన్నీ ఇవి కావు. మా సంభాషణలో కనీసం ఒక్కసారైనా మా చిన్ననాటి అనుభవాల గురించిన ప్రస్తావన రాలేదు.

అక్కడ గంటలు గంటలు నిమిషాల్లో దొర్లిపోతాయనుకున్నది కాస్తా నిమిషాలు గంటల్లా తోచడం ప్రారంభమైంది. ఈ రమణమూర్తి ఎవరో నేనెరగని మనిషి. అక్కడ ఎక్కువసేపు కూర్చోలేక వస్తానని చెప్పి లేచాను. రమణమూర్తి నన్నుండమనలేదు. ఎక్కడ దిగావనీ అడగలేదు. అప్పుడప్పుడూ ఈ వూరు వస్తుండమని మొక్కుబడిగా అని వూరుకున్నాడు. నేనూ అలాగేనని మొక్కుబడిగానే చెప్పి అక్కడ్నించి వచ్చేశాను.

డబ్బు!

స్నేహాన్ని మింగేసే డబ్బు!

నాకు హఠాత్తుగా లోకంమీద అసహ్యం వేసింది. రమణమూర్తి పక్కన నన్ను నేను వూహించుకుంటే వాడి ముందు నేనేదో చీమనో దోమనో అనే న్యూనతా భావం కలిగి మనశ్శాంతి కొద్ది క్షణాలు రెక్కలు కట్టుకుని ఎగిరిపోయింది.

రమణమూర్తి కంటే ఎక్కువగా నేను చూడాలనుకున్న వ్యక్తి మరొకరున్నారు. బజార్లో ఒక సంచిలో పళ్ళు కొని ఆ ఇంటికి వెళ్ళాను. నా చిన్నతనంలో ఆ ఇల్లు చాలా శుభ్రంగా వుండేది. ఇప్పుడు గోడల మీద వెల్ల వెలిసిపోయింది. ఇల్లంతా చిందరవందరగా వుంది.

ఆ ఇంటి పంచలో ఒక ముసలావిడ నిశ్శబ్దంగా కూచుని ఏదో చిన్న పుస్తకం, విష్ణు సహస్రనామం అనుకుంటాను, చదువుకుంటోంది. ఆవిడెవరో నాకు తెలీదు. కొంపదీసి నేను కలుసుకోవాలని వచ్చిన వ్యక్తి ఆ ఇల్లు అమ్మేసి ఎటైనా వెళ్ళిపోవడం జరిగిందా?

ఆవిడ నిదానంగా పుస్తకంలోంచి తల పైకెత్తి చూసింది.

"ఎవరు?"

నేను ఒక్క క్షణం తటపటాయించి, "పంకజమ్మ మేస్టారు ఈ ఇంట్లోనే వున్నారాండీ?" అనడిగాను.

ఆవిడ నెమ్మదిగా తలాడించింది.

"నేనే పంకజమ్మని. మీకేం కావాలి?"

నాకు షాక్ తగిలినట్టైంది.

ఈవిడా!

ఈవిడేనా పంకజమ్మ మాస్టారు! వృద్ధాప్యం మనిషిని ఇంతగా రూపురేఖల్తో సహా మార్చేస్తుందా! కొద్ది క్షణాలు నేనేం మాట్లాడలేక పోయాను.

"ఎవరు కావాలి బాబూ?"

నేను చప్పున చెప్పులక్కడే వదిలేసి ఆవిడ ఎదురుగా వెళ్ళి కూచున్నాను.

"మాస్టారండీ! బావున్నారా?"

చిన్నప్పుడు మేము లేడీ టీచర్లనీ మగటీచర్లనీ సమానంగా మాస్టారండీ అని పిల్చేవాళ్ళం. పంకజమ్మ మాస్టారు దగ్గర నేనూ రమణమూర్తీ ట్యూషన్ కూడా చెప్పించుకునే వాళ్ళం. నేనావిడ ప్రియశిష్యుడ్ని. ఈ పంచలోనే ఆవిడ మాకు ప్రైవేటు చెప్పేది.

ఆవిడ అర్థమైందన్నట్టు తలూపింది.

"పాత విద్యార్థివా?"

"అవును మాస్టారండి! నేను కృష్ణుడ్ని! చిన్నప్పుడు మీరు నన్ను మంచి కృష్ణుడని పిలిచేవారు"

ఆవిడ పెదవుల మీద లీలగా చిరునవ్వు మెదిలింది.

"వయసొచ్చేసింది. నాకు నా స్టూడెంట్స్ అందరూ జ్ఞాపకం లేరు," అంది.

అది నాకు మరో నిరాశ. ఎవర్ని గుర్తుపట్టినా పట్టకపోయినా నన్ను మాత్రం పంకజం మాస్టారు తప్పకుండా గుర్తు పడుతుందనే అనుకున్నాను. నేనెవరబ్బాయినో, ఏ సంవత్సరంలో ఆమె దగ్గర చదువుకున్నానో గుర్తు చేశాను. అయినా ఆవిడకి గుర్తు రాలేదు. ఇక నేనా ప్రయత్నం మానేసి ఆవిడ మంచి చెడ్డలు విచారించాను. జయకీ, సుజాతకీ పెళ్ళిళ్ళు చేసేసి ఆవిడ ఒంటరిగా వుంటోందట! టీచర్‌గా రిటైరైపోయింది. ఆ పెన్షన్‌తోనే రోజులు వెళ్ళబుచ్చుతోంది. ఇప్పుడు ట్యూషన్లు చెప్పడం లేదు. ఆవిడకు నేను పళ్ళిచ్చేసి అక్కడ్నుంచి తిరిగొచ్చేశాను.

ఆ ఇంట్లోంచి వస్తూంటే నా మనసేదో అయిపోయినట్టనిపించింది. ఆ రోజుల్లో ఎలా వుండేది పంకజం మాస్టారు!

ప్రతి మగపిల్లవాడికీ జీవితంలో పదకొండూ పన్నెండేళ్ళ వయసులోనే తొలి ప్రేమ సంభవిస్తుందని నా నమ్మకం. అది కూడా తప్పకుండా వాడి లేడీ టీచర్‌తోనే అని కూడా నా నమ్మకం. అది నా అనుభవం చొప్పున నేను ఏర్పాటు చేసుకున్న నమ్మకం. నా జీవితంలో నేను ప్రేమించిన మొదటి స్త్రీ పంకజం మాస్టారు. నేనేకాదు, రమణమూర్తి కూడా ఆమెను ప్రేమించాడు. నా ప్రేమే అమలినమనీ, రమణమూర్తి ప్రేమ మలినమనీ అనుకునేవాణ్ణి. దానికి దాఖలాలు కూడా వున్నాయి. పంకజం మాస్టారు బాత్ రూంలో స్నానం చేస్తున్నప్పుడు రమణమూర్తి తలుపు సందులోంచి ఆవిడ్ని చూడడానికి ప్రయత్నించేవాడు. వాడా పని చేస్తున్నప్పుడు నేను భయంతో వణికిపోయేవాణ్ణి. అక్కడ్నుంచి పోదాం రమ్మని రమణమూర్తిని చొక్కా పట్టి లాగినా వాడొచ్చేవాడు కాదు. మొత్తానికి మేమిద్దరం కూడబలుక్కునే పంకజం మాస్టారుని ప్రేమించాం.

అదేం విచిత్రమో! అన్ని తిప్పలు పడినా రమణమూర్తి ఆశ ఎప్పుడూ ఫలించలేదు. కానీ, వాడు చూడాలనుకున్న దృశ్యం అయాచితంగా నా కళ్ళబడిపోయింది. ఆ దృశ్యం గుర్తుకొచ్చినప్పుడల్లా ఇప్పటికీ నా తల వెంట్రుకలు నిక్క బొడుచుకుంటాయి.

పంకజం మాస్టారుని భర్త వదిలేశాడు. జయతోనూ, సుజాతతోనూ ఆవిడ ఒంటరిగా వుండేది. దరిమిలా ఆవిడకు ఆకాశరామన్న లవ్‌లెటర్లు వస్తూ వుండేవి. గోవిందరావు

మాస్టారు ఒకసారి సంతకంతో ఆవిడకు లవ్‌లెటర్ రాసి రసాభాస కావడం మా స్టూడెంట్స్ అందరికీ తెలుసు. ఆ రోజు పంకజం మాస్టారు గోవిందరావు మాస్టార్ని స్కూల్లో చెప్పుతో కొట్టేంత పని చేసింది. గోవిందరావు మాస్టారు పిల్లల గలవాడు కాబట్టి ఆయన్ని దయవుంచి క్షమించేయమనీ, హెడ్ మాస్టరుకీ, డి.ఇ.ఓ.కీ రిపోర్టు చేయవద్దనీ తతిమ్మా టీచర్లు ఆవిడ్ని బతిమాలి ఇద్దరి మధ్యా రాజీ కుదర్చడం నా కళ్ళముందే జరిగింది. ఆ రోజు పంకజం మాస్టారు మాకు ప్రైవేట్ చెప్పలేదు. రోజంతా ఏడుస్తూనే వుండిపోయింది. మేమంతా ఇంటి పంచలో బిక్కమొహమేసుక్కూచుని అక్కడే వుండాలో, ఇంటి కెళ్ళాలో తెలీక అలమటించి పోయాం.

ఇది జరిగిన కొన్నాళ్ళకు నేనో రోజు అందరికంటే పెందరాళే ట్యూషన్ కెళ్ళిపోయాను. అప్పుడు చూశాను కిటికీలోంచి ఆ దృశ్యం. కొత్త మోజు కావడం వల్ల కాబోలు వాళ్ళు కిటికీ తలుపులు వేసుకోవడం మర్చిపోయినట్టున్నారు. జయా, సుజాతా ఏమైపోయారో తెలీదు. అన్నింటికంటే ఆశ్చర్యకరమైన విశేషమేమిటంటే పంకజం మాస్టారు పడుకున్నది మరెవరితోనో కాదు, గోవిందరావు మాస్టారుతో!

వాళ్ళిద్దరూ నన్ను చూడలేదు. నేను వాళ్ళని చూశాను. పంకజం మాస్టారుని పూర్తిగా చూశాను. ఆ రూపంలో ఆవిడ నాకు కాళికాదేవిలా భయం గొలిపింది. ఆవిడతో కలిసున్న గోవిందరావు ఎంచేతనో నాకు కాళికాదేవి మర్దిస్తున్న మహిషా సురుడిలా కనిపించాడు. భయంతో నా కాళ్ళూ, చేతులూ వణికిపోయాయి. అక్కడ్నించి వెనక్కి తిరిగి ఒక్క పరుగు తీశాను. నేనేం చూశానో రమణమూర్తికి కూడా చెప్పలేదు. ఆ దృశ్యం నా మస్తిష్కంలో ముద్రపడి పోయింది. వాళ్ళిద్దరికీ ఎలా కుదిరిందో ఈనాటికీ నాకర్థం కాదు.

మొదట భయం గొలిపినా ఆ దృశ్యం తాలూకు జ్ఞాపకాలు క్రమంగా నేను మగాణ్ణే అనే అనుభూతీ, అలజడీ నాలో కలిగించాయి. రమణమూర్తి ప్రేమే కాదు, నా ప్రేమ కూడా మలినమైందేనని ఆ తర్వాత నిర్ధారణ చేసుకున్నాను. కాలేజీలో చదివే రోజుల్లో సీక్రెట్‌గా ఇద్దరు ముగ్గురమ్మాయిల్ని ప్రేమించాను. అంతా లోగుట్టు పెరుమాళ్ళు కెరుక వ్యవహారమే. ఆ అమ్మాయిల ముందు ఎప్పుడూ బయటపడలేదు. కానీ, పంకజం మాస్టారుని ప్రేమించినంత ఘాటుగా నేనా అమ్మాయిల్ని ప్రేమించలేదు.

అసలదంతా ప్రేమే కాదనీ, అదో రకమైన వెర్రి అనీ వేదవతిని పెళ్ళి చేసుకునేంత వరకూ నాకు అవగాహనకు రాలేదు. మా పెళ్ళికి ముందు వేదవతిని నేను చూడలేదు. సినిమా ఫక్కీలో ప్రేమించి పెళ్ళాడలేదు. మాది పెద్దవాళ్ళు కుదిర్చిన పెళ్ళే. అయినా నేను వేదవతిని ప్రేమించాను. ఆ ప్రేమ అగ్నిపర్వతంలా మహోద్ధృతమైంది కాదు.

హిమాలయాల్లా చల్లనిది. బాధ్యత లేని ప్రేమ ప్రేమ కాదు. ఆ సంగతి నాకు వేదవతితో పెళ్ళయ్యాకే తెలిసింది.

కానీ, ఎంచేతనో నాకు ఆనాటి పంకజం మాస్టారు కళ్ళముందు అలాగే నిల్చిపోయింది. అలా నిలిచిపోవడమే కాదు. ఆ రూపం ఏకాంతంలో ఒక్కోసారి నన్ను రెచ్చగొట్టేది కూడా!

ఎలా వూహించుకున్నానో తెలీదు. పద్దెనిమిదేళ్ళ తర్వాత కూడా పంకజం మాస్టారు ఆనాటి పంకజం మాస్టారు లాగే వుంటుందని వూహించుకున్నాను. అందుకే ఆవిడ్ని చూస్తూనే గుర్తు పట్టలేకపోయాను. ఆ ముసలిరూపం నేను మనసులో ముద్రించుకున్న పంకజం మాస్టారు రూపాన్ని, సమూలంగా ధ్వంసం చేసి పారేసింది. దూదిపింజల్లాంటి ఆ తెల్లని కురులూ, ముడతలు పడిన ఆ మొహమూ, తేజస్సు కోల్పోయిన ఆ కళ్ళూ ఏదో కఠినమైన జీవనసత్యాన్ని నాకు బోధిస్తున్నట్టుగా అనిపించింది. అక్కడ్నించి లేచి వచ్చేస్తున్నప్పుడు గోవిందరావు మాస్టారెలా వున్నారని అడగాలనిపించింది. కానీ, అడగలేకపోయాను.

ఆ ఇంట్లోంచి బయటికొస్తూనే నేను తిన్నగా వూరవతలున్న వాగు ఒడ్డుకెళ్ళి కూచుండిపోయాను. ఆ వాగు ఒడ్డున నేనూ, రమణమూర్తీ ఎన్నోసార్లు ఆడుకున్నాం. ఎన్నోసార్లు వంటిమీద దుస్తులన్నీ విప్పి పడేసి మేమిద్దరమూ ఈదాం. ఇప్పుడూ అదే పని చేయాలనిపించింది. నేను మళ్ళీ ఆ ఒడ్డునే నిలబడి వున్నప్పటికీ కాలప్రవాహంలో చాలాదూరం కొట్టుకుపోయాను. అందుకే మళ్ళీ ఆ వాగులో ఈదలేకపోయాను.

ఆ వూళ్ళో ఇప్పటికి నన్ను గుర్తుపట్టి స్నేహంగా పలకరించింది ఆ వాగు ఒక్కటే ననిపించింది. ఆ వాగునీరు నాకేసి చెయ్యి వూపుతూ గలగలా ముందుకు సాగిపోతున్నట్టని పించింది.

ఈ కొద్దిసేపట్లోనే ఈ వాగులో ఇంత నీరు సాగిపోయింది. ఈ పద్దెనిమిదేళ్ళలోనూ ఈ వాగులో ఎంత నీరు సాగిపోయి వుంటుంది? సాగిపోయిన ఆ నీరంతా ఇప్పుడేమై పోయి వుంటుంది? అంచనా వేయడానికి ప్రయత్నించాను. సాధ్యం కాలేదు.

బాగా పొద్దువాలేంతవరకూ ఆ వాగు ఒడ్డునే కూచుండిపోయి అక్కడ్నించి లేచి వీరాంజనేయ లాడ్జికి వెళ్లాను. ఆ రాత్రంతా నన్నా లాడ్జీ గదిలో దోమలూ, నల్లులూ, జ్ఞాపకాలూ కుట్టికుట్టి బాధించాయి.

మూడు రోజులుండాలనుకున్న వాడ్నల్లా ఆ మర్నాడే ఫస్ట్ బస్సందుకుని మా అత్తవారి వూరెళ్ళి పోయాను.

"దొరగారు అప్పుడే వచ్చేశారేం?" నవ్వుతూ ఎదురొచ్చింది వేదవతి. ఆమెను చూస్తూనే నాకు ప్రాణం లేచివచ్చి నట్టనిపించింది. ఆమెను చూసి ఎన్నో యుగాలైనట్టనిపించింది.

"మళ్ళీ ఆ వూరెళ్ళదల్చుకోలేదు," అన్నాను కుర్చీలో కూర్చుంటూ.

"అదేం?" కనుబొమలు పైకెత్తి అడిగింది.

నేను అటూ ఇటూ చూసి వేదవతిని దగ్గరికి లాక్కున్నాను.

"మనిషి గతంలో బతక్కూడదని ఆ వూరెళ్ళాకే జీవితంలో మొట్టమొదటిసారిగా తెలుసుకున్నాను. ఆ వూరు నా గతం. నా వర్తమానం ఇక్కడుంది. అందుకే పరిగెత్తుకుంటూ ఇక్కడి కొచ్చేశాను," అన్నాను.

"వర్తమానమా?" అడిగింది తను.

"నువ్వు," అంటూ ఆమె పెదవుల మీద మృదువుగా ముద్దుపెట్టుకున్నాను.

*హారిక, 21-9-1990*

# రెండణాల గుగ్గిళ్ళు

రోజూ పొద్దున తొమ్మిదీ తొమ్మిదిన్నర గంటల వేళప్పుడు మా ఆఫీసు గుమ్మాని కెదురుగా ఓ బలహీనమైన గొంతు వినిపిస్తూ ఉండేది. గుగ్గిళ్ళమ్ముకునే ఓ ముసలావిడ గొంతది.

అవి అప్పుడప్పుడే నేను మా సీనియర్ గారి నీడచాటు నుంచి కాలు బయటపెట్టి నాకు నేను సొంతంగా ప్లీడరాఫీసు తెరుచుకున్న రోజులు. కేసులు అంతగా వస్తుండేవి కావు. కాబట్టి ఆఫీసులో అంతగా పని కూడా వుండేది కాదు. వట్టినే గోళ్ళు గిల్లుకుంటూ కూచోవడం దేనికని నేను మరిచిపోయిన చట్టాల్ని తిరిగి అవుపోశన పట్టడానికి ప్రయత్నిస్తూ, వున్న కొద్దిపాటి దావా కట్టల్నే ఒకటికి పదిసార్లు తిరగమోతలేస్తూ మహావిసుగ్గా కాలం వెళ్ళబుచ్చుతున్న రోజులు.

ఆ రోజుల్లో మా సుబ్బారాయుడు కక్షిదార్లకోసం మా ఆఫీసు గుమ్మం దగ్గరే తిష్ట వేసుక్కూచునేవాడు. సుబ్బారాయుడు మా ప్లీడరు గుమాస్తా. నాకు ప్లీడరు గుమాస్తాగా కుదరడానికి పూర్వం మా సీనియరు గారి దగ్గర ముప్ఫై అయిదేళ్ళ సుదీర్ఘమైన సర్వీసు చెల్లించిన పాతఘటం. మేమిద్దరం ఇంచుమించుగా ఒకేసారి మా సీనియరుగారి మీద తిరుగుబాటు జెండా ఎగరేసినవాళ్ళం.

అడ్డాల గోపాలకృష్ణయ్యగారు మొదట్నించీ పెద్ద దుర్వాస మహామునీంద్రుడే. వయసు పెరిగే కొద్దీ ఆయన్లో ఆ మహర్షికి తోడు విశ్వామిత్రుడూ వగైరా వగైరా ముక్కోపి మహా పురుషులంతా వరసపెట్టి జత కలవడం మొదలెట్టడంతో ఆయన చుట్టూతా వున్న మాబోటి సామాన్య జీవులెవరూ తట్టుకోలేకపోయారు. దరిమిలా ఆయన జూనియర్లంతా ఒక్కొక్కరే ఆయనగారి ఆఫీసునుంచి బిచాణా ఎత్తేయడం మొదలెట్టారు. నేనొక్కణ్ణీ ఎలాగో చివరిదాకా లంగరేసి ఓడ నిలబెట్టడానికి ప్రయత్నించాను గానీ నాకూ సాధ్యం కాకుండా పోయింది. మేమే కాదు, ఎంతోకాలంగా ఆయన చేత దావాలు జరుపుకుంటూ వచ్చిన పాత కక్షిదార్లు కూడా ఆయన దగ్గర్నుంచి తమ దావా కట్టలు తీసుకుని ఉడాయించేశారు. కొందర్లో వయసు పెరగడం అనేది రకరకాల ట్రిక్కులూ మేజిక్కులూ చేస్తూ వుంటుంది.

అద్దాల గోపాలకృష్ణయ్యగారి విషయంలో కూడా అదే రసాయనిక ప్రక్రియ జరిగింది. చివరికి ముప్ఫై అయిదేళ్ళుగా ఆయన్నే నక్షత్రకుడిలా నమ్ముకున్న అనుంగు శిష్యుడు సుబ్బారాయుడు కూడా ఆయన మీద తిరుగుబాటు జెండా ఎగరేసి అక్కడినుంచి బయటికొచ్చేశాడంటే పరిస్థితి ఎంతదూరం పోయిందీ సులువుగా వూహించుకోవచ్చు.

గోపాలకృష్ణయ్య గారిని వదిలేశాక సుబ్బారాయుణ్ణి పట్టగలగడం నేను సాధించిన ఘనవిజయంగా చెప్పుకోవచ్చు. అక్కడ్నించి వచ్చేశాక ఇంక తానే ఆఫీసులోనూ చేరదల్చుకోలేదని వాలెంటరీ రిటైర్మెంటు ప్రకటించేశాడు సుబ్బారాయుడు. అలాంటి మనిషిని బతిమాలుకునీ బామాలుకునీ నా ఆఫీసులో చేర్చుకునేసరికి ఓ అశ్వమేథ యాగం పూర్తి చేసినంత పనయ్యింది.

మేమిద్దరం జట్టు కట్టాక మా ఆఫీసుకు సంబంధించి కొన్ని నియమాలు పెట్టుకున్నాం. గోపాలకృష్ణయ్యగారి పార్టీలు తమంతట తాముగా మాకోసం వస్తే సమస్య లేదుగానీ మా అంతట మేముగా అక్కడ్నించి ఎవర్నీ ఎగరేసుకురావడం చెయ్యగూడదనేది ఆ నియమాల్లో మొట్టమొదటిది. దానివల్ల మేము అపరాధభావం నుంచైతే తప్పించుకోగలిగాం కానీ మా ఆఫీసులో పని మాత్రం మందకొడిగా వుండిపోయింది. ఆనాటి ఇబ్బందులన్నింటినీ అధిగమించి ఇప్పుడేదో మా పడవ సజావుగానే సాగిపోతోంది గానీ అది వేరే సంగతి.

మా పడవ ఆటుపోట్లకు గురవుతూ వుండిన రోజుల్నాటి సంగతి చెబుతున్నాను గదూ? అప్పట్లో ప్రతిరోజూ క్రమం తప్పకుండా మా ఆఫీసు గుమ్మానికెదురుగా నిలబడి తను చేసిన గుగ్గిళ్ళు కొనండని బలహీనంగా అరిచే ఆ ముసలావిడ కంఠశోష నేను గమనించేవాణ్ణి కాదు. నేనే కాదు, మా సుబ్బారాయుడు కూడా గమనించే వాడు కాడనుకుంటాను.

రోజూ క్రమం తప్పకుండా జరిగే కొన్ని విషయాలకు ఓ గుణం వుంటుంది. వాటినెవరూ గమనించకపోయినా వాళ్ళకు తెలీకుండానే అవి వాళ్ళ మనసుల్లో రికార్డయి పోతాయి. ఏదో ఓ రోజున ఆ క్రమం తప్పినపుడు కారణం తెలీకుండానే ఆ రోజేదో వెలితిగా వుంటుంది.

ఆ ముసలావిడ విషయంలో కూడా మాకు సరిగ్గా అలాగే జరిగింది.

మేము ఆఫీసునుంచి బయల్దేరి కోర్టుకు వెళ్ళేముందు వినిపించే ఆ ముసలావిడ గొంతు ఓ రోజున మాకు వినిపించలేదు. ఆ గొంతు వినిపించినప్పుడు ఎలాగైతే మేమది గమనించలేదో అది వినిపించనప్పుడు కూడా అలాగే గమనించలేకపోయాం. గమనించడానికైనా అదేపాటి గొప్ప విషయం గనక? ఎవరో ముసలావిడ. దారే పోతూ మా ఆఫీసు ముందు నిలబడి గుగ్గిళ్ళు కొనమని అరుస్తుంది. అందులో విశేషం యేముంది?

అయితే కోర్టుకు బయల్దేరే ముందు నా బుర్రలో యేదో జోరీగ కదలనారంభించింది. ఏమిటది? ఏదైనా ముఖ్యమైన పని మర్చిపోయానా? ఎవరైనా ముఖ్యమైన వ్యక్తి నన్ను కలుసుకోడానికి వస్తానని రాలేదా? అలాంటిదేమీ వున్నట్టు లేదే!

నేను సుబ్బారాయుడి వైపు చూశాను. తను కూడా దాదాపు అదే సందేహంలో పడి కొట్టుకుంటున్నట్టుగా నాకనిపించింది. ఆఫీసుకు తాళం వేస్తున్నప్పుడు కూడా మేమా పరధ్యానంలోనే పడున్నాం. కోర్టుకు వెళ్ళి మా పనుల్లో మేము మునిగిపోయాక ఆ విచిత్రమైన ఫీలింగు దానంతటదే సద్దు మణిగిపోయింది.

ఆ రోజున ఆ విచిత్రమైన ఫీలింగు నాకెందుకు కలిగిందో ఆ మర్నాడు గానీ నాకు అవగాహనకు రాలేదు. రోడ్డున వెళ్తూ ఓ మొహాన్ని చూస్తాం. అది మనకెంతో పరిచయమైన మొహంలా కనిపిస్తుంది. అయితే ఆ మొహాన్ని మనం ఎక్కడ చూశామో మాత్రం చచ్చినా గుర్తుకు రాదు. ఆ రోజంతా మనల్నా విషయం బాధపెడుతూనే వుంటుంది.

ఆ తర్వాత మళ్ళీ ఎప్పుడో అదే మొహం మనం తరచుగా చూసే చోట అకస్మాత్తుగా దర్శనమిస్తుంది. 'వార్నీ! ఈ మొహాన్నా నేనా రోజు గుర్తు పట్టలేకపోయాను!' అనుకుంటూ మనకు మనమే అప్రయత్నంగా ఓ జల్లకాయ వేసుకుని నాలుక్కొరుక్కుంటాం. ఆ మర్నాడు పొద్దున యధాప్రకారం ఆ ముసలావిడ గొంతు మా ఆఫీసుగుమ్మం ముందు వినిపించడంతో నేనూ అలాగే నాలిక్కొరుక్కుంటూ జల్లకాయ వేసుకున్నాను. 'ఈ గొంతు వినిపించకేనా నిన్న యేదో పోగొట్టుకున్న అనుభూతి కలిగింది!' అనుకుంటూ నాలో నేనే నవ్వుకున్నాను. మంచి డిటెక్టివ్ నవల చివర పేజీల్లో మిస్టరీ అంతా విడిపోయి హంతకుడెవరో తెలిసిపోయినట్టుగా మనసు తేలిక పడిపోయింది. అదే సమయంలో కొన్ని చిన్న చిన్న విషయాలు మనకు తెలీకుండానే యెలాంటి ప్రభావం చూపిస్తాయో గదా అని ఆశ్చర్యం కూడా వేసింది.

సుబ్బారాయుడు కూడా నాలాగే ముసిముసిగా నవ్వుకుంటున్నాడు. తను కూడా పడక్కుర్చీ వదలకుండానే హంతకుణ్ణి పట్టుకున్న అపరాధ పరిశోధక సాహితీ పాతకొత్తముడిలాగే ఆనందపడిపోతున్నాడు.

గుమ్మం బయట నుంచున్న ఆ ముసలావిడ గొంతు మళ్ళీ వినిపించింది.

"అలసంద గుగ్గిళ్ళు నాయనా! కొంటారా?"

సుబ్బారాయుడు చిరునవ్వుతో తను కూచున్న చోటునుంచే వద్దన్నట్టు తల అడ్డంగా వూపాడు.

"మంచి గుగ్గిళ్ళు నాయనా! చానా బాగుంటాయ్. రెండణాలవి కొను తండ్రీ!" బతిమాలుకుందామె.

ఆ గొంతు ఇదివరకటికంటే బలహీనంగా వుంది. ఆపైన వణుకుతున్నట్టుగా నాకు కొంచెం తమాషాగా అని పించింది. అణాల భాష పోయి అప్పటికే చాలా కాలమైపోయింది.

సుబ్బారాయుడికి కూడా నాలాగే అనిపించిందిలా వుంది.

"ఇంకేడి రెండణాలు ముసిల్దానా? నువ్వే కాలంనాటి సంగతి మాట్లాడుతున్నావ్?" అన్నాడు.

దానికా ముసలామె యేదో సమాధానం చెప్పింది. అయితే ఆ సమాధానం నేను కూచున్న చోటికి వినిపించలేదు. ఆమె గుమ్మానికవతల నిలబడి వుండడం వల్ల ఆమె మొహం కూడా నేనున్న చోటికి కనిపించడం లేదు. రోజూ ఆమె గొంతు వింటం తప్పిస్తే ఆ ముసలామె మొహం నేనెప్పుడూ చూడలేదని నాకప్పుడే తట్టింది.

సుబ్బారాయుడు యేవనుకున్నాడో యేమో, ఆ ముసలామెని లోనికి రమ్మని జేబులోంచి ఓ పావలా బయటికి తీశాడు. దాంతో ఆమె యెలా వుంటుందో చూడాలనే కుతూహలంతో నేను చేతుల్లో వున్న పుస్తకం లోంచి చూపులు సజావుగా గుమ్మం వైపు సారించాను.

ఓ చేతిలో వెడల్పాటి సత్తు పళ్ళెంతో ఆ ముసలామె లోపలికి అడుగు పెట్టింది.

ఆ రూపం నాకు నిజంగా జాలి కలిగించింది. ఎనభై ఏళ్ళకు తక్కువ వుండవా ముసలామెకు. తల ముగ్గుబుట్టలా నెరిసిపోయింది. చర్మం ముడతలు పడిపోయి కొన్ని చోట్ల ఎముకలకు సంచిలా వేలాడుతోంది. చూపు సరిగ్గా ఆనుతున్నట్టుగా లేదు. గుమ్మం దగ్గర చూసి చూసి జాగ్రత్తగా లోపలికి అడుగు పెట్టింది. మనిషి రెపరెపా వణికిపోతోంది. ఆమె దగ్గర చేతి కర్ర కూడా లేదు.

సుబ్బారాయుడిచ్చిన పావలా అరచేతిలో వుంచుకుని ఆమె చాలాసేపు దాన్ని పరిశీలనగా చూసింది. ఆ తర్వాత తల పైకెత్తి, "ఇదెంత నాయనా?" అనడిగింది.

"పావలా!" చెప్పాడు సుబ్బారాయుడు.

ఆమె తృప్తి పడ్డట్టు తలాడించి వంట్లో సత్తువ లేక చేతిలో పళ్ళెంతో పాటు నెమ్మదిగా నేలమీద కూలబడింది. తర్వాత ఆ పళ్ళెంలోనే పెట్టుకున్న ఓ కాయితాన్ని బయటికి లాగింది. అది ఒకానొకప్పుడు యేదో నోటు పుస్తకంలో చోటు చేసుకున్న రూళ్ళ కాయితం. ప్రస్తుతం శిథిలావస్థలో వుంది. ఆమె వణుకుతున్న చేత్తో ఇన్ని గుగ్గిళ్ళు తీసి ఆ కాయితంలో పోసింది.

"పావలాకి అన్నేనా గుగ్గిళ్ళు?" అన్నాడు సుబ్బారాయుడు.

దాంతో ఆమె సందేహంగా కళ్ళప్పగించి చూసి మరికొన్ని గుగ్గిళ్ళు అందులో పోసింది.

"అన్నేనా?" మళ్ళీ అన్నాడు సుబ్బారాయుడు.

ముసలామె ఇంకొన్ని గుగ్గిళ్ళు అందులో పోసింది.

సుబ్బారాయుడు నవ్వేశాడు.

"ముసిల్దానా, ఇట్లా అడిగేకొద్దీ పావలాకు ఇన్ని గుగ్గిళ్ళు ఇచ్చినావంటే నువ్వారిపోతావ్," అన్నాడు.

దానికి ముసలామె మొదటిసారిగా నవ్వింది.

"ముసల్దాన్ని, నన్నెవరు మోసం చేస్తారు నాయనా?" అంది.

"అదే పొరపాటు. లోకంలో మోసగాళ్ళకి కరువా?" అన్నాడు సుబ్బారాయుడు.

"పోన్లే నాయనా, నా కొడుక్కే ఇచ్చాననుకుంటాను," అందామె.

ఆ మాటకు సుబ్బారాయుడు దగ్గర జవాబే లేకపోయింది.

మాట్లాడకుండా జేబులోంచి మరో పావలా తీసి ఆమెకిచ్చాడు.

"వుంచుకో! నువ్విచ్చిన గుగ్గిళ్ళు అర్ధరూపాయివై వుంటాయి," అన్నాడు.

ఆమె కృతజ్ఞతపూర్వకంగా ఆ పావలా అందుకుని సత్తుపళ్ళెంలో పడేసుకుంది.

సుబ్బారాయుడు రెండు గుగ్గిళ్ళు నోట్లో వేసుకుంటూ, "సర్లేగానీ, నిన్న నువ్వు దేనికి రాలా?" అంటూ ఆరా తీశాడు.

"యేం చెప్పేది నాయనా! జ్వరం వచ్చింది. నిన్నంతా కదల్లేక పోయాను," అంది ఆయాస పడుతూ.

ఆమె ధోరణి చూస్తే ఆమె ఇప్పుడు కూడా జ్వరంతో బాధ పడుతోందనిపించి నా గుండె కరిగిపోయింది.

"ఈ వయసులో నీకీ బాధలేంది ముసిల్దానా? నీకు కొడుకుల్లేరా?" అనడిగాడు సుబ్బారాయుడు.

"వున్నాడు నాయనా, ఓ కొడుకున్నాడు."

"మరి నిన్నిలా వదిలేసి వాడేం చేస్తున్నాడు?"

ముసలామె తన కథ ఏకరువు పెట్టేసింది.

ఆమె కథ ఎంతమాత్రమూ అసాధారణమైంది కాదు. అందులో చిత్ర విచిత్రాలు యే కోశానా లేవు. అతి సాధారణమైన కథ ఆ ముసలామెది. అందులో కొత్తదనం ఎక్కడా లేదు. నేను పుట్టి బుద్ధెరిగాక అలాంటి కథలు యెన్నో విన్నాను. అయినా ఎప్పటికప్పుడు ఎవరికైనా మనసు స్పందింపజేసే దయనీయమైన కథ అది. మనం యెలాంటి మనుషుల మధ్య బతుకుతున్నామో అనిపింపజేసే కథ.

చెప్పడానికి పెద్దగా యేమీ లేదు. నా మాటల్లో నేనా కథ చెప్పినా అంత వినదగ్గదిగా వుండదు. ఆ కథ ఆమె నోటివెంటే వినాలి. అది వట్టి కథ కాదు. అది జీవితం. ఈ లోకంలో ప్రతి మనిషీ ఒక కథలో జీవిస్తాడు. ఆ కథ అతని నోటి వెంటే వినాలి.

అప్పుడు మనం కూడా ఆ కథను అనుభవించగలుగుతాం. ఆ కథలో జీవించిన వ్యక్తుల్ని సరిగ్గా అర్థం చేసుకోగలుగుతాం. అయినప్పటికీ ఇక్కడ నేనా ముసలామె కథ చెప్పవలసిందే గనక చెప్పదల్చుకున్నాను.

ఆ ముసలామెకు ఒక్కడే కొడుకు. ఆ కొడుకు చిన్నవాడుగా వున్నప్పుడే ఆమె భర్త పోయాడు. అష్టకష్టాలూ పడి ఆమె ఆ కొడుకుని పెంచింది. అతన్ని చదివించింది. తన బతుకు తాను బతగ్గల యోగ్యత అతనికి కల్పించింది. ఆ తర్వాత అతనికి పెళ్ళి చేసింది. ఆ వచ్చిన కొత్త కోడలికి ఈ ముసలమ్మ తమ ఇంట్లో వుండడం నచ్చలేదు. కోడలికి తను నచ్చలేదు కాబట్టి కొడుక్కీ నచ్చలేదు. అక్కడ పడవలసినన్ని బాధలూ పడి చివరికి తాను కన్న కొడుక్కి బరువు కావడం ఇష్టం లేక ఆ ఇంట్లోంచి వచ్చేసింది. అప్పట్నుంచీ ఇలా గుగ్గిళ్ళమ్ముకుని బతుకు వెళ్ళబుచ్చుతోంది.

"నీ కొడుకు నిన్ను చూడ్డానికెప్పుడూ రాడా?"

ఆ ప్రశ్నకు ఆమె సూటిగా సమాధానం చెప్పలేదు.

"నేనేడున్నానో తెలిస్తే గదా నాయనా వస్తాడు," అంది.

ఈ పరిస్థితుల్లో కూడా తన కొడుకు మీద చాడీలు చెప్పడం ఆమెకిష్టం లేదని మాకర్థమైంది. ఎంతైనా ఆమెది కన్న కడుపు. ఆ ప్రేమకు సాటి రాగల ప్రేమ సృష్టిలో మరొకటి లేదు. అయినప్పటికీ ఆమె చెప్పిన ఆ ఒక్కమాట నాకు చాలా విషయాలు తెలియజేసింది. తల్లి ఇంట్లోంచి వెళ్ళిపోయాక ఆమె ఏమైందో తెలుసుకోవడానిక్కూడా ఆ కన్నకొడుకు ప్రయత్నించలేదు.

ఆమె చెప్పిన మాటలు వింటుంటే నా మనసుకేదో స్ఫురించింది. ఎంతైనా నాది లాయరు బుర్ర కదా!

"చూడవ్వా, నీ కొడుకు యేం చేస్తుంటాడు?" వాళ్ళ సంభాషణలో మొట్టమొదటి సారిగా కలగజేసుకుంటూ అడిగాను.

"జవుళీ వ్యాపారం నాయనా," చెప్పిందామె.

జవుళీ వ్యాపారం!

అంటే బాగా లాభసాటి వ్యాపారమే! ముసలామె కొడుకుని బాగానే పైకి తెచ్చింది.

"చూడవ్వా, ఈ వయసులో నీ మంచిచెడ్డలు చూడాల్సిన బాధ్యత నీ కొడుకుది. అతను నిన్ను పట్టించుకోకపోతే నువ్వు కోర్టుకెళ్ళొచ్చు. నీ కొడుకు నువ్వు బతకడానికి సరిపడా భృతి కల్పించే యేర్పాటు నేను చేస్తాను. యేమంటావ్?" అన్నాను.

నేను చెప్పిన మాట వింటూనే ఆ ముసలామె ఒక్కక్షణం మాట పడిపోయినట్లుగా చూసింది. అంతలోనే ఆమె మొహంలో నామీద పట్టరానంత ఆగ్రహం తొంగి చూసింది.

"వద్దులే బాబూ వద్దులే. నేను కొడుకుని కనింది కోర్టుల చుట్టూ కచేరీల చుట్టూ తిప్పేదానిక్కాదు. వాడు యేడున్నా చల్లంగా వుంటే చాలు," తీవ్రంగా అనేసింది.

వూహించని ఆ తిరుగుబాటుకి నేను ఖంగు తినేశాను.

"అది కాదవ్వా, నేను చెప్పేది నీ మంచికోసమే," నన్ను నేను సమర్థించుకుంటూ బింకంగా అన్నాను.

"నా మంచి నాతోనే వుండనీలే నాయనా!" అంటూ ఆమె ప్రయత్నం మీద లేచి నిలబడింది.

నేనూ సుబ్బారాయుడూ ఒకరి మొహం ఒకరం చూసుకున్నాం. ఇంక ఆ విషయం గురించి ఆమె ముందు ప్రస్తావించవద్దని సలహా ఇస్తున్నవాడిలా చూశాడు సుబ్బారాయుడు. దాంతో నేను మెదలకుండా వుండిపోయాను.

ఆమె తన సత్తుపళ్ళెంతో పాటు వెళ్ళబోతూ ఆగిపోయి వెనక్కి తిరిగింది.

ఇప్పుడామె మొహంలో ఇందాకటి కోపం కనిపించలేదు. బతిమాలుకుంటున్నదానిలా దీనంగా చూసింది నావైపు.

"జ్వరంలో వూరంతా తిరగలేను నాయనా, గుగ్గిళ్ళు బాగుండాయ్. రెండణాలవి తీస్కో" అంది ఆశగా.

"ఛట్, మళ్ళా అణాలంటావ్!" అంటూ నవ్వాడు సుబ్బారాయుడు.

ఆమె ఆ నవ్వుని పట్టించుకోలేదు. వున్నచోటే నిలబడి నావైపు అలాగే చూస్తోంది.

ఆ వేడుకోలుకు యేం చెప్పాలో కొద్ది క్షణాలు నాకు తోచలేదు. కాసేపు జేబు తడుముకుని అందులోంచి ఓ రూపాయిబిళ్ళ బయటికి తీశాను.

"నేను గుగ్గిళ్ళు తిననల్లే అవ్వా, ఇదుంచుకో," అంటూ చెప్పరానంత ఉదారంగా ఆ రూపాయిబిళ్ళ ఆమెకు ఇవ్వబోయాను.

ఆమె కళ్ళలో వెంటనే ఒకవిధమైన నిరాశ అలుముకుంది. అంతలోనే మళ్లీ ఆశ కూడబలుక్కుంటున్నట్టుగా చూసింది.

"నేను అడుక్కునేదాన్ని కాను నాయనా. నేను చేసిన గుగ్గిళ్ళు చానా బాగుంటాయి, తిని చూడు. ఒక్క రెండణాలవి తీస్కో చాలు," అంది.

నా గుండె ఒక్కసారి దిగజారిపోయింది. నేను చేసిన వెధవ పనికి నన్ను నేనే తిట్టుకున్నాను.

ఆమె స్థానంలో మరొకరుంటే యేం చేసి వుండేవారో నాకు తెలీదు. బహుశా ఆ రూపాయి తీసుకునే వారేమో! అయితే ఆత్మగౌరవంతో స్వశక్తిమీద ఆధారపడి బతికేవాళ్ళకి అలా ఉచితంగా డబ్బివ్వబోవడం వాళ్ళని నిలువునా అవమానించడమేనన్న ఇంగితజ్ఞానం

లేకపోయినందుకు నాలో నేనే కుంచించుకుపోయాను. ఆ ముసలామె ఆ రూపాయిని తిరస్కరించడం ఆమె పట్ల నాకు అంతులేని గౌరవం కలిగేలా చేసింది.

"అరెరె, క్షమించవ్వా! వూరికే తీసుకోవద్దులే! ఈ రూపాయికి గుగ్గిళ్ళే ఇవ్వు," నా తప్పు సరిదిద్దుకుంటూ అన్నాను.

ముసలామె మొహం వికసించింది.

"మా నాయనే! ఇవుగో తండ్రీ తీస్కో, కమ్మటి గుగ్గిళ్ళు కడుపు నిండా తిను!" అంటూ ఓ కాయితంలో ఇన్ని గుగ్గిళ్ళు నాకు పోసిచ్చింది.

ఆ క్షణంలో ఈ ముసలామె ముందు నేను చాలా అల్పుడిననిపించింది. నాకు ఆమె వాత్సల్యానికి ఆనందం వేసింది.

నా చేతుల్లో గుగ్గిళ్లుంచి ఆ ముసలామె సన్నగా వణుకుతూ అక్కణ్ణించి బయటికి వెళ్ళిపోయింది. ఆ కాసేపు ఆమె వెళ్ళిన వైపే పరధ్యానంగా చూస్తూ కూచున్నాం సుబ్బారాయుడు, నేనూ. ఆ తర్వాత నా కళ్ళు నా చేతుల్లో వున్న గుగ్గిళ్ళవైపు మళ్ళాయి.

"తింటావా?" అన్నాను వాటిని సుబ్బారాయుడివైపు చాపుతూ.

"ఇవే నాకెక్కువ," అన్నాడు.

నేను మళ్ళీ నా చేతుల్లోని గుగ్గిళ్ళకేసి పరిశీలనగా చూశాను. నాకు నిజంగానే గుగ్గిళ్ళంటే ఎందుకో సయించదు. వాటినోసారి అయిష్టంగా చూసి ఆ కాయితాన్ని అలాగే మడిచేసి చెత్తబుట్టలో పడేశాను.

అది మొదలు మా ఆఫీసులో నేనూ, సుబ్బారాయుడు ఆ ముసలామె దగ్గర రోజూ తలా ఓ రూపాయికి గుగ్గిళ్ళు కొంటం ఆనవాయితీగా మారిపోయింది. నేను కొన్న గుగ్గిళ్ళు యథావిధిగా చెత్తబుట్టలో చేరిపోయేవి.

డబ్బులే కాదు, ఆమెకు ఉచితంగా యేమిచ్చినా తీసుకునేది కాదు. చివరికి నేను యెప్పుడైనా అవసరం వస్తుందని డెస్కులో దాచిపెట్టుకున్న నాలుగు జ్వరం మాత్రలు తీసివ్వబోయినా ఆమె తీసుకోలేదు.

జీవితం చాలా విశాలమైంది. అందులో యెన్ని సమస్యలకైనా చోటుంటుంది. రోజులు గడిచేకొద్దీ నా సొంత సమస్యలు కూడా పెరిగిపోనారంభించాయి. అవన్నీ చాలినంత డబ్బులు సంపాయించలేకపోవడం అనే ప్రధాన సమస్యనుంచి పుట్టుకొచ్చిన పిల్లలే. దానికదే అదో పెద్ద కుటుంబం.

ఆ సమస్యల్లో పడిపోయి సతమతమై పోతూ ఇంకా ఇంకా కేసులు సంపాయించాలనే తపనలో కొట్టుకుపోతున్న నాకు మరొకరి సమస్యల గురించి ఆలోచించడానికే తీరిక లేకపోయింది. దరిమిలా ఆ ముసలామె దగ్గర రోజుకో రూపాయికి గుగ్గిళ్లు కొంటం తప్పిస్తే ఆమె బాధల గురించి పట్టించుకోలేదు. అలాగే రోజులు గడిచిపోతున్నాయి.

ఒకరోజున ఆ ముసలామె మా ఆఫీసుకి రావడం హఠాత్తుగా ఆగిపోయింది. ఓ మూడ్నాలుగు రోజులు ఆమె గురించి మేము పెద్దగా పట్టించుకోలేదు. అయితే ఆమె కనబడక వారం రోజులైపోయేసరికి యేమై వుంటుందా అనే ఆలోచన వచ్చింది.

"సుబ్బారాయుడూ, ఆ గుగ్గిళ్ళ ముసిలామె యేమైపోయిందో కాస్త విచారించు," అన్నాను.

నేనా పని పురమాయించిన రెండో రోజున సుబ్బారాయుడు ఓ వార్త మోసుకొచ్చాడు.

"ఆ ముసల్దాని పనైపోయింది. ఆమెని ఇంట్లో వుండనిచ్చిన వాళ్ళు ఆమె ప్రాణాలు అక్కడ్నే పోతాయేమోనని చెట్టుకింద పెట్టారు," అన్నాడు.

ఆ మాట వింటూనే ఆమె వారం రోజుల్నుంచీ రాకపోయినా ఆ సంగతి పట్టించుకోనందుకు నేను చాలా గిల్టీగా ఫీలయ్యాను. ఆలస్యం చేయకుండా అప్పుడే ఆమె ఎక్కడుందో చూడ్డానికి సుబ్బారాయుడ్ని వెంట బెట్టుకుని బయల్దేరాను.

మాదింకా పాత వాసనలు వదిలి పెట్టని వూరు. మా ఆఫీసుకు రెండు వీధుల కవతల రచ్చబండ ఒకటుండేది. విశాలంగా కొమ్మలు పరుచుకున్న ఓ మర్రిచెట్టు చుట్టూ ఓ అరుగుండేది. ఆ అరుగు మీద పంచాయితీలు జరగడం ఏ కాలంనాడో ఆగిపోయింది. గచ్చకాయ లాడుకునే వాళ్ళకీ, పేకాట రాయుళ్ళకీ, బీడీ దమ్ము కొడుతూ వూసుపోక కబుర్లు చెప్పుకుంటూ పనీపాటా లేకుండా కూచునే నిక్షేపరాయుళ్ళకీ ఆ అరుగు ఆవాసమైపోయింది. ఆ ముసలామెను ఆ రచ్చబండ మీదికి చేర్చారు. అన్ని రోజులూ ఆమెనెవరో దయతల్చి తమ ఇంటి పంచలో మెట్లకింద చోటుంటే అక్కడ వుండనిచ్చారు. ఆమె గుగ్గిళ్ళు చేసుకునే పొయ్యీ గట్రా ఆ మెట్ల కిందనే వుండేవి. అయితే అక్కడ కూడా ఆమె ఉచితంగా వుండలేదు. నెలకు పది రూపాయల అద్దె చెల్లించేదట!

మేము వెళ్ళేసరికి ఆ ముసలామె వున్న పరిస్థితి చూసి నాకు కడుపులో యేదో ఖాళీ ఏర్పడినట్లనిపించింది. చిరిగిపోయిన ఓ జంపఖాన మీద పడుకుని వుందామె. కాళ్ళూ చేతులూ యెప్పుడో స్వాధీనం తప్పాయి. కుడి చెయ్యి మాత్రం అతికష్టం మీద కదిలించగలుగుతోంది. మనిషి మీద ఈగలు ముసురుకుంటున్నాయి. ఆమె చుట్టూ ఒక విధమైన దుర్గంధం వ్యాపించింది.

మేము వెళ్ళే సమయానికి ఆమె ఇంకా మనుషుల్ని గుర్తు పట్టగలిగే స్థితిలోనే వుంది. మమ్మల్ని చూస్తూనే జీవం కోల్పోయిన ఆమె కళ్ళలో సన్నటి వెలుతురు తళుక్కున మెరవడం నాక్కనిపించింది. అది భ్రాంతో నిజమో ఆ క్షణంలో నాకు తెలీదుగానీ యెందుకో ఆమె మా కోసమే ఎదురు చూస్తోందని అనిపించింది నాకు.

మమ్మల్ని చూస్తూనే ఆమె యేదో చెప్పడానికి ప్రయాస పడనారంభించింది. అదేమిటో వింటానికి నేను బాగా చెవొగ్గాను.

ఆమె నాతో చెప్పింది ఒకే ఒక్కమాట.

"నా కొడుకు కోసం రెండణాల గుగ్గిళ్ళు దాచినాను! అమ్మ యిచ్చిందని వానికియ్యవా."

ఆ మాట వింటూనే నాకు తెలీకుండానే నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఇలాంటి తల్లిని ఆదరించలేకపోయిన ఆ కొడుకు దౌర్భాగ్యానికి అతని మీద జాలితో పాటు పట్టరానంత కోపం కూడా వచ్చింది.

ఆమె చెయ్యి ఆరాటంగా కొద్ది క్షణాలు అటూ ఇటూ కదిలించి ఆ తర్వాత తన పక్కనే ఉన్న ఒక చిన్న మూట మీద ఆమె వేళ్ళు బిగుసుకున్నాయి.

నేనామె ఉద్దేశం యేమిటో గ్రహించి ఆ గుగ్గిళ్ళ మూటని నా చేతుల్లోకి తీసుకున్నాను.

"నువ్వేం బెంగపడకవ్వా, నీ కొడుక్కి ఈ మూట నేనిస్తాలే," అన్నాను.

నేనా మాట చెప్పాక ఆమె మొహంలో అంతులేని ప్రశాంతత ఆవరించుకుంది. తను పోతానని ముందే తెలిసిందాన్లా ఆమె కొడుక్కోసం గుగ్గిళ్ళు మూటకట్టి పెట్టుకోవడం, ఆ తర్వాత నేను తప్పకుండా వస్తాననే నమ్మకంతో నాకోసం ఆమె ఎదురుచూడ్డం నాకంతా యేదో వింతగా అనిపించింది. ఆ మూట నాకివ్వడం కోసమే ఆమె ప్రాణాలు నిలుపుకుందా అని కూడా అనిపించింది.

ఆ తర్వాత ఆమె నాతో మరింకేమీ మాట్లాడలేదు. నాతోనే కాదు, మరెవరితోనూ మాట్లాడలేదు. మాట్లాడ్డానికి ఆమె నోరు పడిపోయింది.

నేనూ సుబ్బారాయుడూ ఆ తర్వాత యేం చెయ్యాలో చర్చించుకున్నాం. ఆ ముసలామె బాధ్యత నేను తీసుకోవడం రిస్కుతో కూడుకున్న పననీ, దానివల్ల ఆ తర్వాత చాలా చిక్కులు రావచ్చనీ సుబ్బారాయుడు వాదించబోయాడు.

"నువ్వేమైనా చెప్పు సుబ్రాయుడూ! ఇది లా పాయింట్ల గురించి మాట్లాడుకునే సమయం కాదు. ఈ ముసలామె దిక్కు లేకుండా ఇలా చచ్చిపోవడం చూస్తూ నేనూరుకోలేను. కనీసం గవర్నమెంటాసుపత్రిలోనైనా ఈమెని చేర్పిద్దాం," అంటూ మొండిపట్టు పట్టాను.

అయితే ఆమెని గవర్నమెంటాసుపత్రిలో చేర్చడం అంత సులభం కాలేదు. ఆమె తరఫున బంధువులెవరూ లేకపోతే తను ఆసుపత్రిలో చేర్చుకోలేనని గవర్నమెంటు డాక్టరు చేతులు కట్టుక్కూచున్నాడు. ఆయన్ని బతిమాలుకునీ బామాలుకునీ ఆమెని నా సొంత బాధ్యత మీద ఆస్పత్రిలో చేర్చేసరికి తల ప్రాణం తోక్కొచ్చింది. అక్కడికీ పోలీసు రెఫరెన్సు తీసుకెళ్తేగాని ఆయన ఆ ముసలామెని  చేర్చుకోలేదు.

ఆ పని పూర్తయ్యాక ఆమె కొడుకు ఎక్కడుంటాడో వెతకాల్సి వచ్చింది. ఆ పనేదో ఆమె ప్రాణాలు పోయే ముందే చేస్తే ఆనక చాలా చిక్కులు తప్పుతాయని సుబ్బారాయుడు సలహా ఇచ్చాడు. అపస్మారక స్థితిలో వున్న ఆమెని ఫొటో తీసి ఆమె కొడుకు ఎక్కడున్నా

రావాల్సిందిగా పేపర్లో ప్రకటన ఇచ్చాం. అయితే దాని వల్ల యేమాత్రం లాభం లేకపోయింది. ఆ ముసలామె కోసం ఎవరూ రాలేదు.

మేము పేపర్లో ఆ ప్రకటన ఇచ్చిన మూడో రోజున ఆ ముసలామె ప్రాణాలు పోయాయి.

అదే జరిగితే యేం చెయ్యాలో నేనూ సుబ్బారాయుడూ ముందే ఆలోచించి పెట్టుకున్నాం కాబట్టి డాక్టరు డెత్ సర్టిఫికెట్ ఇస్తూనే సుబ్బారాయుడు వెళ్ళి అలాంటి అనాథశవాలకు సంస్కారం జరిపేవాళ్ళని పట్టుకొచ్చాడు. వాళ్ళకు తగినంత డబ్బిచ్చి ఆ సంస్కారం యేదో నేనే దగ్గరుండి పూర్తి చేయించాను. ఆమెని స్మశానానికి మోయించడానికి నలుగురు మనుషుల్ని పట్టుకురావడం మేము ఏర్పాటు చేసినవాళ్ళక్కూడా కష్టమైపోయింది.

అది జరిగిన రెండో రోజున కాబోలు అకస్మాత్తుగా ఒకతను మా ఆఫీసులో దిగబడ్డాడు. వస్తూనే మాటా మంతీ లేకుండా, "అమ్మా!" అనేడుస్తూ నా ఎదురుగా కుర్చీలో కూలబడ్డాడు. ఆ ధోరణి చూస్తే అతనే ఆ ముసలామె కొడుకై వుండాలని మాకర్థమైంది.

అతనికి యాభై ఏళ్లుంటాయి. ఎత్తుగా బలంగా వున్నాడు. నిలువెత్తు మనిషి. నా ఎదురుగా కూచుని ఏడుస్తున్నా నాకతని మీద ఎంతమాత్రం జాలి కలగలేదు. మాట్లాడకుండా చూస్తూ కూచున్నాను. అతను పది నిమిషాలసేపు అలాగే ఏడ్చి నెమ్మదిగా తల పైకెత్తి నావైపు చూశాడు.

"ఏదీ మా అమ్మ?" అన్నాడు తుండుగుడ్డతో ముక్కు తుడుచుకుంటూ.

"మీరు చాలా ఆలస్యంగా వచ్చారు," పొడిగా అన్నాను.

అతను కొద్ది క్షణాలు అలాగే మెదలకుండా కూచున్నాడు. ఆ తర్వాత, "మా అమ్మ నాకోసం యేమైనా వదిలి వెళ్ళిందా?" అడగలేక అడుగుతున్నట్లుగా అడిగాడు.

సుబ్బారాయుడు మా ఆఫీసు పక్కనే టీ కొట్లో పనిచేసే ఓ కుర్రాడ్ని కేకేసి పిలిచి ముసలామె మూట కోసం మా ఇంటికి దౌడు తీయించాడు. ఆ మూట నా చేతికి వచ్చినప్పట్నుంచీ దాన్ని మా ఇంట్లోని ఫ్రిజ్‌లో పెట్టాను. ఆఫీసునుంచి మా ఇల్లు ఎక్కువదూరంలో లేదు. సుబ్బారాయుడు పంపిన కుర్రాడు ఆ మూటతో పది నిమిషాల్లో మా ముందు హాజరైపోయాడు.

నా ఎదురుగా కూచున్నతను ఆ మూట రాగానే ఆత్రంగా అందుకుని గబగబా తెరిచి చూశాడు.

"గుగ్గిళ్ళా!" నమ్మశక్యం కానట్టుగా అన్నాడు.

నేను తలూపాను.

"మా అమ్మ మీకేమీ బంగారం ఇవ్వలేదా?"

"బంగారమా!" అన్నాను విస్తుపోతూ.

అతను ఒకేసారి లేచి నిలబడ్డాడు.

"అబద్ధాలాడకండి, మా అమ్మ మీ దగ్గర చాలా బంగారం దాచింది," అన్నాడు కోపంగా.

నాకు వళ్ళు మండిపోయింది.

"షటప్! ఇలాంటి పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడేట్టయితే నా ఆఫీసులోంచి బయటికి నడవండి," తీవ్రంగా అన్నాను.

అతను పోట్లగిత్తలా ఒకేసారి బుసకొట్టాడు.

"మా అమ్మ బంగారం యెలా వసూలు చేసుకోవాలో నాకు బాగా తెలుసు," బెదిరించాడు.

"నీ ఇష్టం వచ్చినట్టు చేసుకోవచ్చు, గెటవుట్!" అరిచాను.

అతను నాకేసి వురిమి చూసి విసురుగా అక్కడ్నించి బయటికి వెళ్ళిపోయాడు.

నేను నెమ్మదిగా మళ్ళీ నా కుర్చీలో కూలబడ్డాను.

ఆ కొద్ది క్షణాల్లోనే నా వంట్లోని ఓపికంతా నశించిపోయి చాలా అలసటగా అనిపించింది. తల్లి బతికుండగా ఆమెని పట్టించుకోకుండా ఆమె పోయాక ఆమె బంగారం కోసం వచ్చిన ఆ కొడుకునేమనాలో నాకర్థం కాలేదు. గుగ్గిళ్ళమ్ముకుని శేషజీవితం గడిపిన ఆ అభాగ్యురాలికి బంగారం కూడానా! తల్లికి కొడుక్కీ ఎంత తేడా!

సుబ్బారాయుడు, 'నేనప్పుడే నిన్ను హెచ్చరించాగా,' అన్నట్టు చూస్తున్నాడు.

నేను గబుక్కున నాకెదురుగా వున్న గుగ్గిళ్ళు దగ్గరికి లాక్కుని వాటిని తినెయ్యనారంభించాను.

నేను గుగ్గిళ్ళు తినటం చూసి సుబ్బారాయుడు విస్తుపోయాడు.

ఆ తర్వాత నేనెప్పుడూ గుగ్గిళ్ళని అసహ్యించుకోలేదు.

రచన మాసపత్రిక

# విషాదగాత్రి

సుగాత్రి జీవితంలో ఎదుర్కోబోతున్న కష్టాలకు ముహూర్తం ఆమె పుట్టినప్పుడు ఏడ్చిన ఏడుపుతో నిశ్చయమైంది. అయితే, ఆ ముహూర్తాన్ని ఏ జ్యోతిష్కుడూ నిశ్చయించలేదనుకోండి, అది వేరే సంగతి.

లోకంలో అందరూ పుట్టేటప్పుడు 'ఉంగా' అని గుక్కపెట్టి ఏడుస్తారు. అయితే, సుగాత్రి అలా ఏడవలేదట! ఆమె అచ్చంగా భైరవిలో ఏడ్చిందని ఆమె అమ్మమ్మ ఆ రాగాన్ని గుర్తుపట్టి చెప్పింది. ఆ మాటకు అప్పట్లో అందరూ నవ్వేశారు. ఆ తర్వాత కూడా చాలా ఏళ్ళదాకా ఆ విషయాన్ని ఆ కుటుంబంలో జోక్‌గా చెప్పుకునేవారు. అయితే సుగాత్రీ వాళ్ళ నాన్నగారు మాత్రం అత్తగారి మాటను సీరియస్‌గా తీసుకుని లేక లేక కలిగిన ఒక్కగానొక్క కూతురికి 'సుగాత్రి' అని పేరు పెట్టారు.

సుగాత్రీ వాళ్ళది వైదిక బ్రాహ్మణ కుటుంబం. ఆ కుటుంబంలో అంతా వేదం చదువుకున్నవాళ్లూ, రామాయణం పారాయణం చేసినవాళ్ళే తప్ప, సంగీత జ్ఞాన సంపన్నులంటూ ఎవరూ లేరు. సుగాత్రీ వాళ్ళ అమ్మమ్మకు మాత్రం సంగీతం పట్ల బోలెడు అభిమానం ఉండేది. ఆవిడ తమ ఊళ్లో ప్రతి ఏటా పెద్ద ఎత్తున జరిగే త్యాగరాజ స్వామి ఆరాధ నోత్సవాలకు క్రమం తప్పకుండా తప్పనిసరిగా హాజరయ్యేది. సుగాత్రి భైరవిలో ఏడ్చిందని ఆవిడ చెప్పినప్పుడు 'ముసలావిడ చాదస్తం కొద్దీ అలా చెబుతోం'దని సుగాత్రి తండ్రి తప్ప అందరూ కొట్టి పారేశారు. కాని ఆవిడ మాట భవిష్యత్తులో నిజం కాబోతోందని ఎవరూ ఊహించలేదు. సుగాత్రి సంగీతం పట్ల అభిరుచి చూపించడమే కాదు – గొప్ప గాయకురాలు కూడా అయిపోయింది.

కూతురికి సహజంగా అబ్బిన సంగీతాభిమానం చూసి సుగాత్రి తండ్రి చాలా సంబరపడిపోయాడు. చాలా చిన్న వయసులోనే ఆమెను తమ ఊళ్లో బాగా పేరున్న సంగీత విద్వాంసుడి దగ్గర శిష్యురాలుగా చేర్పించారు. సుగాత్రి కంఠం అచ్చం కోకిల గొంతులా శ్రావ్యంగా ఉండడం చూసిన ఆమె గురువుగారు ఆమె తండ్రితో, "సుగాత్రి

నిజంగా సుగాత్రేనయ్యా! సార్థక నామధేయురాలు. ఇంకా ముడి వజ్రమేననుకో, సానబెడితే గొప్పగా ప్రకాశిస్తుంది," అని చెప్పారు.

గురువుగారు చెప్పినట్లే జరిగింది. ఎనిమిదేళ్ళ వయసులోనే తమ ఊరి రామాలయంలో ఆమె మొట్టమొదటిసారిగా సంగీత కచేరీ చేసింది. మొదటినుండి మంగళం పాడేదాకా, సుగాత్రి గాన మాధుర్యంతో కచేరికి వచ్చిన వాళ్ళను మంత్రముగ్ధుల్ని చేసింది. ఆమె పాడుతున్నంతసేపూ ఏ ఒక్కరూ కూర్చున్న చోటునుంచి కదల్లేకపోయారు. ఆ రోజున ఆమెకు లభించిన ప్రశంసావర్షం అంతటితోనే ఆగిపోలేదు – రోజులు గడుస్తున్నకొద్దీ మరింత ఉధృతంగా కురుస్తూనే ఉంది.

క్రమంగా ఆంధ్ర రాష్ట్రం నలుమూలలకూ ఆమె కచేరీలు పాకిపోయాయి. ఆమె తియ్యని గొంతు వినడానికి జనం పెద్ద సంఖ్యలో రానారంభించారు.

ఆమె గురువుగారు ఆ సమయంలో ఆమెకు ఒకటే చెప్పారు. "చూడు సుగాత్రీ! ఇప్పుడు నీకు లభిస్తున్న ప్రశంసలు నిన్ను తప్పుదారి పట్టించే అవకాశం ఉంది. ప్రశంసవల్ల మనిషికి అహంకారం పెరిగే ప్రమాదం ఏర్పడుతుంది. ఒక్క విషయం ఎప్పుడూ గుర్తుంచుకో – నీ పాట విని ఎవరైనా నిన్ను మెచ్చుకుంటే అది అహంకరించాల్సిన సమయం కాదు, నీ పాటను మరింత మెరుగు దిద్దుకోవలసిన సమయం. ఈ లోకంలో ఇంతవరకూ ఎవరూ సంపూర్ణ విద్వాంసుడు కాలేదు, కాలేడు కూడా. అయినా సంపూర్ణ విద్వత్తు సంపాయించుకోవడానికే ప్రతి విద్వాంసుడూ ప్రయత్నిస్తాడు. నీ గమ్యం కూడా అదే కావాలి. ఈ లలితకళ నీలో ఇంకా పూర్తిగా వికసించలేదు. అందుకు సమయం పడుతుంది. నువ్వు సాధన చెయ్యాల్సిందింకా చాలా ఉంది."

సుగాత్రికి అంతంత పెద్ద మాటలు పూర్తిగా అర్థం చేసుకోగల వయసు ఇంకా రాలేదు. అయినా అదంతా తనకు అర్థమైనట్టే వినయంగా తలూపింది.

గురువుగారు తమ హితబోధ అంతటితో ఆపలేదు. "సంగీత సాధన పట్ల నీకు శ్రద్ధా, నీలోని ఉత్సాహమూ చూసి ఇంత చిన్న వయసులోనే కచేరీలు ఇవ్వడానికి అనుమతించాను. ఇప్పుడు నిన్ను హెచ్చరించకుండా ఉండలేను. ఎదుటివారిని నీ పాటతో మెప్పించగలగడం గొప్ప సంగతే. కానీ ఎదుటివారిని మెప్పించడం ఒక్కటే సంగీతానికి పరమావధి కాదు. ఆత్మానందానికి సంగీతం ఓ గొప్ప సాధన. ఆ రహస్యం అర్థం చేసుకోగలిగిననాడే నువ్వు గొప్ప విద్వాంసురాలివి కాగలవు," అన్నారు.

ఆ మాటల్లో సుగాత్రికి అర్థమైనవి రెండే రెండు విషయాలు – 'నువ్వు సాధన చెయ్యాల్సిందింకా చాలా ఉంది. నీకున్న శ్రద్ధా, ఉత్సాహమూ చూసే కచేరీలు ఇవ్వడానికి అనుమతించాను,' అనేవి.

ఆ మాటలకు అర్థం తెలికే – తను కచేరీలు బాగా తగ్గించుకోవాలి; సంగీత సాధనకు సమయం ఇంకా కేటాయించాలి. ఆమె అలా చేయడానికే నిశ్చయించుకుంది. ఆమె తండ్రి ఆమె నిర్ణయానికి అడ్డు రాలేదు.

కాలం గడుస్తోంది. కాలంతో పాటు సుగాత్రి సంగీత సామర్థ్యం కూడా వికసిస్తోంది.

క్రమంగా గురువుగారు ఆనాడు తనకు చేసిన హితబోధకు అర్థం ఆమెకు నెమ్మదిగా అవగతమైంది. ఏ కళ అయినా ఆత్మానందం కోసం సాధన చేసినప్పుడే వికసిస్తుంది. కేవలం ఇతరుల్ని మెప్పించడం కోసమో, డబ్బు సంపాదించడం కోసమో కళను మార్గంగా ఎన్నుకుంటే అది తేజస్సునే కోల్పోతుంది. అది మనసులోనే ఆమె ఏర్పరుచుకున్న అభిప్రాయం. ఆ అభిప్రాయంతో ఆమె గురువుగారు చెప్పినట్టు సంపూర్ణ విద్వత్తు సాధించడానికే నిశ్చయించుకుంది. కేవలం కళార్జన ఒక్కటే తన జీవితాశయంగా భావించుకుంది.

అంతవరకూ బాగానే వుంది. కానీ, ఆమె తీసుకున్న ఆ నిర్ణయం ఆమె కుటుంబంలో క్రమంగా కలవరపాటుకు దారి తీసింది.

సుగాత్రి కానీ, ఆమె తండ్రి కానీ గుర్తించలేదు కానీ, ఆమెకు వస్తున్న కీర్తి కుటుంబంలో మిగతావాళ్లెవరకీ నచ్చలేదు – ముఖ్యంగా సుగాత్రి తల్లికి. చివరికి సంగీతం పట్ల వల్లమాలిన అభిమానం ఉన్న సుగాత్రి మామ్మగారు కూడా ఆ విషయంలో బోలెడు సంశయాలు వ్యక్తం చేసింది.

"ఇదేం చోద్యమమ్మా! అమ్మాయి అత్తవారింటికి వెళ్ళేటప్పుడు మా పిల్ల బాగా పాడుతుందండి అని చెప్పుకోవడానికి మీ ఆయన సంగీతం నేర్పిస్తున్నాడనుకున్నానే గానీ, ఇలా పదిమందిలోనూ కూర్చోబెట్టి పాడిస్తాడని అనుకోలేదు," అని ఆవిడ సుగాత్రి మొదటి కచేరి నాడే చెప్పింది.

సుగాత్రి తల్లి మొదట్లో ఆ మాట అంతగా పట్టించుకోలేదు. అయితే సుగాత్రి కీర్తి పెరుగుతున్న కొద్దీ ఆమెకూ రకరకాల భయాలు కలగనారంభించాయి. ఆవిడ దృష్టిలో ఆడపిల్ల అత్తవారింటిని మెప్పించడానికి తప్ప అతిగా ఏదీ నేర్చుకోగూడదు.

సుగాత్రి కచేరీలు తగ్గించుకున్నప్పటికీ ఆమె కీర్తి మాత్రం తగ్గలేదు. పైగా రాను రాను ఆ కీర్తి పెరుగుతోంది కూడా. దాంతో కూతురు తనకు అందకుండా పోతుందేమోనని ఆ తల్లికి దిగులు పట్టుకుంది.

కూతురి ప్రతిభ చూసి తండ్రి మాత్రం మురిసిపోయేవాడు. ఆ ఆనందం చూసి మొదట్లో ఏమనడానికీ ఆవిడ సందేహించేది. కానీ రాను రాను న్యూనతా భావం భరించలేక ఆ

విషయంలో భర్తముందు సణగడం మొదలెట్టింది. సుగాత్రి తండ్రి ఆ సణుగుడు చాదస్తమంటూ నవ్వుతాలగా కొట్టి పారేసేవాడు.

సుగాత్రికి పద్నాలుగో ఏడు దాటిపోయాక ఆమె సంగీత సాధన విషయమై కుటుంబంలో గంభీరమైన వాతావరణం ఏర్పడనారంభించింది. ఆ విషయం ఇప్పుడు సుగాత్రి తల్లిని ఇబ్బంది పెట్టడం మాని ఏకంగా కలవరపెట్టడం మొదలెట్టింది. పదిమందిలోనూ కూచుని పాట పాడే పిల్ల. సుగాత్రిని చేసుకోవడానికి ఎవరు ముందుకొస్తారు? మంచో, చెడో పదిమంది నోళ్ళలోనూ కూతురి పేరు నానడం ఆమెకు బొత్తిగా ఇష్టం లేకపోయింది.

సుగాత్రి పెళ్ళి విషయం ఇప్పుడు ముచ్చట గాదు – సమస్య!

భార్య తన చెవిలో జోరీగలా పోరగా పోరగా, చివరికి సుగాత్రి తండ్రి మెదడులోనూ సందేహం తలెత్తింది. సుగాత్రిని సంగీత విద్వాంసురాలిగా చేయడానికి ప్రయత్నించి తను పొరపాటు చేశాడా? కూతురు ముచ్చట పడితే ఏవో నాలుగు లొల్లాయి పదాలు నేర్పించి సంతోష పెట్టి ఉంటేనే బావుండేదా?

సరే, జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఇకనైనా సుగాత్రి పెళ్ళికోసం ప్రయత్నాలు ప్రారంభించడం మంచిది. ఆయన గట్టిగా ఆ నిర్ణయం తీసుకునే సమయానికి సుగాత్రికి పదహారు సంవత్సరాలు.

తన పెళ్ళికోసం అప్పుడే ప్రయత్నాలు ప్రారంభమైపోయాయని తెలుసుకోలేకపోవడానికి సుగాత్రి చిన్నపిల్ల కాదు. అయితే, ఆ విషయం ఆమెను ఆనంద పరచకపోగా, దిగులు పుట్టించింది. తనలో సంగీతం పట్ల ప్రేమ పెరగడానికి తండ్రి ఇచ్చిన ప్రోత్సాహమే సగం కారణం. అలాంటిది ఆ తండ్రే ఇప్పుడు తన సంగీత సాధనకు ఆటంకం కలిగిస్తున్నాడని ఆమె నిరుత్సాహ పడింది. పెళ్ళి చేసుకుని ఎవరికో భార్యగా బిడ్డల్ని కనివ్వడం కంటే గొప్ప ప్రయోజనం ఏదో తన జీవితానికి ఉందని ఆమె భావం.

కచేరీలు జరిపే విషయంలో తనతో సంప్రదించినట్టుగా పెళ్ళి విషయంలో ఎవరూ తన అభిప్రాయాన్ని కోరలేదు. ఎంత విచిత్రం! నాలుగు గంటలసేపు జరిగే సంగీత కచేరీకి తన అనుమతి కావాలి. ఒక జీవిత కాలాన్ని ప్రభావితం చేసే విషయంలో మాత్రం ఎవరికీ తన ఆలోచనలతో నిమిత్తం లేదు. తన ఇష్టానిష్టాలతో సంబంధం లేదు! ఆ చేదు అనుభూతిని ఆమె తన మనసులోనే దాచుకుంది తప్ప బయటికి వ్యక్తం చేయలేదు. అసలు జరగబోయేది ఆమె పెళ్ళి కాదన్నట్టుగానే పెళ్ళి ప్రయత్నాలు మాత్రం జరిగిపోతున్నాయి. ఆమె కూడా అదంతా తనకు సంబంధించనట్టు మిన్నకుండిపోయి, సంగీత సాధనలోనే మనసు లగ్నం చేయడానికి ప్రయత్నించింది.

రెండేళ్లు అలా పెళ్ళి ప్రయత్నాల్లోనే గడిచిపోయాయి. సుగాత్రికి తగిన సంబంధం ఆ రెండేళ్ళలో ఏదీ రాలేదు. ఒకవేళ వచ్చినా జాతకాలు కలవక తిరిగి వెళ్ళిపోయాయి. చివరికి సుగాత్రి తండ్రికి అర్థమైన నిజమేమిటంటే తన కూతురికి పట్టుబడ్డ అద్భుతమైన కళతో కానీ, ఆమె అందమైన రూపురేఖలతో కానీ ఎవరికీ పని లేదు. తామిస్తామన్న కట్నం సరిపోకనే చాలామంది జాతకాలు సరిపోలేదనే వంక పెట్టి వెళ్ళిపోయారు. కట్నం తర్వాతే సుగాత్రి కంఠ మాధుర్యాన్ని లెక్కలోకి తీసుకోవడానికి వాళ్లంతా ఇష్టపడ్డారు.

ఆ చేదు నిజాన్ని జీర్ణం చేసుకోవడానికి సుగాత్రి తండ్రికి కొంత సమయం పట్టింది. దాంతో ఆయన అహం దెబ్బతిన్నట్టయింది. పూర్వీకుల నుంచి తనకొచ్చిన కొద్దిపాటి మాగాణి తెగనమ్మి సుగాత్రి పెళ్ళి చేయడానికి సంకల్పించాడు.

చివరికి ఎలాగైతేనేం సుగాత్రికి ఓ సంబంధం కుదిరింది. పెళ్ళికొడుకు పేరు వరాహనరసింహశాస్త్రి. డిగ్రీ పాసై రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో చిన్న గుమాస్తాగా పని చేస్తున్నాడు. తమ పుత్రరత్నానికి వచ్చే నెలజీతం కంటే పై ఆదాయమే ఎక్కువని అతగాడి తల్లిదండ్రులు పెళ్ళి చూపుల్లోనే ఘనంగా చెప్పుకున్నారు.

పెళ్ళి నిశ్చయమైన రోజున సుగాత్రి తండ్రి తన కూతురికి కాబోయే అత్తగారి ముందు చేతులు జోడించి ఒక్కటే విన్నవించుకున్నాడు – "మా అమ్మాయికి సంగీతమంటే ప్రాణం. పెళ్ళయ్యాక దానికి తల్లీ, తండ్రీ అంతా మీరే. మేము అప్పుడప్పుడూ వచ్చి చూసి పోయే బంధువులం మాత్రమే అవుతాం. పెళ్ళయ్యాక కూడా దాని సంగీత సాధనకు ఆటంకం రాకుండా ఉండడం కంటే ఎక్కువగా మేము కోరేదంటూ ఏమీ లేదు."

దానికి అక్కడే ఉన్న పెళ్ళికొడుకు తండ్రి – "దానికేం వంటా వార్పూ పూర్తయ్యాక శుభ్రంగా సంగీత సాధన చేసుకోవచ్చు" అన్నాడు.

పెళ్ళికొడుకు తల్లి భర్త మాటకు అడ్డొస్తూ, "ఆc, ఈ సంగీత సాధనలూ, గానా బజానాలూ అన్నీ ఎంతకాలం ఉంటాయిలెండన్నగారూ? నేనూ నా చిన్నతనంలో హార్మోనియం పెట్టె పట్టుకుని పదో మెట్టు దాకా సంగీతం నేర్చుకున్నాను. ఆ తర్వాత మా వరాహం పుట్టగానే ఆవైపే ధ్యాస పోలేదంటే నమ్మండి," అనేసింది.

దానికి సుగాత్రి తండ్రి మరోసారి ఆవిడకు నమస్కారం చేసి, "తమ దయ," అని మాత్రం అన్నాడు.

సుగాత్రి తన గురువుగారికి పూజ చేసి తనకు పెళ్ళి కుదిరిన వైనం చెప్పడానికి వచ్చింది. శిష్యురాలు తెచ్చిన పట్టు పంచె, ఉత్తరీయం అందుకుంటూ ఆయన "శుభ మస్తు" అంటూ దీవించాడు.

ఆ సమయంలో సుగాత్రి ఆయన వంక వింతగా చూసింది.

"ఎందుకమ్మా అలా వింతగా చూస్తున్నావు?" అడిగాడు.

"నాకిప్పుడు పెళ్ళి నిశ్చయం కావడం పట్ల తమ అభ్యంతరం ఏమీ లేదా, మాస్టారూ?" చాలా నెమ్మదిగా అడిగింది సుగాత్రి.

దానికాయన నవ్వాడు. "భలేదానివే. నువ్వు పసుపు కుంకుమలతో సౌభాగ్యవతివి కాబోతుంటే నాకభ్యంతరం దేనికుంటుంది?" అన్నాడు.

ఆ మాటకు సుగాత్రి ఏమీ అనలేదు. మౌనంగా ఆయన దగ్గర సెలవు తీసుకుంది.

పెళ్ళయ్యాక మొదటి రాత్రి వరాహ నరసింహశాస్త్రి భార్య దగ్గరికి వచ్చినప్పుడు అడిగాడు – "నువ్వు పాట చాలా బాగా పాడతావటగా?" అని.

"గురువుగారు నేర్పిన విద్య చేతనైనంతవరకూ నేర్చుకున్నాను," సమాధానం చెప్పింది సుగాత్రి.

"కాదులే, నువ్వు నిజంగానే చాలా బాగా పాడతావని విన్నాను. పెద్ద పెద్ద కచేరీలు కూడా చాలా ఇచ్చావటగా? అదంతా నిజమేనా, లేక మీ నాన్న వట్టి డబ్బా కొట్టుకున్నాడా?"

"కచేరీలు ఇచ్చిన మాట వాస్తవమే," అందామె.

"అయితే దేశమంతా నీ పేరు పాకిపోవడం నిజమేనంటావ్. మరైతే నేనెప్పుడూ నీ పేరు పెళ్ళి కాకముందు వినలేదేం?"

ఆ ప్రశ్నకు సుగాత్రి సమాధానం చెప్పలేదు. మౌనంగా ఉండిపోయింది.

"నువ్వెవర్లా పాడతావ్? సుశీలలా పాడతావా, జానకిలా పాడతావా?"

ఆ ప్రశ్నకు కూడా మౌనమే సమాధానమైంది.

"సరే, ఇప్పుడో పాట పాడు," అన్నాడతను.

"ఇప్పుడు నా పాటెందుకులెండి?" మంద్రస్వరంలో చెప్పిందామె.

"ఫర్వాలేదు, ఓ పాట పాడు. అడిగేది నేనేగా?"

సుగాత్రి సరేనన్నట్టు తలూపుతూ గురువుకు నమస్కరించి పాట మొదలెట్టింది. కల్యాణి రాగంలో ఆమె త్యాగరాజ కృతి ఒకటి పాడుతుంటే అతను కంగారుగా మధ్యలోనే అడ్డుకున్నాడు.

"ఏమిటీ, రేడియోలో ముసలమ్మలా ఆ పాట పాడుతున్నావ్!" అన్నాడు ఎబ్బెట్టుగా మొహం పెట్టి.

"నాకొచ్చిన సంగీతం అదే!" చెప్పింది సుగాత్రి.

"భలేదానివే. ఈ హింస రాగం పాడతావనేనా మీ నాన్న అంతగా టాంటాం కొట్టుకున్నాడు! నేనింకా ఏ సినిమా పాటో పాడతావనుకున్నాను."

"సినిమాల పాటలు నాకంతగా రావు. పోనీ, ఏ పాట పాడమంటారో చెప్పండి. పాడ్డానికి ప్రయత్నిస్తాను" అందామె.

"సరేలే, రానిదాన్ని అడిగి మాత్రం ఏం ప్రయోజనం. నేనింకా సినిమాల్లో హీరో హీరోయిన్ ఫస్ట్ నైట్ సాంగ్ పాడుకున్నట్టు కమ్మగా ఓ పాట పాడతావనుకున్నాను," అంటూ విసుక్కున్నాడతను.

అత్తవారింటికి వెళ్ళాక సుగాత్రికి నాలుగైదు రోజులు బెరుగ్గా గడిచిపోయాయి. ఓ పాట పాడమని కానీ, సంగీత సాధన చేసుకోమని కానీ ఆ ఇంట్లో ఎవరూ ఆమెను అడిగిన పాపాన పోలేదు. చివరికో వారం రోజుల తర్వాత తనే చొరవ తీసుకుంది. ఆ రోజున పెందలాడే నిద్ర లేచి తలారా స్నానం చేశాక పూజ గదిలో ప్రమిద వెలిగించి సంగీత సాధన ప్రారంభించింది.

ఆ రాగం కాస్తా చెవిని పడుతూనే అత్తగారు హడావుడిగా నిద్ర లేచి పూజ గదివైపు పరిగెత్తుకుంటూ వచ్చింది.

"ఓసి నువ్వటే? పొద్దున్నే పూజ గదిలోకి ఎవరు దూరారా అని కంగారుపడి పరిగెత్తుకుంటూ వచ్చాను. అయితే మీ నాన్న చెప్పిన సంగీత సాధన ఇదేనన్నమాట! రోజూ పొద్దున్నే ఈ కూనిరాగాలే మేమంతా వినాల్సి వస్తుందా?" అందావిడ.

సుగాత్రి సమాధానం చెప్పలేక తల వంచుక్కూచుంది.

ఇంతలో ఆమె మామగారు కూడా అక్కడికొచ్చాడు. "కోడలు కమ్మగా పాడుతుంటే పాడుకోనివ్వక అలా అంటావేమిటే?" అన్నాడాయన.

"మీకు తెలీదు మీరూరుకోండి. ఇలాగే అలుసిస్తే నెత్తికెక్కి కూర్చుంటుంది," అంటూ ఆయన చెవి కొరికిందావిడ.

సుగాత్రికి ఆ మాట వినిపించకపోలేదు.

ఆ రోజునుంచీ ఆమె తప్పనిసరై తన సంగీత సాధన వదులుకోవలసి వచ్చింది. దాంతో ఆమె అత్తవారింటికి వచ్చిన కొద్దిరోజుల్లోనే బాగా మందకొడిగా మారిపోయింది. ఏ పనిలోనూ ఉత్సాహం చూపించగలిగేది కాదు. కోడల్ని సాధించడానికి అత్తగారికి అదో వంకైపోయింది.

ఏదో మిష పెట్టుకుని కోడల్ని సూటిపోటి మాటలతో వేధించడం ఆమె దినచర్యలో ఓ భాగమైపోయింది. అయినా సుగాత్రి పన్నెత్తి అత్తగారికి ఒక్క మాట ఎదురు చెప్పేది కాదు.

సంగీత సాధన మానుకున్నంత మాత్రాన ఆ విషయంలో ఆమె కష్టాలు గట్టెక్కలేదు. అనుకోకుండా ఆమెకో కొత్త బెడద వచ్చి పడింది.

ఆమె భర్త పని చేసే ఆఫీసులో మిత్రులందరూ వచ్చి అతన్ని అభినందించారట. "కంగ్రాచ్యులేషన్స్ గురూ! మీ ఆవిడ చాలా గొప్పగా పాడుతుందటగా? పెళ్ళప్పుడు మాతో చెప్పలేదేమిటోయ్?" అడిగాడో సహోద్యోగి.

"ఆహా! విన్నారంటే మూర్ఛపోతారు!" వెటకారంగా అన్నాడు వరాహనరసింహశాస్త్రి.

"అంత గొప్పగా పాడుతుందా?"

"వట్టి సుత్తిరా బ్రదర్! రేడియోలో వచ్చే హింస ధ్వని రాగాలన్నీ పాడి ప్రాణం తీస్తుంది," చెప్పుకున్నాడు శాస్త్రి.

అంతవరకూ ఆ మాటలు మౌనంగా వింటున్న అశోక్ అనే సహోద్యోగి ముందు కొచ్చాడు. అతనెప్పుడూ మౌనంగా తన పని తాను చేసుకుపోయే రకం. అమ్మాయిలకు కూడా దూరంగా ఉంటాడు. అందుకే అతన్ని ఆఫీసులో అందరూ బుద్ధావతారం అని పిలుస్తారు.

"అయాం సారీ, మిస్టర్ శాస్త్రీ! మీ భార్య పట్ల మీకలాంటి అభిప్రాయం ఉండడం నిజంగా నాకు చాలా బాధ కలిగిస్తోంది. సుగాత్రిగారు చాలా గొప్ప వోకలిస్ట్. అలాంటి భార్య దొరకడం మీ అదృష్టం," అన్నాడతను.

"అలాగా! ఆవిడ గొప్పగా పాడుతుందని తమకెలా తెలుసు?" ఆరా తీశాడు శాస్త్రి.

"ఓసారి మా ఊళ్లో కూడా ఆవిడ సంగీత కచ్చేరీ జరిగింది. అప్పుడు నేనూ హాజరయ్యాను. ఆ కంఠస్వరం నిజంగా ఆవిడకు భగవంతుడు ప్రసాదించిన వరం."

అతనలా పరవశంగా చెప్పుకుపోతుంటే శాస్త్రికి ఒళ్లు మండింది. తన భార్యని పరాయి మగాడు అలా పొగడ్డం అతనికి ససేమిరా నచ్చలేదు. ఆ ఒళ్లు మంటను ఇంటికొచ్చాక భార్యమీద వెళ్ళగక్కాడు.

"ఛ ఛ! నేరకపోయి సిగ్గుమాలిన కొంపలో పెళ్ళి చేసుకున్నాను," అన్నాడు వస్తూనే.

సుగాత్రికి ఏం జరిగిందో తెలీక కళ్ళప్పగించి చూసింది.

శాస్త్రి మరింతగా ఒంటికాలి మీద లేచాడు. "బుద్ధీ జ్ఞానమూ ఉండక్కర్లా? పదిమంది పరాయి మగాళ్ళ ముందు కూచోబెట్టి నీచేత పాడించడానికి మీ బాబు పుట్టింది ఏ కొంపలోనా అని! ఈ రోజు నాకెంత అవమానం జరిగిందో తెలుసా? మా ఆఫీసులోనే నా కళ్ళముందే ఓ పరాయి మగాడు నిన్ను సిగ్గులేకుండా పొగుడుతున్నాడు."

సుగాత్రికి ఆ మాటలో విషయం అర్థమైపోయింది. దాంతో ఆమెకు కళ్ల నీళ్ళు తిరిగాయి. "నేనిప్పుడు కచేరీలు ఇవ్వడం లేదు," అంది తల వంచుకుని.

"ఉద్ధరించావులే!" అంటూ కస్సుమన్నాడు శాస్త్రి.

ఆ ప్రస్తావన అంతటితో ముగిసిపోతే బావుండేది కానీ, అతను పని గట్టుకుని రోజూ ఆమె ముందు అదే మాట ప్రస్తావిస్తూ ఆమె తండ్రిని తిట్టిపోయడం మొదలెట్టాడు. తన నేమన్నా పర్వాలేదు. అతను మాటిమాటికీ తన తండ్రిని అలా దుర్భాషలాడ్డం ఆమె సహించలేకుండా ఉండేది. వంట గదిలో ఎవరూ లేనప్పుడు తనలో తనే కుమిలి కుమిలి ఏడ్చేది.

అయితే అంతలోనే ఓ తమాషా జరిగింది.

త్యాగరాజ ఆరాధనోత్సవాలు దగ్గర పడుతుండగా పొరుగూరి నుంచి కొందరు పెద్దమనుషులొచ్చి సుగాత్రిని కలుసుకున్నారు. ఆ సమయంలో ఆమె భర్త కూడా అక్కడే ఉన్నాడు.

"మా ఊరి సత్యనారాయణస్వామి ఆలయానికి మేము ధర్మకర్తలం. రేపు త్యాగరాజు ఆరాధనోత్సవాలకు మీ చేత పాడించాలని వచ్చాం" అని చెప్పుకున్నారు వాళ్లు.

"నేనిప్పుడు కచేరీలు ఇవ్వడం లేదండీ," నమ్రతగా చెప్పింది సుగాత్రి.

"అంత మాటనకండి. మీ పేరు పదిమంది నోటా విని ఎంతో అభిమానంతో మీ పాట కోరి వచ్చాం. కాదనడం మీకు భావ్యం కాదు."

ఆ మాటకు శాస్త్రి మండి పడిపోయాడు. "ఓసారి చెప్తే మీక్కాదుటయ్యా? మీరు పిలుస్తూనే పరుగెత్తుకొచ్చి పదిమందిలో పాట పాడ్డానికి ఇక్కడ తేరగా ఎవరూ లేరు," అన్నాడు.

ఆ దురుసుతనానికి వాళ్లు కోపం తెచ్చుకోలేదు. "తేరగా రమ్మని పిలవడం లేదు బాబూ! ప్రతి ఏటా మేము త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో మా కోవెలకొచ్చి పాడే సంగీత విద్వాంసులకు వెయ్యిన్నూట పదహార్లు దక్షిణ సమర్పించుకుంటాం," అన్నారు శాంతంగా.

"వెయ్యిన్నూట పదహార్లా?" అంటూ ఒకేసారి నోరు వెళ్ళబెట్టాడు శాస్త్రి.

వాళ్ళు తలూపారు.

"నిజంగానే ఇస్తారా, లేక ఇస్తామని ఎగ్గొడతారా?" అనుమానంగా చూశాడతను.

"ఇస్తామని ఎగ్గొట్టేంత పాపిష్టివాళ్ళం కాదు లెండి."

శాస్త్రి గబగబా గుటకలు మింగాడు. వెయ్యిన్నూట పదహార్ల ప్రస్తావన వస్తూనే అతని డాంబికం గాల్లోకెగిరిపోయింది.

బాప్‌రే, వెయ్యిన్నూట పదహార్లు! "సరే, మీరా మాట నిలబెట్టుకునేట్టయితే మా ఆవిడొచ్చి కచేరీ ఇస్తుంది వెళ్ళండి," అనేశాడు.

"నేను రాలేను," అంటోంది సుగాత్రి.

"నువ్వు నోర్మూసుకో!" అంటూ గుర్రుమన్నట్టు చూశాడు శాస్త్రి.

శాస్త్రి దేనికోసం వెళ్ళమని చెప్పినప్పటికీ సుగాత్రికి మాత్రం మరోసారి కచేరీ ఇచ్చే అవకాశం వచ్చింది. ఆ రోజున ఆమె మానసికానందం వర్ణనాతీతం. అదే తన జీవితానికి చివరి కచేరీ అయినట్టుగా తనకెంతో ఇష్టమైన రాగాలన్నీ పాడింది. ఎన్నో రోజులుగా సరైన సాధన లేకపోయినప్పటికీ ఆమెలోని సహజ గానమాధుర్యంతో శ్రోతలు ఉర్రూత లూగిపోయారు. చివరికి మంగళం పాడే సమయంలో 'అరె, అప్పుడే అయిపోయిందా?' అనే భావం అందరికి కలిగింది. ఆలయ ప్రాంగణం అమృతప్రాయమైన సంగీత సాగరంలో ఓలలాడింది. ఆ రోజున ఆలయ ధర్మకర్తలు ఆమెకు ఇచ్చుకున్న వెయ్యి నూట పదహార్లే కాక, ఆ ఊరి పెద్దమనిషి ఒకాయన మరో అయిదు నూర్ల పదహార్లు అదనంగా బహూకరించాడు.

ఆమె ఇంటికొస్తూనే శాస్త్రి ఆ డబ్బంతా తనే లాక్కున్నాడు. నామకార్థమైనా భార్య దగ్గర ఓ పది రూపాయలుంచలేదు. అయితే సుగాత్రి మాత్రం ఆ డబ్బుకోసం చింతించలేదు. ఆనాటి ఆ కచేరీతో ఆమెకు మళ్ళీ ప్రాణం పోసినట్టుగా అనిపించింది.

సుగాత్రి కచేరీ ఇచ్చిన సంగతి శాస్త్రి చెప్పకపోయినా అతని మిత్రబృందానికి తెలిసిపోయింది.

"ఏం వాయ్ శాస్త్రీ! మీ ఆవిడ సంగీత కచేరీ ఇచ్చిందటగా!" అంటూ కొర్రీ వేయడానికి వచ్చారు వాళ్లు.

"వచ్చిన విద్య వృథాగా ఎందుకు పోవాలని నేనే వెళ్ళమన్నాను," అంటూ ఫోజు కొట్టబోయాడు శాస్త్రి.

"ఏడిశావ్! వాళ్లే నూట పదహార్లో ఇచ్చి ఉంటారు. అంతే కదరా బ్రదర్?" అంటూ శాస్త్రి సంగతి తెలిసిన మిత్రుడొకడు ముక్కుసూటిగా అడిగేశాడు.

ఆ మాటలకు శాస్త్రి కిమ్మనలేదు.

సుగాత్రికి సంగీత కచేరీలు ఇంకా రాసాగాయి. కనీసం వెయ్యిన్నూట పదహార్లయినా ఇవ్వందే పంపనని షరతు పెట్టడం నేర్చుకున్నాడు శాస్త్రి.

సుగాత్రికి ఏమాత్రం డబ్బుతో నిమిత్తం ఉండేది కాదు. కచేరీలకు వచ్చే డబ్బంతా శాస్త్రే తీసుకునేవాడు. అందులో ఒక్క పైసా కూడా తనకు కావాలని సుగాత్రి నోరు తెరిచి అడిగిన పాపాన పోలేదు.

అలా సాగుతుండగా ఉన్నట్టుండి ఎవరో శాస్త్రి బుర్రలో ఓ కొత్త ఐడియా మొలిపించారు.

"అది కాదురా, బ్రదర్! మీ ఆవిడ అంత గొప్పగా పాడుతుంది గదా, సినిమాల్లో పాడించడానికి ప్రయత్నించ కూడదూ? అక్కడైతే ఇంకా డబ్బొస్తుంది," అంటూ ఉచిత సలహా ఒకటి పారేశాడు.

ఆ ఉచిత సలహా శాస్త్రిమీద మంత్రంలా పనిచేసింది. అదే మాట భార్యతో అన్నాడు.

"నేనా! సినిమాల్లో పాడ్డమా?" అంటూ నివ్వెరపోయింది సుగాత్రి.

"ఏం, ఆ హింసధ్వని రాగాలు పాడుకునే బదులు హాయిగా సినిమా పాటలే పాడొచ్చుగా? అక్కడైతే డబ్బులు కూడా ఎక్కువొస్తాయి," కసిరాడు శాస్త్రి.

"కానీ నేను పుట్టి పెరిగింది శాస్త్రీయ సంగీతంలో. సంగీతాన్ని అపభ్రంశం చేసే సినిమా పాటలు నేనెలా పాడగలను?" అందామె.

"ఏమో, అదంతా నాకు తెలీదు. నువ్వు సినిమాల్లో పాడి తీరాలంతే!" అనేశాడు శాస్త్రి.

సుగాత్రికి తన అస్తిత్వమే పోగొట్టుకుంటున్న అనుభూతి ఆ క్షణంలో కలిగింది. కానీ భర్త మాటకు ఎదురు చెప్పకుండా తల వంచుకుని కూర్చుండిపోయింది.

సుగాత్రి సినిమాల్లో పాడాలనే నిర్ణయమైతే జరిగిపోయింది. అయితే ఆమెను సినిమా ప్రపంచంలోకి తీసుకెళ్ళే దెలా? అది తోచక శాస్త్రి జుట్టు పీక్కున్నాడు. రోజు రోజుకీ అతని సణుగుడు ఎక్కువైపోవడం చూసి సుగాత్రే ఆ విషయంలో చొరవ తీసుకోవలసి వచ్చింది.

గతంలో తన సంగీత సభకు ఓసారి పెద్ద పేరున్న సంగీత దర్శకుడు కూడా వచ్చాడు. ఆ రోజున తన కంఠాన్ని ఆయన చాలా మెచ్చుకున్నాడు కూడా. సుగాత్రి ఆయనకో ఉత్తరం రాసింది. అయితే సమాధానం కోసం మాత్రం ఎదురు చూడలేదు. ఆ సంగీత దర్శకుడికి తన పేరు గుర్తున్నప్పటి మాట కదా!

అయితే ఊహించని విధంగా పక్షం రోజులు తిరక్కుండానే ఆమె ఉత్తరానికి సమాధానం వచ్చింది. మద్రాసులో ఫలానా అడ్రసులో తనను కలుసుకోవలసిందిగా రాశాడా సంగీత దర్శకుడు.

భర్తకు ఆ ఉత్తరం చూపినప్పుడు తనను మెచ్చుకుంటాడని అనుకుంది సుగాత్రి. అయితే అతను మాత్రం "ఓహో! నీకు పెద్ద పెద్ద వాళ్ళతో కూడా పరిచయాలున్నాయన్న మాట?" అంటూ వెటకారం చేశాడు.

అలాగని ఆ ఉత్తరాన్ని అతను నిర్లక్ష్యం చేశాడనుకుంటే పొరపాటు. సుగాత్రిని వెంటనే మద్రాసుకు బయలు దేరదీశాడు.

ఆనాటి గానసభలో ఆ సంగీత దర్శకుడిని పలకరించడమే తప్ప, ఆయనతో వాస్తవంగా పరిచయం ఏర్పడ్డం ఆమెకదే మొదటిసారి.

"చూడమ్మాయ్! హాయిగా శాస్త్రీయ సంగీతంలో ఆత్మానందం అనుభవించక, ఈ మాయాలోకానికి ఎందుకొచ్చావ్?" అడిగాడాయన.

సుగాత్రి ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా భర్తవైపు చూసి ఊరుకుంది.

అతను అర్థమైందన్నట్టు తలూపి, "సరే, రేపు నీకు వాయిస్ టెస్ట్ ఇప్పిస్తాను," అన్నాడు

ఆ మర్నాడు సుగాత్రి వాయిస్ టెస్ట్ ఇవ్వడానికి వెళ్ళింది. అప్పుడు శాస్త్రిని బయటే కూర్చోబెట్టి ఆమెను లోపలికి పిలుచుకెళ్ళాడాయన.

అక్కడ తామిద్దరు మాత్రమే వున్న సమయం చూసి, "ఈ వాయిస్ టెస్ట్ లాంఛన ప్రాయంగా జరుగుతోంది. నిజం చెప్పాలంటే నీ గొంతు మొదటిసారి విన్నప్పుడే నేను చాలా ఇంప్రెస్ అయ్యాను. నీ గొంతు మైక్రోఫోన్‌కి సూటు కాదంటే మ్యూజిక్ డైరెక్టర్‌గా ఇన్నేళ్ళ నా అనుభవం వృథా! ఈ వాయిస్ టెస్ట్ నువ్వు పాసవుతావనే నా నమ్మకం," అంటూ ఒక్క క్షణం మౌనం వహించాడు.

ఆ ధోరణిని బట్టి ఆయన చెప్పదలుచుకున్నది ఇంకా ఏదో వున్నదని అర్థం చేసుకుంది సుగాత్రి.

ఆయన నెమ్మదిగా మళ్ళీ నోరు విప్పాడు.

"ఒక్కమాట మాత్రం నీకు స్పష్టంగా ఇప్పుడే చెప్పేస్తున్నాను. మునుపట్లా నా సంగీతానికి ఇప్పుడీ ఫీల్డులో పెద్దగా డిమాండ్ లేదు. చిన్న చిన్న నిర్మాతలు మాత్రం నాతో పాటలు కట్టించుకోవడానికి ముందుకొస్తున్నారు. నిజం దాచకుండా చెప్పాలంటే నా చేతుల్లో ప్రస్తుతం వున్నవి రెండు సినిమాలు. ఈ రంగానికి నువ్వింకా కొత్తదానివి. నీ వల్ల నాకు మళ్ళీ దశ తిరుగుతుందేమో చూస్తాను. కొత్తమ్మాయి చేత పాడించడానికి నా ప్రొడ్యూసర్లు ఒప్పుకోకపోవచ్చు. కానీ, నాకున్న రెండు సినిమాల్లో ఏదో ఒకదాంట్లో నీకు కనీసం ఒక్క పాటైనా పాడే అవకాశం ఇస్తాను. నీకిచ్చే ట్యూన్లో బంగారం పండించే పూచీ మాత్రం నీది," చెప్పాడు.

సుగాత్రి మౌనంగా తలూపింది.

వాయిస్ టెస్టు జరిగింది. ఫలితమేమైందో తెలుసుకోవడానికి ఆమె మళ్ళీ ఆయన్ని కలుసుకోవలసి వచ్చింది.

"నేను చెప్పినట్టు నీ వాయిస్ టెస్టు బాగానే వచ్చింది. కానీ, నేననుకున్న పొరపాట్లే కొన్ని చేశావు," అంటూ ఆ పొరపాట్లేమిటో ఆమెకు వివరంగా చెప్పాడాయన.

సుగాత్రి ప్రాథమికంగా శాస్త్రీయ పద్ధతిలో పాడే విధానం సినిమాకు పనికిరాదు. దానికోసం ఆమె ఆ పద్ధతి వదిలేయాల్సి వుంటుంది.

ఆ మాట సుగాత్రి ఊహించనిది ఎంతమాత్రం కాదు. సినిమా పాటల్లో శాస్త్రీయ సంగీతాన్ని అపభ్రంశరూపంలో వాడుకుంటారని ఆమెకు బాగా తెలుసు. ఆయన చెప్పిన కొత్త పద్ధతిలో కొన్నాళ్ళు శిక్షణ పొందడానికి ఒప్పుకుంది.

సుగాత్రి సినిమాల్లో పాడబోతోందనే వార్త ఇటు అత్తింట్లోనూ, అటు పుట్టింట్లోనూ కలవరం రేకెత్తించింది. సుగాత్రిని సినిమాల్లోకి తీసుకెళ్లొద్దని ఆమె అత్తగారు శాస్త్రి ముందు నెత్తీ నోరూ కొట్టుకుంది.

"నీకేం తెలుసు? దానిచేత సినిమాల్లో పాడించి ఎంత డబ్బు సంపాయిస్తానో చూడు," తల్లి మాట లెక్కచెయ్యకుండా ధీమాగా అన్నాడు శాస్త్రి.

అదేం చిత్రమో, సుగాత్రి సినిమాల్లో పాడాలనే నిర్ణయం పూర్తిగా శాస్త్రిదైతే, అందుకు శిక్ష అనుభవించింది మాత్రం సుగాత్రే! సూటిపోటి మాటలతో ఆమె అత్తగారు వేధింపులు మరింత ఎక్కువ చేసింది.

అప్పుడే సంక్రాంతి కూడా వచ్చింది. ఆ పండక్కి పుట్టింటికి వెళ్ళిన సుగాత్రి అక్కడ కూడా నిరసన ఎదుర్కొంది. సినిమావాళ్ళంతా చెడిపోయినవాళ్ళేనన్న అభిప్రాయం వున్న సుగాత్రి తల్లి ఏకంగా కూతురు చచ్చిపోయినట్టే బిగ్గరగా శోకాలు కూడా పెట్టింది. ఆ పండగ పండగలా జరగలేదు.

ఎన్ని ప్రశ్నలు ఎదురైనా సుగాత్రి నిబ్బరంగా ఒకటే సమాధానం చెప్పింది. "నాకేమీ తెలీదు. మీ అల్లుడుగారు చెప్పినట్లు వింటున్నాను."

ఆ సమాధానం ఎవరికీ తృప్తి కలిగించలేదు.

సుగాత్రి గురువుగారిని చూడ్డానికి వెళ్ళినప్పుడు పాదాలంటబోతే ఆయన దగ్గరక్కూడా రానివ్వలేదు.

"ఆ గక్కడే! నేను నేర్పిన విద్యంతా అభాసుపాలు చేస్తూ నా పాదాలంటడానికి వచ్చావా? వెళ్ళిక్కడ్నించి!" అంటూ హూంకరించాడు.

సుగాత్రి ఆ ప్రశ్నకు అన్నిచోట్లా ఊరుకుంది. కానీ, గురువుగారి ముందు మాత్రం ఊరుకోలేదు, "నేను చేసిన తప్పేమిటి?" తల వంచుకుని నమ్రతగా అడిగింది.

"స్వచ్ఛమైన శాస్త్రీయ సంగీతాన్ని అప్రాచ్యం చేసి భ్రష్టు పట్టించడానికి తయారయ్యావ్. అది తప్పు కాదా?"

"క్షమించండి. ఆ తప్పు నాదేనంటారా?"

"కాకపోతే నాదా?"

"అనే నేననుకుంటున్నాను."

"ఏమన్నావ్?" అంటూ అదిరిపడ్డారు గురువుగారు.

సుగాత్రి గబుక్కున ఆయన పాదాలు పట్టుకుంది.

"మీ పాదాల సాక్షిగా చెబుతున్నాను. మీరు నేర్పిన విద్యను పాడు చేసే ఉద్దేశం నాకెప్పుడూ లేదు. కానీ, నేనందుకు సిద్ధపడ్డానికి కారణం మీరు కాదా? మీ మాటలు విని జీవితమంతా సంగీతానికే అంకితం చేద్దామని నిశ్చయించుకున్నాను. కానీ ఆ నిర్ణయం నుంచి నన్ను మళ్ళించింది మీరు కాదా? నాకు మాట మాత్రంగానైనా చెప్పకుండా నాన్నగారు నా పెళ్ళి నిశ్చయించినప్పుడు మీరొక్కమాటైనా అన్నారు కాదు. పైగా నన్నాశీర్వదించి పంపారు. ఇదంతా మీ ఆశీర్వాద ఫలమే మాస్టారూ! నా భర్త నోటివెంట మీ ఆజ్ఞనే నేను శిరసా వహిస్తున్నాను," అంటూ ఆయన ముందునుంచి లేచి నెమ్మదిగా బయటికి వెళ్ళిపోయింది.

గురువుగారు నిర్ఘాంతపోయి ఆమె వెళ్ళేవైపే చూస్తుండిపోయారు.

ఆమె తిరిగి అత్తవారింటికి వెళ్లిందో లేదో మద్రాసునుంచి పిలుపు వచ్చింది. ఆ సంగీత దర్శకుడు ఆమెతో ముందుగా చెప్పినట్టే ఒక్క పాటకి మాత్రమే అవకాశం ఇచ్చాడు. ఆ పాట పూర్తి చేసి రికార్డింగ్ రూం నుంచి బయటికి వస్తున్నప్పుడు ఆమె ఆమెకు తెలిసిన సుగాత్రి కాదు. శాస్త్రీయ సంగీతం నుంచి నేపథ్యగానంలోకి పరకాయ ప్రవేశం చేసిన సరికొత్త సుగాత్రి.

ప్రతిభ అనేది ఎక్కడున్నా ప్రకాశిస్తున్నట్టే సుగాత్రి పాడిన పాట ఆ ఏటి మేటి హిట్ కావడమే కాదు– ఆమెకా సంవత్సరం జాతీయ అవార్డు కూడా సంపాయించి పెట్టింది. మొదటి పాటే జాతీయ అవార్డు అందుకున్న నేపథ్యగాయనిగా ఆమె పేరు దేశమంతా వినిపించింది. ఆమెతోపాటు ఆ సంగీత దర్శకుడి దశ కూడా ఆ పాటతో నిజంగానే తిరిగిపోయింది. ఆయనకి నిర్మాతలు మళ్ళీ క్యూలు కట్టడం మొదలెట్టారు. ఆయన సంగీత దర్శకత్వంలో వచ్చే చిత్రాలన్నింటిలోనూ సుగాత్రే పాడింది.

సుగాత్రి ఇప్పుడు తెలుగులోనే కాదు, దక్షిణ భారత దేశభాషలన్నిట్లోనూ మేటి గాయని. క్రమంగా ఆమె పాడిన పాటలు హిందీ సినిమాల్లోనూ చోటు చేసుకోనారంభించాయి. దాంతో ఆమె జాతీయస్థాయి గాయనిగా గుర్తింపు సంపాదించుకుంది. చిత్రమేమిటంటే ఆమె సినిమాల్లో పాడిందని తీవ్రంగా అభ్యంతరం చెప్పినవాళ్ళే ఇప్పుడామెను పొగుడుతున్నారు. ఇప్పుడామెకు మద్రాసులో పెద్ద బంగళా వచ్చింది. బయట తిరగడానికి

ఫారిన్ కారొచ్చింది. బయటి ఊళ్ళకు వెళ్ళాలంటే విమానాల్లో ప్రయాణాలు. ఆమె అత్తగారికిప్పుడు ఆమె సాక్షాత్తూ లక్ష్మీదేవి!

ఓ రోజున ఆమెను చూడ్డానికి ఆమె గురువుగారే స్వయంగా వచ్చారు.

సుగాత్రి భావరహితంగా ఆయనకు స్వాగతం చెప్పింది.

"నా శిష్యురాలు ఇంతెత్తుకు ఎదిగింది గదా! ఎలా వుందో ఓసారి చూసిపోవడానికి వచ్చాను," చెప్పాడాయన.

సుగాత్రి శుష్క దరహాసం చేసింది.

"మీ శిష్యురాలు చనిపోయి చాలా రోజులైంది మాస్టారూ! మీరు నేర్పిన సంగీతంతో పాటే ఆమెకూ ఎప్పుడో అంత్యక్రియలు జరిగిపోయాయి. ఇప్పుడు మీరు చూస్తున్నది నేపథ్యగాయని సుగాత్రిని," అంది.

గురువుగారు నిట్టూర్చారు.

"నీ కోపానికి నేను కూడా కొంత కారకుణ్ణే అని ఒప్పుకుంటాను. కానీ, ఒకవిధంగా చెప్పాలంటే ఆ కోపం కూడా అర్థం లేనిదే అంటాను. నేనూ వివాహితుడ్నే. కానీ నా వైవాహిక జీవితం నా సంగీత సాధనకు అడ్డురాలేదే?" అన్నాడు.

"మీరు మగవారు మాస్టారూ! మీరనుకున్నది చేయడానికి ఈ లోకం ఒప్పుకుంటుంది," అంటూ ఆమె రెండు చేతులూ జోడించి ఆయనకు నమస్కరించింది. "ఓ ఆడపిల్ల తనకు ఇష్టమైన విధంగా జీవించే అధికారం, అవకాశం ఇకనైనా ఇవ్వమని మీ వంటి పెద్దవారందర్నీ వేడుకుంటున్నాను" అంది.

గురువుగారు ఆమె నుంచి సెలవు తీసుకుని వెళ్ళబోతూ కూడా ఆ మాట గురించి ఆలోచించుకుంటూనే ఉన్నాడు. సుగాత్రి తనకు బోధపడీ బోధపడని విచిత్ర వ్యక్తి అనిపించిందాయనకు.

ఆమె పట్ల ఎవరి ప్రవర్తనలో మార్పు వచ్చినా, ఆమె భర్త ప్రవర్తనలో మాత్రం మార్పు రాలేదు. ఆమె గొప్ప గాయని అయ్యాక అతను ఉద్యోగం మానేశాడు. ఆమె వ్యవహారాలన్నింటికీ అతనే మేనేజర్. ఆమెకొచ్చే డబ్బంతా కూడా అతనే తీసుకునేవాడు. సుగాత్రి జీవితానికిప్పుడు పరమార్థం ఒక్కటే – భర్తకి డబ్బు సంపాదించి ఇవ్వడం.

శాస్త్రికి ఇప్పుడు అన్ని దురలవాట్లూ వచ్చాయి. అచ్చంగా గుణనిధే అయిపోయాడు. తాగుతాడు. పేకాడతాడు. రేసులకు వెళ్తాడు. వ్యభిచరిస్తాడు. అతనంతగా పతనమైపోతాడని సుగాత్రి ఊహించలేదు.

కాలక్రమేణా ఆమె తల్లీ, తండ్రీ పోయారు. అత్తా మామా పోయారు. గురువుగారూ పోయారు. ఆమెకు తనవాళ్ళంటూ ఎవరూ మిగల్లేదు. ఒంటరితనం నుంచి బయటపడటానికి ఆమెకు పిల్లలు కూడా కలగలేదు.

రాను రాను ఆమె భర్త మరీ రాక్షసుడైపోయాడు. ఎంత ఇచ్చినా ఇంకా ఇంకా కావాలని పీడించడం మొదలుపెట్టాడు. చివరికి ఆమెను కొట్టడం కూడా అలవాటు చేసుకున్నాడు. ఆమె మాత్రం కిక్కురుమనేది కాదు.

ఆమె ఎంత కీర్తిప్రతిష్టలు సంపాదించినా, ఎంత డబ్బు గడించినా ఫలితం లేదు.

ఆమె పాట ఆమెది కాదు.

ఆమె జీవితం ఆమెది కాదు.

కాలం గడిచిపోతూనే ఉంది.

శాస్త్రి మారే అవకాశం లేకపోగా పూర్తిగా తాగుడుకు బానిసైపోయాడు. ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. లివర్ చెడిపోయింది. రక్తపు పోటు ఎక్కువైపోయింది. రెండుసార్లు గుండెపోటు కూడా వచ్చింది. అయినా తాగడం మానలేదు. అతని తాత ముత్తాతలు సనాతన బ్రాహ్మణులంటే ఎవరూ నమ్మలేని విధంగా తయారయ్యాడు.

చివరికోరోజు అతను బాగా తాగి ఇంటికొచ్చాడు. ఆ సమయంలో అతను చెయ్యని రాద్ధాంతం లేదు. తాగిన మైకంలో అకారణంగా సుగాత్రిని తిడుతూ ఆమెని కొట్టడానికి చెయ్యి పైకెత్తాడు. ఎత్తిన చెయ్యి ఎత్తినట్టే వుంది. ఎలా వున్నవాడలాగే దబ్బున నేలమీదికి జారిపోయాడు.

డాక్టర్లు వచ్చారు. అతణ్ణి పరీక్షిస్తూనే పెదవి విరిచారు. అప్పటికే ప్రాణాలు పోయాయి.

సుగాత్రి ఏడవలేదు. కనీసం ఆమె కళ్ళు తడవనైనా లేదు. అతను రాక్షసంగా ప్రవర్తించినపుడు ఎలా మౌనంగా వుండిపోయేదో ఇప్పుడూ అలాగే వుండిపోయింది.

ఆమె సంసార జీవితం గురించి తెలిసిన వాళ్ళందరూ ఆమె జీవితంలో ఓ పెద్ద పీడ వదిలిపోయిందన్నారు. ఆ రోజునుంచే ఇంకా ఎంతో ఎత్తుకు ఎదిగిపోగలదన్నారు.

శాస్త్రికి అంత్యక్రియలు జరిగిపోయాక ఆమె యథాప్రకారంగానే రికార్డింగ్‌కు హాజరైంది.

సంగీత దర్శకుడు "వన్ టూ త్రీ" చెప్పాడు.

వాద్యాలు మోగడం మొదలైంది.

సుగాత్రి పాట పాడటానికి నోరు తెరిచింది.

నోరు తెరిచిందే గానీ ఆమె గొంతులోంచి పాట బయటికి రాలేదు. అస్పష్టంగా కొన్ని శబ్దాలు మాత్రం వినిపించాయి.

సంగీత వాద్యాలు ఆగిపోయాయి.

సంగీత దర్శకుడు బొమ్మలా నిలబడిపోయాడు.

సుగాత్రి మళ్ళీ పాడ్డానికి ప్రయత్నించింది.

అయితే ఆమె గొంతు లోతుల్లో ఎక్కడో ఆ పాట బయటికి రాకుండా చిక్కుబడిపోయింది. మళ్ళీ కొన్ని అస్పష్టమైన శబ్దాలు తప్ప మరేమీ వినిపించలేదు.

రికార్డింగ్ రూంలో ఉన్నవాళ్ళంతా విభ్రాంతులై చూస్తుండగానే ఆమె హెడ్‌ఫోన్స్ తీసి పక్కన పెట్టి నెమ్మదిగా అక్కడినుంచి బయటికి నడిచింది.

ప్రయోజనం లేని కళ నిస్సారం!

ఆమె కళకు ప్రయోజనం ఆమె భర్త!

అందుకే ఆ గొంతు మూగబోయింది!

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఏప్రిల్ 8-14, 1992*

# ఎడారి సేద్యం

ఎండాకాలం దగ్గరికొచ్చింది.

ఎల్లన్న ఇంట్లో సందడి అలుముకుంది.

"ఇదో, ఇంటాండావా? బిర్నపోయి కేశవరెడ్డితో మాట్లాడి రారాదేమి? ఈతూరి గుడకా భూమి మనమే చేస్కుంటామని చెప్పిరా," అంది ఎల్లన్న భార్య.

జాలాట్లో వేపపుల్లతో పళ్ళు తోముకుంటున్న ఎల్లన్న తుపుక్కున ఉమ్మేశాడు. "అది గుడకా అడగాల్నా? పోయినతూరి మనమే గదా చేస్తిమి. అడగందే ఇయ్యడేమి కేశవరెడ్డి?" అన్నాడు ధీమాగా.

"ఎంతైనా పెద్దోల్లతో పనిగదేంబా! ముందే అడిగితే మంచిది," హితబోధ చేసింది నాగమ్మ.

"సర్లే, అట్నేగాని," అన్నాడు ఎల్లన్న.

స్నానపానాదులు ముగించి సద్దిబువ్వ తిని అతను బయల్దేరబోతుండగా నాగమ్మ అతని కోసం ఉతికి ఇస్త్రీ చేసిన దుస్తులు పట్టుకొచ్చింది. "చెప్పేది బాగా ఇను. నీకొకటి తెలిస్తే ఇంకోటి తెల్దు. ఈతూరి గుడకా భూమి మనకే ఇయ్యాలని కేశవరెడ్డితో గట్టిగా చెప్పు. ఆ పాట్నే పదివేలు డబ్బు గుడకా అడగాల. అది మర్సిపోవాకు. పిల్ల పెండ్లి గుడకా పెట్టుకున్నేమని చెప్తావో చెప్పవో," అంది.

"చెప్తాలేయే! ఆ మాత్రం చెప్పను గుడకా రాదేమి నాకు?" అన్నాడు ఎల్లన్న.

అతను చెప్పులు వేసుకుని గుమ్మం దాటేదాకా ఒకటికి రెండుసార్లు అదే హితబోధ చేస్తూనే వుంది నాగమ్మ.

ఎల్లన్న వీధి గుమ్మం దాటుతుండగా అతని కూతురు పద్దెనిమిదేళ్ళ జ్యోతి నడుంమీద నీళ్ళ బరువుతో ఎదురొచ్చింది.

"నీ కోసరమే పోతాండానమ్మీ! కేశవరెడ్డితో మట్లాడివచ్చినాక నీ పెండ్లి చేసేస్తా," అన్నాడు ఎల్లన్న నవ్వుతూ.

జ్యోతికి సిగ్గు ముంచుకొచ్చేసి ఒద్దికగా తండ్రి పక్కనుంచి నీళ్ల బిందెతో ఇంట్లోకొచ్చింది.

ఎల్లన్న హుషారుగా కేశవరెడ్డి ఇల్లు చేరుకున్నాడు.

"నమస్కారం కేసన్నా!"

కేశవరెడ్డి నల్లమద్ది చెక్కతో చేసిన పొడుగాటి పడక్కుర్చీలో కాళ్లు బారజాపి పడుకుని ఆ రోజు పేపరు చదువు తున్నవాడల్లా తల పక్కకు తిప్పి సరిగ్గా లేచి కూర్చున్నాడు.

"ఆ ఎల్లన్నా! రారా, కూకో! ఏంబా, పొద్దున్నే ఇట్లొచ్చినావే?"

"ఏముందన్నా, మంచికీ చెడ్డకీ నువ్వేగదా మాకుండావు! మరేంలేదు. ఈ తూరి గుడకా ఏట్లో భూమి నాకే ఇప్పిచ్చు. కర్బూజా కాయలు బేస్కుంటా. అడగడానికే వచ్చినా," అన్నాడు. ఎల్లన్న అతని ఎదురుగా నేలమీద కూర్చుంటూ.

"ఓ అదా! ఇస్తాలే, దానికేమిగానే ఈతూరి నాకు రెండు వేలన్నా గుత్త ఎక్కువియ్యాల," అన్నాడు కేశవరెడ్డి.

"అదేమన్నా? ఏసమ్మచ్చరానికా సమ్మచ్చరం గుత్త పెంచుతా పోతే మేమెట్లా బతకాల?" వాపోయాడు ఎల్లన్న.

"నీకిష్టమైతేనే చెయ్యి, లేదంటే ఆ భూమి చేస్కునేటోల్లు నూరుమందుండారు. అయిదు వేలు ఎక్కువిస్తానని మా బామ్మర్దే అడుగుతుండాడు. ఏమంటే ముందునుంచి నువ్వు నాకు కావల్సినోనివి. అందుకు ముందు నీకే చెప్తాండా. నువ్వు చెయ్యలేనంటే ఈసారి మా బామ్మర్దికే ఇచ్చేస్తా భూమి."

ఎల్లన్న గుటకలు మింగి, "సర్లెన్నా! అంత మాటెందుకు? అట్నే ఇస్తాలే రెండు వేలు," అన్నాడు.

"సరే, ఇంకేమో చెప్పు. మీ ఇంట్లో అంతా బాగుండారా? కూతురి పెండ్లి చెయ్యాలని చెప్తాంటివే, అదేమైనాది?" ఆరా తీశాడు కేశవరెడ్డి.

తను ప్రస్తావించబోతున్న విషయం అతనే ఎత్తేసరికి ఎల్లన్న మొహం చాటంతైంది.

"అదే అది చెప్దామనే వుండినా, నువ్వే అడిగినావు. ఈ సమ్మచ్చరం దేవుడు సల్లగా చూస్తే కూతురి పెండ్లి చేసేస్తామనే వుండా! మంచి సంబంధం గుడకా కుదిరింది. మన పొద్దుటూరోల్లే! పెండ్లి కొడుకు బేల్దారీ పని చేస్తాడు. మేస్త్రీ అయితే మంచి లెక్క సంపాయిస్తాడు. అయిదు తులాల బంగారం, పదివేలు లెక్క ఇస్తామని ఒప్పుకున్నాం. దాని పెండ్లి చేస్తినా, శీకాయతో తల కడుక్కున్నెట్టుంటాది," అంటూ చెప్పుకొచ్చాడు.

కేశవరెడ్డి మీసాల చివర్నుంచి చిరునవ్వు చిందించాడు. "అయితే ఈ యేడు మాకు పప్పన్నం పెట్టిస్తావన్నమాట."

"పెట్టిస్తాన్నా! దేవుడు సల్లంగా సూడాల. నువ్వు సల్లంగా సూడాల," అన్నాడు ఎల్లన్న.

"నాదేముంది? భూమి నీకే ఇస్తానని చెప్తిని గదా."

"చెప్పినావనుకో, అదే చేత్తో ఒక పదివేలు అప్పు కూడా ఇచ్చినావంటే నీ మేలు మర్చిపోను."

"పదివేలా! ఎందుకు?"

"అదేన్నా! కర్బూజా కాయలు బేస్కోనీకి."

"పోయిన్సారి కర్బూజా కాయలు బేసి బాగా దుడ్డు సంపాయిస్తివిగదా! అదంతా ఏమైనాది?" అడిగాడు కేశవరెడ్డి.

"అది ఇంకా యాడుందిన్నా. నువ్వు చెప్పినట్లు పోయినతూరి పంటలో బాగానే దుడ్డొచ్చినాది. అయితే పిల్లకోసరం రోంత బంగారం కొన్నేం. చీరెలూ సారెలూ ఇంకా ఏందేందో కొన్నేం. ఈ తూరి కర్బూజాలు బాగా పండినాయంటే పదివేలు కట్నం లెక్కా పెండ్లి ఖర్చులూ అన్నీ సరిపోతాయి. పంట బేస్కోనీకి ఒక్క పదివేలిప్పిచ్చు చాలు."

కేశవరెడ్డి నవ్వాడు. "ఒకటా రెండా పదివేలు నాకాడ యాడుండాయని?" అన్నాడు.

"ఆ మాటనాకన్నా! మా కేసన్నకాడ దుడ్డు లేదంటే ఈ మండలం మొత్తంలో ఎవని కాడా లేనట్టే. నేనేమి ఎక్కువడిగినానా? ఒక్క పదివేలీ చాలు."

కేశవరెడ్డి ఆలోచనలో పడ్డట్టు మొహం పెట్టాడు.

"సరే ఎంతైనా నువ్వు మావోనివి. వడ్డీ ఏమిస్తావో చెప్పు," అన్నాడు.

"వేరే చెప్పాల్సిందేముందన్నా! రూపాయిన్నర బేస్కో".

కేశవరెడ్డి బిగ్గరగా నవ్వాడు.

"భలే చెప్పినావులే ఇంకా రూపాయిన్నర వడ్డీకి లెక్క యాడొస్తాండాదని? ఆ వడ్డీకి నాక్కావలన్నా అప్పు పుట్టదు. పొద్దుటూర్లో మార్కెట్ బాగా టైటైపోయింది తెలుసునా?"

"సరే ఎంత బేసుకుంటావో నువ్వే చెప్పు," అన్నాడు ఎల్లన్న.

"మామూలే, మూడు రూపాయలు."

ఎల్లన్నకు గుండె గుభేల్మంది.

"మూడు రూపాయలు మామూలేమి కేసన్నా! దయ చూడబ్బా, నా కూతురి మొహం చూడు. రెండు రూపాయలు చేస్కో."

"మూడు రూపాయలకి పైసా తగ్గేది లేదు. కావాల్నంటే నీకోసరమై వడ్డీ ముందే పట్టుకోను. పదివేలూ ఇస్తా. నీ కర్బూజాకాయలు పండి దుడ్డు చేతికొచ్చినాక అసలు, వడ్డీ అంతా కలిపి చెల్లించు సరిపోతాది. ఇంక అంతకంటే నేనేం చెయ్యలేను."

"సరే అట్నే కానీలే కేశన్నా! నిన్ను నమ్ముకునేటోన్ని యాడికి బోతాను? అట్నేకానీ లెక్క. ఈ మూడు రూపాయల ప్రకారమే నోటు రాసిస్తా," అన్నాడు ఎల్లన్న నిస్సహాయంగా.

కేశవరెడ్డి లేచి ఇంట్లోకి వెళ్ళి పదివేలు పట్టుకొచ్చి ఎల్లన్న చేతిలో నోటు పెట్టాడు. "నీకు అంతో ఇంతో చదువొస్తాదిగదా! నీ చేత్తో నువ్వే ఆ నోటు రాసి బిళ్లమీంద సంతకం పెట్టు," అన్నాడు.

ఎల్లన్న అలాగే చేసి కేశవరెడ్డికి నమస్కారం పెట్టాడు. "నీ మేలు నిజంగా మర్చిపోలేనన్నా! వడ్డీ ముందే పట్టుకోకుండా లెక్కిస్తాండావ్. ఆ మాత్రమన్నా ఈ రోజుల్లో మాలాంటోల్లకి పలికేటోల్లు లేరు. పోయొస్తానన్నా!" అంటూ డబ్బు జేబులో పెట్టుకొని లేచి నిలబడ్డాడు.

"సరే పోయిరా కానీ ఒక్క మాట వినేసిపో. దుడ్డు చేతికి రాంగానే నా బాకీ తీర్చేయాల. ఆలస్యం చేస్తానంటే ఊరుకోను."

"అయ్యో! ఎంతమాట కేసన్నా! నీ బాకీ ఆలీసెం చేస్తానా? నీకియ్యాల్సిన లెక్క నీకు పూలల్లో పెట్టి తెచ్చియ్యనూ! పోయొస్తాన్నా, నమస్కారం."

ఎల్లన్న అక్కడినుంచి నేరుగా ఇంటికొచ్చి భార్యతో జరిగిందంతా చెప్పాడు.

నాగమ్మ ఆ విషయాన్ని తేలిగ్గా తీసుకుంటూ, "వడ్డీ మూడు రూపాయిలు అయితే అయ్యిందిలే. ఆయప్ప పెద్ద మనసు చేసి ఇచ్చిందే చాలు. దానికేం దిగులు? పది రూపాయలు వడ్డీ ఇస్తామన్నా అప్పిచ్చేటోల్లు లేరు. పోయిన్నారి మాదిరే ఈసారి కూడా పంటమీద లాభం వస్తే పిల్ల పెండ్లీ అయితాది. అప్పూ తీర్తాది. నువ్వేం దిగులు పడబాకు," అంది.

జ్యోతి చాటునుంచి ఈ మాటలన్నీ రహస్యంగా వింటోంది.

ఎక్కడ్నించి వచ్చినాడో ఎల్లన్న పెద్దకొడుకు ఆనందు వెనుకనుంచి చెల్లెలి చెవి దొరకబుచ్చుకున్నాడు. "దొంగా! నీ పెండ్లని ఆ మాటలన్నీ ఇంటాండావా? ఉండు నీ పెళ్ళి నేను చేస్తాను," జ్యోతి సిగ్గుపడిపోతూ అన్నగారి చెయ్యి విదిలించుకుని అవతలికి పారిపోయింది.

ఆనందు నవ్వుకుంటూ అక్కడ్నించి వెళ్ళిపోయాడు.

ఎల్లన్న ఇంటి పెరట్లో ఎర్రగన్నేరు చెట్టొకటి వుంది. ఆ చెట్టు అంటే జ్యోతికి చాలా ఇష్టం. అదెప్పుడూ ఎర్రని పూలు విరగకాస్తూ వుంటుంది. జ్యోతి నెమ్మదిగా ఆ చెట్టు దగ్గరికి వచ్చి నిలబడింది.

"ఏయ్, నా పెండ్లి తెలుసా! ఇంకనుంచి నేను నీ దగ్గరుండను. అయినా అప్పుడప్పుడూ వచ్చి నిన్ను చూసి పోతుంటాలే," అంటూ ఆప్యాయంగా ఆచెట్టును నిమిరింది.

ఆ పిల్ల మనసు తియ్యని ఊహల్తో నిండిపోయింది. ఎల్లన్న సేద్యం పనుల్లో వుండగా పెళ్ళికొడుకు తరఫు వాళ్ళ పెద్దమనిషి ఒకతను వచ్చి ఇంటిదగ్గర అతన్ని కలుసుకున్నాడు.

"చూడు ఎల్లన్నా, అవతల వాండ్లు పెండ్లికి తొందరిస్తావుండారబ్బా! ముందు గట్టితట్టన్నా పెట్టుకోరాదాని అడగనీకొచ్చినా," అన్నాడతను.

ఎల్లన్న కన్నా ముందు నాగమ్మ అతన్తో అంది. "అయ్యో ఎంత మాట గురయ్యాన్నా! మాకు లేదా పిల్లకు తొందరగా పెండ్లి చేస్తామని? కాకపోతే ఇప్పుడు సేద్యం పనులు పెట్టుకున్నేం, నీకు తెలుసు గదా. మేం కేశవరెడ్డి గారి ఏట్లోభూమి చేస్తాన్నాం. ఇప్పుడు గట్టి తట్ట పెట్టుకుంటే ఆ పనులాగిపోతాయ్."

గురయ్య నువ్వేం చెప్తావన్నట్లు ఎల్లన్న వంక చూశాడు. "అది చెప్పేది నిజమే గురయ్యాన్నా! కర్బూజా పండ్లు చేతికి రానీ," అన్నాడు ఎల్లన్న.

"అది సరే ఎల్లన్నా! నేను ఆడ్నుంచి ఈడికొచ్చింది నీ కర్బూజా పండ్ల మాట ఇనేదానికా? ఏదో ఒకటి పెండ్లి జరిపే మాట చెప్పరాదా అవతల నేను పోయి చెప్పనీకీ గుడకా బాగుంటాది," అన్నాడు గురయ్య.

"అన్నా, నీకు తెలియందేముండాది చెప్పు. ఇప్పుడు గట్టి తట్టంటే సామాన్యమా. కర్బూజా కాయలు పండినాయంటే నాకు గుడకా లెక్క చేతిలో ఆడతాది. అప్పుడు గట్టి తట్టల్యాకుండా పెండ్లికి మట్టసంగా ముహూర్తమే పెట్టుకుందాంలేబ్బా. ఆ మాటే పోయి చెప్పు" విన్నవించుకున్నాడు ఎల్లన్న.

"అంతేనంటావా. గట్టితట్ట పెట్టి తీరాల్నని వాండ్లు పట్టుపట్టితే ఏం చెప్పమంటావ్? గట్టి తట్ట పెట్టేది లేదని చెప్పమంటావా?"

"అయ్యో! అంతమాటెందుకు చెప్తావు లేన్నా, మాకు లెక్క చేతికొచ్చినాక గట్టితట్టే కావాల్నని వాండ్లు అంతగా అడిగితే అట్లే కానీలే. ఇప్పుడేదో సేద్యం పనుల్లో వుండాము, తొందరిస్తే ఎట్లన్నా?" అంది నాగమ్మ బతిమాలుకునే ధోరణిలో.

గురయ్య లేచి నిలబడ్డాడు.

"సరే ఎల్లన్నా! నువ్వంతగా చెప్తాండావు కాబట్టి అదేమాట చెప్తాలే కానీ ఒకటిమాత్రం చెప్తాండా ఇనుకో. ఆ ఏట్లో భూమిని నమ్ముకోని పెండ్లి ఎనకేస్తాండావు. ఏటి సేద్దెం ఓటి సేద్దెం ఎల్లన్నా. ఈ కాలంలో నీల్లు పారిచ్చి ఎరువులు బేసి పండిచ్చేనే పంట చేతికి వస్తాదో రాదో గుడకా తెలీకుండా పోతాంది. ఈ ఏట్లో సేద్యానికంత మురిపెమేంబా? ఆడబిడ్డ పెండ్లి పెట్టుకున్నావ్. కాస్త జాగర్తగా చేస్కో పనులు," అంటూ హితబోధ చేసి అంతా అయినాక ఆఖర్న చేతుల్లో లెక్క లేదనో ఇంకోటనో వాయిదా బేసినావంటే మల్లా

నేను చేసేదేవుండదు. సంబంధం దాటుకొని పోతాది. ఆ తర్వాత నన్నడగాకు. ముందే వాండ్లు మేనరికం వద్దనుకొని ఈ సంబంధం చేసుకుంటా వుండారు. వాయిదాలు బేస్తే వొప్పుకోరు. వస్తాబ్బా ఎల్లన్నా! వస్తామ్మా నాగమ్మా!" అంటూ హెచ్చరిక చేసి నిష్క్రమించాడు.

ఎల్లన్నా, నాగమ్మా, వాళ్ళ కొడుకు లిద్దరూ చాలా సేపటివరకూ స్తబ్ధుగా అలాగే కూర్చుండిపోయారు.

ఇంట్లో వున్న పెళ్లికూతురు జ్యోతి కూడా అలాగే స్తబ్ధుగా కూర్చోని వుంది. పెళ్ళిచూపుల్లో ఆమె పెళ్ళికొడుకుని చూసి ఇష్టపడింది. అప్పట్నుంచి అతని మీదే మనసు పెట్టుకుంది. ఇప్పుడు గురయ్య చెప్పిపోయిన మాటలు విని ఆ పిల్ల మనసు కూడా దిగులు పడిపోయింది.

అందర్లోకి ఎల్లన్నే ముందుగా తేరుకొని లేచి నిలబడినాడు. "కర్బూజా పండ్లు చేతికి రాందే ఏమీ కాదు. ఇప్పుడు గట్టితట్ట పెట్టుకుంటే కేసన్న కాడ తెచ్చిన పదివేలూ అయిపోతాయి. అప్పుడు పెండ్లి పనులకు గుడకా మనకాడ లెక్కుండదు. లెయ్యండి... లెయ్యండి... ఆ సేద్యం పనులేవో చూసుకుందాం," అన్నాడు.

తండ్రిమాట వింటూనే ఎల్లన్న కొడుకులిద్దరూ కృతనిశ్చయంతో లేచి నుంచుండి పోయారు.

ఎల్లన్న కేశవరెడ్డి దగ్గర గుత్తకు తీసుకున్న భూమి నిజానికి కేశవరెడ్డిది కూడా కాదు. ఆ మాటకొస్తే అసలా భూమి ఎవర్దీ కాదు... పెన్నమ్మ తల్లిది. ఆ నది ఎండిపోయి ఎప్పుడో ఎడారిగా మారిపోయింది. క్రమంగా అందులో ఇసక కూడా హరించుకుపోయి నేల గట్టిపడుతోంది. అందులో అక్కడక్కడా గుబురుగా కంపచెట్లు కూడా పెరుగు తున్నాయి. అలా అనాధగా మిగిలిపోయిన ఆ నదిని అనేకమంది అనేకరకాలుగా ఆక్రమించుకున్నారు. కొందరు ఏట్లోనే పక్కా ఇళ్లు కూడా కట్టుకోగా మరికొందరు ఆ భూమిని సేద్యానికి ఉప యోగిస్తున్నారు. సామాన్యులెవరూ అంతకు తెగించలేరనేది నిర్వివాదాంశం. అందుకు అంతో ఇంతో బలం కావాలి. అది రాజకీయ బలమైతే మరీ మంచిది.

అలాంటి వాళ్ళల్లో కేశవరెడ్డి ఒకడు. స్వతహాగా అతనేమీ రాజకీయ నాయకుడు కాదు. అయితే రాజకీయ నాయకుల దగ్గర పలుకుబడి వున్నవాడు. సందర్భానుసారంగా ఏ రాజకీయ నాయకుడి వల్ల తనకు ఉపయోగముంటుందో ఆ రాజకీయ నాయకుడి గొడుగు కిందకి వస్తాడు. కేవశరెడ్డి లాంటి వాళ్ళు భూముల్ని ఆక్రమించుకున్నా సొంతంగా వాటిని సాగుచేయరు. ఎవరికో గుత్తకిస్తారు. ఆ ఉద్దర సొమ్ము తింటూ కాలుమీద కాలేసుకు బతికేస్తుంటారు. కేశవరెడ్డి కూడా అదే చేశాడు.

మునుపటి సంవత్సరం ఆ ఏట్లో భూమిని కేశవరెడ్డి దగ్గర గుత్తకు తీసుకుని సాగు చేసినాడు ఎల్లన్న. రాయలసీమలో రెడ్లని కూడా కాపోల్లనే అంటారు. ఎల్లన్న రెడ్డికాడు గానీ కాపే. భూమి పుత్రా వున్నవాడు కాదు. తొలిరోజుల్లో తమ పల్లెలో వ్యవసాయ కూలీగా జీవిస్తుండేవాడు. కరువు మూలంగా అతనికి పని లేకుండా పోవడంతో టౌనుకు మకాం మార్చి బేల్దారుగా కుదురుకున్నాడు. మేస్త్రీ కూడా అయ్యాడు. అందులోనే అంతో ఇంతో డబ్బు సంపాయించి చిన్న ఇల్లు కూడా కట్టుకోగలిగాడు.

ఒకసారి మేస్త్రీగా వున్నవాడు కలకాలం మేస్త్రిగానే వుండలేడు. పని లేనప్పుడు ఇతర మేస్త్రీల దగ్గర మామూలు బేల్దారుగానే వెళ్ళవలసి వస్తుంది. ఎల్లన్న అలా కూడా చేశాడు. అయితే అతని అహం దెబ్బతిన్నది. ఒకసారి మేస్త్రీ అయినాక మళ్ళీ ఇంకో మేస్త్రీ దగ్గర పని చేయడం అతనికి నామోషీగా తోచింది. అందుకే సొంతంగా ఏదో పని చూసుకోవాలనుకున్నాడు. కేశవరెడ్డి దగ్గిర ఏట్లో భూమి గుత్తకు తీసుకున్నాడు.

ఆ ఇసక నేలలో వేరే ఏదీ పండకపోయినా కర్బూజా కాయలు మాత్రం విరగకాస్తాయి. ఏడాదికో కాపు. ఎల్లన్నకు మొదటిసారి కాపు చేతికి వచ్చినప్పుడు అది మంచి లాభసాటి వ్యవసాయంగా తోచింది. కర్బూజా పండ్లకు ఇతర ప్రాంతాల్లో చాలా గిరాకీ వుంది. అందులో విత్తనాలకే అతనికి పదివేల రూపాయల దాకా లాభం చేతికొచ్చింది. ఆ డబ్బుతోనే జ్యోతికి పెళ్ళికి కావల్సినవి చాలా వరకు అమర్చుకున్నాడు. డబ్బంతా అందుకే ఖర్చయిపోయింది.

కర్బూజా పళ్ళసీజన్ అయిపోతూనే చేతికి అందివచ్చిన కొడుకులిద్దర్నీ బేల్దారు పనికి పంపించాడు. ఆ ఇద్దర్లో ఆనందు మంచి పనివాడు. త్వరలో మేస్త్రీ కూడా కాదగినవాడు. చిన్నవాడు ప్రతాపు ఇంక బేల్దారు పనిలో రాటుదేలాలి. కర్బూజాల్లో వచ్చిన లాభం జ్యోతి పెళ్ళి సరంజామాకు సరిపోగా కొడుకులిద్దరి సంపాదనతోనే ఆ ఏడాది ఇల్లు గడిచింది. ఎల్లన్నకు ఎవరూ పిలిచి మేస్త్రీ పనివ్వలేదు. దాంతో చింతచెట్టు కింద కూర్చొని రోజూ పనీపాట లేనివాళ్లతో రాజకీయాలు చర్చిస్తూ కాలం గడిపేశాడు. ఇప్పుడు కర్బూజా కాయల సీజన్ మళ్ళీ వచ్చేసరికి అతన్లో తిరిగి మునుపటి ఉత్సాహం వచ్చేసింది.

ఈ ఏడాది జ్యోతి పెళ్ళి చేయలేననిగానీ, కేశవరెడ్డి అప్పు తీరదని కానీ ఎల్లన్నకు ఏమాత్రం భయంలేదు. కేశవరెడ్డి తనకు ముందుగానే వడ్డీ పట్టుకోకుండా డబ్బివ్వడంలో పెద్ద ఔదార్యం ఏమీ లేదని అతనికి తెలుసు. కేవశరెడ్డిని ఎల్లన్న క్షుణ్ణంగా ఎరుగును. కేశవరెడ్డి కొత్త ఇల్లు కట్టినపుడు ఎల్లన్నే మేస్త్రీగా వ్యవహరించాడు. ఆ మనిషి పైకెంత మెతగ్గా కనిపిస్తాడో లోన అంత కఠినుడని ఎల్లన్నకు తెలుసు. కేశవరెడ్డి డబ్బు గడించే

అనేకానేక మార్గాలలో డబ్బు వడ్డీలకు తిప్పడం కూడా ఒకటి. రాని బాకీలు వసూలు చేయడం ఎలాగో అతనికి బాగా వచ్చు. అవసరమైతే కేశవరెడ్డి అవతలి మనిషిని వంచనూ గలడు, తుంచనూ గలడు. అయితే కేశవరెడ్డిని చూస్తే ఎల్లన్నకి భయంలేదు. పోయి నేడాది కాపులో మంచి లాభం వచ్చింది. కాబట్టి ఈసారి కూడా వస్తుందనేది అతని లాజిక్. కరువు కాలంలో కర్బూజా పళ్లు ఎందరివో బతుకులు నిలబెట్టడం అతను స్వయంగా చూశాడు. కాపు బాగా చేతికి రావాలంటే ఒకటే సూత్రం – వాన రాకూడదు.

ఎల్లన్న వేసిన కర్బూజా పాదులు చూస్తుండగానే అలా అలా పాకిపోయాయి. తొలి కాపు కర్బూజాలు కాసేసరికి సంతోషం పట్టలేక ఎల్లన్న మంచి కాయలేరి నాలుగు బుట్టలు కేశవరెడ్డి ఇంటికి కానుకగా పంపించాడు. అంతవరకు ఎడారిలా నిస్తేజంగా వుండిన ఏట్లో భూమి ఇప్పుడు పచ్చదనం అల్లుకుపోయి కళకళలాడుతోంది.

ఇంటికి తాళం వేసి ఎల్లన్న ఇంటిల్లిపాది ఇప్పుడా తోటలోనే కాపురం పెట్టేశారు. చిన్న పాక. అందులో చిన్న పొయ్యి వండుకోవడానికి సత్తుగిన్నెలు, కొన్ని గింజలు. ఇవీ అక్కడ సరంజామా. కాలక్షేపం కోసం ఓ చిన్న ట్రాన్సిస్టర్ రేడియో.

ఆ రాత్రి ఎల్లన్న కుటుంబం అన్నం వండుకోలేదు. పండు వెన్నెల్లో పాక వెలుపల కూర్చొని కర్బూజా కాయల్ని ఓ పట్టుపట్ట నారంభించారు. "బుడమ కాయల మాదిరి కర్బూజాలు భలే అందంగా కాసినాయి నాయనా బాగుండాయి," ఆనందం వెలిబుచ్చింది జ్యోతి. "సర్లేమ్మి! నీ పెండ్లికి పప్పన్నం కాదు, వచ్చినోల్లందరికీ ఈ బుడమలే పెడ్తాం," హాస్యమాడాడు ఎల్లన్న చిన్నకొడుకు ప్రతాపు.

"నాకేం వద్దులే నీ పెండ్లికి మీ అత్తగార్ని అట్నే చెయ్యమని చెప్తాం" ఎదురెత్తి పొడిచింది జ్యోతి. అందరూ నవ్వుకున్నారు.

"ష్ ఆగండి. ఏందో శబ్దం రావడంలా?" అన్నాడు ఆనందు.

ఆ మాటలో అందరూ ఒక్కసారిగా నిశ్శబ్దంగా వుండిపోయారు.

"ఏదీ శబ్దం?" అంది జ్యోతి కాసేపటి తర్వాత.

"నాకు వినిపిస్తోంది. మీకెవరికీ వినపడరాలా? అదో మాదిరి విచిత్రమైన శబ్దం."

"యాడిది అంతా వొట్టిదే," అన్నాడు ప్రతాపు.

"య్యా! సరింగ ఇనమంటే అదో మాదిరి ఇసిత్రమైన శబ్దం. భూమి అరుస్తాన్నెట్టు."

ఆనందు మొహంలో భావం చూసి అందరూ మరోసారి, "అవును ఏదో నాకూ వినిపిస్తాన్నట్టుంది" అంది నాగమ్మ. ఎల్లన్న చప్పన భూమికి చెవిని ఆనించి శ్రద్ధగా విన్నాడు. తర్వాత నెమ్మదిగా లేచి కూర్చున్నాడు.

"ఔ, భూమి అరుస్తాంది" మిగతా నలుగురి మొహాల వంక చూస్తూ అన్నాడు.

దాంతో వాళ్ళు కూడా భూమికి చెవులానించేశారు. "ముసిలామె మాదిరి గరగరా అరుచ్చాంది భూమి," అంది నాగమ్మ.

జ్యోతి మొహం పాలిపోయింది. "ఏమైంది నాయనా? భూమి ఎందుకట్లా అరుచ్చాంది?" అంది. ఎల్లన్న తల విదిలించాడు.

"ఈ మాట నేను యాడనో ఇన్న్యా, ఎప్పుడో నా పిల్లప్పుడు," అన్నాడు జ్ఞాపకం చేసుకోడానికి తీవ్రంగా ప్రయత్నిస్తూ.

"నీల్ల కోసరమే భూమి అరుచ్చాంది," తేల్చి చెప్పింది నాగమ్మ.

"నీల్లు... నీల్లు... " జ్ఞాపకం చేసుకోవడానికి ఇంకా ప్రయత్నిస్తూనే అన్నాడు ఎల్లన్న. అయితే అప్పటికే అతనికేం జ్ఞాపకం రాలేదు.

ఆ మర్నాడు ఆనందు ఏదో పనుండి టౌన్లోకి వెళ్ళొచ్చాడు. "ఈ మాట ఇన్న్యవా నాయనా?" అన్నాడు వస్తూనే.

"ఏ మాట?" అడిగాడు ఎల్లన్న.

"మైలవరం డ్యాముకి నీల్లొస్తున్నాయంట. ఆడ యాడనో వానలు కురిసినాయంటనే."

ఎల్లన్నకు అప్పుడు స్ఫురించింది.

"ఔరా, ఇప్పుడు గ్యాపకం వస్తాంది. ఏటికి నీల్లొచ్చినాయంటే ఏరు అట్టారుచ్చాదంట. పిల్లపుడు విన్న్యా ఈ మాట," అన్నాడు.

"ఇప్పుడెట్లా నాయనా? ఏటికి నీల్లొస్తాయా?" భయంగా అంది జ్యోతి.

ఆనందు చెల్లెలికి అభయం ఇస్తున్నట్టు చూశాడు.

"ఎట్లొస్తాయే నీ మొహంగాని, డ్యాము నిండాల నీల్లివ్వాల. ఎప్పుడైనా అది మనం చూశామా?"

ఎల్లన్న ఏదో ఆలోచిస్తున్నాడు.

ఆనందు వాన అని చెప్పిన మాటలో అతనికేదో అపశకునం తోచినట్లయింది. చప్పున తల పైకెత్తి ఆకాశం వంక చూశాడు. ఆకాశం నిర్మలంగా వుంది. మబ్బు తునక జాడలేదు. అయినా ఎల్లన్నకు మనస్తిమితం కలగలేదు. అదే పనిగా రేడియో పెట్టి విన్నాడు. రాయలసీమలో రాబోయే ఇరవై నాలుగ్గంటల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. ఎల్లన్న మొహం పాలిపోయింది. మనసులోనే దేవుడికి మొక్కుకుని చేసేదేం లేక పాకలోకి వెళ్ళాడు.

క్రమంగా సాయంకాలం కాజొచ్చింది.

ఆకాశంలో కారు మేఘాలు అలుముకోవడం ప్రారంభమైంది. ఎక్కడో మెరుపు మెరిసింది.

ఆకాశం ప్రళయాంతకంగా గర్జించింది. పాకలోంచి గబగబా బయటికి పరిగెత్తుకొచ్చింది జ్యోతి. అప్పటికే చినుకులు ప్రారంభమైనాయి.

"పెద్దవాన వచ్చాందే!" గుండెమీద చెయ్యి వేసుకుంది జ్యోతి.

ఆమె మొహం కళ తప్పింది.

చిన్నపుడు వానలో ఎగుర్లాడుతూ ఆడుకున్న రోజులు గుర్తుకొచ్చాయి. ఇప్పుడెందుకో ఈ వానని చూస్తుంటే బూచిని చూసినట్టు భయం వేసింది.

చూస్తుండగానే వాన ఉధృతమైపోయింది. ఆనందు, ప్రతాపు చిన్నబోయిన మొహాలతో పాకలోంచి బయటికొచ్చారు.

వాళ్ళ వెనకే నాగమ్మా వచ్చింది. అందరికంటే వెనక ఎల్లన్న కూడా వచ్చాడు. అతని మొహంలో ఇప్పుడెలాంటి భావం లేదు.

"అంతా మునిగిపోతాంది," అంది నాగమ్మ.

ఎల్లన్న మాట్లాడలేదు. భూమి ఆబగా దాహం తీర్చుకుంటోంది. క్రమంగా బురదలో కలిసిపోతున్న కర్బూజాల వైపు జాలిగా చూశాడు ఎల్లన్న. రేపటికల్లా అవి పనికి రాకుండా పోతాయి.

నిన్న రాత్రి ఇదే స్థలంలో పండు వెన్నెల్లో కూర్చొని తాము పళ్లు ఆరగించారు.

నిన్నటికీ ఈ రోజుకీ ఎంత తేడా! ఎల్లన్న చెవుల్లో భూమి ఇంకా అరుస్తున్నట్టుగానే వుంది.

ఆ అయిదుగురూ ఉధృతంగా కురుస్తున్న వానలో తడుస్తూ పాక వెలుపల బిక్కు బిక్కుమంటూ మిగిలిపోయారు.

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 8-1-1997*

అంకితం:

1996 పెన్నా నది వరదలో ప్రాణాలు పోగొట్టుకున్న అభాగ్యులకు.

# ఆశీర్వాదం

"అన్నా, టెలిగ్రాం," గదిలోకొస్తూ అంది సుజాత.

సీరియస్‌గా ఏదో పుస్తకం చదివేస్తూ మంచంమీద పడుకున్న శేఖర్ కొంచెం ఆశ్చర్యంగా చూశాడు.

"టెలిగ్రామా! నాకెవరిస్తారబ్బా?!" అనుకుంటూ చేతిలోని పుస్తకం పక్కన పడేసి మంచంమీద లేచి కూచున్నాడు.

"ఉద్యోగం వచ్చిందనేమో చూడు," అంటూ సుజాత అతని చేతికి టెలిగ్రాం అందించింది.

"ఉద్యోగమా! ఆ వచ్చినట్టే!" అంటూ టెలిగ్రాం చించాడు శేఖర్. అతనా మాట ముభావంగానే అన్నా లోలోపల చెల్లెలి మాట నిజం కావాలని ఆశ పడ్డాడు. ఎన్నాళ్ళు గడిచినా ఉద్యోగం ఎండమావిగాలాగే ఊరిస్తోందతన్ని. రోజులు గడిచేకొద్దీ ఉద్యోగం రావడం తన జాతకంలోనే లేదని నిర్థారించుకున్నాడతను. అయినా ఆ ప్రస్తావన వచ్చినప్పుడల్లా మనసులో ఆశ రేగుతూనే ఉంటుంది. శేఖర్ బియ్యే పాసయ్యి నాలుగేళ్లు పూర్తి అయిపోయాయి.

టెలిగ్రాం ఉద్యోగం వచ్చిందని కాదు. అయినా ఒక విధంగా శుభవార్తే మోసుకొచ్చింది.

"ప్రసాదొస్తున్నాడు!" హుషారుగా మంచం దిగుతూ అన్నాడు. "రేపు రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కి. స్టేషన్‌కెళ్ళి రిసీవ్ చేసుకోవాలి," నీళ్ళగది వైపు నడిచాడు.

ప్రసాద్ పేరు చెబుతూనే సుజాత కళ్ళు మెరవడం శేఖర్ గమనించాడు. ఆ మెరుపుకు కారణమేమిటో అతనికి తెలుసు. పెళ్ళికావలసిన పిల్ల కళ్ళల్లో కనిపించే మెరుపది. సుజాత ప్రసాద్ మీద లోలోపలే ఆశ పెట్టుకుందని గ్రహించలేని వాజమ్మ కాడతను. ఆ ఆశను తుంచే ప్రయత్నం శేఖర్ ఎప్పుడూ చేయలేదు. ఒక విధంగా ఆ ఆశ తను కల్పించిందే. సుజాతని చేసుకోమని ప్రసాదునడగాలని అతను ఏ కాలంనాడో నిర్ణయించుకున్నాడు. ఆ మాట తల్లి ముందు వెల్లడించాడు కూడా.

సుజాతని ప్రసాదుకివ్వాలనుకోవడం స్నేహితుడని మాత్రమే కాదు. ఒక విధంగా పరిస్థితుల ప్రభావం వల్ల కూడా.

శేఖర్ తండ్రి పెద్దగా ఆస్తిపాస్తులేమీ వదలిపెట్టి పోలేదు. ఒక చౌడుమిద్దె, పల్లెలో నాలుగెకరాల మెట్ట పొలం. ఆ మిద్దె కూడా బాగా పాతబడిపోయి దంతెలు పుచ్చి కప్పు కూలిపోయే స్థితిలో వుంది. కప్పు పీకేసి కనీసం సున్నం పిట్టుతోనైనా ఇంటికి కప్పేసుకోవాలని శేఖర్ ఆలోచన. ఆ ఆలోచన అంత ఆచరణయోగ్యమైనదేమీ కాదు. కారణం డబ్బులేకపోవడమే. చదువుకున్న చాలామంది కుర్రాళ్ళలాగే శేఖర్‌కు వ్యవసాయం చేతగాదు. అందుకే ఉన్న ఆ నాలుగెకరాల పొలం గుత్తకిచ్చేశాడు.

పొలం మీదొచ్చే గుత్తా, తను ఓ స్నేహితుడు నడుపుతున్న ట్యుటోరియల్ కాలేజీలో తెలుగు పాఠాలు చెప్పి సంపాదించే కొద్దిపాటి డబ్బూ ఇల్లు గుట్టుగా గడిచిపోవడానికి సరిపోతుంది. వానాకాలంలో ఇల్లు కారినా సొంతిల్లు కాబట్టి ఓ పూట తిన్నా ఓ పూట తినకపోయినా మర్యాదగా గడిచిపోతుంది. సమస్య పూట గడవడం గురించి కాదు, సమస్య సుజాత పెళ్ళిగురించి.

తమకున్న ఇల్లూ పొలమూ తెగనమ్ముకున్నా మంచి వరుడ్ని తెచ్చి చెల్లెలి పెళ్ళి చేయగలనన్న నమ్మకం శేఖర్‌కి లేదు. ఇల్లు చూస్తే పాతకాలం నాటి చౌడుమిద్దె. పొలం చూస్తేనేమో వర్షాధారం. రెండూ ఎక్కువ ధర పలకవు. మరి ఈ రోజుల్లో కాస్త యోగ్యుడైన వరుడు కావాలంటే లక్షల్లో పలుకుతోంది రేటు.

అందుకే తన చెల్లెల్ని చేసుకోమని ప్రసాదునడగదల్చుకున్నాడు శేఖర్. తనడిగితే ప్రసాద్ కాదనడనే అతని నమ్మకం.

ప్రసాద్ అందరిలాంటివాడు కాడు. అతనికి జీవితంలో కొన్ని ఆశయాలున్నాయి. కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకోవడం అందులో ఒకటి. కాలేజీలో చదివే రోజుల్లో ప్రసాద్ ఎన్నిసార్లు వరకట్న దురాచారం మీద తనకు లెక్చర్లిచ్చేవాడో లెక్కలేదు. ఎప్పటికైనా సరే కట్నం లేకుండా పెళ్ళి చేసుకోవడమే తన జీవితాశయమనేవాడు. మగవాడు కాబట్టి కట్నం తీసుకోకపోయినా పెళ్లి జరుగుతుంది. ఆడపిల్ల సంగతలా కాదు, కట్నం ఇచ్చుకోకపోతే పెళ్లి జరగదు.

శేఖర్ సుజాతని ప్రసాదుకివ్వాలనుకోవడానికి కారణం నిజానికి అది కూడా కాదు. ప్రసాద్ ఆ రోజుల్లో సుజాత గురించి అన్యాపదేశంగా ఇంట్రెస్టు కనబరిచేవాడు. సుజాత కుందనపు బొమ్మలా వుంటుంది. వాళ్ళిద్దరికీ ఈడూ జోడూ కూడా బావుంటుంది. అందుకే తనడగ్గానే ప్రసాద్ ఒప్పేసుకుంటాడని నమ్మకం శేఖర్‌కి. తల్లితో కూడా అదేమాట చెప్పాడు.

తన పెళ్ళి గురించి జరుగుతున్న ప్రయత్నాలు అర్థం చేసుకోలేకపోవడానికి సుజాత పసిపిల్ల కాదు. ప్రసాద్ పేరు తన మనసులో వుంది కాబట్టే ఆమె మనసులోనూ వుంది.

బ్యాంకులో ఉద్యోగం వచ్చి ప్రసాద్ హైదరాబాద్ వెళ్ళిపోయాక అతని ముందు పెళ్ళి ప్రస్తావన తేవడానికి వీల్లేకపోయింది. తనే ఎప్పుడో వీలు చూసుకుని హైదరాబాద్ వెళ్ళి రావాలనుకుంటున్నాడు. అంతలోనే ఈ టెలిగ్రాం వచ్చింది.

ఎందుకో ప్రసాదే తన చెల్లెల్ని అడగడానికొస్తున్నాడన్న నమ్మకం వద్దన్నా కలుగుతోంది శేఖర్‌కు. ఆ మాటనుకుంటున్నప్పుడు అతని కుడికన్నదిరింది కూడా.

శేఖర్ నీళ్ళగదిలో మొహం కడుక్కుంటుండగా తల్లి పెరట్లోంచి వచ్చింది.

"ఏమే ఉద్యోగమంటున్నావు – అన్నకుద్యోగం వచ్చిందా?" వస్తూనే సుజాత నడిగింది. కొడుకు ఉద్యోగం చేస్తాడని పాపం ఆవిడ కూడా ఆశ పెట్టుకుంది.

"ఉద్యోగం కాదు. అన్న స్నేహితుడొస్తున్నాడంట," అంది సుజాత.

"ఏ స్నేహితుడూ?" ఆరా తీసిందావిడ.

"ఏమో, నాకేం తెలుసు?" ముందరి జడ వెనక్కేసుకుంటూ తనలో తనే ముసిముసిగా నవ్వుకుంటూ పెరట్లోకి వెళ్ళింది సుజాత.

ఇంతలో శేఖర్ నీళ్ళగదిలోంచి బయటికొచ్చాడు.

"ఎవర్రా స్నేహితుడొస్తున్నాడంట?" అడిగింది తల్లి.

"ప్రసాదమ్మా! రేప్పొద్దున రైల్లో వస్తున్నాడు," టవల్తో మొహం తుడుచుకుంటూ అన్నాడు శేఖర్.

"ప్రసాదొస్తున్నాడా?!" నమ్మకం కుదరనట్టుగా అంది తల్లి.

"అవునమ్మా! రేపు వాడు రాగానే సుజాత విషయం అడిగేస్తాను," అంటూ టవల్ పక్కన పడేసి దండెం మీదున్న పాంటు చేతిలోకి తీసుకున్నాడు.

కొడుకు ఆ మాట చెప్పగానే తల్లి ప్రసన్నంగా చూసింది.

"ఎక్కడికెళ్తున్నావ్?" అడిగింది.

"ఇంట్లో సరుకుల్లేవుగా. పచారి అంగడికెళ్ళి తెస్తాను. రేపు వాడికేదైనా స్పెషల్ వండి పెట్టొద్దూ!" అంటూ పాంటు తొడుక్కుని షర్టు వేసుకున్నాడతను.

"అయితే జేబులో లెక్కుందా?" అడిగింది తల్లి.

"లెక్కెక్కడిదే? అప్పే!" అని సంచి తీసుకుని బయటికి నడిచాడు.

అంతవరకూ పెరటి గుమ్మం చాటున నిలబడి తల్లీ కొడుకుల సంభాషణ వింటున్నదల్లా సుజాత "లలలా లలలా" అనుకుంటూ తులసికోట దగ్గరకెళ్ళి కూచుని ఆనందంగా తనలో తను నవ్వుకుంది.

ఆ మర్నాడు ఉదయం అయిదున్నరకే స్నేహితుడ్ని రిసీవ్ చేసుకోవడానికి రైల్వే స్టేషన్‌కు బయల్దేరాడు శేఖర్. ప్రొద్దుటూరులో రైల్వే స్టేషన్ లేదు. అక్కడికి పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎర్రగుంట్లకు వెళ్ళాలి. అమ్మవారిశాల దగ్గర ఆర్టీసీ బస్సు పట్టుకుని ఇరవై నిమిషాల్లో ఎర్రగుంట్ల చేరుకున్నాడు. ఎర్రగుంట్ల పెద్ద స్టేషన్ కాదు. అయినా పక్క ప్రొద్దుటూరుండటం వల్ల ఆ స్టేషన్‌కి ప్రాముఖ్యత వచ్చింది.

ఆరున్నర గంటలకు రావలసిన రాయలసీమ ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా ఏడున్నరకొచ్చింది. రైల్లోంచి ప్రసాద్ దిగుతూనే శేఖర్ అతన్ని కౌగిలించుకున్నంత పని చేశాడు. రైలు దిగుతూనే శేఖర్ మీద ప్రశ్నల వర్షం కురిపించాడు ప్రసాద్. అమ్మెలా వుంది? ఊళ్ళో తమ పాత స్నేహితులందరూ ఎలా ఉన్నారు? ప్రసాద్ సుజాత గురించి అడగటానికి సిగ్గు పడుతున్నాడు అనుకుంటూ లోలోపలే నవ్వుకున్నాడు. అతని ప్రశ్నలన్నింటికీ ఓపిగ్గా సమాధానాలు చెప్పాడు. ఇద్దరూ కలిసి స్టేషన్ బయటికొచ్చి ప్రొద్దుటూరు వెళ్ళే బస్సుకోసం ఓ టీ అంగడి దగ్గర కాసేపుక్కూర్చున్నారు.

"సరే గానీ, అందరిగురించీ అడిగావు. సుజాత గురించి అడగలేదేమిరా?" అన్నాడు శేఖర్.

"సుజాతా!" అంటూ కళ్ళప్పగించి చూశాడు ప్రసాద్. "ఓ సుజాత. సుజాత బావుందా?" అడిగాడు.

సుజాత తనకు గుర్తే లేనట్టుగా అతను మాట్లాడ్డం చూసి శేఖర్‌కు గుండెలో కలుక్కు మంది.

"ఆ బావుందిలే," అన్నాడు అన్యమనస్కంగా.

ప్రసాద్ సుజాత గురించి సంభాషణ పొడిగించలేదు. గడగడా మాట్లాడేస్తూ సంభాషణ మరోవైపు మళ్లించాడు. ప్రసాద్ ఎప్పుడూ అంతే. ఏది మాట్లాడినా గడగడా ఉపన్యాస ధోరణిలో మాట్లాడతాడు. అతని మాటల్లో ఏదో ఒక సమ్మోహనశక్తి కూడా వుంది. అతని మాటల్లో పడి శేఖర్ మళ్ళీ మామూలైపోయాడు. ఇంతలో బస్సురావడంతో ఇద్దరూ బస్సెక్కి కూచున్నారు. బస్సు కదిలాక ప్రసాద్ తను రావడానికి కారణం చెప్పాడు. అతను చెబుతున్నది వింటుంటే శేఖర్ తన చెవుల్ని తానే నమ్మబుద్ధి కాలేదు. గుండెల్లో సన్నని తుఫాను బయల్దేరింది.

ప్రసాద్ ప్రొద్దుటూరుకి రావడానిక్కారణం పెళ్లి చూపులు.

"ఏం లేదురా, మా నాన్నగారి స్నేహితుడొకాయన ప్రొద్దుటూర్లో బిజినెస్ పెట్టి అక్కడే సెటిలైపోయాడు. ఆయన మూడో అమ్మాయి. రెండు లక్షల కట్నం ఇస్తామన్నారు. కట్నం

సంగతి సరేగానీ, అమ్మాయి బావుంటే ఈ మాఘమాసంలోనే చేసేసుకుంటాను," అన్నాడు ప్రసాద్.

అమ్మాయి బావుంటే!

'ఏం? సుజాత నీ కళ్ళకు బాగాలేదా?' అనరవాలనిపించింది శేఖర్‌కు. తమాయించు కున్నాడు.

"ఇంతకీ ఆ పెద్ద మనిషెవరు?" చేదుగా అడిగాడు.

"వెలగా సుబ్బయ్యగారనీ! మా నాన్నగారూ ఆయనా కలిసి చదువుకున్నారట," అంటూ నెమ్మదిగా తన మనసులో వున్న అసలు విషయం చెప్పాడు ప్రసాద్. "కానీ, నా మనసు మాత్రం ఈ సంబంధం మీద లేదురా," అని.

అతనా మాట అంటూనే శేఖర్ మనసులో మళ్ళీ ఆశ చిగురించింది.

"అయితే నీ మనసు ఎవరిమీదుంది?" అడిగాడు.

"మొన్ననే రాజమండ్రిలో ఒకమ్మాయిని చూశాను. అప్సరసనుకో. పైగా వీళ్ళకంటే యాభైవేలు ఎక్కువ కట్నమిస్తామంటున్నారు. ఆ అమ్మాయి కంటే బావుంటేనే ఈ అమ్మాయిని చేసుకుంటాను. కట్నం కూడా మరో యాభైవేలు ఎక్కువడిగిస్తాను," అన్నాడు ప్రసాద్.

అతనా మాటనగానే శేఖర్ మొహం మీద చన్నీళ్లు కొట్టినట్టయింది.

కట్నం!

తనెరిగిన ప్రసాదేనా ఇలా మాట్లాడుతున్నాడు.

"కట్నం కట్నం అంటున్నావు. చదువుకునే రోజుల్లో కట్నం తీసుకోనని ఉపన్యాసా లిచ్చేవాడివిగా!" అన్నాడు శేఖర్.

ప్రసాద్ నవ్వాడు.

"అవి చదువుకునే రోజులు కాబట్టి అలా అనేవాడ్ని. చదువు పూర్తయిపోయిందిగా, ఇప్పుడన్నీ తెలుస్తున్నాయి. అయినా బ్యాంకాఫీసర్ని అయ్యుండి కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటే నామోషీ కాదూ?" ఎదురు ప్రశ్న వేశాడు.

'అందుకే కాబోలు ఈ బీదస్నేహితుడు నీకు గుర్తుకు రాలేదు,' తనలో తనే చేదుగా అనుకున్నాడు శేఖర్. అతనా చేదు దిగమింగుకుంటూ వుండగానే వూరొచ్చేసింది.

"రా, నీకోసం అమ్మ ఎదురు చూస్తోంది," అంటూ బస్సు దిగాక రిక్షాని కేకెయ్య బోయాడు శేఖర్. తన మనసులోని చేదు బయట పడనీయకుండా ఉండడానికి శతథా ప్రయత్నిస్తున్నాడతను. అందులో చాలావరకు కృతకృత్యుడౌతున్నాడు కూడా.

"మీ ఇంటికా?!" వెర్రివాడ్ని చూసినట్టు చూశాడు ప్రసాద్.

"ఏం? నువ్వు మా ఇంటికి రావడం లేదా?" అడిగాడు శేఖర్.

ప్రసాద్ నొచ్చుకుంటున్నవాడిలా చూశాడు.

"సారీ బ్రదర్! మీ ఇంటికి రాలేను. ఈ అమ్మాయి వాళ్ళ నాన్న కోసం హోటల్ రూం బుక్ చేశాడు. అక్కడే తయారై పెళ్ళిచూపులకు వెళ్తాను," అన్నాడు.

శేఖర్ పొందిన నిరాశ అంతా ఇంతా కాదు.

"నువ్వలా అంటే ఎలా ప్రసాద్? అమ్మ నీకిష్టమని పాయసం కూడా చేస్తోంది," అన్నాడు.

"అరెరె, ముందుగా నీకీ విషయం ఉత్తరం రాయకపోవడం వల్ల వచ్చిందీ ఇబ్బంది. మీ ఇంటికి మరోసారి వస్తాలే శేఖర్," అన్నాడు ప్రసాద్.

"ఇప్పుడంటే సరేలే! సాయంత్రం కూడా మా ఇంటికి రావా?" అడిగాడు శేఖర్.

"సాయంత్రం దాకా నేనీ ఊళ్ళో ఉండనుగా!" అన్నాడు ప్రసాద్.

"అదేం?"

"నెల్లూర్లో నాకో చిన్న పనుంది. ఈ పెళ్లి చూపులు అయిపోతూనే మధ్యాహ్నం బస్సుకి నెల్లూరు వెళ్ళి ఒకరోజు అక్కడుండి అట్నుంచటే హైదరాబాద్ వెళ్ళిపోతాను."

"సరేలే, అయితే నిన్ను హోటల్లో దించి నేను ఇంటికెళ్ళిపోతాను," నీరసంగా అన్నాడు శేఖర్.

ప్రసాద్‌ని కలుసుకోవాలని ఎంత ఉత్సాహపడ్డాడో అంత నిరుత్సాహం ఏర్పడిందతనికి.

ఎంత మారిపోయాడు ప్రసాద్!

అతనిది రాజంపేట దగ్గర పల్లెటూరైతే ప్రొద్దుటూర్లో కాలేజీ సీటొచ్చిందని ఇక్కడ విడిచి పెట్టాడు ప్రసాద్ తండ్రి. అతను బియ్యేస్సీ, తను బియ్యే. అయినా తామిద్దరి మధ్యా చిత్రంగా స్నేహం కుదిరింది. ఆ రోజుల్లో ఒక చిన్న రూంలో ఉంటూ హోటల్ కూడు తినలేక వారంలో ఎక్కువ రోజులు తమ ఇంట్లోనే భోం చేసేవాడు. అప్పట్లో తన తండ్రి బ్రతికే వుండేవాడు. ఇంట్లో మంచి మంచి వంటకాలు చేసేవారు. తన తల్లి చేసిన పాయసాన్ని ఎంతో ఇష్టంగా మరీ మరీ అడిగి తినేవాడు ప్రసాద్. ఇప్పుడేమో తన ఇంటికే రానంటున్నాడు.

ప్రసాద్ అతన్ని నిష్ఠూరంగా చూశాడు.

"నువ్వలా ఇంటికెళ్ళిపోవడానికేనా అదే పనిగా టెలిగ్రామిచ్చి నిన్ను పిలిపించుకున్నది!" అన్నాడు.

"మరేం చేయమంటావ్?" చిరాగ్గా అడిగాడు శేఖర్.

"నువ్వు నాతో పెళ్ళిచూపులకి రావా? నువ్వే నాకు తోడు పెళ్ళికొడుకువి," నవ్వాడు ప్రసాద్.

తోడు పెళ్ళికొడుకు!

శేఖర్ మనసు బాధగా మూలిగింది.

"ఎందుకులే ప్రసాద్ నేను రావడం!" అన్నాడు నెమ్మదిగా.

"నువ్వు నావెంట వుంటావని ఎంతో ఆశతో నేనొస్తే రానంటావా! ఇప్పుడేమైంది నీకు?"

"మరేం లేదు, నా బట్టలు బాగోలేవు," నసిగాడు శేఖర్.

ప్రసాద్ అతనికేసి తేరిపార చూసి "నీకేమైంది! బావున్నావులే రా," అన్నాడు.

చాలా రోజుల తర్వాత అతన్ని కలుసుకోబోతున్న ఉత్సాహంలో, ఇస్త్రీ బట్టలేసుకుని ట్రిమ్‌గా తయారై ఖరీదైన డ్రెస్ తీసి తొడుక్కున్నాడు ప్రసాద్. ఇన్‌షర్ట్ చేసి మెడకు టై కట్టుకున్నాడు.

"ఇలా నేనీ పెళ్లిచూపులకి వెళ్తున్నది నామకార్థమే. రాజమండ్రి అమ్మాయి కంటే ఈ అమ్మాయి బావుంటుందన్న నమ్మకం నాకు లేదు," అన్నాడు ప్రసాద్.

"రాజమండ్రి మనకు చాలా దూరం కదూ?" శేఖర్ సందేహం వెలిబుచ్చాడు.

"దూరమైతేనేం? ఆ అమ్మాయి ఫస్ట్‌గా వుంది. కట్నం కూడా ఎక్కువే ఇస్తున్నారు. మనలో మాట – ఆ అమ్మాయివాళ్ళ నాన్నకి తానొక్కతే కూతురు. చాలా ఆస్తిపరులు," అన్నాడు ప్రసాద్.

శేఖర్‌కి అతని మాటలు వెగటు పుట్టించాయి. రాజమండ్రి అమ్మాయి రాజమండ్రి అమ్మాయని అతను గోల పెట్టడంలో అంతరార్థం ఇప్పుడు బోధపడింది. ప్రసాద్ పెళ్ళవుతూనే మామగారి చావుకోసం కాచిపెట్టుక్కూర్చునే గుంటనక్కలా అనిపించాడు. ఒక మనిషి కొన్ని సంవత్సరాల తేడాలో ఇంతగా మారిపోగలడా? అతనికి భరించరానంత విస్మయంగా ఉంది. హఠాత్తుగా ప్రసాద్ ఎవరో కొత్త మనిషిలా కనిపించాడు. మునుపటిలా అతనితో ఫ్రీగా మాట్లాడలేకపోతున్నాడు తను. మాట్లాడాలంటే మాటల కోసం వెదుక్కోవలసిన పరిస్థితి.

ఇంతలో ఆ పెళ్ళికూతురి తమ్ముడు కారు తెచ్చాడు. శేఖర్ ప్రసాద్‌తో కలిసి వెళ్ళి కార్లో కూచున్నాడు. కార్లో కూర్చుంటూనే ప్రసాద్ ఒక్కసారిగా రిజర్వ్‌డ్‌గా మారిపోయాడు. అతనప్పుడే పెళ్ళికొడుకు హోదా వెలగబెట్టడం శేఖర్‌కు చిరాకనిపించింది.

సుబ్బయ్యగారిల్లు పెద్ద బంగళా, ఇటీవలే కట్టింది. సుబ్బయ్యగారు వాళ్ళిద్దర్నీ చాలా మర్యాదగా రిసీవ్ చేసుకున్నాడు. చూస్తూనే వాళ్ళది చాలా మర్యాదస్థుల కుటుంబమని గ్రహించాడు శేఖర్. ప్రసాద్‌ని ఎంత గౌరవంగా చూశారో శేఖర్నీ అంత గౌరవంగా చూశారు సుబ్బయ్యగారు. టిఫిన్ వచ్చింది. ఇద్దరూ టిఫిన్ తిన్నాక, "అమ్మాయిని పిలిపించ మంటారా?" అని ఎంతో మర్యాదగా అడిగాడు సుబ్బయ్యగారు. ప్రసాద్ తలూపాడు.

ఆడవాళ్లు వెళ్లి అమ్మాయిని తీసుకొచ్చారు. ఎక్కువ ఆడంబరం లేకుండా సాదాసీదాగా అలంకరించారా అమ్మాయిని. అమ్మాయి కూడా సాదాసీదాగానే ఉంది. అప్సరస కాదు. పైగా కొంచెం నల్లగా వుంది. అయితేనేం ఆ ముఖంలో మంచి కళ వుంది అనుకున్నాడు శేఖర్. వస్తూనే వాళ్ళకెదురుగా ఒద్దికగా నేలమీద కూర్చుందా అమ్మాయి.

"ఏవైనా ప్రశ్నలడుగుతావేమో అడుగు బాబూ!" అన్నారు సుబ్బయ్యగారు.

"మీ పేరు?" మొదటి ప్రశ్న వేశాడు ప్రసాద్.

"సుజాత."

పరధ్యానంగా వేళ్ళ మధ్య కాఫీ కప్పు ఆడిస్తూ కూర్చున్న శేఖర్ ఆ పేరు వింటూనే చటుక్కున తల పైకెత్తి ఆ అమ్మాయికేసి సూటిగా చూశాడు. ఈ అమ్మాయి పేరు కూడా సుజాతే కావాలా!

"ఎంతవరకూ చదువుకున్నారు?" అడిగాడు ప్రసాద్.

"ఇంటర్మీడియట్."

ఆ తర్వాత మరికొన్ని ప్రశ్నలు వేశాడు ప్రసాద్. ఆ అమ్మాయి వినయంగా సమాధానాలు చెప్పింది. 'అదివో అల్లదివో శ్రీహరివాసము' అనే అన్నమయ్య కీర్తన కూడా పాడింది. శేఖర్ చెల్లెలు కూడా ఆ కీర్తన చాలా బాగా పాడుతుంది. ఈ అమ్మాయి గొంతు తన చెల్లెలి కంఠమంత శ్రావ్యంగా లేకపోయినా బాగానే వుంది. తర్వాత ఆమె ఉచ్చారణ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని ఆమెచేత చందమామ చదివించాడు ప్రసాద్. ఒకసారి లేచి నడవమన్నాడు. ఆమె అతను చెప్పినవన్నీ చేసింది.

శేఖర్‌కు అక్కడ ముళ్లమీద కూర్చున్నట్లుగా వుంది. 'ఆపండి ఇదంతా అన్యాయం. ఇతగాడీ అమ్మాయిని చేసుకోబోవడం లేదు' గొంతెత్తి అరవాలనిపించిందతనికి. ప్రసాద్ ఎలాగూ ఆ అమ్మాయిని చేసుకోబోవడంలేనప్పుడు అన్నిరకాల ప్రశ్నలు వేసి అన్నివిధాల ఆమెను పరీక్ష చేసి ఆ అమ్మాయి సహనాన్ని పరీక్షించడం ఘోరమనిపించింది. ఇన్ని విధాల పరీక్ష చేసి చూశాక ఈ అమ్మాయి తనకు నచ్చలేదని తిప్పికొడితే ఆమె ఎంత క్షోభ అనుభవిస్తుందో తల్చుకుంటే అతనికి కంపరం పుట్టింది.

ఎంత వద్దనుకున్నా శేఖర్‌కు ఈ సుజాతలో తన చెల్లెలు సుజాతే కనిపిస్తోంది. ప్రసాదుక్కూడా పెళ్లి కావలసిన చెల్లెలు ఇంట్లో ఉంది. తన చెల్లెల్నీ ఇలాగే సంతలో వస్తువులా అన్నిరకాలా పరీక్షించి ఆ తర్వాత తనకు నచ్చలేదని ఏ పెళ్ళికొడుకైనా తిప్పికొడితే ప్రసాదుకెలా వుంటుంది? తన పిచ్చిగానీ అలా ఆలోచించేవాడే అయితే ప్రసాద్ ఇలాంటి మోసానికి ఎందుకు పూనుకుంటాడు? పిల్ల నచ్చలేదని తిప్పి కొట్టడానికి ముందే నిర్ణయించుకుని నిమ్మకు నీరెత్తినట్టు ఇలా వచ్చి పెళ్ళిచూపులకు కూచుంటాడా? అంతా ఫార్సు. క్రూరమైన ఫార్సు. మనుషుల్తో ఆడుకునే ఈ క్రూరమైన ఆటలో తనకూ భాగం వుందనిపించి లోలోపలే కుంచించుకుపోయాడు శేఖర్. ఎంత త్వరగా అక్కడ్నించి బయటపడితే ప్రాణానికి అంత హాయిగా ఉంటుందనిపించింది. ప్రసాద్ మీద కొన్ని సంవత్సరాలపాటు ఏర్పర్చుకున్న మంచి అభిప్రాయాలన్నీ కొన్ని గంటల వ్యవధిలో తుడిచిపెట్టుకుపోయాయి. అతని మొహంలోకి చూడాలంటేనే అసహనంగా వుందిప్పుడు. ఇలాంటి వాడికా తన చెల్లెల్ని ఇవ్వాలనుకున్నాడు!

అయితే అతనాశించినంత త్వరగా ఆ తతంగం ముగియలేదు. ప్రసాద్ అమ్మాయిని తీరిగ్గా పరీక్షించినంతసేపూ పరీక్షించిగానీ వదిలిపెట్టలేదు. ఆ అమ్మాయి అక్కడ్నించి లోపలికి వెళ్ళిపోయాక అనిపించిన రిలీఫ్ కూడా ఎంతోసేపు నిలవలేదు. పెళ్ళిచూపుల తంతు ముగిశాక మధ్యాహ్నం భోజనానికి అక్కడే వుండిపోవలసి వచ్చింది. వచ్చిన పెళ్ళికొడుకు తన పాత స్నేహితుడి కొడుక్కూడా కావడంతో సుబ్బయ్యగారు ప్రసాద్‌ని మరింతగా మర్యాద చేశారు. అక్కడున్నంత సేపూ తమతో ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉన్నాడాయన. ప్రసాద్ పెళ్ళికొడుకు హెూదా వెలగబెడుతున్నాడు కాబట్టి ముక్తసరిగా ఒకటీ రెండు మాటలకంటే ఎక్కువ మాట్లాడలేదు. గడగడా మాట్లాడే ఆ ధోరణి అంతా ఏమైపోయిందోననిపించింది. సుబ్బయ్యగారి మాటల్ని బట్టి ఆయనకు చాలా విషయాలు తెలుసుననిపించింది. ఆటమిక్ బాంబునుంచి ఆడపిల్లల పెళ్ళిళ్ళ దాకా చాలా మాట్లాడాడు. కనీసం ఆయన మాటలు శేఖర్‌కి విసుగనిపించలేదు. చెబుతున్నంతసేపూ వింటుండిపోయాడు. లక్కీగా ఆయన సంభాషణ ప్రాచీన తెలుగు కావ్యాలవైపు మళ్లడంతో శేఖర్ హుషారుగా తనూ మాట్లాడ్డం మొదలెట్టాడు. తనకిష్టమైన విషయం గురించి ఆయన ప్రస్తావించడంతో అంతవరకు తను పొందిన విసుగుదలంతా మర్చిపోయి నన్నయ్య నుంచి చిన్నయ్య దాకా డిస్కస్ చేసి పారేశాడు. శేఖర్ మాటలు సుబ్బయ్యగారికి చాలా నచ్చాయి. ప్రాచీన కావ్యాల్ని అంత శ్రద్ధగా చదివినందుకు ఆయన శేఖర్ని మెచ్చుకున్నారు కూడా.

భోజనాలయ్యాక సుబ్బయ్యగారు ఇద్దరికీ వీడ్కోలు చెప్పి మళ్ళీ కారులోనే హొటల్‌కి పంపించాడు. ప్రసాద్ ఆయనకు బాగా నచ్చాడని ఆయన మొహంలో కనిపించిన సంతృప్తి చెబుతోంది. హొటల్‌కి చేరుకోగానే కారుని తిప్పి పంపేసి హొటల్ రూం ఖాళీ చేసి బస్టాండుకి బయల్దేరదీశాడు ప్రసాద్.

"ముసలాయనికి నాకంటే నువ్వే బాగా నచ్చినట్టున్నావ్. నువ్వే ఆ అమ్మాయిని చేస్కో." రిక్షాలో వెళ్తుండగా జోక్ చేశాడు.

శేఖర్‌కి మండుకొచ్చింది.

'రాస్కెల్, ఆ అమ్మాయి నా చెల్లెల్లాంటిదిరా'! అందామనుకుని ఏమీ అనకుండా ఊరుకున్నాడు.

ప్రసాద్‌ని నెల్లూరు బస్సెక్కించే ముందు మాత్రం తనకు మనసులో అనిపించిన విషయం నిక్కచ్చిగా చెప్పేశాడు.

"నువ్వా అమ్మాయిని అన్ని రకాల పరీక్షించి నచ్చలేదని తిప్పికొట్టడం బావుండదు. నువ్వు చేసిన పని నాకేం నచ్చలేదురా ప్రసాద్."

ప్రసాద్ పకపకా నవ్వాడు.

"పిచ్చిమొహమా! పెళ్ళిచూపులకు వెళ్ళించోటల్లా అమ్మాయిని చేసుకుంటూ పోతే ఇరవైమందిని చేసుకోవల్సి వస్తుంది," అని బస్సెక్కాడు.

'నిజం చెప్పావు ప్రసాద్. పెళ్ళిచూపుల్లో నీకున్న ఛాయిస్ ఆడపిల్లకు లేదు అనుకున్నాడు శేఖర్.

నెల్లూరు బస్సు వెళ్ళిపోయాక ఉదాసీనంగా ఇంటికి చేరుకున్నాడు శేఖర్. తల్లి ఎదురొచ్చింది. సుజాత ఆసక్తిగా తన వెనక్కి చూసింది.

"ఇయ్యాలయ్యిందేమిరా? ప్రసాదేడీ?" అంది తల్లి.

ఆ ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే రక్తం వుడికిపోయింది శేఖర్‌కి.

"వచ్చాడు పోయాడు! వాడి గురించి మనకెందుకులే." అంటూ షర్టు తీసి విసుగ్గా దండెంమీద పడేసి పాంటుతోనే మంచంమీద అలసటగా కూచుండిపోయాడు.

తల్లి ఆ మాటతో వదిలిపెట్టలేదతన్ని. శేఖర్ జరిగిందంతా చెప్పి, "వాడిమీద ఆశ పెట్టుకోవడం నాదే తప్పు. ప్రసాదింత మారిపోతాడనుకోలేదు," అన్నాడు.

"ఆ పోతే పోయాళ్ళే! మనమ్మాయికి అంతకంటే మంచి సంబంధం తెచ్చి చేద్దాం పెళ్లి. ఇప్పుడు చేసిన వంటంతా ఏం చేసుకోను?" అని గొణుక్కుంటూ వంటగదిలోకి వెళ్ళింది తల్లి.

శేఖర్ మాట్లాడకుండా చెల్లెలివైపు చూశాడు. ఆమె కళ్ళలో కనిపించిన నిరాశ అతన్ని బాధపెట్టింది. సుజాత మౌనంగా పెరట్లోకి వెళ్ళిపోయింది. శేఖర్ ఆమె వెళ్తున్నవైపే చూస్తూ పరధ్యానంగా కూచుండిపోయాడు.

ఆడపిల్ల! ఈ సమాజంలో ఆడపిల్ల ఎంత త్వరగా పరిస్థితులతో రాజీ పడిపోతుంది! నోటివెంట ఒక్క మాట కూడా మాట్లాడకుండా పరిస్థితులు తనని ఏ వైపు తోస్తే ఆ వేపు ఒదిగిపోతుంది. ఒకర్ని పెళ్ళాడ్డానికి మౌనంగానే అంగీకరిస్తుంది. ఒకర్ని పెళ్ళాడకపోవ డానికీ మౌనంగానే అంగీకరిస్తుంది. తన అభిప్రాయాల్తో నిమిత్తం లేదు. అదే మగవాడైతే? ఎంత అన్యాయం!

ఒక నెల గడిచిపోయాక ప్రసాద్ ఉత్తరం రాశాడు. ప్రొద్దుటూరు సంబంధం ముందుగా అనుకున్నట్లుగానే అతను తిప్పికొట్టాడు. సుబ్బయ్యగారు తనే స్వయంగా వాళ్ళ నాన్నగారి ఊరెళ్ళి సంబంధం సంగతి విచారించారు. ప్రసాద్ వాళ్ళ నాన్న ఆయన తన పాత స్నేహితుడని కనీస మర్యాద కూడా చూపకుండా వాళ్ళమ్మాయి తన కొడుక్కే నచ్చలేదని చెప్పేశాడు. ఇద్దరి మధ్యా కొద్దిపాటి వాదన కూడా జరిగిందట. 'మా నాన్న తన పాత స్నేహితుడు కాబట్టి తన కూతుర్ని నేను తప్పకుండా చేసుకుంటానని ఆ ముసలాయన పాపం ఆశ పెట్టుకున్నట్టుగా వున్నాడు. పిల్ల నచ్చలేదని మొహం మీదే చెప్పేటప్పటికి నాన్నతో వాదన పెట్టుకున్నాడు,' అని రాశాడు ప్రసాద్.

శేఖర్‌కి ఆ ఉత్తరం చాలా మనస్తాపం కలిగించింది. సుబ్బయ్యగారి స్థానంలో తనని ఊహించుకుని లోలోపలే గిలగిల్లాడాడు. ఆ ఉత్తరాన్ని చించి అవతల పారేశాడు. ఆ ఉత్తరానికి జవాబివ్వలేదు.

ఎప్పుడైనా సుబ్బయ్యగారి వీధిలో ఆయన బంగళా ముందునుంచి వెళ్తున్నప్పుడు శేఖర్‌కి తనేదో అపరాధినన్న భావం కలిగేది. అప్పటికప్పుడు సుబ్బయ్యగార్ని కలుసుకుని ఆయనకు జరిగిన అవమానంలో తనకు భాగం లేదని చెప్పాలనిపించేది. పాపం ఆ అమ్మాయి ఏం చేస్తోందోననిపించేది.

మరో నెల గడిచాక ప్రసాద్ నుంచి మరో ఉత్తరం వచ్చింది. రాజమండ్రి సంబంధమే ఖాయపర్చుకున్నాడు. పెళ్ళికి తప్పకుండా వస్తానని ఆశిస్తా అని రాశాడు. శేఖర్ ఆ పెళ్ళికి వెళ్ళలేదు. ప్రసాద్‌ని తన ఆలోచనల్లోంచే తీసి పారేశాడు.

మరో రెండు నెలలు గడిచాక శేఖర్ ఒకసారి సుబ్బయ్యగారి బంగళా ముందునుంచి వెళ్లడం తటస్థించింది. బంగళా అంతా గొప్పగా అలంకరించి ఉండడం చూసి కొంచెం విస్మయం కలిగిందతనికి. ఎవరి పెళ్ళి జరుగుతోంది? ఎదురుగా వున్న పాన్ షాప్‌లో

విచారించాడు. ప్రసాదుకి చూపించిన అమ్మాయి పెళ్ళే జరుగుతోంది. సుబ్బయ్యగారు ఒంగోలు నుంచి సంబంధం తెచ్చి చేస్తున్నారు.

శేఖర్‌కి చాలా సంతోషం కలిగింది. అవును మరి, తన పిచ్చిగానీ ప్రసాద్ చేసుకోకపోతే ఆ అమ్మాయికి పెళ్ళే జరక్కపోతుందా? ప్రసాద్ తప్ప సుబ్బయ్యగారికి వేరే దిక్కే లేనట్టు తనెలా ఊహించుకున్నాడు?

అతనికి హఠాత్తుగా తన చెల్లెలి పెళ్ళి విషయం గుర్తుకొచ్చి మనసంతా అదోలా అయిపోయింది. సుబ్బయ్యగారు తన కూతురికి పెళ్ళి చేస్తుంటే తనేనా తన చెల్లెలి పెళ్ళి చెయ్యలేంది? ఏదో చేసి సుజాత పెళ్ళి వెంటనే జరిపించెయ్యాలి.

ఏది ఏమైనా సుబ్బయ్యగారమ్మాయి పెళ్ళి జరిగిపోతున్నందుకు శేఖర్ తన భుజాల మీదనుంచే ఏదో పెద్ద బరువు దిగిపోతున్నట్టుగా ఫీలయ్యాడు. తన చెల్లెలి పెళ్ళే జరుగుతున్నంతగా సంబరపడ్డాడు. ఆ అమ్మాయి పెళ్ళికి వెళ్ళాలని తీర్మానించుకున్నాడు. మర్నాటి ఉదయం లగ్నానికే పెళ్ళి.

శేఖర్ ఆ మర్నాడు పొద్దున్నే లేచి ట్రిమ్‌గా డ్రెస్ చేసుకుని సుబ్బయ్యగారమ్మాయి పెళ్ళికి బయల్దేరాడు. సుబ్బయ్యగారి బంగళా అంతా హడావిడిగా ఉంది. పెళ్ళి పందిట్లో పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ కూచున్నారు. పురోహితుడు బిగ్గరగా మంత్రాలు చదువుతున్నాడు. శేఖర్ అక్షింతలు తీసుకున్నాడు.

శేఖర్ ఆ పెళ్ళికొడుకునోసారి తేరిపారా చూశాడు. ప్రసాదంత ఆకర్షణీయంగా లేడు. అయితేనేం? ప్రసాద్ అందంగా వుండి ఏం వెలగబెట్టాడు?

శేఖర్ దృష్టి వధూవరుల పక్కనే నిలబడ్డ సుబ్బయ్యగారి మీద పడింది. ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి. సుబ్బయ్యగార్ని చూస్తూనే పలకరింపుగా నవ్వాడు శేఖర్. ఆయన నవ్వలేదు. తల మరోవైపు తిప్పుకుని చిన్న కొడుకుని దగ్గరికి పిలవడం కనిపించింది శేఖర్‌కి. పెళ్ళి చూపులప్పుడు ప్రసాద్‌కోసం కారు తెచ్చిన కుర్రాడతనే. సుబ్బయ్యగారతనితో ఏదో చెబుతున్నాడు. ఆ కుర్రాడు తలూపుతున్నాడు. సుబ్బయ్యగారతన్తో ఏం చెబుతున్నాడో శేఖర్‌కి తెలియలేదు. ఆ కుర్రాడు తనవైపు రావడం కనిపించింది.

"హలో!" అన్నాడు శేఖర్.

ఆ అబ్బాయి తనవైపు అదోలా చూశాడు.

"మీకు ఇన్విటేషనుందా?" సూటిగా అడిగాడు.

"ఇన్విటేషనా! లే... లేదు," తడబడ్డాడు.

"ఇన్విటేషన్ లేందే ఎందుకొచ్చావయ్యా? బయటికి నడు."

శేఖర్‌కి అర్థమైంది. అర్థమౌతూనే ఎవరో గుండెలమీద కాల్తో తన్నినట్లైంది. ఆ కుర్రాడివైపు కళ్ళప్పగించి చూశాడు.

"ఇ... ఇన్విటేషన్ కావాలని నాకు తెలీదు" మళ్ళీ తడబడ్డాడు.

"ఇప్పుడు తెలిసిందిగా, బయటికి నడు."

శేఖర్ తన చేతిలో వున్న అక్షింతలవైపు చూసుకున్నాడు. తర్వాత తలతిప్పి పెళ్ళిపందిరివైపు చూశాడు. తల వంచుక్కూర్చున్న పెళ్ళి కూతురులో అతనికి తన చెల్లెలు కనిపించింది. చెయ్యి పైకెత్తి అక్షింతలు వధూవరుల మీద వేశాడు. తర్వాత తల తిప్పి ఆ కుర్రాడివైపు చూశాడు.

"వస్తాను," అంటూ వెనక్కి తిరిగాడు.

*ఉదయం నవతరం వారపత్రిక, 3-8-1990*

# ప్రదర్శన

ఆయన నవ్వుతున్నాడు.

స్థిరచిత్తాన్ని సూచిస్తున్న అద్భుతమైన కళ్ళు.

ఆపైన కళ్ళజోడు.

కార్యదీక్షలో నిమగ్నమైనట్టు కొద్దిగా ముందుకు వంచిన గుండ్రని ముఖం.

బోసినోరు.

దరిద్రనారాయణతకు చిహ్నంగా లోతుకు పోయిన కడుపు.

స్థిరమైన పట్టులో నిటారుగా నిలబడ్డ పొడవాటి చేతికర్ర.

విల్లులా ముందుకు వంగిన నడుము.

–బడుగు భారతజాతికి ప్రతిరూపం–

తాను మరణించిన ముప్ఫై ఏడేళ్ళ తరువాత ప్రదర్శనకు నడివీధిలో నిలబడ్డ మహాత్ముడు!

మురికివాడల్లో సంచరించిన శరీరాన్ని అందమైన పబ్లిక్ పార్క్‌లో వుంచారు.

శతకోటి భారతీయుల మెత్తని హృదయాలలో నడయాడే పాదాలు కఠిన శిలావేదిక మీద నిలుచున్నాయి.

చుట్టుపక్కల వాతావరణం పసందుగా వుంది. పిల్లలు కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు. అక్కడక్కడ ఆడామగా జంటలుగా కూర్చున్నారు. కళాహృదయం గల ఒకరిద్దరు కెమెరాబాబులు మహాత్ముడికి చేరువలో తమ ప్రియురాలినో, కన్నబిడ్డనో నిలుచోబెట్టి ఫోటోలు గుంజుతున్నారు.

ఆకాశంలో మెల్లగా మేఘాలు కమ్ముకుంటున్నాయి. అయితే అవి ఎక్కువసేపు నిలవడం లేదు. సాయంకాలపు చల్లగాలికి అలా అలా తేలియాడుతూ సాగిపోతున్నాయి. ఇవేవీ పట్టనట్టు ఆయన తన ధోరణిలో తాను నవ్వుతూనే వున్నాడు.

ఆ నవ్వులోకి దీక్షగా చూస్తూ నిలబడ్డ పోలిగాడు కూడా నవ్వుతున్నాడు.

హృదయపూర్వకంగా మాత్రం కాదు–

వెక్కిరింపుగా!

పోలిగాడు మూగవాడు – పలకలేడు.

అయితే గుడ్డివాడు మాత్రం కాదు – కళ్ళలో భావాలు పలికించగలడు.

ఆ కళ్ళలోకి విమర్శనాత్మకంగా చూస్తే లోతుగా ఎక్కడో హృదయాంతరాళాల్లో గూడుకట్టుకున్న విషాదం గోచరిస్తుంది.

పోలిగాడు రోజూ అక్కడికొస్తాడు!

కాస్సేపు నిలబడతాడు!

ఆ మహానుభావుడికేసి చూస్తాడు!

పెదవులతో నవ్వుతాడు!

కళ్ళతో ఏడుస్తాడు!

వెళ్ళిపోతాడు!

కారణం...?

ఆ జాతిపితకు తెలుస్తుందో లేదో!?

ఆ ఊరి మునిసిపల్ ఛైర్మన్‌కు మాత్రం తెలుస్తుంది.

ఇంకా కొందరు పెద్ద మనుషులకు తెలుస్తుంది.

పోలిగాడి ఇల్లు సరిగ్గా మహాత్ముడి కాళ్ళకింద భూస్థాపితమై వుంది!

ఇప్పుడాయన నిలబడ్డ చోటనే ఒకప్పుడు పోలిగాడి పూరి గుడిసె అరిపేదగా నిలబడి వుండేది. పోలిగాడి గుడిసెతో పాటు ఇంకా చాలామంది హరిజనుల ఇళ్ళు ఆ చుట్టుపక్కల వుండేవి. ఇప్పుడు వాటి స్థానంలో అందమైన పూలమొక్కలు ఆనందంగా తలలూపుతూ వున్నాయి.

ఆనాటి మురికివాడ ఇప్పుడు నందనోద్యానమైంది.

అందుకే మహాత్ముడు నవ్వుతున్నాడేమో!

❖ ❖ ❖

గాంధీ జయంతినాటికి గాంధీగారి జ్ఞాపకార్థం ఏదైనా ఘనకార్యం తల పెట్టాలని ఆ వూరి మునిసిఫల్ ఛైర్మన్‌గారికి తట్టింది.

నిజానికా ఊళ్ళో 'గాంధీరోడ్డు' ఒకటుంది. అది మహాత్ముని కీర్తికి వన్నె తెచ్చేదిగా లేదని ఆయన అనుమానం.

ఊళ్ళో గాంధీగారి విగ్రహం ఒకటి ప్రతిష్ఠించాలని చాలాకాలంగా అనుకుంటున్నదే. అదేదో తన హయాంలో పూర్తి చేస్తే!

రాజు తల్చుకుంటే దెబ్బలకు కొదవా?

వెంటనే తన ఆలోచన కార్యరూపం దాల్చేందుకు ప్రయత్నాలు మొదలెట్టాడాయన.

ఆ ఊరి నడిబొడ్డున హరిజనవాడ ఒకటుంది.

ఇదెక్కడి విడ్డూరం!

హరిజనవాడలెక్కడైనా ఊరవతలుంటాయిగాని!

నాగరిక ప్రపంచం నడుమ వాళ్ళుంటే మైల కూడాను. ఈ విషయం అగ్రవర్ణాలకు చెందిన ఊరి పెద్దమనుషులు తన దృష్టికి తెచ్చారు కూడా.

ఈ హరిజనులనక్కణ్ణించి తోలేస్తే...

ఓ అందమైన పార్కు అక్కడొస్తే...

అమ్మో! ఎంత మంచి ఆలోచన!

ఊరికి నడుమ పార్కుకు పార్కూ వుంటుంది. గాంధీగారికి గాంధీగారూ వుంటారు.

గాంధీగారు మాత్రం సామాన్యంగా వుండకూడదు.

సినిమా షూటింగ్‌లక్కూడా పనికొచ్చేలా దర్జాగా వుండాలి.

తన హయాంలో ఇంత గొప్ప పనిచేసినందుకు ప్రజలు తనని గుర్తు పెట్టుకుంటారు. అందమైన పార్కు ఏర్పాటు చేసినందుకు వచ్చే ఎన్నికల్లో తనకు ఓట్లు కూడా వేస్తారు.

మరి హరిజనులో!

ఆ, వాళ్ళ ఓట్లు లేకపోతే ఎంత! అంతా కలిసి అయిదు వందలుంటాయేమో ఓట్లు వాళ్ళవి! వాళ్ళని తోలేస్తే మిగతా అగ్రవర్ణాల వారు ఎలాగూ వేస్తారు ఓట్లు. ఆ లోటు అలా పూడ్చుకోవచ్చు.

ఆ హరిజనుల్ని ఇంకా అక్కడే వుండనిస్తే ఆ చుట్టుపక్కలున్న విలువైన స్థలాల్ని కాస్తా కాజేస్తారు. అంతా రొష్టు పట్టిపోతుంది.

ఇలా ఆలోచించి ఛైర్మన్‌గారు మున్సిపల్ కౌన్సిల్లో రెసల్యూషన్ ఒకటి పాస్ చేయించారు. దాని ప్రకారం ఊరికి మధ్యలో మునిసిపల్ పార్కు ఒకటి వస్తుంది. అందులో గాంధీగార్ని నిలబెట్టేస్తారు.

ఆ ఊరి కౌన్సిలర్లు చాలామంది తలకాయ లేని వాజమ్మలు. వాళ్ళలో మెజారిటీ వర్గానికి మన ఛైర్మన్ గారు నాయకుడు. మిగిలిన కొద్దిమంది కౌన్సిలర్లలో చాలామందికి ఆ పార్కు వచ్చేట్టయితే ముందుగా అక్కడ్నుంచి హరిజనుల్ని ఖాళీ చేయించాల్సి వస్తుందన్న విషయం తట్టనే లేదు. ఒకరిద్దరికి తట్టిందిగాని ఛైర్మన్‌గారి 'ప్రతాపానికి' జడిసి మెదలకుండా ఊరుకున్నారు.

ఇక ఆ హరిజనవాడ వున్న వార్డు తాలూకు కౌన్సిలర్ మన ఛైర్మన్‌గారే! ఆయనకా ప్రాంతంలో స్థలాలు కూడా వున్నాయి. ఈ అలగా జనాన్ని ఖాళీ చేయిస్తే ఆ స్థలానికి విపరీతమైన గిరాకీ వచ్చి పడుతుంది. దగ్గర్లోనే పార్కు వెలుస్తున్నదాయే. ఆ ప్రదేశం కాస్తా మెయిన్ సెంటరయి కూర్చుంటుంది. అదీ అసలు సంగతి!

దరిమిలా కౌన్సిల్లో హరిజనుల తరఫున ప్రశ్నించే నాథుడే లేకపోయాడు.

హరిజనులు గొడవ చేశారు.

వాళ్ళ ప్రతిపక్షనాయకులతో చెప్పి చూశారు. వాళ్ళు తప్పకుండా మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు – హామీ మాత్రమే ఇచ్చారు. అంతకుమించి ఏమీ చేయలేదు. హరిజనులు ఊరి మధ్యన ఉండడం పట్ల సర్వత్రా వ్యతిరేకత ప్రబలి వుంది. ఈ విషయంలో వేలు పెడితే మెజారిటీకి చెందిన అగ్రవర్ణాలవారి ఓట్లు తమకు రాకపోవచ్చు. అసెంబ్లీ ఎన్నికలు దగ్గర్లోనే వున్నాయి మరి! అందుకే వాళ్ళు కొన్ని తాటాకు చప్పుళ్ళు చేసి ఊరుకున్నారు.

హరిజనులు కలెక్టరుకూ, ముఖ్యమంత్రికీ, మైనారిటీల కమిషన్‌కూ మహజర్లు పంపుకున్నారు. లాభం లేకపోయింది. ముఖ్యమంత్రిని కలుసుకొనేందుకు పోతే ఆయన ఎన్నికల ప్రచారంలో మునిగిపోయి ఈ దీన జనావళిని పట్టించుకోనేలేదు. అందుబాటులో వుండిన హొమ్మినిస్టరుగారు మాత్రం అరచెయ్యి చూపించి అభయం పలికి, “రాబోయే ఎన్నికల్లో ఓట్లు వేయండి, మీ స్థలాలు ఖాళీ చెయ్యనివ్వం. అందాకా మీరు ఎవరొచ్చినా ఖాళీ చెయ్యొద్దు,” అన్నారు.

ఆయనగారి మాట నమ్ముకొని హరిజనులు స్థలాలు ఖాళీ చెయ్యం పొమ్మన్నారు.

ఛైర్మన్‌కు ఈ ‘జనం’ ఇలా తిరగబడతారని ముందే తెలుసు.

అయితే మాత్రం భయం దేనికి? హరిజనులకు అభయమిచ్చిన హొమ్మినిష్టరుగారే తమ ఇలాకా అయిపోయె.

ఆయన వెంటనే హొమ్మినిస్టర్‌తోనే సంప్రదించి హరిజనుల్ని ఖాళీ చేయించే మాస్టర్ ప్లాన్ ఒకటి తయారు చేశారు.

అందులో హొమ్మినిస్టరుగారి పాత్ర చాలా చిన్నదే. సమయానికి తగిన చర్య తీసుకోకుండా పోలీసుల్ని ఓ ఇరవై నాలుగ్గంటలపాటు మెదలకుండా కళ్ళు మూసుకోమని పురమాయించడమే!

ఇక మొదలైంది దౌర్జన్యకాండ.

అర్ధరాత్రి పూట కొందరు గుర్తు తెలియని వ్యక్తులు హరిజనవాడలోకి జొరబడ్డారు. హరిజన నాయకుణ్ణి బయటికి ఈడ్చుకొచ్చి, “మర్యాదగా ఖాళీ చేయమంటే చెయ్యర్రా

మీరు! మీ బాబుగాడి స్థలాల్రా? మాలజాతికింత పొగరా!!" అని కారుకూతలు కూస్తూ అతన్ని తన్ని, అతని గుడిసె తగలబెట్టేశారు.

ఒకదాని వెంట ఒకటి అరవై గుడిసెలదాకా తగలబడిపోయాయి.

ఇంకొందరు దుండగులు కళ్ళకు నదురుగా కనిపించిన హరిజన స్త్రీలను జుట్టుపట్టి లాక్కొచ్చి సామూహిక మానభంగం చేశారు. అడ్డుపడబోయిన మగాళ్ళను చితకబాదారు.

ఇద్దరు పసిపిల్లలు మంటల్లోపడి నిలువునా కాలిపోయారు.

తెల్లారేసరికి హరిజనవాడ పూర్తిగా దగ్ధమై నగ్నంగా నిలబడింది.

ఊరంతా ఆవులిస్తూ లేచి కూర్చుని ఈ దారుణ కాండని మౌనంగా గమనించింది.

పోలీసులు వచ్చారు. రిపోర్టు రాసుకున్నారు.

హడావుడిగా ఓ పదిమంది అనామకుల్ని అరెస్టు చేసి ఛార్జిషీట్ ఫైలు చేశారు.

ఆ మరుసటి రోజు ఛైర్మన్ గారింట్లో మందు పార్టీ జరిగింది.

విషయం పత్రికల కెక్కింది.

దేశం అట్టుడికిపోయింది.

ప్రతిపక్ష నాయకులు ఈ సంఘటనని ఎన్నికల్లో అధికార పార్టీమీద అస్త్రంగా ఉపయోగించదల్చుకున్నారు. వాళ్ళు ప్రభుత్వాన్ని తీవ్రంగా దుయ్యబట్టారు.

ముఖ్యమంత్రి హరిజనులకు పునరావాస సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కేసులో పోలీసులు పది అరెస్టులు ఆనాడే చేశారని పత్రికలకు స్టేట్‌మెంట్లు విడుదల చేశారు.

నిరాహారదీక్షలు జరిగాయి.

అన్నిరకాల హంగామా అయ్యింది.

ప్రజలు తమకు సహజంగా వుండే శాడిస్టిక్ ఎగోని సంతృప్తి పరిచేందుకు మాత్రమే ఈ వార్తలు చదువుతూ వచ్చారు. పాపం హరిజనులని సానుభూతి వెలిబుచ్చారు.

హరిజనులకు ఒరిగిందేమీ లేదు. వాళ్ళు భీతితో చెల్లాచెదురైపోయారు.

రోజులు గడిచాయి.

క్రమంగా ప్రజలు ఈ దౌర్జన్య సంఘటన మర్చిపోయారు. హరిజనులు సోదిలోకి కూడా రాలేదు. పత్రికలు కూడా అందుగురించి రాయడం మానుకున్నాయి.

అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.

ఇదివరకటి ముఖ్యమంత్రే గెలిచాడు.

హెూమ్మినిస్టరూ గెలిచాడు.

మునిసిపల్ ఎన్నికలు పెడితే ఆ ఊరి ఛైర్మన్ మళ్ళీ గెలిచి కూర్చునేందుకు అవకాశాలు గట్టిపడ్డాయి.

ఇంకొన్ని రోజులు గడిచాయి.

హరిజనవాడ శుభ్రం చేసి అక్కడ చెత్తాచెదారాన్ని బండ్లకెత్తించి పారబోయించారు.

పార్కు వెలిసింది.

పార్కులో గాంధీగారూ వెలిశారు.

ఛైర్మన్ గారి కోరిక ఈడేరింది.

పార్కుకు 'గాంధీ పార్కు' అని నామకరణం చేశారు.

హెూమ్మినిస్టరుగారు పరివారంతో దిగబడి రిబ్బన్ కత్తిరించి పార్కు ప్రారంభోత్సవం చేసి గాంధీగారిని పుష్పమాలాలంకృతుల్ని చేశారు.

బాపూజీ కలలు కన్న భారతదేశం గురించి ఊకదంపుడు ఉపన్యాసాలు సాగాయి.

చుట్టుపక్కల పల్లెటూళ్ళ నుంచి లారీలతో జనాన్ని అద్దెకు తోలి సభను జయప్రదం చేశారు.

❖ ❖ ❖

"సారే జహాఁసే అచ్ఛా

హిందూస్థాన్ హమారా..."

పార్కు రేడియోలో శ్రావ్యంగా ఎవరో పాడుతున్నారు.

పోలిగాడు మహాత్ముడికేసి చూస్తూనే వున్నాడు.

మహాత్ముడు నవ్వుతూనే వున్నాడు.

"గాంధీగారి బొమ్మ ఎంత అద్భుతంగా వుంది!" ఎవరో వ్యాఖ్యానించారు.

"నిజంగా ఆయనక్కడ నిలబడ్డట్టే వుంది," మరొకరెవరో అన్నారు.

ఇంకొక రెవరో కెమెరా క్లిక్ మనిపించారు.

వాతావరణం బాగా చల్లబడిపోయింది.

క్రమంగా వెలుతురు తగ్గిపోతోంది.

మబ్బులు మరింతగా ముసురుకుంటున్నాయి.

శిల్పంలా నిలబడి మహాత్ముడి కేసి చూస్తున్న పోలిగాడిలో మెల్లగా చైతన్యం వచ్చింది.

అక్కణ్ణించి కదిలి వెనక్కి తిరిగి భారంగా నడుస్తూ ముందుకు సాగిపోయాడు.

ఎక్కడో దూరంగా ఆకాశంలో ఓ మెరుపు మెరిసింది.

ఎక్కడో వురిమింది.

'దేవతలు యుద్ధం చేస్తున్నారు,' అనుకున్నారు పిల్లలు.

నల్లని మబ్బులు నీలాకాశాన్ని ఆక్రమించుకొంటున్నాయి.

గాలి ప్రారంభమైంది. మేఘాల్ని తరిమెయ్యడానికది భీమ ప్రయత్నం చేయసాగింది.

ఎక్కడినుంచో సన్నని మబ్బు తునక ఒకటి అటుగుండా ప్రయాణం చేస్తూ వచ్చింది.

చల్లగాలి సోకి అది కొద్దిగా ద్రవించింది.

ఆకాశం నుంచి రెండే రెండు చినుకులు సూటిగా దిగి వచ్చి మహాత్ముడి శిరస్సు నభిషేకించాయి.

బహుశా అక్కడెక్కణ్ణుంచో మహాత్ముడే తన స్థితికి రోదిస్తున్నాడేమో!

*ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 11-4-1986*

# అహింస

అది మోకాలిమీదికి పాకింది. ఒకసారి నిలబడి గంభీరంగా తన స్థితిగతులు పరీక్షించుకొని ప్రమాదమేమీ లేదన్నట్లు మళ్ళీ కదిలి ముందుకు సాగింది ఆ నల్లటి గండుచీమ.

నిద్రమత్తు కళ్ళతో దాన్నే స్తబ్దుగా చూస్తున్నాడు చంటి. అంతవరకూ ఓపిగ్గా దాన్ని గమనిస్తూ వచ్చాక దానిమీద హఠాత్తుగా ఆసక్తిపోయి విసుగు పుట్టేసి బొటనవేలికి మధ్య వేలును సంధించి లాగి ఒక్కటి తగిలించాడు. గండుచీమ ఎగిరి నేలమీద పడి సర్దుకొని నిలబడి దొరికిపోయినట్టు తికమకగా ఎటు పారిపోవాలని కాస్సేపు దిక్కులు చూసి వెనక్కి తిరిగి పలాయనం చిత్తగించింది.

ఒక మోకాలి మీద గెడ్డం ఆన్చి నిర్లక్ష్యంగా పారిపోతున్నదాన్ని గమనిస్తూ దిగుల్లో పడిపోయాడు చంటి. ఆ రోజు బడికి వెళ్ళాలంటేనే నీరసం ముంచుకొచ్చేస్తోంది. ఏం చేయాలో తోచక జేబు తడుముకొని ఇన్ని బలపాలూ చాక్‌పీసులూ బయటికి తీశాడు. అవి ఎప్పుడూ తన జేబులో వుండాల్సిందే– రాత్రిపూట కూడా! ఎవర్నీ తీయనియ్యడు.

ఓ చాక్‌పీసుతో అరుగుమీద ఓ సున్నా గీసి, మధ్యలో నిలువుగా గీతగీసి, చెవులు పెట్టి, పొడుగ్గా రెండు జడలు పెట్టి కింద రాశాడు– 'అమ్మ'. చంటి బళ్లో చేరి రెండు నెల్లే అయింది. కాని, అంతకుముందే వాళ్ళమ్మ దగ్గర అక్షరాలన్నీ నేర్చేశాడు. అమ్మ పక్కనే నాన్నని గీసి పీచు జుట్టు పెట్టాడు. తర్వాత గంభీరంగా తన సొంత సామర్థ్యాన్ని పరీక్షించుకొని తృప్తిగా చూసి కాస్త వెనక్కి జరిగి కింద మరో బొమ్మ గీశాడు – 'టీచర్'.

ఈ లోపల అమ్మ బయటికొచ్చి కొడుకు చిత్రకళాకౌశలాన్ని తిలకించి నవ్వి, "బొమ్మలు గీస్తూ కూచున్నావా చంటీ! బడికి పోవూ? మొహం కడుక్కొని స్నానం చేద్దూగాన్రా," అని కొడుకుని లేవదీసింది.

మొహమ్మీదికొచ్చిన చింపిరి జుట్టుని వెనక్కి తోసుకొని, "అమ్మా, మా టీచర్ చూడవే – బావుంది కదూ?"

కళ్ళు మెరిపించి వేలితో చూపిస్తూ అన్నాడు చంటి.

"ఆఁ ఆఁ చాలా బావుంది. బడికి వేళ కాదూ? రా!"

చంటికి అరుగు దిగాలనిపించలేదు. బిక్కమొహం వేసుకొని దిగి అమ్మ వెంట వెళ్ళాడు.

స్నానం చేయించుకొని, తల దువ్వించుకొని అమ్మ వెంట వంటగదిలోనికి వెళ్ళాడు చంటి.

పొయ్యి వెలిగించి, గిన్నె పెట్టి ఉప్మా కోసం పోపు వేసి తిరగపెడుతున్న అమ్మ కొంగు లాగుతూ వగలు పోసాగాడు.

"అబ్బ, వుండరా ఉప్మా కానీ."

అమ్మ భుజం మీద గెడ్డం ఆన్చి గారంగా, "అమ్మా!" అని పిలిచాడు.

"ఊఁ!"

చీర కొంగుని గుప్పిట బలంగా బిగించి మళ్ళీ పిలిచాడు, "అమ్మా"!

"ఏవిట్రా?"

"ఈ రోజూ..."

"ఊఁ."

"స్కూలొద్దే."

చేస్తున్న పనాపి కొడుకు మొహంలోకి నేరుగా చూసి, "ఏం?" అంది.

చంటి జవాబివ్వలేదు. అమ్మ మళ్ళీ పన్లో పడింది.

"అమ్మా."

"మీ నాన్నగార్నడుగు."

చంటి మొహం వేలాడేసుకొని నిలబడ్డాడు. కాస్సేపాగి మళ్ళీ కొంగు లాగాడు.

"ఊఁ....."

".........."

అమ్మ చంటి చేతుల్లోంచి కొంగు లాగేసింది.

చంటి ఖిన్నుడైపోయాడు. అమ్మ నిరసనకు మొహమైతే చిన్నబోయింది గాని, బడికి మాత్రం వెళ్ళాలన్లేదు.

బిక్క మొహమేసుకొని కాస్సేపలాగే నిలబడ్డాడు. తర్వాత అమ్మ భుజం మీద చెయ్యేశాడు.

కాస్సేపు వూరుకొని ఒక చేత్తో భుజంమీది కొడుకుచేతిని నొక్కిపట్టి తలతిప్పి లాలనగా చూసి, "అలాగేలే. ఇంట్లో కూచుని చదువుకో," అంది.

చంటి మొహం వికసించింది. లావు లావు బుగ్గల్ని నవ్వుతో మరింత లావు చేసి వంటగదిలోంచి బయటికి పరిగెత్తి నాన్నగారి ముందు "హేయ్ హేయ్" అని గెంతుతుంటే పేపరు చదువుతున్న నాన్నగారు, "ఏవి(ట్రా?" అన్నారు కొడుకుని మురిపెంగా చూస్తూ.

గెంతడం ఆపేసి కుర్చీ కోడు పట్టుకు నిలబడి, "నాన్నా! అమ్మేం, స్కూలుకెళ్లొద్దంది," అన్నాడు సిగ్గుగా.

నాన్నగారు విస్మయంగా చూసి "ఎందుకు?" అనడిగారు.

చంటికేం చెప్పాలో అర్థం కాలేదు. ఆలోచనల్లో పడ్డట్టు మొహం పెట్టాడు.

నాన్నగారు వంటగదిలోకి కేకేసి, "చంటిగాణ్ణి స్కూలు కెళ్ళొద్దన్నావట?" అన్నారు.

"ఆఁ," లోపల్నుంచి సమాధానం.

"ఎందుకూ?"

"రేపెళ్తాడులెండి."

అయోమయంతో లేచి లోనికెళ్ళారు నాన్నగారు. చంటి నేరస్తుడిలా వున్నచోటునే నిలబడ్డాడు. ఈయన స్కూలు కెళ్ళమనడుగదా!

"ఎందుకెళ్ళొద్దన్నావ్?" అడిగారు నాన్నగారు.

"వాడు నిన్న ఆదివారమంతా గెంతీ గెంతీ ఈ రోజు బడికెళ్ళడానికి బద్ధకిస్తున్నాడు. ఎప్పుడూ ఇలా అడగలేదు. స్కూలికి పోనన్నాడు - సర్లెమ్మన్నాను."

"అలా ఎందుకన్నావ్? చదువు దగ్గరేం గారాలు!"

"పోన్లెండి, రేపు వెళ్తాడు. రెండు నెల్లేగా బళ్ళో చేరి."

నాన్నగారు ముందుగదిలోని కెళ్ళిపోయి చంటివైపు చూడకుండా సీరియస్‌గా పేపర్లో పడ్డారు.

చంటి అక్కడే నాన్నగారి మొహంలోకి చూసి చూసి బిడియంగా అక్కణ్ణించి కదిలి వెళ్ళిపోయి మళ్ళీ అరుగుమీద కూచొని దిగుల్లో పడ్డాడు. నాన్నగారిక్కోపవొఁచ్చినట్టుంది. ఇందాకా గీచిన బొమ్మలు చెరిపేశాడు.

ఎండవాలు కాస్త ఎక్కువయ్యే వేళకి లేచి ఇంట్లో చాపమీద కూచొని హెూం వర్క్ చేస్తున్న అక్క దగ్గరికెళ్ళి, "అక్కా కేరం బోర్డాడుకుందామా?" అడిగాడు కుతూహలంగా.

"హెూం వర్క్ చేసుకొని స్కూలు కెళ్ళాల్సుంటే నీతో కేరమ్సాడుకుంటూ కూచో మంటావా?"

పేపర్లోంచి నాన్నగారు, "ఏం నిన్నంతా ఏం జేశావ్?" అడిగారు.

అక్క తలపైకెత్తి చూసి, "చేసుకోలేదు," అని నవ్వేసి మళ్ళీ చివరి లెక్క చెయ్యడంలో మునిగిపోయింది.

చంటి బాసింపట్టేసుక్కూచొని బుద్ధిగా అక్క చేస్తున్న పనివైపు చూస్తూ చదవడానికి ప్రయత్నించాడు. అసలేం అర్థం కాలేదు. విసుగు పుట్టి లేచి పెరట్లోనికెళ్లాడు. బంతిపూవుమీద కూచొని సీతాకోక చిలుకొకటి కనిపించింది. చప్పుడు చెయ్యకుండా వెళ్ళి పట్టుకోబోయాడు. సీతాకోక చిలుక ఎగిరిపోయి మరోచోట వాలింది. చంటి మళ్ళీ పట్టబోయాడు. అది ఆకాశంలోకి లేచి పెరటిగోడ దాటి ఎగిరిపోయింది. చంటి నిరాశపడిపోయి ఇంకేమన్నా సీతాకోక చిలకలున్నాయా అని చూశాడు. లేవు – ఇంకొంచెం ముందు వచ్చుంటే వుండేవి.

చంటి బంతిపూలు కోద్దామా అని ఆలోచించాడు. అమ్మ తిడుతుంది. నేలమీదికి చూశాడు. పెరటిగోడ మొదట్లో గడ్డిపూలున్నాయి. వెళ్ళి ఒక్కోటీ ఒక్కోటీ కోస్తుంటే వానపామొకటి బద్ధకంగా కదుల్తూ కనిపించింది. చంటి అటూ ఇటూ చూసి ఓ ఎండుపుల్లనేరి వానపాముని కదిలించాడు. అది కాస్త వేగంగా కదిలి ఓ గడ్డిమొక్క పక్కన చిన్న బొరియలోకి దూరిపోయింది. ఎండుపుల్లతో బొరియలోకి గుచ్చాడు. వానపాము బయటికి రాలేదు. గడ్డిమొక్క పట్టి పీకాడు. బొరియ పెద్దదైంది గాని వానపాము మాత్రం రాలేదు. అయితే బలంగా పీకేసరికి గడ్డిమొక్క వేళ్ళతో సహా ఊడొచ్చి చంటి వెనక్కి చిత్తడిలోకి పడ్డాడు. ఛీ ఛీ! బురదైపోయింది!

"ఒరేయ్ చంటీ, ఉప్మా తిందూగా(రా!" లోపల్నుంచి అమ్మ కేకేసింది.

మొహమంతా చిన్నబుచ్చుకొని లోనికొచ్చిన చంటిని చూసి, "ఛీ... ఛీ! గాడిదా, ఇందాకే కదరా స్నానం చేశావ్!" అని బుగ్గ గిల్లి లాక్కెళ్ళి చొక్కా లాగూ తీసేసి నీళ్ళ గదిలో చంటి కాళ్ళూ చేతులూ కడిగింది.

చంటికి బుగ్గ మంట పెట్టింది. కళ్ళల్లోకి నీళ్ళొచ్చాయి. రోషమొచ్చింది.

అమ్మ లోపలికి తీసుకెళ్ళి వేరే బట్టలేసి ఉప్మా పెట్టింది.

చంటి ఉప్మా తిని వీధి గుమ్మం దగ్గర నిలబడ్డాడు.

పక్కింటి హరిగాడు పలకా పుస్తకం పట్టుకొచ్చి, "ఏరా కిరణ్! బడికి రావా?" అనడిగాడు.

చంటి ఫోజుగా తల పైకెగరేసి లేదన్నట్టు తలూపాడు.

"ఏం?"

"మా అమ్మెళ్ళొద్దంది."

హరికి అర్థం కాలేదు. "దేనికి?"

"నేనే పోనన్నాను."

"అసలు స్కూలుకే రావా?"

"వస్తాను, ఈ రోజు రాను."

"మరి మీ అమ్మ కొట్టదా?"

"మా అమ్మ కొట్టదుగా!" అన్నాడు చంటి గర్వంగా.

హరి వెళ్ళిపోయాడు. చంటి ఇంకాసేపు అక్కడే నిలబడి ఇంట్లోకొచ్చాడు. తెలుగు వాచకం ముందేసుక్కూచుని బొమ్మలు చూడ్డం మొదలెట్టాడు. కాస్సేపటికి అక్క స్కూలుకెళ్ళిపోయింది. బట్టలేసుకొని నాన్నగారు పదింటికి ఆఫీసుకు వెళ్ళిపోయారు. పుస్తకం పక్కన పడేసి విసుగ్గా హాల్లోకొచ్చాడు చంటి.

ఆదివారానికీ మామూలు రోజుకీ తేడా అప్పుడు తెలిసింది. కేరమ్స్, బంతాట ఆడడానికి అక్కలేదు – స్కూలుకెళ్ళిపోయింది. ఒళ్ళో కూచోబెట్టుకొని కథలు చెప్పడానికీ, మురిపించడానికీ నాన్నగారు లేరు. ఇల్లంతా బోసిపోయి మూగగా కనిపించింది.

నాన్నగారి కుర్చీ ఖాళీగా కనబడితే దిగులుగా వెళ్ళి కూచుని బల్లమీదున్న లావుపాటి పుస్తకాన్ని ఒళ్ళో పెట్టుకొని పేజీలు తిప్పడం మొదలెట్టాడు. లోపల బొమ్మలేం లేవు.

చంటికి ఒకసారి నాన్న చెప్పిన విషయం గుర్తుకొచ్చింది. నాన్న ఈ పుస్తకం చదువుతుంటే "ఏవిఁట్నాన్నా అది?" అనడిగాడు తను.

"నా పుస్తకం నాన్నా."

"ఏముంటుందందులో?"

"ఆఫీసు మాటలుంటాయి."

"ఓ!" అని అర్థమైపోయినట్టు కళ్లు మెరిపించాడు.

"ఎంత పెద్ద పుస్తకమో!" అన్నాడు తను మళ్ళీ.

నాన్నగారు నవ్వి, "నువ్వూ రోజూ స్కూలుకెళ్ళి బాగా చదూకుంటే ఇంతకంటే పెద్ద పుస్తకాలు చదివేస్తావు నాన్నా," అన్నారు.

తనకు భలే సంతోషమేసింది.

ఈ విషయం గుర్తుకు రాగానే హాయిగా నవ్వుకొంటూ కుర్చీ వెనక్కి వాలి ఆలోచన్లో పడ్డాడు.

తను స్కూలు కెళ్తాడు. బాగా చదూకుంటాడు. నాన్నగారిలా పెద్ద పెద్ద పుస్తకాలన్నీ చదివి పారేస్తాడు. ఒళ్ళోని పుస్తకం అపురూపంగా కనిపించి దాన్ని ప్రేమగా నిమిరి జాగ్రత్తగా బల్లమీద పెట్టాడు.

గుండెలురకలేస్తూండగా అమ్మ దగ్గరికి పరిగెత్తాడు.

"అమ్మా... అమ్మా, నేనేం, నాన్నారిలా పెద పే...ద్ద పుస్తకాలన్నీ చదివేస్తాను పెద్దయ్యి," అన్నాడు ఉత్సాహంగా.

"ఊహూఁ," అందమ్మ నిరాసక్తత చూపుతూ.

"ఇంతింత పెద్ద పుస్తకాలు..." రెండు అరచేతుల నడుమ గొప్ప ఖాళీని చూపుతూ అన్నాడు.

"ఎలా? నువ్వు సరిగ్గా బడికెళ్ళవుగా!"

చంటి ఉత్సాహం నీరుగారిపోయింది. ఖిన్నుడై వెళ్ళిపోతున్న కొడుకుని చూసి నవ్వుకొంది అమ్మ.

చంటి పెరట్లోని కొచ్చాడు. బాగా ఎండ కాసింది. ఆడుకోవాలనిపించలేదు. ఇంట్లో కొచ్చేశాడు. మళ్ళీ వెళ్ళి నాన్నగారి కుర్చీలో కూర్చున్నాడు.

హరిగాడేం చేస్తున్నాడో! నిన్న హరిగాడితో తనెంత ఆడుకున్నాడో!

హరి గుర్తుకొచ్చేసరికి చంటికి స్కూలు గుర్తుకొచ్చింది. స్కూలుతోపాటు టీచర్ గుర్తుకొచ్చింది.

టీచరంటే చంటికి భలే ఇష్టం. ఎన్నెన్నో కథలు చెబుతుంది – కొట్టనే కొట్టదు.

నల్లటి టీచర్ మొహాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు చంటి. ఆవిడ మొహానికి మందంగా పూసుకొనే పౌడరూ, నుదుట ఎఱ్ఱటి తిలకం బొట్టు, కళ్ళకు పెద్ద పెద్ద కళ్ళద్దాలు, వొదులుగా వేసుకొనే జడ, చేతిలో బెత్తం. ఇంకా బల్లమీది దస్తరూ, చాక్‌పీసులూ, బ్లాక్‌బోర్డు అన్నీ గుర్తుకొచ్చాయి. టీచరెవ్వర్నీ కొట్టదు. బెత్తం మాత్రం చేతిలో ఊతంగా ఊగుతూనే వుండాలి.

చంటికి తన డెస్కు గుర్తుకొచ్చింది. ఖాళీగా వుండి వుంటుంది. చెప్పలేనంతగా దిగులేసింది.

లేచి ఇంట్లోంచి బయటికెళ్ళాడు. బయట దూరంగా రోడ్డు పక్కన ఓ చెట్టు మొదట్లో కొంతమంది చింపిరిపిల్లలు గోళీలాడుతున్నారు. వెళ్ళి కుతూహలంగా చూస్తూ నిలబడ్డాడు. చంటికి గోళీలాడ్డం రాదు. వాళ్ళల్లో ఒకడు ఎడం చేత్తో గోళీలు విసిరి కుడిచేత్తో కొట్టడానికి ఒక కన్ను మూసి, తెరిచిన రెండో కంటి చివరకు మునివేళ్ళతో గోళీని పట్టుకొని గురి చూస్తూ చేతిని ముందుకీ వెనక్కీ ఆడిస్తూ వుంటే భలేతమాషాగా అనిపించింది. చంటి చూస్తుండగానే వాళ్ళలో వాళ్ళకి కొట్లాట మొదలయ్యింది. రెండోవాడు మొదటివాణ్ణి తిడుతూ ఎడం చేత్తో వెనక్కి తోశాడు.

మొదటివాడు ముందుకు లంఘించి రెండోవాడ్ని చంకలో ఇరికించుకొంటే వాడు మొదటివాణ్ణి మోచేత్తో పొత్తికడుపులోకి గుచ్చాడు.

చంటికి భయమేసి ఇంట్లోకి దూరిపోయి పెరట్లో కెళ్ళాడు. మూడు రాళ్ళనేరి తనూ గోళీలాట మొదలెట్టాడు. ఎండలో చురుకు పాలు చాలా పెరిగింది. ఒంటరిగా ఆడినంత సేపాడి రాళ్ళు పారేసి ఇంట్లోకొచ్చాడు.

అమ్మ బియ్యం చెరుగుతోంది.

దగ్గరకెళ్ళి "అమ్మా, తాయిలం చెయ్యవూ?" అనడిగాడు.

"రోజూ తాయిలమెక్కణ్ణించి తెచ్చేదిరా! నిన్న తిన్లేదూ?"

"ఊఁహూఁ చెయ్యి".

"ఊహూఁ. నిన్నంటే అక్క కూడా వుండింది కదా!"

"అక్క మళ్ళా తింటుందిలే."

"ఊఁ బావుంది. నువ్వు స్కూలుకెళ్ళనప్పుడల్లా తాయిలాలు చేసి పెట్టాలా? అదివారం పూటంటే అందరూ వుంటారు. అందరూ తింటారు. మళ్ళీ ఆదివారం చేస్తాలే."

ఉక్రోషంగా చంటి అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

ఇప్పుడు పూర్తిగా ఒంటరితనం కనిపిస్తోంది. ఆడుకోవడానికెవరూ లేరు. వెళ్ళి కేరంబోర్డు ముందేసుకొని ఒక్కడే ఆడ్డం మొదలెట్టాడు. ఇట్నుంచటు కొట్టి స్ట్రైకర్ని అవతలికెళ్ళి తెచ్చుకోవాలంటే చిరాకేసింది. బోర్డు నెత్తకుండా ఎక్కడి కాయిన్సక్కడే పడేసి లేచిపోయాడు. బయటికొచ్చి చూశాడు. గోళీలాడుకునే పిల్లల్లేరు. మళ్ళీ ఇంట్లోనికొచ్చి అమ్మ దగ్గరకెళ్ళి, "అమ్మా కథ చెప్పు," అన్నాడు.

"పన్లు చేసుకొంటుంటే కథలు కావల్సొచ్చాయా? పనుంది ఫో."

అక్కడే కూచుని అమ్మ బియ్యం చెరగడం చూస్తూ మెల్లగా ఒరిగి ఒళ్లో తల దాచుకోబోయాడు. తోసేసింది.

అప్పుడొచ్చిందేడుపు. లేచి నిలబడి కాళ్ళు నేలకేసి కొట్టి ఏడుస్తూ వెళ్ళి చాపమీద పడుకున్నాడు. మళ్ళీ అమ్మొచ్చి పిలిచేవరకూ అక్కడే వున్నాడు.

"అన్నం వండాను తినవా?"

"నేను తినను ఫో."

"మా చంటి కదూ! రామ్మా."

"ఊహూఁ."

"మా అమ్మ కదూ, రామ్మా."

గడ్డాన్ని చేరిన అమ్మ చేతిని తోసేశాడు.

"రావా?"

"......................."

"తాయిలం వద్దా?"

చటుక్కున లేచి కూచున్నాడు. "తాయిలమా?"

"తిందూగాన్రా."

"ఊహూఁ," బెట్టు చేశాడు.

"నాకేం. ఇక్కడే పడుకో," అని అమ్మ వెళ్ళిపోతుంటే ఇంకా బతిమాలనందుకోపఁ వొచ్చింది గాని తాయిలం కోసం ఝామ్మని లేచి వెంట పరిగెత్తాడు.

చంటి భోంచేశాక ఆఫీసునుంచి ప్యూనొచ్చాడు. నాన్నగారికీ, అక్కకూ అతను కేరియర్స్ పట్టుకెళ్తాడు.

"సిన్నయ్యగోరు స్కూలు కెల్లేదులా వుంది."

"వెళ్లను ఫో. నీకేం?" తన్నాలన్నంత కోపం వచ్చింది చంటికి.

"హబ్బో హబ్బో సిన్నయ్యగారికెంత కోపం!" ఉడికించాడు.

రోషంగా వెళ్ళి చాపమీద పడుకున్నాడు.

చంటికి మళ్ళీ స్కూలు గుర్తుకొచ్చింది.

గుంపులు గుంపులుగా పిల్లలు, తెలుగు వాచకం పట్టుకొన్న టీచరు చాలా ప్రియంగా కనిపించారు. స్కూలుమీద అనుకోని ప్రేమ ముంచుకొచ్చేసింది.

అలాగే పడుకొని నిద్రపోయాడు చంటి.

సాయంత్రం నాలుగున్నరకు నిద్ర లేచి కాస్సేపు అటూ ఇటూ తిరిగి వీధి గుమ్మం దగ్గరికెళ్ళి నిలబడితే హరిగాడు స్కూలు నుంచి ఇంటికొస్తూ కనిపించాడు.

"ఒరే కిరణ్, నువ్వు రాలేదురా, టీచర్ భలే కథ చెప్పింది."

ఉత్సాహంగా ముందుకు వంగి, "ఏం కథరా?" అడిగాడు చంటి.

"జింకా నక్కా కథ."

"ఒరే ఒరే నాకు చెప్పరా?"

"తర్వాత చెప్తారా, టీచర్ నువ్వు రాలేదేమంది. నువ్వు చెడిపోతున్నావన్జెప్పింది."

చంటి గుండె దిగజారిపోయింది.

"ఒరే, ఈ రోజే కేశవం మాస్టారు మా అందరిచేతా కబడీ ఆడించారు వాళ్ళ క్లాసు వాళ్ళకీ, మనకూ."

"ఎవరు గెలిచార్రా?"

"మనమే."

చంటి గుండె గర్వంతో నిండిపోయింది.

హరి వెళ్ళిపోయాక చంటి దిగాలుగా ఇంట్లో కెళ్ళాడు.

సాయంత్రం నాన్నా, అక్కా వచ్చేశాక బాగా ఆడుకున్నాడు. ఊరికే నాన్న దగ్గర్నుంచక్క దగ్గరికీ, అక్క దగ్గర్నుంచి నాన్న దగ్గరికీ తిరిగాడు.

ఆ రోజు రాత్రి పడుకోబోయేముందు, "అమ్మా జింకా నక్కా కథేంటే?" అనడిగాడు చంటి.

"ఏం జింకా నక్కా?"

"నాకేం తెలుసు. మా టీచర్ చెప్పిందంట. హరిగాడన్నాడు."

"అదా," అని అమ్మ చెప్పడం మొదలెట్టింది. "అనగనగా ఓ అడవిలో ఓ జింక వుండేదట. ఓ నక్క దాన్ని చూసి ఎలాగైనా తినేద్దామని దాంతో స్నేహం చేసిందట..."

చంటి ఒళ్ళంతా చెవులు చేసుకొని కథ విన్నాడు.

కథ విపరీతంగా నచ్చేసింది.

బాగా పొద్దుపోయాక అమ్మ గుండెల్లో వెచ్చగా మొహం దాచేసుకొని ఏవో ఆలోచనల్లో పడిపోయినవాడల్లా ఉన్నట్టుండి తల పైకెత్తి, "అమ్మా రేపు తొందరగా నిద్ర లేపాలి," అన్నాడు.

కళ్ళు మూసుకు పడుకున్న అమ్మ కళ్ళు తెరిచి "దేనికి?" అనడిగింది.

"స్కూలుకెళ్ళడానికి," అనేసి మళ్ళీ గుండెల్లో దాగిపోయాడు చంటి.

*ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 29-4-1983*

# భవితవ్యం

"నాన్నా! ఈ రోజు సినిమాకు పిల్చుకెళ్తానన్నావు?"

"అవునవును మర్చేపోయాను", అని జేబు తడువుకొని, "ఈసారి వద్దమ్మా! వచ్చే ఆదివారం వెళ్దాంలే," అన్నాడు కృష్ణమూర్తి దిగులుగా.

"పో నాన్నా! పోయినాదివారమడిగినప్పుడేమో నెలాఖరన్నావు. ఈరోజు రెండో తేదీ. మళ్ళీ ఆదివారమంటావేం? అప్పుడు మళ్ళీ డబ్బుల్లేవంటావు."

"నిజం తల్లీ! కావలసిస్తే మీ అమ్మనడుగు ఇంటి ఖర్చులకు ఎంతయ్యిందో! వచ్చే ఆదివారం ఎలాగైనా తీసుకెళ్తాగా."

"వద్దంటే నీక్కాదటే! నువ్వు మరీ విసిగిస్తావాయన్ని. నెలకెన్ని సినిమాలు చూస్తావేం? మొన్ననేగా లీలామహల్ కెళ్ళింది," తల్లి కూడా కసిరేసరికి పద్మజ మొహం చిన్నబోయింది.

"ఆ! ఆ సినిమాకెళ్ళి నెల్లాళ్లయింది," అని సన్నగా నసుగుతూ వెళ్ళబోతుంటే, "దాని మాటలకేంలే తల్లీ! వచ్చే ఆదివారం నే పిల్చుకెళ్తాగా," అన్నాడు తండ్రి.

"అయితే వచ్చే ఆదివారం విశ్వనాథ్ సినిమా రిలీజవుతోంది నాన్నా! దానికెళ్దామేం?" అంది పద్మజ.

"అలాగే వెళ్దాం. విశ్వనాథ్ సినిమా అయితే మీ అమ్మని కూడా పిల్చుకెళ్దాం. ఏం శాంతీ నువ్వూ వస్తావా? విశ్వనాథ్ సినిమా అట," అన్నాడు కృష్ణమూర్తి.

"నాన్నా, నేనూ వస్తానేం," ఎగిరి గంతేసి తండ్రి ఒళ్లో తలమోపి గారంగా అన్నాడు చిన్నీ.

"నువ్వు లేకుండా ఎట్లారా? నువ్వూ వద్దువుగాన్లే," అన్నాడు కృష్ణమూర్తి.

"నేను మాత్రం రాన్లెండి. అయినా మీరు నన్నెప్పుడు పిల్చుకెళ్తారు గనక! పెద్దదాన్ని వెంటేసుకుని తిప్పమంటే లోకమంతా తిప్పుతారు," అంది శాంతి.

"అన్యాయంవే అమ్మా! పోయిన వారం నువ్వు రాలేదూ," నేరం మోపుతూ అంది పద్మజ.

"ఆ ఆ వచ్చాలెద్దూ! మహాగొప్ప సినిమా అనీ," దీర్ఘం తీస్తూ నవ్వు దాచుకుంది శాంతి.

"నువ్వామాట అంటుంటే గుర్తుకొచ్చిందే. మొన్న ఎలెక్షన్లప్పుడు నేను సుందర్రామయ్య గారింట్లో కూర్చున్నానా, బయటినుండి పెద్దగా ఏదో వెళ్తున్న శబ్దం వినిపిస్తే పార్టీ వాళ్లు బాంబులు విసురుకుంటున్నారని సుందర్రామయ్య వాళ్లావిడ కేకలు పెట్టి నానా గాభరా పెట్టింది. వెళ్లి చూస్తే ఎదురింటి వాళ్లు పెద్దగా టేప్ రికార్డర్ పెట్టి డిస్కో పాట ఏదో వింటున్నారు," అన్నాడు కృష్ణమూర్తి నవ్వడం మొదలెట్టి.

పద్మజ అది విని పకపకా నవ్వి, "నువ్వలా అంటున్నావుగా నాన్నా! మొన్న సీతాలక్ష్మి వాళ్లింట్లో ఏం జరిగిందంటే టేపురికార్డర్ పెట్టి డిస్కో పాట వింటుంటే ఏదో కొత్త మ్యూజిక్ వినబడిందే అమ్మా! 'ఇదేవిటబ్బా, ఇదెప్పుడూ విన్లేదే,' అని సీతాలక్ష్మి తెగ కంగారుపడి పోయింది. తీరా చూస్తే అదేమిటో తెలుసా? వాళ్లింటెదురుగా పాత సామాన్లు కొనేవాడు సుత్తె పెట్టి బక్కెట్టు మోదుతున్నాడు," అంది.

ఆ రాత్రి పక్కమీద నడుం వాల్చుతూ, "పిల్లలు నిద్రపోయారా?" అడిగాడు కృష్ణమూర్తి.

"ఆఁ! చిన్నా ఎప్పుడో నిద్దరోయాడు. పెద్దది ఏదో నవల చదువుతుంటే తిట్టి పడుకోబెట్టి వస్తున్నాను" అంది శాంతి అతని పక్కనే కూర్చుంటూ.

"పద్మజ ఎదుగుతోంది శాంతీ!" అన్నాడు కృష్ణమూర్తి.

"అవునూ," అని దీర్ఘం తీసి, "ఇప్పుడు మీకా సంగతి కొత్తగా కనిపిస్తున్నట్టుందే," అంది శాంతి నవ్వుతూ.

కృష్ణమూర్తి నవ్వలేదు.

"ఇప్పుడు దానికి పదమూడో ఏడుగా! ఇక నేడో రేపో!" అంది శాంతి.

కృష్ణమూర్తి తలూపి, "ఆ తర్వాత?" అన్నాడు.

"ఏమిటి ఆ తర్వాత?" అడిగింది శాంతి.

"కట్నాలు వేలకు వేలు అడుగుతున్నారు శాంతీ! దాని పెళ్ళి ఎలా చేయగలమో!"

"బావుంది. పిల్లకు ఏళ్లు మీదపడి పోయినట్టు బాధపడతారేం?" అంది శాంతి భర్తని విచిత్రంగా చూస్తూ. కృష్ణమూర్తి కూతురి పెళ్లి గురించి మాట్లాడ్డం అదే మొదటిసారి.

"నీకు చెప్పలేదుగాని, చాలా రోజుల్నించి నన్నీ ప్రశ్నే బాధిస్తోంది శాంతీ! ఎక్కడినుంచి తెస్తాం అంత డబ్బు," అన్నాడు కృష్ణమూర్తి దిగులుగా.

"బావుంది, అలా అని పిల్లకు పెళ్ళి చేయరా ఏం?" అంది శాంతి.

"చేయాలి. అదే, ఎలా చేయగలమా అని."

"అప్పటికెలాగోలా అవుతుంది లెద్దురూ. దాని గురించి ఇప్పుడే ఇంత బాధపడిపోవడం ఎందుకట?"

"బాధకాదు, ఆలోచన," అన్నాడు కృష్ణమూర్తి.

మర్నాడు ఆఫీసులో వరకట్నం సమస్య గురించి చర్చ సాగుతోంది.

"లాభం లేదబ్బాయ్!" అన్నాడు సుందర్రామయ్య కుర్చీ వెనక్కువాలి. ఆయనకి యాభై రెండేళ్లు. "మా అమ్మాయికి పెళ్ళి చేశాను! ఎలా చేశాను? మా తాతగారి పొలం అమ్మేయాల్సొచ్చింది," అన్నాడాయన.

"వరకట్నం తీసుకోవడం చాలా అన్యాయంఁవండి," అన్నాడు ప్రసాదు బల్లగుద్ది వాదిస్తూ. అతనికి పాతికేళ్లు. ఉడుకు నెత్తురు. కొత్తగా ఉద్యోగంలో చేరాడు.

"అన్యాయమే! కాని అది పోయేదెట్లా?" అన్నాడు సుందర్రామయ్య.

❖ ❖ ❖

ఆ ఉత్తరం చూసి శాంతి దవడలు నొక్కుకుంది.

"మీ అక్కగారేదో మంచిదన్నారు. పిల్లాడికి పెళ్లి చేయతలపెట్టి మిమ్మల్ని కనీసం సంప్రదించనైనా లేదు. అవ్వ! నిండా ఇరవై ఏళ్ళు నిండని పిల్లాడికి పెళ్లా! డబ్బెవరికైనా ముద్దే! అయినా, ఆవిడ మగవారి తరఫు బంధువుల్లెండి," అంది దెప్పిపొడుపుగా.

కృష్ణమూర్తి కుంగిపోయాడు. అతనికి నిరాశతో పాటు అక్కగారిమీద అలవిమీరిన కోపం కూడా కలిగింది. కొన్నిరోజులు ఆ ఉత్తరానికి జవాబు కూడా రాయలేదు.

"మీ అక్కగారెలాగూ మిమ్మల్ని లెక్కపెట్టలేదు. మీరిప్పుడు జవాబు కూడా రాయకపోతే ఏడిచిపోతున్నారంటారు. మనకెందుకు నామర్దా! జవాబు రాసెయ్యండి. మనమ్మాయికేం రాజాలాంటి సంబంధం తేవచ్చు," అంది శాంతి.

అప్పటికి కొంత శాంతించిన కృష్ణమూర్తి అక్కగారికి సంతోషాన్ని వెలిబుచ్చుతూనే ఉత్తరం రాసి పడేశాడు.

ఆ ఉత్తరాన్ని పోస్టు చేసిన రోజే రాత్రి భోజనాలప్పుడు చిన్నా అన్నాడు, "నాన్నా! రేపేం, పుస్తకం కొని పెట్టవా?"

"ఏం పుస్తకం నాన్నా?"

"తెలుగు వాచకం. మరేం, పుస్తకాలు దొరకట్లేదుగా. రేపు తీసుకోకపోతే మళ్ళా అయిపోతుందట."

"ఎందుకయిపోతుందట?" అడిగాడు కృష్ణమూర్తి పరధ్యానంగా.

"గవర్నమెంటు వాళ్ళు పుస్తకాలు సరిగ్గా సప్లయి చేయడం లేదుగా నాన్నా! తొందరగా కొనెయ్యకపోతే అయిపోతాయి," అంది పద్మజ.

"ఓహో! అయితే కొందాంలే. ఎంతట?"

"ఏడున్నర."

కృష్ణమూర్తి ఆశ్చర్యంగా తలెత్తాడు. "నాలుగో క్లాసు పుస్తకం ఏడున్నరా?"

"ఆశ్చర్యం ఏముంది? అన్ని ధరలూ ఆకాశం మీదే వున్నాయి," అంది శాంతి.

"నాన్నా! నాన్నా! నేనేం, గుమాస్తాని కాను," అన్నాడు చిన్నా హఠాత్తుగా ఏదో గుర్తుకు తెచ్చుకుని.

"ఎవరన్నారు నాన్నా నువ్వు గుమాస్తావౌతావని?"

"మరేం అమ్మ అంటోంది. మీ నాన్న గుమాస్తాయేరా! నువ్వెట్టా డాక్టరవుతావంది. నాన్నా, నేనేం, డాక్టరవుతాను," అన్నాడు చిన్నా.

"అలాగే నాన్నా! మీ అమ్మకేం తెలుసు? ఒట్టి మొద్దు. నువ్వు పే...ద్ద డాక్టరౌదువుగాని," అన్నాడు కృష్ణమూర్తి.

"ఒరేయ్, నువ్వుత్త డాక్టర్‌వి కావురా! పే...ద్ద డాక్టర్‌వి" అంది శాంతి వెక్కిరిస్తూ.

"మరి, నేను పే...ద్ద డాక్టర్నే అవుతాను" అన్నాడు చిన్నా బింకంగా.

"ఆ ఆ అవుతావౌతావు – లక్ష రూపాయలు డొనేషన్ కట్టి."

"డొనేషనా! అంటే?" కొర్రి వేసింది పద్మజ.

"సీటివ్వడానికి కాలేజీల్లో తీసుకునే లంచం."

"కాలేజీల్లో సీట్లా? సినిమాల్లో సీట్లలా వుంటాయా నాన్నా? ఎంచక్కా మనకిచ్చేస్తారా? బస్సులో సీట్లయితే మనకొద్దు," అన్నాడు చిన్నా.

పద్మజ ముద్ద నోట్లో పెట్టుకోబోతూ పడీపడీ నవ్వడం మొదలెట్టింది. "అవున్రా! ఒరేయ్ లక్ష రూపాయలు తీసుకొని సినిమాలో కుర్చీ ఇస్తార్రా మనకి," అంది.

"మరి పుస్తకానికి డబ్బులెప్పుడిస్తావు నాన్నా? రేపే కావాలి," అన్నాడు చిన్నా.

"రేపే ఇస్తా నాన్నా! ఎందుకు, రేపు నేనే బజార్లో కొనుక్కొస్తాలే."

"అయ్యో! నీకేం తెలీదు. అవి బజార్లో దొరకవుగా! స్కూల్లోనే వుంటాయి. డబ్బులు మా మేస్టారికిస్తే పుస్తకం ఇస్తాడు."

"ఎలారా? నా దగ్గరిప్పుడంత లేదే. రేపు ఆఫీసులో ఎవర్నయినా అడిగిస్తాను. ఎల్లుండి తెచ్చుకుందువుగాన్లే," అన్నాడు కృష్ణమూర్తి.

"అయిపోతాయి నాన్నా పుస్తకాలు," గునిశాడు చిన్నా.

"మీ మేస్టారు నాకు తెలుసులేరా, చీటీ రాసిస్తానుగాని," అన్నాడు కృష్ణమూర్తి.

ఆ రాత్రి పిల్లలిద్దరూ పడుకున్నాక శాంతి మెల్లగా భర్త చెవుల్లో వూదింది.

"ఏవండీ! మీకో విషయం చెప్పాలి."

కొడుకు చదువు గురించి ఆలోచిస్తున్న కృష్ణమూర్తి పరధ్యానంగా "ఊ" అన్నాడు.

"అదిగో, మీరేదో ఆలోచిస్తున్నారు, ఇటు తిరగండి సార్," అంది శాంతి.

"ఏమిటోయ్?" అడిగాడు భార్యకేసి తిరిగి.

"మరేం మనకు మరో చంటాడు పుట్టబోతున్నాడు," అంది తను.

కృష్ణమూర్తి చటుక్కున లేచి కూర్చున్నాడు.

"ఏమిటీ? సరిగ్గా చెప్పు."

"సరిగ్గానే చెప్పాను. మనకు మరో పిల్లాడు పుట్టబోతున్నాడు," అంది శాంతి.

కృష్ణమూర్తి దిండుపైకి వాలాడు.

"ఊఁ హూ," అన్నాడు ముభావంగా.

శాంతికి కోపం వచ్చింది. "ఏమిటి ఊహూ? మీకు సంతోషంగా లేదూ?" అడిగింది.

కృష్ణమూర్తి జాలిగా చూశాడు. భార్యను లాలనగా దగ్గరకు తీసుకుని, "చూడు శాంతీ! మనకు మరో పిల్లాడెందుకు చెప్పు," అన్నాడు.

"అంటే?" కోపంగా అంది శాంతి.

"పిల్లలమీద వ్యామోహపడే వయస్సు పోయింది మనకు. ఇద్దరు రత్నాల్లాంటి పిల్లలు పుట్టారు. ఇంకా మనకు పిల్లలెందుకు చెప్పు?"

శాంతి సహించలేనట్టు దూరంగా జరగబోయింది. కృష్ణమూర్తి పట్టుకున్నాడు.

"నాకిప్పుడు నలభై ఏళ్ళు, శాంతీ! ఇప్పుడు మళ్ళీ మనకు పిల్లలు పుడితే వాళ్లకు ఉపయోగపడాల్సిన వయస్సులో మనం ఉపయోగపడలేము" అన్నాడు.

"అయితే ఏమిటి?" చిరాగ్గా అడిగింది.

"ఈ పిల్లాడు... ఈ పిల్లాడు మనకొద్దు."

శాంతికి ఊపిరాగినంతపనయ్యింది.

కృష్ణమూర్తి ఇంకా అంటున్నాడు, "పెద్దదానికి పెళ్ళి చేయాలి, చిన్నాని చదివించాలి. ఈ రెండే చాలు మనకు. ఈ జీవితం సరిపోతుంది. ఇంకా పిల్లలు మనకొద్దు శాంతీ!"

శాంతికి ఏడుపు ముంచుకొచ్చేసింది.

"శాంతీ, ఇదేమిటి? ఛ... ఛ!" అన్నాడు కృష్ణమూర్తి.

శాంతి ఉక్రోషంగా చూసింది. "పుట్టిన బిడ్డ ఒకటి, పుట్టని బిడ్డ ఒకటి అని మీరను కున్నట్టు నేననుకోలేను. పిల్లలు ఇంత భారంగా మీకనిపిస్తుంటే పుట్టిన బిడ్డలమీద మాత్రం ఎందుకు ప్రేమ? వాళ్ళకీ ఇంత విషమిచ్చెయ్యండి," అంది.

"నేను చెప్పేది నువ్వర్థం చేసుకోలేదు," అన్నాడు కృష్ణమూర్తి నిస్సహాయంగా.

"అర్థం చేసుకున్నాను. బాగా అర్థం చేసుకున్నాను. పిల్లలు చస్తే బావుంటుందని మీరనుకుంటున్నారు."

"ఛీ!" అన్నాడు కృష్ణమూర్తి భరించలేనట్టు.

"మీకంత ఇష్టం లేకపోతే ముందే జాగ్రత్త తీసుకోవలసింది. కడుపులో బిడ్డని చంపడానికి నేను చస్తే ఒప్పుకోను," అని లేచి ఏడుస్తూ పక్కగదిలో పడుకున్న పద్మజ పక్కన వెళ్ళి పడుకుండిపోయింది.

మర్నాడు ఆఫీసుకి వెళ్తుండగా దారిపక్కన, "ఇచ్చట జ్యోతిష్యము చెప్పబడును" అని అరచేతి బొమ్మ బోర్డు పెట్టుక్కూర్చున్న మనిషి కనిపించాడు కృష్ణమూర్తికి.

కృష్ణమూర్తి  అతన్ని చూసి ఆగాడు. జేబు తడుముకున్నాడు. రెండు రూపాయి నాణాలున్నాయి.

జోస్యుడి దగ్గరికెళ్ళి ఒక నాణెం చేతిలో పెట్టి, "చెప్పు," అన్నాడు అరచేయి చూపిస్తూ.

"నీది మెత్తటి మనస్సు," అన్నాడు జోస్యుడు.

"ఊఁ," అన్నాడు కృష్ణమూర్తి.

"మాట కరుకు, కడుపునిండా శాంతి," అన్నాడు జోస్యుడు.

"ఊఁ," అన్నాడు కృష్ణమూర్తి.

"ఇప్పుడు చాలా కష్టాల్లో వున్నావు. అందరూ కలిసి నిన్ను నట్టేట్లో ముంచేశారు," అన్నాడు జోస్యుడు.

నిజమేననిపించింది కృష్ణమూర్తికి. "ఊఁ," అన్నాడు.

"నీ భార్య నిన్ను బాధపెడుతుంది."

"ఊఁ," అన్నాడు తలూపి.

"కష్టాలు నిన్ను కాటేస్తాయి. అయినా నువ్వు ధైర్యంగా వుంటే వాటిని జయించగలవు."

కృష్ణమూర్తికి సంతోషంగా అనిపించింది. "ఊఁ," అన్నాడు ఉత్సాహంగా.

"ఇప్పుడు నీకు చాలా గడ్డుకాలం. నువ్వు ధైర్యంగా వుండాలి," అన్నాడు జోస్యుడు.

కృష్ణమూర్తి మళ్ళీ "ఊఁ," కొట్టాడు.

"రాబోయే పది రోజుల్లో ఏ అవకాశం వచ్చినా వదులుకోకు, నీకు రాజయోగం పట్టబోతున్నది."

"ఎలా?" అడిగాడు కృష్ణమూర్తి.

"నీకు త్వరలో గొప్ప నిధి దొరుకుతుంది."

"ఊ" అనే అన్నాడు గాని, ఇది మాత్రం నమ్మబుద్ధి పుట్టలేదు. అయినా మనసుకెందుకో కొంత ఆశగా అనిపించింది.

"అవకాశాన్ని మాత్రం వదులుకోకు," అంటూ చెయ్యి వదిలేశాడు జోస్యుడు.

కృష్ణమూర్తికెందుకో జోస్యుడి మాటల్లో నమ్మకం కుదిరింది. అవకాశం వస్తుంది, వదులుకోవద్దన్నాడు. తనకేం అవకాశం వస్తుందబ్బా!

ఆలోచిస్తూ నడుస్తున్నవాడు కాస్త ఠక్కున ఆగిపోయాడు.

"రండిసార్ రండి. లక్షాధికారులు కండి, తెల్లారితే లక్షాధికారి. ఒక్క రూపాయికి ఇరవై లక్షలండి సార్! 'భాగ్యలక్ష్మి' లాటరీ టికెట్ కొనండి సార్. అదృష్టవంతులెవరో ముందుకు రండి సార్, అందుకోండి సార్ ఇరవై లక్షలు. రూపాయికి ఇరవై లక్షలు. తెల్లవారితే లక్షాధికారి. ఫస్ట్ ప్రైజ్ ఇరవై లక్షలు. మీకు పోతే ఒక్క రూపాయి, వస్తే ఇరవై లక్షలు. ఆలోచించకండి సార్, అదృష్టవంతులు మీరే కావచ్చు," గొంతు చించుకుంటూ లాటరీ టిక్కెట్లవాడు మైకులో అరుస్తున్నాడు.

కృష్ణమూర్తి సాలోచనగా అటు చూశాడు. జోస్యుడేదో నిధి వస్తుందన్నాడు, బహుశా ఇదేనేమో! అతను చెప్పిన అవకాశం కూడా ఇదేనేమో!

అతను ముందుకు కదిలాడు. జేబులోంచి మిగిలిన ఒక్క రూపాయిబిళ్లా బయటికి తీశాడు.

ఎదురుగా ఇరవై లక్షలే అతనికి కనిపిస్తున్నాయి.

"ఓ భాగ్యలక్ష్మి టిక్కెట్టివ్వు," అన్నాడు కృష్ణమూర్తి.

ఉదయం వీక్లీ

# జడ్జిమెంట్

మొదటి బొయ్యిమని గూబ గుయ్యిమనేట్టు బిగ్గరగా హారన్ మోగేక బస్సు స్టార్టయింది. చలిగాలికి పళ్లు కిటకిటలాడిపోయినట్టుగా కిటికీల అద్దాలు గడగడా వణికిపోవడం ప్రారంభించాయి. బస్సు లోపలి వాసన సరిపడక, "ఎలాగూ సీటు లేదులే-నిలబడవలసిందేగా, స్టార్టయ్యేక యెక్కితే సరి," అని స్వగతం మాట్లాడుకొని అంతవరకూ బయటే నిలబడ్డ ఒకరిద్దరు తిరిగి బస్సెక్కేశారు.

బస్సెక్కిన వాళ్ళందరి చూపుల్నీ అయస్కాంతంలా పట్టేస్తోందా అమ్మాయి.

కుడివైపు వరసలో నాలుగో సీట్లో కూర్చొని వుంది తను. మగాళ్లు మాత్రమే కాదు - బస్సులోని నలుగురైదుగురు ఆడవాళ్ళు కూడా అప్పుడప్పుడూ ఆమెకేసి తేరిపారా చూస్తున్నారు. ఓ కాలేజీ స్టూడెంట్ అందర్నీ తప్పించుకుంటూ అటుగా వెళ్ళి ఆమెవైపు ఓరచూపులు విసుర్తూ నిలబడ్డాడు.

ఆమెకు వెనక సీట్లో కూర్చున్న యిద్దరు వ్యక్తులు ఆమెను గురించే మాట్లాడుకుంటున్నారు.

"ఈ పిల్లనిప్పుడేం జేస్తావురా మణీ?"

ఆ మాట అడిగిన కళ్ళద్దాల పెద్దమనిషికి నలభై దాటి వుంటుంది వయస్సు.

"నువ్వట్లా చెప్పడం సరింగా లేదన్నా!" ఇప్పుడేం జెయ్యాలన్నా అదే నాకు చెయ్యగల్దు," పక్కనే కూర్చున్న రెండో మనిషి అంటున్నాడు.

వాళ్ళిద్దరూ యెవరి గురించి మాట్లాడుకుంటున్నారో చూచాయగా గ్రహించగలిగిన ఒకరిద్దరు ఆ రెండోమనిషి కేసి కుతూహలంగా చూశారు.

అతనికి ముప్ఫయి యేళ్ళుంటాయి. మాసిన గుడ్డలా కనిపిస్తున్నాడు. గెడ్డం అసహ్యంగా పెరిగింది. వంటిమీదున్న దుస్తులు తామెప్పుడో తెల్లగా కూడా వుండేవన్న విషయాన్ని దీనంగా చెబుతున్నాయి. కళ్ళు ఎర్రగా వున్నాయి. పళ్ళ బిగువున ఆరిపోయిన బీడీ ముక్క పట్టుకున్నాడు. ఆ చూస్తున్న వాళ్ళు అతని అవతారానికీ, అంత నీటుగా కనిపిస్తున్న ఆ అమ్మాయికీ యేం సంబంధం వుంటుందా అని ఆలోచిస్తున్నారు.

"అది కాదురా మణీ! ఇప్పుడేందో జరిగి పోయినాదే అనుకో – అదట్లుండనీ! కోర్టులో తేలేదేందో తేల్తాది. ఆ తర్వాత ఆ పిల్ల యేం గావాల? నే జెప్పేదినుకో – కాంప్రమైజేషను పెట్టించేస్తా. ఆళ్లు కేసెత్తేసుకుంటారు. నువ్వా యమ్మి నేలుకో!" కళ్ళద్దాల పెద్దమనిషి అనునయంగా అన్నాడు.

"ఏందన్నా నువ్వు చెప్పేది?" కోపంగా అన్నాడు మణి. "ఎంత పోలీసు కేసులో యిరుక్కున్నా చెడిపోయిందాన్ని నన్నేలుకోమంటావా?"

కళ్ళద్దాల పెద్దమనిషి తీక్షణంగా చూశాడు.

"నువ్వు గాదురా దొంగనాయాల దాన్నందులోకి దించినావు?"

"సర్లెన్నా బానే సెప్తుండావు గానీ, నువ్వు చెప్పే కాంప్రమైసన్కి నేరాననుకో – ఆళ్లు కోర్టులో కేసెడ్తరు. కచ్చేరీలో తేలేదేంది? ఇది నా సైడు చెప్తదా? నన్నెట్టాగూ బొక్కలో యెట్టించేదే! తెగింది తెగిందేన్నా! అంత కాందానికెందుకు సెప్తవ్?"

ఈ తర్కం బుర్రకెక్కేసరికి కళ్ళద్దాల పెద్దమనిషికి కాసేపు పట్టింది.

వాళ్ళు తన గురించే మాట్లాడుకుంటున్నారని తెలిసినా ఆ అమ్మాయి మాత్రం కళ్ళు తిప్పి ఒక్కసారయినా వాళ్ళవంక చూడలేదు. అసలామె యెవరివంకా చూడ్డంలేదు. కేవలం తల వంచుక్కూర్చుంది.

కళ్ళద్దాల పెద్దమనిషి మళ్ళీ యేదో అనబోయేసరికి మణి అక్కణ్ణుంచి లేచిపోయాడు.

"యాడికిరా...? కూకో!" అన్నాడాయన.

అతను జవాబివ్వలేదు. జనాన్ని తోసుకుంటూ అవతలికెళ్ళి ఆ అమ్మాయి పక్కనే కూలబడ్డాడు.

అక్కడికి కాస్త దూరంలో కూర్చున్న ఇన్స్పెక్టర్ ఇబ్రహీం పెద్దమనిషిని కేకేశాడు.

"ఓయ్ పెద్దమనిషీ! నువ్వు ఎమ్మెల్లేవన్నా కాకపోతివే వాణ్ణి బెదిరించడానికి," అని నవ్వేడు.

"అదెట్లాగండి సార్! మీయట్లంటోళ్ళు నాలుగు ఓట్లేపించి గెలిపించకపోతిరి. పెట్టిన డిపాజిట్టు కూడా పోయె," ఇన్స్పెక్టర్ మాట తిరగబొడిచి బిగ్గరగా నవ్వేశాడు కళ్ళద్దాల పెద్దమనిషి. "ఈడికి రండి సార్, ఖాళీ వుండాది," ఆహ్వానించాడు.

"ఫరవాలేదులే, పాపం ఆయనెవరో కూర్చున్నాడు," చిరునవ్వుతో ఆఫర్ తిరస్కరించాడు ఇన్స్పెక్టర్.

కళ్ళద్దాల పెద్దమనిషి పక్కన మణి ఖాళీ చేసిన సీట్లో ఓ ముసలాయన కూలబడ్డాడు.

"ఎలక్షన్లకి నిలబడినావేమన్నా?" ఆయనతో మాట కలుపుతూ కొశ్చ్రీ వేశాడు.

కళ్ళద్దాల పెద్దమనిషి తలూపేడు.

"ఆఁ.... ఇండిపెంటెంటుగా నిలబడితి. డిపాజిట్టు రాలేదులే," తేలిగ్గా నవ్వేశాడు.

"ఏం పేరో?"

"నా పేరా? నారుమళ్ళ చౌడయ్యలే!"

"ఓ... నువ్వేనా?" పేరు గుర్తుంచి అన్నాడా ముసలాయన. "ఏ వీధన్నా మంది?" ఆసక్తిగా అడిగాడు.

"మేం హరిజనులంలే... హరిజనవాడ."

ముసలాయన నిట్టూర్చాడు.

"యేందోలే! మీయట్టంటోళ్ళకి ఓట్లెయ్యరు జనాలు," సానుభూతిగా అన్నాడు.

చౌడయ్య తలూపి, "అంతే అంతే," అన్నాడు.

బస్సులో అందరికీ టిక్కెట్లు కోసిచ్చాక కండక్టర్ రైట్ చెప్పగానే బస్సు బయల్దేరింది.

ముసలాయన యెదురు సీట్లో కూర్చున్న ఆ అమ్మాయిని తేరిపార చూసి, "ఈ అమ్మి యెవరో?" అన్నాడు.

"మనూరే... మేటపత్రు! దాని పక్కన కూకుండ్లే – మణి అని ఆ యమ్మిని లేవదీసుకుపోయి బొంబాయిలో యెభిచారం కొంపకి అమ్మేసినాడు."

చౌడయ్య ఆ మాట చెప్పగానే అందరి కళ్ళూ మరోసారి ఆసక్తిగా ఆమెకేసి తిరిగాయి. ఆమె పక్కన కూర్చున్న మణి ఫోజుగా సీట్లో వెనక్కి జారగిలబడ్డాడు. వాళ్ళిద్దరూ ఎవరివైపూ చూడ్డంలేదు.

"ఆ యమ్మే పోయిందా, ఇతనే మోసం జేసినాడా?" అడిగాడు ముసలాయన.

"ఆ యమ్మి పోయినాది – యీడు మోసం జేసినాడు," వివరించాడు చౌడయ్య. "బొంబాయిలో లెక్క అయిపోజేసుకోని యీడు దాన్ని రెండున్నర వేలకి అమ్మేసినాడు. ఈళ్ళిద్దరూ లేచిపోయినాక దాని అమ్మానాయినా నాకాడికొచ్చి యేదుస్తా కూకుంటే నేనే స్టేషన్లో రిపోర్టిప్పిస్తే దర్యాప్తుమీంద తెలిసినాది ఈళ్లు బొంబాయి పోయినారని. ఆడ సి.ఐ.డిలు ఆర్నెల్లు పన్జేసి ఈళ్లిద్దర్నీ పట్టినారు. అప్పటికే యిది నలుగుర్దీ అయిపోయినాది. ఆ కొంపలో దీన్ని నానారకాలుగా హింసించి నారంట!"

"పాపం!" అన్నాడు ముసలాయన.

"పిల్ల బంగారంలా వున్నాది – ఎట్టమ్మి సచ్చినాడో," మరొకరెవరో యీసడించారు.

"అయితే కేసైతదంటావా?" అడిగాడు ముసలాయన.

"ఏమో మరి?" సాలోచనగా అన్నాడు చౌడయ్య, "ఈ అమ్మి తరఫునోళ్ళు కేసెత్తేసుకుంటే యేమీ కాదు. అందుకే కాంప్రమైజేషన్ చేయిస్తాన్రా ఆ యమ్మినేలుకో అని చెప్పినా వానికి – యింటంలా!"

ఈలోగా ఇన్‌స్పెక్టర్ ఇబ్రహీం కలగజేసుకున్నాడు.

"కేసంతా ఈ అమ్మాయి చెప్పే మాటల మీదే ఆధారపడి వుంటుంది. తను మైనరేమీ కాదు. తనంతట తనే వాడి వెంట వెళ్ళి పోయానంటే యేం కాదు. మోసగించి పిలుచుకొని పోయాడంటే మాత్రం శిక్ష పడుతుంది వాడికి," అన్నాడాయన.

"మోసం చేయలేదని యెందుకు చెప్తాదిలే సార్! మోసం జేసినోణ్ణి వదిలేస్తదా?" అన్నాడు ముసలాయన.

"అదేం?"

"అదీ తెలీదంలే!"

"అయితే అన్నా, ఆ యమ్మే వాణ్ణి నమ్మి పోయినాదంటావా?" ఎవరో అడిగాడు.

చౌడయ్య తలూపి, "మరంతే గదా!" అన్నాడు.

"ఏందోలే పాడు కాలం! ఆడపిల్లని కండమే మహా పాపమయిపోతావుంది," నిట్టూర్చాడు ముసలాయన.

"పోయ్యా బాగా సెప్తివి! ఆడపిల్లలందరూ అట్టనే పోతుండారంటావా?" నిష్ఠూరంగా అన్నాడు మరో పెద్దమనిషి.

దానికి చౌడయ్య సమాధానం చెప్పాడు–

"ఒక విధంగా చెప్పాలంటే ఆ యమ్మిదీ తప్పుందనే అనుకో – కానీ, యీ కాలంలో యెంతమంది ఆడకూతుళ్ళు మోసపోతుండ్లేదు? బొంబాయిలో రోజూ యిట్లాంటి యాపారాలు జరుగుతూనే వుంటాయి. బొంబాయి సంగతెందుకు? మన కళ్ళముందరే యెన్ని జరుగుతా వుండ్లేదు? కన్న కూతుళ్ళనే తల్లిదండ్రులు అమ్మేసుకునే రోజులొచ్చినాయి – రోజూ పేపర్లలో చూడ్డంలే? ఆడదానికి గౌరవం లేనన్నాళ్ళూ యిట్లా జరుగుతూనే వుంటాది."

వింటున్నవాళ్ళందరూ నిట్టూర్చారు.

బస్సు దడదడలాడుతూ మేటపల్రుకేసి పోతోంది.

❖ ❖ ❖

"ఆ కేసేమైనాదో?" అడిగింది ఆదెమ్మ.

"ఏం కేసే?" అడిగాడు చౌడయ్య.

"అదే... ఆయమ్మిని బొంబాయిలో అమ్మిన కేసు."

"అదా! ఆయమ్మి మొత్తం తల్లికిందులు చేసినాది," విసుగ్గా అన్నాడు చౌడయ్య.

"అంటే?"

"ఆడు తనని మోసం చేయలేదని కోర్టులో సాక్ష్యం చెప్పినాది."

"ఎట్లా, పిచ్చిగాని పట్టినాదా పిల్లకు?"

"అదే అర్థం కావడంలా! ఆళ్లమ్మానాయనకాణ్ణించీ, నాకాణ్ణించీ, యినస్పెక్టర్ కాణ్ణించీ, ఆ గవర్నమెంటు లాయరు కాణ్ణించీ అందరం సిలక్కి చెప్పినట్టు చెప్పినాం. వున్నదున్నట్లు ఆడు మోసం చేసినాడని చెప్పమని! అందరి కాడ తలూపి తీరా ఆడికెళ్ళేతలికి అట్ట జెప్పి సచ్చినాది."

"అయితే ఆడు మోసం జేయలేదేమో!"

"ఆడి బొంద! ఉత్త ఫోర్టొంటీ నాయాలు. దానికేందేదో చెప్పి లేవదీసుకుపోయిండు. బొంబాయిలో అమ్మిండు. తెలిసిపోతానే వుండ్లా."

"నీకూ నాకూ తెలిసింది కచ్చేరివోళ్ళకి తెల్దా?" విచిత్రంగా అడిగింది ఆదెమ్మ.

"దానంతట అదే కొంపముంచుకోని యివరంగా సాక్ష్యమిస్తావుంటే యెవడేం చేస్తాడే? నువ్వే జడ్జీవనుకో అది చెప్తావుంటే కాదని పీక తెగ్గోస్తావా? అది కావాలన్జెప్పిన సాక్ష్యం. దానికెవరేం చేస్తారు? మొదట యెర్రిగాని పట్టిందానుకున్నాను. అదేంలా! దిట్టంగుంది,"

"అయ్యో పాపం! ఇంతకీ సెడ్డోళ్ళదే కాలం."

"సూస్తావుంటే అట్నే వుండాది. బొంబాయిలో ఆ కొంపలో అన్ని హింసలు పడి గుడ్కా అట్లా చెప్పినాదంటే మరి సెడ్డోళ్ళది గాదూ కాలం! యెందుకిట్లా జేసినావే అంటే యేం జెప్పదు. ఊరికే యేడుస్తాది."

"అయితే ఆడేమన్నా బెదిరించినాడేమో!"

"బెదిరింపులా మజాకా? నాయాల్ని యేకీలు కాకీలు యిరగదియ్యనూ! ఇదే వానిమీద పడి సచ్చిపోతావుంది."

"ఆ యమ్మినేం జేసినారో?"

"వదిలేసినారు."

"పోనీలే పాపం."

"పాపమేందే పాపం! ఆడోళ్ళకుండే జబ్బే యిది. మగోడెంత తప్పు చేసినా ఆడదే భరిస్తాది. భరించి ఊరుకుంటాది. ఆడు ఈ యెధవలాంటి యెధవన్నర యెధవయినా సరే! అందుకే మగోడు యేలుకుంటూ వున్నాడు. ఇది ఆడ కోర్టులో నిలబడి వుండేది వున్నట్లు చెప్పేసి వుంటే...? ఆడు దాన్నెంత మోసం జేసినాడేం లెక్క! గాడిద కొడుకుని

కాంప్రమైజేషన్ పెట్టిస్తారా, ఆ యమ్మి నేలుకో అని కూడా చెప్పినా! ఆడు దాని కాళ్ళు కడగడానిక్కూడా పనికిరాడు, చెడిపోయిందాన్నేలుకోనంటాడు. దాన్ని సెడగొట్టిన్నా కొడుకు ఆడే! మగోడు కదూ యేమైనా అంటాడు. ఆడంటాడు ఇది పడతాది!"

ఆదెమ్మ నవ్వి, "నువ్వెందుకయ్యా అట్టిదౌతావ్? ఆ యమ్మి దాని మంచి చెడ్డలది చూసుకున్నాదిలే. నువ్వు చేయగలిగేది చేసినావ్," అంది.

చౌడయ్య మాట్లాడలేదు.

మౌనంగా తనలో తనే వుడుక్కున్నాడు.

❖ ❖ ❖

రాత్రివేళ బాగా చీకటి పడింది.

మొండిగోడలు, విరిగిపోయిన కొన్ని రాతి విగ్రహాలు, చాలా పాతకాలంనాటి గుడి అది. సరైన ఆలనాపాలనా లేక అలా తయారయింది.

ఆమె ధ్వజస్తంభాన్ని ఆనుకుని కూర్చొని వుంది. ఆమె కళ్లు మూసుకుని వున్నాయి. పొడవాటి తల వెంట్రుకలు కొన్ని ఆమె జడలోంచి తప్పుకుని గాలిలోకి లేచి ఆడుతున్నాయి. ముఖం అలసటగా వుంది.

చిన్న అలికిడి కావడంతో ఆమె కళ్ళు తెరిచి చూసింది.

ఎదురుగా అతను.

తల వంచి నిలబడి వున్నవాడు కొద్దిక్షణాలు తటపటాయించి తల పైకెత్తి ఆమెవైపు చూశాడు. అంతలోనే ఆమె కళ్ళల్లోకి చూడలేక మళ్ళీ తల వంచుకున్నాడు.

గుడ్డి వెలుతురులో అతని నీడ పొడుగ్గా ఆమె మీద పడుతోంది. అక్కడ వీస్తున్న చల్లని గాలి, పిచుకల కిచకిచలు, ఏటవాలుగా అతని మీద పడుతున్న లేత చంద్ర కిరణాలు, చెట్ల ఆకుల కదలికలు అన్నీ అతన్ని గేలి చేస్తున్నట్లే వున్నాయి.

అతన్ని చూడగానే ఆమె పెదవులు లీలగా విచ్చుకున్నాయి.

దగ్గరకు రమ్మన్నట్లు తలూపింది.

"రా మావా! ఆణ్ణే నిలబడ్డావేం?" మెల్లగా అంది.

అతను కదిలాడు.

నెమ్మదిగా వెళ్ళి ఆమె ముందు కూలబడ్డాడు.

"నువ్వు... నువ్వు నామీద యెందుకు చెప్పలా?" వినిపించీ వినిపించనట్టు గొణిగాడు.

ఆమె చిన్నగా నవ్వింది. శుష్కమయిన చిరునవ్వు! అంతే, సమాధానం చెప్పలేదు.

"ఇంటికెళ్ళవా?" అతను కొద్దిక్షణాల తర్వాత నెమ్మదిగా అడిగాడు.

"ఇంటికెళ్తే యేముందిలే మాంవా – అమ్మ యేడ్పులూ, నాయన తిట్లు. నేను చేసిందానికి అందరూ మొహాన వుమ్ముతా వుంటారు!" అదే శుష్కమైన చిరునవ్వుతో అంది.

"అట్టయితే... అట్టయితే నేనొప్పేసుకుంటా – నాతో వచ్చెయ్యి," చాలా మంద్ర స్వరంతో అన్నాడతను. "నిన్ను... నిన్నేలుకుంటా!"

ఈసారి నిజంగానే నవ్విందామె.

"ఎందుకులే మాంవా! నన్నిడు – నాదార్నేదో నన్ను పోనీ!"

అతను చలించాడు.

జీవితంలో మొట్టమొదటిసారిగా చలించాడు.

"లేదు... లేదు...! తప్పేదో నేనే చేసినాను. నేనే... నేనే...!" అతని కళ్ళలో లీలగా కన్నీరు మెరిసింది... "నువ్వు... నువ్వు కచ్చేరీలో అట్లా చెప్తావనుకోలేదు – నా మీందనే చెప్తావనుకున్నా," అన్నాడు.

"ఇప్పుడేంది సెప్తే యేమైతాదిలే మాంవా! మొదట్లో నీ యెంటెల్లే తప్పు చేసినాను," అందామె.

"కాదు... కాదు...," అతని తల వాలి పోయింది. "నేనే... తప్పు చేసినాను."

ఆమె జాలిగా చూసింది.

"నువ్వీడికెందుకొచ్చినావ్ మాంవా? ఆడదానికి మల్లే యేదుస్తవేంది? యేడ్చేటోనివైతే ఆ యేళ నన్నెందుకమ్మినవ్?"

అతనామె చెయ్యి పట్టుకుని అన్నాడు.

"కోర్టులో యెందుకు చెప్పినావే అట్లా? నేను చేసిందానికి నన్నే సావనియ్యాల్సింది."

"ఇప్పుడేమైంది మాంవా? సిచ్చ పడ్నట్టే యేడుస్తావేం?"

అతనామె కేసి విస్మయంగా చూశాడు.

ఆమె మళ్ళీ అంది–

"ఈ ఆర్నెల్లు నాకు శానా తెల్సినయ్యి మాంవాం! మదుసులెట్టాంటోళ్ళో తెల్సినాది. నువ్వేంది జేసినావులే! అయ్యేళ నన్నమ్మేసి నందుకు నిన్ను శానా తిట్టినాను. కానీ మాంవా నిన్నిప్పుడు తిట్టలేన్రా! అమ్మేదానికి ముందు వొక్క నెలైనా నువ్వు శానా దయ గుండినవ్! ఆ ఒక్క నెలలో బతుకంటే యెంత తియ్యంగుంటాదో నీ వల్లనే తెలిసినాది నాకు. మంచికో సెడ్డకో నీ యెంటొచ్చేసినాను. అన్నీ వొదులుకొనే వచ్చినాను. ఇప్పుడు వొదులుకున్నయన్నీ నాకెందుకు? నువ్వు నన్నేలినా, యేలకపోయినా బరువంతా నీమీందనే పెట్టుకోనొచ్చినాను. నువ్వేలుకోలా, నీ తప్పేముండాది? ఇప్పుడూ యేలుకోవద్దు. ఇప్పుడూ బరువంతా నామీందనే పెట్టుకొనుండాను."

అతను కళ్ళు పెద్దవి చేసి ఆమెను కొత్త మనిషిని చూస్తున్నట్టు చూస్తున్నాడు.

ఆమె యింకా చెప్పుకుంటూ పోతోంది–

"నీకు తెల్దురా! నువ్వు శానామందికన్నా శానా దయగలోనివి. సూస్కున్నన్నాళ్ళూ రాణీగోర్లా చూస్కున్నావ్. నువ్వు నన్నమ్మినకాడ నాకు మగోళ్ళెట్టాంటోళ్ళో తెలిసినాది. ఒక ఆడది సూడగూణ్ణంతమంది మగోళ్ళని నేను చూసినాను మాఁవా ఆడ! ఆళ్లు పసులు. ఆడదాన్ని సక్కంగా ఆళ్లెవ్వరూ సూళ్ళేరు. ఆళ్ళముందు నువ్వు దేవునివి," ఆమె తన పైట తొలగించి రవికను కొద్దిగా కిందికి దించి చూపించింది. "ఆళ్ళల్లో ఒకడు ఆడ సుట్టకాల్చి పెట్టినాడు మాఁవా – అదో సరసమంట!" దిగులుగా నవ్వింది.

అతను కెవ్వున కేకేశాడు.

కేక వేశానని అనుకున్నాడు.

అతని కేక అతని గొంతులోనే చిక్కుబడి పోయింది.

ఆమె చెబుతూనే వుంది–

"నువ్వేల మాఁవా అట్టయిపోతవ్? నీ యెంటొచ్చి ఆడదానిగా తప్పు చేసినాను! నన్నాళ్ళకమ్మి మగోనిగా నువ్వు తప్పు చేసినవ్! కానీ ఆ తప్పేందో ముందర నా చేతనే జరిగినాది – నీ యెంట రాకుండానే వుండాల్సింది. కచ్చేరీలో అట్లెందుకు సెప్పినానో తెలుసురా మాఁవా? సెడిందాని నోటెంట యిట్టాంటి మాటలొస్తే నమ్మవేమో గాని – నువ్వు నావోడి వనుకున్నాను మాఁవా! ఇప్పటికీ అనుకుంటానే వుండాను. నావోడివిగనకనే గదరా నాకోసమొచ్చినావ్! నావోణ్ణి జైల్లో యెడితే నాకు సంతోషమైతదా మాఁవా? ఎందుకట్లేడుస్తవ్ రా?"

అతను సన్నగా గొణిగాడు

"వద్దు... వద్దు..."

ఆమె యింకా అంది.

"నువ్వు నామీద సూపించిన దయ సచ్చేదాకా చాలురా మాఁవా నాకు! నాకింకేమాశ లేదు. నన్నేల్కోని నువ్వింకా నవ్వులపాలు గావొద్దురా! సెడిందాన్నెవ్వరేలుకోరు మాఁవా! నీమీంద సాడీలు చెప్పి నిన్ను జైలుకంపలేదు. అదే సాలు నాకు. ఇంక నువ్వేం సెప్పొద్దు. ఇంకేం యేడవొద్దు. ఈ వొక్క సంతోషమైనా నా కోసముంచు మాఁవా!"

అతను మెల్లగా వణుకుతున్నాడు.

"ఇంకెల్లిపో మాఁవా! నన్నట్టా సూడొద్దు. నాకు బయ్యంవేస్తాదిరా! అట్టా సూడొద్దు!"

అతను కదల్లేదు.

శిలలా వుండిపోయాడు.

"ఏందిరా అట్ట సూస్తవ్ మాఁవా! ఇంకెల్లిపోరా!"

అతనప్పటికీ కదల్లేదు.

ఆమె రెండు చేతులూ జోడిస్తూ అంది-

"నన్నట్టా సూడమాకరా! నీకు దండమెడతాను. ఎల్లు మాఁవా యెల్లు!" అతని భుజాలు పట్టుకుని కుదిపింది.

అప్పుడు కదిలాడతను.

నెమ్మదిగా - చాలా నెమ్మదిగా కదిలాడు.

కన్నీట తడిసిన ఆమె ముఖాన్ని వెర్రివాడిలా చూశాడు.

అతని పెదవులు లీలగా కదిలాయి.

ఏం గొణుక్కున్నాడో తెలీదు.

బరువుగా - చాలా బరువుగా పైకి లేచాడు.

ఆమె వైపుకు వీపు తిప్పి ముందుకు కదిలి నెమ్మదిగా అక్కడినుంచి బయటికి నడిచాడు

-శవానికి ప్రాణం వచ్చినట్టు.

*మయూరి సచిత్రవారపత్రిక, 9-9-88*

# గుక్కెడు నీళ్ళు

"ఒసే పోలే!

"ఓ పోలమ్మా!

"ఓ పోలి ముండా! యాడ సచ్చినవే! నీల్లు త్యావేమే" అంటూ కీచుగా అరుస్తున్న ముసలమ్మకి చెట్టు చాటున కూర్చున్న పోలి కనిపించలేదు. కనిపించే అవకాశం లేదని పోలికీ తెలుసు. అందుకే ధీమాగా ఓ కుక్కపిల్ల నొళ్ళో పడుకోబెట్టుకుని ముద్దాడుతూ అక్కడినుంచి కదల్లేదు!

బ్రహ్మాండమైన మర్రి చెట్టది! ఊడలు బాగా పాతుకుంది. దాని నీడలో చల్లగా హాయిగా కాళ్ళు బార్లా చాపుకుని ఒళ్ళో కుక్కపిల్లతో కూర్చుంది పోలి.

"ఓ పోలి! నీల్లు త్యావేమే తల్లీ!" మళ్ళీ అరిచింది ముసలమ్మ.

"మా యవ్వ ముండకేం పన్లేదు. యెప్పుడు జూచినా నీల్లు.. నీల్లంటూ పేణం దీస్తాది" కుక్కపిల్లని ముద్దెట్టుకుంటూ దాని చెవిలో గొణిగింది పోలి.

కుక్కపిల్ల తన మూతిచాచి సౌకర్యంగా పోలి కాలు మీదపెట్టుకుని చెవులు వేళ్ళాడేసి కళ్ళు మూసేసుకుని హాయిగా పడుకుని తోకాడిస్తోంది.

పోలి ఇంత మన్నెత్తి దాన్నెత్తి నిండా పోసి మళ్ళీ తుడిచేసి "ఉఫ్..ఉఫ్..." అంటూ ఊదడం మొదలెట్టింది.

తన మనవరాలు చెట్టుచాటు నుండడం పసికట్టి ముసలమ్మ అటుగా తిరిగి పోలికేసి వచ్చింది.

ముసలమ్మ తనకేసి రావడం చూసి పోలి చప్పున లేచి అవతలి కెళ్ళి కూచుంది. ఆ లేవడంలో పాపం కుక్కపిల్ల కాస్త దభీమని కిందపడి దొనదొనా దొర్లి కుయ్యోమంటూ లేచి, చెంగుచెంగున ఎటుకేసో పరుగుతీసింది.

ముసలమ్మ పోలికేసి నిస్సహాయంగా చూసింది. తర్వాత నేల మీద అటూ ఇటూ చూసి ఓ కర్రపుల్లని వెతికి పట్టుకుని మనవరాలిని బెదిరించే ఉద్దేశంతో ముందుకొచ్చింది.

ముసలమ్మ చేతిలో దుడ్డు కర్రలాంటిదున్నా ఖాతరుచేయదు పోలి. మరింక ఆ బలహీనమైన చిన్న కర్రపుల్ల అనగా ఎంత? ఒళ్ళంతా ఎముకలమయం. ఇప్పుడో, ఇంకాసేపటికో చచ్చిపోతుందేమో ననిపిస్తుంది. వంగిపోయి ఊగిపోతూ నడిచే ముసలమ్మ అంటే పోలికి మంచి అలుసు.

"దొంగ ముండా! నీల్లు తెమ్మంటే యాడేడో తిరిగి వస్తవేందే?" అంటూ ముసలమ్మ కర్రపుల్లతో మెత్తగా ఒకటి తగిలించబోయింది. వెంటనే పోలి ఆమె చేతిలోంచి కర్రపుల్ల లాక్కుని దూరంగా విసిరికొట్టి నిర్లక్ష్యంగా తల ఎగరేసి మోకాళ్ళు కావిలించుక్కూర్చుంది.

మనవరాలి అవిధేయ ధోరణికి ముసలమ్మ కించిత్తు ప్రాన్పడిపోయి తిరిగి సర్దుకుని, "ఏఁవే! తెస్తవా లేదా నీల్లు!" అంది ఇంకా బెదిరించే ధోరణిలోనే.

"తేను," ఖచ్చితంగా చెప్పేసింది పోలి.

"త్యాకుంటే ఏం తాగి సావాలంట?"

పోలి జవాబివ్వలేదు. బుంగమూతి పెట్టుకుని కాలి బొటన వ్రేలితో నేలమీద గీతలు గీస్తూండిపోయింది.

ముసలమ్మ ఇక బెదిరించే ధోరణి వదిలేసి బతిమాలుకునే ధోరణిలో పడింది.

"పది పైసలిస్తాగాని, రాయే!"

"అయితే యీ!" ఠక్కున చెయ్యి చాచింది పోలి.

"యీడేడుండయ్యే? ముందు నీల్లు త్యా ఇస్తాను!" అంది ముసలమ్మ.

"ఉహు? ఉప్పుడేఇయ్యాల," మొండిగా అంది పోలి.

"యింటి కాడికి రా," అంది ముసలమ్మ వెనుదిరిగి.

పోలి చెంగున లేచి ముసలమ్మ కంటె ముందుగా గుడిసె కేసి పరుగుతీసింది.

పోలికి కడవ చేతికిచ్చింది ముసలమ్మ.

"మరి పదిపైసాలెయ్యి?" డిమాండు చేసింది పోలి.

"సంపుతవుగదే!" అంటూ ముసలమ్మ గొణుక్కుంటూ వెళ్ళి తుప్పుపట్టి రంధ్రాలు పడడానికి సిద్ధంగా వున్న ఓ రేకు పెట్టెని తెరిచింది. దాన్నిండా చింపిరి గుడ్డలు బొత్తులుగా వున్నాయి. వాటిని జాగ్రత్తగా బయటికి తీసి నేల మీద పెట్టి లోపల్నించి ఓ చిన్న డబ్బీ తీసి అయిదు పైసలు మనవరాలి చేతిలో పెట్టింది.

"అయిదు పైసాలా! అయిదు పైసాల కేమొస్తదనీ! పది పైసాలంటివే?"

"అయ్యేనే వుండేది. సూడు!" అంటూ డబ్బీ చూపింది ముసలమ్మ. పోలి ఆ ఖాళీ డబ్బీని సుదీర్ఘంగా పరిశీలించిన మీదట అయిష్టంగా అయిదు పైసలు తీసుకుని కడవెత్తుకు బయటికి నడిచి తిన్నగా వెళ్ళి మళ్ళీ మర్రిచెట్టు కింద కడవ ఒళ్ళో పెట్టుకు కూలబడింది.

ప్రతి రోజూ కోనేటికెళ్ళి నీళ్ళు పట్టుకు రావాలంటే పోలికి మహా బాధగా వుంది. అమ్మలక్కలు కడవలు పట్టుకుని సుంకాలమ్మ కోనేటికేసి వెళ్తుంటే నిరుత్సాహంగా చూస్తూ కూర్చుంది పోలి.

కొండల్లోకి విసిరేసినట్టున్న ఆ చిన్న పల్లెటూరి పేరు రాళ్ళమిట్ట.

పేరుకి తగ్గట్టు అది రాళ్ళమిట్టే!

రాళ్ళల్లో, తుప్పల్లో అడ్డంపడి రెండు మైళ్ళు నడిచివెళ్ళి సుంకాలమ్మ కోనేటి నుంచి నీళ్ళు తెచ్చుకోవాలంటే రోగిష్టి ముసలమ్మకు సాధ్యపడే పనికాదు. అలాగని పోలైనా తేగలుగుతుందా అంటే అదీ లేదు! పోలి పదేళ్ళ పిల్ల. అంతదూరం నడిచివెళ్ళి మళ్ళీ అంత దూరం నీళ్ళు మోసుకురావాలంటే ఆమె ప్రాణాలు కడగడతాయి.

వెళ్ళేటప్పుడు పెద్ద ఇబ్బందేంలేదుగాని, వచ్చేటప్పుడే ఇబ్బంది అంతాను. పోలి కడవ నిండుగా నీళ్ళు మోయలేదు. అందుకని సగానికే తెస్తుంది. ఆ పిల్ల లేత నడుము మీద కడవ అర నీళ్ళతో అల్లాడి పోతుంటుంది. పదిసార్లు కిందపెట్టి మళ్ళీ ఎత్తుకు రావాలి. అందుకే పోలి నీళ్ళు తేవడానికి మొండికేస్తుంది. వున్నప్పుడు అయిదు పైసలో, పదిపైసలో చేతిలో పెడితే మాట్టాడకుండా వెళ్ళి తెస్తుంది. లేనప్పుడు మాత్రం ముసలమ్మకు ప్రాణ సంకటమే. ఇది రోజూ రివాజుగా జరిగేదే!

కడవమీద దరువేస్తున్న పోలి దగ్గరికి కుక్కపిల్ల గునగునలాడుతూ వచ్చి పైపైకి ఎగబ్రాకిపోయింది. పోలి కడవ నేలమీద పెట్టి కుక్కపిల్ల నెత్తి గుండెల కదుముకుంది. ఇది ఇందాకటిది కాదు. అది కర్రిది. దీనికి తెల్లని ఒంటిమీద నల్లని మచ్చలుండి ముద్దుగా వుంది. ఆ దరిదాపులనే ఆడకుక్క తరచుగా సంతానాభివృద్ధి చేసుకుంటూ వుంది. దానికీసారి నాలుగు పిల్లలు పుట్టాయి. వాటిల్లో దేన్నో ఒకదాన్ని సంకనేసుకుని పోలి ఊరంతా పెత్తనాలు చెలాయిస్తుంది. మొదట్లో ఆ తల్లి కుక్క తన ముద్దు కూనల దగ్గరికి పోలిని రానిచ్చేది కాదు కాని, తర్వాత్తర్వాత దానికి పోలి మంచితనం మీద నమ్మకం ఏర్పడిపోయి ఇప్పుడేమనడం లేదు.

గుడిసెలోంచి ముసలమ్మ ఎందుకో బయటికి రావటం చూసి, "మా యవ్వ వస్తోంది! పోదాం పా," అని కుక్కపిల్లతో చెప్పి దాన్ని చంకనేసుకుని కడవతో పరుగు తీసింది పోలి.

కోనేటికెళ్ళేదార్లో మీసాలప్పయ్య చిల్లర కొట్టుంది. మిగతావాళ్ళు బేరమాడుతున్నా పట్టించుకోకుండా పోలి దాదాపుగా అతని మీద పడిపోయినంత పని చేస్తూ, "నాకో బిస్కోత్తియ్యన్నా బిస్కోత్తు", అంది అయిదు పైసల బిళ్ళనిస్తూ.

మీసాలప్పయ్యకి పోలి అవతారం చూస్తే చెడ్డ చిరాకు. స్నానంలేక కంపు కొడుతుండే వొళ్ళు, మాసిపోయిన చిరుగు బట్టలూ, ఎఱ్ఱబారి చిందర వందరగా పడే జుట్టూ, జిడ్డోడే మొహం, చీమిడి ముక్కూ, ఉబ్బికొచ్చినట్టుండే పొట్టా, చింపిరి చింపిరిగా కనిపిస్తున్న పోలిని "ఇష్షు వుండు" అని కసురుకుని ఆ బేరమాడుతున్నావిడ కేసి చూశాడు.

"ముందు నాకియ్యన్నా! పోవాల," అంటూ ఇచ్చేదాక వదిలిపెట్టలేదు పోలి. మీసాలప్పయ్య కోపంగా అయిదు పైసలు లాక్కుని ఓ బిస్కెట్ పోలి చేతిలో పెట్టాడు. దాన్ని కొరుక్కుంటూ సుంకాలమ్మ కోనేటికేసి బయలుదేరింది పోలి.

ఆ కోనేరు ఏకాలం నాటిదో, ఎవరు కట్టించారో! దాన్ని గురించో కథ ప్రచారంలో వుంది.

ఆ ఊరి గ్రామదేవత సుంకాలమ్మ. ఆమె యర్నాగుల సుందరేశయ్యని పెళ్ళాడింది. సుందరేశయ్య వేరే ఒకామె నుంచుకుని సుంకాలమ్మని నిర్లక్ష్యం చేశాడు. సుంకాలమ్మ మరిది గానుగలయ్య సుంకాలమ్మమీద కన్నేసి ఒక రోజు కబళించపోయాడు. సుంకాలమ్మ ఆ కోనేట్లో పడి చచ్చిపోయింది. సుంకాలమ్మ ఎందుకు చచ్చిపోయిందో ఎవరికీ తెలీదు. తర్వాత ఆమె గ్రామ పెద్ద కల్లోకొచ్చి తనెందుకు చచ్చిపోయిందో చెప్పి, గానుగలయ్యని ఉళ్ళోంచి తరిమెయ్యకపోతే తాను రాళ్ళమిట్టనంతా వల్లకాడు చేస్తానందట. గానుగలయ్య కూడా నిజం ఒప్పేసుకున్నాడట. సుంకాలమ్మ చెప్పినట్టుగానే గానుగలయ్యని ఊళ్ళోంచి తరిమేశారు. ఆమె పేరు మీద ఆమె పడి చనిపోయిన కోనేటికి సుంకాలమ్మ కోనేరని పేరొచ్చింది. తన పాతివ్రత్య మహిమతో సుంకాలమ్మ ఆ ఊరి గ్రామ దేవతగా వెలిసింది.

పోలికి ముసలమ్మ ఈ కథ చెబుతూ వుండేది. కథ సంగతి ఎలా వున్నా పోలికి సుంకాలమ్మ కోనేటిని చూస్తే జడుసుకోవడం అలవాటయ్యింది. తను కడవ ముంచిన ప్రతిసారీ నీళ్ళలోంచి సుంకాలమ్మ అమాంతం పై కొచ్చేసి తనని మింగేస్తుందని పోలి భయం. అందుకే ఒంటరిగా ఎన్నడూ కోనేట్లోకి దిగదు.

పోలి వెళ్ళేసరికి అక్కడ అమ్మలక్కలెవరూ లేరు. వెళ్ళినవాళ్ళు నీళ్ళు తీసుకుని వచ్చేశారు. మరో ఇద్దరాడవాళ్ళు నీళ్ళ కోసం వచ్చేదాకా పోలి అక్కడే ఓ చెట్టు కింద కూచుని కుక్కపిల్లతో ఆడుకుంది. తర్వాత వాళ్ళతో పాటు తను కూడా కోనేట్లోకి దిగి నీళ్ళు పట్టుకు పై కొచ్చింది.

కుక్కని నేలనొదిలేసి కడవని చంకలు మార్చుకుంటూ కొంత దూరం తెచ్చింది పోలి. కుక్కపిల్ల వెంటబడి వస్తోంది గాని ఒకటే ఇబ్బంది– అది కాళ్ళ కడ్డంపడి ప్రదక్షిణాలు చేయడం మొదలెట్టింది. ముందే అర నిండిన కడవాయె అల్లల్లాడిపోతోంది. ఆపైన కుక్కపిల్ల

కాళ్ళకడ్డం పడడంతో పోలి కాలు మార్చబోయి తూలి దభాలున కిందపడిపోయింది. దానితో కడవకాస్తా పగిలిపోయింది. నీళ్ళన్నీ నేలపాలయిపోయాయి.

"వామ్మో! నా కడవ," అంది పోలి. తర్వాత లేచి నిలబడి ఒరుసుకుపోయిన మోచేతులు చూసుకుంది.

"స్...స్.... ఎట్టాగే? మాయవ్వ సంపేత్తాది!" అంది పోలి కడవకేసి జాలిగా చూస్తూ. తర్వాత విచారంగా అక్కడే కాస్సేపు నిలబడిపోయి మళ్ళీ కుక్కపిల్లని చంకనేసుకుని బయలుదేరింది. ఆమెకిప్పుడేం చేయాలో తోచలేదు ఇంటికి మాత్రం వెళ్ళబుద్ధికాలేదు.

ఊళ్ళోకొచ్చిన పోలికి టౌను వైపు వెళ్తున్న వీరేశు కనిపించాడు. వీరేశు జడలూ గడ్డం పెంచి చేతిలో తంబూరా పట్టుకుని బ్రహ్మంగారి తత్వం పాడుతూ ఇంటింటా తిరిగి బిచ్చమెత్తుకుంటాడు.

"గుక్కెడు నీళ్ళాకోసం
బొక్కేవూ లేరా సిద్దా!
చిక్కేవా మాయాలోకం?
దక్కేనా నీరూ సిద్దా?"....

...అని తంబూరా మీటుకుంటూ పోతున్నాడు వీరేశు. పోలికి వీరేశన్నా, వీరేశు పాటలన్నా ఇష్టం. ఆమె వీరేశు వెంటబడి కొంతదూరం నడిచింది.

వీరేశు పాడడం ఆపాక, "టౌనుకెళ్తున్నావా తాతా?" అనడిగింది.

వీరేశు తన పొడవాటి గడ్డం కదిలేట్టు తలాడించి, "యిజీదసెమికి సంతర్పణ సేయిస్తుంద్రు. పోతుండా!" అన్నాడు.

"యిజీదసెమంటే?"

"దసరాకి."

"ఓ!"

"సంతర్పణ కొస్తావా?"

పోలి ఉత్సాహంగా తలూపింది.

"పోదాం పా."

పెద్ద గురప్పగారి ఎద్దుల బండి టౌను కెళ్తుంటే ఎక్కి ఇద్దరూ మధ్యాహ్నానికల్లా టౌను చేరుకున్నారు. అమ్మవారి గుడి దగ్గర రెండు పూటలా సంతర్పణ. పోలి కుక్కపిల్లని చంకలో ఇరికించుకుని గుంపులో వీరేశు వెనగ్గా నిలబడింది. వీరేశు పోలితోపాటు గుంపులోంచి అవతలికి దూరడానికి ప్రయత్నించాడు గాని వాలంటీర్లు ఆపేసి గుంపునంతా వరసగా

కూర్చోబెట్టారు. పోలి వంతుకన్నం వచ్చేసరికి మధ్యాహ్నం మూడయింది. వీరేశు ఇచ్చిన పాత న్యూస్ పేపర్లో అన్నం పెట్టించుకుని కుక్కపిల్ల కింత పెట్టి తనూ ఇంత తిని లేచింది పోలి.

"యాడికి పోదాం తాతా?" అడిగింది పోలి భోజనాలు ముగిశాక.

"యాడికేముంది? యీణ్ణే!" అన్నాడు వీరేశు.

"యీడెందుకు? ఊరికి పోవద్దా?"

"పోదాం. పోదాం! సంజేల కూడా అన్నం తినీ," అన్నాడు వీరేశు.

పోలికి ఈ సంతర్పణేం నచ్చలేదు. ఇంట్లో అయితే ముసలమ్మ ఎంచక్కా కొసరి కొసరి తినిపిస్తుంది. అయినా, పోలికి మాత్రం అప్పుడే ఇంటికి పోబుద్ధిపుట్టలేదు.

వీరేశు చెప్పినట్టే సాయంత్రం దాకా వీరేశు పాడే బ్రహ్మంగారి తత్త్వాలు వింటూ అక్కడే వుండిపోయింది పోలి.

ఏడింటికల్లా మళ్ళీ రద్దీ మొదలయింది. రాత్రి తొమ్మిదిన్నరకల్లా భోజనం ముగించి తిరుగుదోవపట్టారు వాళ్ళు.

పోలికి టౌను కొత్తకాదు. పూసలమ్మడానికో, చింతచిగురూ, చింతకాయలూ అమ్మడానికో అప్పుడప్పుడూ వస్తూనే వుంటుంది. అందువల్ల వీధుల్లో అటూ ఇటూ చూడకుండా కుక్కపిల్లని పట్టుకొని తల వంచుకు నడుస్తోంది. అప్పటి కామెకు చాలా విసుగెత్తిపోయింది.

టౌను దాటి రాత్రిపూట రోడ్డెమ్మట నడుస్తుంటే పోలికి భయం వేసింది. రోడ్డుకురెండు వైపులా వున్న చెట్లు వెన్నెల వెలుగులో దయ్యాల్లా జుట్టు విరబోసుకున్నట్టున్నాయి.

అప్పటికి పోలి కడవ పగలగొట్టిన సంకటంలోంచి బయటపడింది. ఎప్పుడెప్పుడు వెళ్ళి ముసలమ్మ చేతుల్లో వాలి పోదామా అని వుంది. పోలికెందుకో ముసలమ్మ ఆ క్షణంలో దేవతలా అనిపించింది.

ముసలమ్మ గుర్తుకు రాగానే పోలికి మనసంతా హాయిగా అయిపోయి అనుకోకుండానే కిసుక్కున నవ్వేసింది. మళ్ళీ వీరేశు ఏమైనా అనుకుంటాడేమోనని అతనికేసి ఇబ్బందిగా చూసింది. వీరేశు అదేం పట్టించుకున్నట్టే లేడు.

'రేపటికాణ్ణించి కడవ పగలగొట్టనే కొట్టను' తనలో తాను ఒట్టుపెట్టుకుంది పోలి.

ఆ రాత్రి పూట ముసలమ్మని చూడాలనే కాంక్ష విపరీతంగా పెరడగంతో కుక్క పిల్లని గట్టిగా చేతుల్లో బిగించి పట్టుకుని వడివడిగా నడుచుకుంటూ పోతుంటే వీరేశు వెనకబడిపోయాడు. అతను చాలా తాపీగా నడుస్తున్నాడు. పోలికి వీరేశు వాలకమేం నచ్చలేదు. అతని కోసం ఆగి ఆగి నడవవలసి వస్తోంది.

కొంచెం దూరం నడిచాక దార్లో రాళ్ళమిట్ట కేసి ఎద్దుల బండి ఒకటి పోతుంటే చూసి ఎగిరి గంతేసింది పోలి.

"బండ్లో పోదాం తాతా!" అంది.

వీరేశు తలాడించి బండివాడితో "రాళ్ళమిట్టకాడ వదుల్తావేమన్నా?" అనడిగాడు.

బండివాడు అతన్ని ఎగాదిగా చూసి, "సంతర్పణ కాణ్ణించా?" అని కొర్రీ వేశాడు.

"అవును," గబుక్కున తనే సమాధానమిచ్చింది పోలి.

"బండివాడు మరేం మాట్లాడకుండా ఎద్దుల నదిలించి, మళ్ళీ వీరేశు వైపుకు తిరిగి "ఎక్కండి," అన్నాడు.

రాళ్ళమిట్ట కొచ్చేసరికి రాత్రివేళ ఎంతయిందో తెలీదు. అంతసేపూ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పోలికి తీరా గుడిసె దగ్గరికొచ్చేసరికి కాళ్ళాడలేదు. గుండెలు వేగంగా కొట్టుకోవడం ప్రారంభించాయి. అవ్వ తనకోసం తప్పకుండా ఎదురుచూస్తూ వుంటుంది. పోలికి ఒక్కసారిగా వెనుదిరిగి పారిపోదామనిపించింది. కాని, అలా చేయలేదు. మెల్లగా గుమ్మంలోని కదుగుపెట్టింది.

గుడిసెలో చడీచప్పుడూ లేదు. పోలికెందుకో గుండె జలదరించింది. పిండారబోసినట్టున్న వెన్నెల వెలుగు గుమ్మంగుండా లోనికి పడుతూంది. ఆ వెలుతురులో లోన పడుకొని వున్న ముసలమ్మని పోలి గుర్తించింది.

దగ్గరగా వెళ్ళి మోకాళ్ళమీద కూర్చొని ముసలమ్మని ఒకచేత్తో కదిలించింది పోలి.

"అవ్వా! ఏందట్టా పడుకున్నావ్? లే అవ్వా'!' అంది. ముసలమ్మ కదల్లేదు. పోలికి చాలా భయంవేసింది.

"అవ్వా! లే అవ్వా!"

ఎక్కడో లోతుల్లోంచి వచ్చినట్టు ముసలమ్మ గొంతులోంచి ఓ మూలుగు వినిపించీ వినిపించనట్లుగా వినిపించింది. ముందుకు వంగి వింది పోలి.

ముసలమ్మ పోలిని గుర్తుపట్టినట్టుంది. ఏదో గొణికింది.

"ఏందవ్వా, ఎందుకట్టుండవ్?"

ముసలమ్మ మళ్ళీ గొణిగింది. చెవులు రిక్కించి వింది పోలి.

"నీల్లు... నీల్లు..!" అంటోంది ముసలమ్మ.

"నీల్లా అవ్వా! త్యాలేదవ్వా? మరేం, కడవ పగిలిపోయింది," ఏడుపుగొంతుకతో అంది పోలి.

ముసలమ్మ మళ్ళీ మూలిగింది. పోలి మళ్ళీ వింది.

"దాహం," అంది ముసలమ్మ. ఆమె డొక్కలు ఎగిసి ఎగిసి పడుతున్నాయి.

కొంచెం కొంచెంగా అర్థమైంది పోలికి.

"తెస్తానుండవ్వా" అని లేచి రివ్వున బయటికి పరుగెత్తింది.

అక్కడికి కొంచెం దూరంలో వున్న మరో గుడిసె దగ్గరి కెళ్ళి నిద్రపోతున్న రామక్కని తట్టి లేపింది పోలి. రామక్క ఉలిక్కిపడి లేచి, "ఎవరూ?" అంటూ పోలిని చూసింది.

ఎడమ చంకలో ఇరుక్కున్న కుక్కపిల్ల మూతిని బిడియంగా బిగించి పట్టుకుని, "అక్కా! మరేం, మా యవ్వకి నీళ్ళు కావాలంట! కొంచెం నీళ్లియ్యక్కా" అంది.

రాళ్ళమిట్టలో నీటి ఎద్దడి సామాన్యమైనదేం కాదు.

"నీల్లా! యాడుండయ్యనీ? లేవు!" అని అవతలికి తిరిగి పడుకొంది రామక్క.

పోలి కదల్లేదు.

"కొంచెమియ్యక్కా!" అంది బిడియంగానే.

రామక్క జవాబివ్వలేదు.

పోలి బిడియంతో మరికొంచెంసేపు అక్కడే నిలబడి మెల్లగా కదిలి లచ్చుమ్మ గుడిసె దగ్గరి కెళ్ళింది. లచ్చుమ్మ ఇంకా నిద్రపోలేదు. నులక మంచం చివర్న కూచుని ఆకాశంలో చంద్రుడికేసి చూస్తూ ఏదో ఆలోచిస్తోంది.

పోలి ఆమె దగ్గరికెళ్ళి "మా యవ్వకి కొంచెం నీళ్ళు కావాలంటవ్వా!" అంది.

లచ్చుమ్మ పోలికేసి శూన్యంలోకి చూస్తున్నట్టుగా చూసి, "లేవు," అంది మెల్లగా.

పోలి కాసేపు అక్కడే నిలబడి మెల్లగా కదిలి వెనుదిరిగింది.

"తాగడానికి గుక్కెడు నీల్లకి కరువొస్తే అందరికియ్యాలంట" అని లచ్చుమ్మ గొణుక్కోవడం పోలికి వినిపించింది.

పోలి కుక్కపిల్లని అలాగే పట్టుకుని తన గుడిసెలోనికెళ్ళి ముసలమ్మ పక్కన నిలబడి, "నీల్లు లేవంటవ్వా! ఎవ్వరూ యీడంల్యా!" అంది.

ముసలమ్మ మాత్రం జవాబివ్వలేదు. పోలి మోకాళ్ళ మీద కూర్చుని ముసలమ్మని కదిలించింది. ముసలమ్మ స్పర్శలో ఇదివరకు తోచిన కనీస చలనం అయినా కనిపించలేదు.

"అవ్వా, నీల్లు లేవంటవ్వా! పెందలకాణ్ణే తెస్తాలే!" అంది పోలి.

ముసలమ్మకు నీళ్ళ అవసరం తీరిపోయింది. ఆమె ఏమీ అనలేదు.

"ఏందవ్వా, అట్టుండవ్! మాట్టాడవేందవ్వా?" అడిగింది పోలి, ఇంకా గట్టిగా ముసలమ్మని కదిలిస్తూ. ముసలమ్మ శరీరం నిర్జీవంగా కదిలింది.

పోలికి విపరీతమైన భయం పుట్టుకొచ్చింది.

"నీకు నీళ్లు కావాలంటే కోనేటికాడికెళ్ళి తెత్తాలే అవ్వా!" అంది ఆశగా ముసలమ్మ మాట్లాడుతుందేమోనని చూస్తూ.

అప్పటికీ ముసలమ్మ మాట్లాడక పోయేసరికి పోలి ఓ సత్తుచెంబు తీసుకుని కోనేటి కేసి పరుగుతీసింది.

అర్ధరాత్రి! వెన్నెల్లో వికృతంగా కనిపిస్తున్న చెట్లు. కీచురాళ్ళ రొద వికృతంగా వినిపిస్తోంది. పోలికి వెన్నులోంచి సన్నగా చలి పుట్టుకొచ్చింది. గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. చంకలో కుక్కపిల్ల ఇంకా వుందన్న సంగతే ఆమెకు గుర్తులేదు. పొద్దుట్నించీ దాన్నలా మోసీమోసీ దాన్ని విడవాలన్న జ్ఞానం నశించిపోగా అది కూడా పోలి శరీరంలోని ఒక భాగంగా తయారైంది.

వెన్నెల వెలుగులో ఆ ప్రదేశమంతా స్మశానంలా పోలికి అనిపించింది. చిన్నప్పట్నించీ విన్న దయ్యాల కథలన్నీ ఒక్కొక్కటీ మనస్సులో కదిలాయి. భయంతో కుక్కపిల్లని మరింత గట్టిగా ఒడిసిపట్టుకుని కోనేరు చేరుకుంది పోలి.

సుంకాలమ్మ కోనేరు ఆహ్వానిస్తున్నట్టుగా కనబడింది. ఎవరో ఏదో చెవిలో మాట్లాడినట్టుగా అయింది. పోలికి కాళ్ళు వణికి పోయాయి.

చుట్టుపక్కల దయ్యంలాంటిదేమైనా వుందేమోనని కళ్ళు చించుకుని మరీ చూసింది పోలి. ఎవరూ కనిపించలేదు.

కోనేటి మెట్లను గబగబా దిగేసి భయంతో కళ్ళుమూసుకుని చెంబుని నీటిలో ముంచడానికి వంగింది పోలి.

ఆ క్షణంలో పోలి అవస్థ వర్ణనాతీతం. నీటిలో చెంబు ముంచితే సుంకాలమ్మ వచ్చి పట్టుకుంటుందని భయమేసి చెంబు ముంచకుండానే లేచి నిటారుగా నిలబడి నీళ్ళకేసి పరీక్షగా చూసింది పోలి.

గాలి వేగంగా వీచి పోలి చెవుల్లో గుసగుసలాడింది.

ఎవరో "పోలీ" అని పేరుపెట్టి పిలిచినట్లయి కాళ్ళు చల్లబడిపోయి అక్కడే కూలబడింది పోలి. పిచ్చిదానిలా కోనేటి నీళ్ళకేసి గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయింది.

పోలిలో ఎక్కడలేని అలసట అలుముకోసాగింది. అలసటతోబాటు అదో విధమైన స్తబ్ధత కూడా ఆవరించింది.

అప్పుడు తెలిసింది పోలికి తనకు దాహమేస్తోందని.

దాహం-నాలుక పిడచకట్టుకు పోయే దాహం!

అయినా పోలి కదల్లేదు! చంకలోని కుక్కపిల్ల ఒళ్ళోకొచ్చి ముడుచుకుంది. పోలి దాని వీపు నదిమిపెట్టి అలాగే కూర్చుంది.

పోలికి ముసలమ్మ గుర్తుకొచ్చింది. "నీల్లు... నీల్లు..." అని ఇంకా అంటున్నట్టుగానే వుంది ముసలమ్మ. అయినా పోలి కదల్లేదు. గాలికి శరీరాన్నప్పగించి కూచుంది.

కోనేట్లో పడ్డ సుంకాలమ్మ మొహం పెద్ద పెద్ద కోరల్తో పోలికి కనిపించింది. పోలి భయంతో కళ్ళు మూసుకుంది.

దాహం– విపరీతమైన దాహం! ప్రాణమాగేట్టులేదు.

పోలి మెల్లగా లేచి ఆఖరి మెట్టుమీద నిలబడి చెంబుని నీట్లోకి ముంచింది. చల్లటి నీళ్ళు. ఒళ్ళు జల్లుమనడంతో పాటు ఎవరో తన చేయి పట్టుకున్నట్టుగా కూడా అనిపించింది పోలికి. నీళ్ళలోంచి సుంకాలమ్మ నాలుక బయటపెట్టి వికృతంగా కనిపించింది.

అంతే! పోలి కెవ్వున కేక పెట్టింది. ఆ తర్వాత తూలి కుక్కపిల్లతో సహా నీళ్ళలోకి పడిపోయింది.

పోలికి ఈత రాదు. రెండు మునకలు వేసింది.

కుక్కపిల్ల మాత్రం తపతపలాడుతూ గట్టుకేసి ఈదుతోంది.

ప్రాణ భయంతో పోలి ఈతకోసం కుక్కపిల్లని ఒడిసి పట్టుకుని మూడవసారి మునక వేసింది.

అంతే!

ఆ తర్వాత ఆ కోనేట్లో రెండు శవాలు తేలాయి.

సుంకాలమ్మ తర్వాత రెండు శవాలు!

ఒకటి పోలిది.

మరొకటి కుక్కపిల్లది.

*ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక, 4-1-1985*

# ప్రసూతి వార్డు

నాలుగు వైపులా డిసిన్ఫెక్టెంటు వాసన. మరోవైపు మనిషికి ఒంటరితనాన్ని కలిగించే విచిత్రమైన నిశ్శబ్దం. లక్షలాది ఇతర జీవకణాలతో పాటే నాశనమైపోకుండా ప్రమాదవశాత్తూ మానవరూపం ధరించిన ప్రాణిని ఇహలోకంలోకి తెచ్చే చోటు. ఇది ప్రసూతి వార్డు.

ఆ వార్డులోకి అడుగు పెట్టబోతుండగా అరవింద మనస్సును ఒక విధమైన భయం ఆవహించింది. అసలామెకు మొదటినుంచీ ఆస్పత్రులంటేనే గగుర్పాటు.

పెళ్ళయిన నాలుగేళ్ళకు అదే ఆమెకు తొలిగర్భం. నిజానికా వూళ్ళో కాన్పు జరిపించుకోవడమే అరవిందకు మొదట ఇష్టం లేదు. హైదరాబాదులోనే బిడ్డను కనాలనుకుంది. అక్కడే తన భర్త ఉద్యోగం చేస్తున్నాడు. ఈ తొమ్మిది నెలలూ అతనికి దగ్గరగా ఉండాలని ఎంతగానో కోరుకుంది.

మూడోనెల గడుస్తుండగానే అతను హడావుడి చేయడం ప్రారంభించాడు. ఆడపిల్లకు మొదటి కాన్పు పుట్టింట్లోనే జరగాలనేది అతని వాదన. అదామెకు ఇష్టం లేదు. అతనికి దగ్గరగా వుండాలని తన మనసు ఎందుకంతగా ఆరాటపడుతోందో ఆమెకే అర్థం కాలేదు. తన అక్కలంతా కాన్పుకు పుట్టింటికే వచ్చారు. వాళ్ళెవరికీ భర్తమీద తనలా ప్రేమ లేదా? అని ప్రశ్నించుకుంది. బహుశా వాళ్ళు కూడా తనలాగే ఆరాటపడ్డా ఆ మాట పైకి చెప్పి వుండరని భావించుకుంది.

అరవింద ఈ కాన్పుకు పుట్టింటికి వెళ్ళకూడదని అనుకోవడానికి మరో కారణం వుంది. ఆమె తండ్రికి నలుగురు ఆడపిల్లలు. అరవింద చిట్టచివరిది. ఆయన గుమాస్తాగా రిటైరవడానికి మరో రెండేళ్ళుంది. పై ఆదాయానికి చేయి చాపడం ఆయనకి అలవాటు లేదు. తనకొచ్చే ఆదాయంతో తమ పెళ్ళిళ్ళు చేయడానికి సరేసరి, తన అక్కల కాన్పులకూ, వాళ్ళ అత్తవారిళ్ళ ఆశపోతు తనానికీ ప్రతీసారి ఆయన ఎంత ఇబ్బంది పడిపోయాడో తనకు తెలుసు. తన మూలంగా ఇప్పుడాయన మళ్ళీ అంత ఇబ్బందికి గురికావడం

అరవిందకు సుతరామూ ఇష్టం లేకపోయింది. అందుకే కాన్పుకోసం తనని పుట్టింటికి వెళ్ళమని భర్త చెప్పినప్పుడు బాధ్యతనుంచి తప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని అతని మీద కోపం వచ్చింది.

భర్త వాదన మరోవిధంగా ఉంది. పెద్దవాళ్ళెవరూ లేకుండా కాన్పు జరగడమంటే మాటలా? అదీ తొలి చూలు కాన్పు. ఆలనాపాలనా చూసి మంచీ చెడ్డా చెప్పగలిగేవాళ్ళు లేని ఈ హైదరాబాదు నగరంలో తమకెవరు దిక్కు? కాబట్టి ఇక్కడ పురుడు పోసుకోవాలనుకోవడం ఎంత మాత్రం వివేకం కాదు. పుట్టింటికి పోవడమే మంచిది.

అయితే అరవింద ఆ వాదన చెవిని వేసుకోలేదు. ఎన్ని కష్టనిష్ఠూరాలొచ్చినా పురుడు ఇక్కడే పోసుకుంటానని మొండి కేసి కూర్చుంది. అంతలో ఆమె తండ్రి ఆమెను పిల్చుకు వెళ్ళడానికి వచ్చాడు. అరవింద రాను పొమ్మంది. తండ్రి ఆమెకు అనేక విధాల నచ్చచెప్పాడు. అల్లుడి మాటే సరైందన్నాడు. తల్లిదండ్రులు చూసేది బిడ్డ మొహమే కానీ డబ్బు మొహం కాదన్నాడు. ఈ బిడ్డను కన్నాక మా ఆరాటం ఏమిటో నీకే అర్థమవుతుంది లెమ్మని హాస్యమాడాడు. చివరికి కూతురి మనసు మెత్తబరిచి తన వెంట రావడానికి ఒప్పించాడు. అరవింద అన్యమనస్కంగానే పుట్టింటికి వెళ్ళింది.

అక్కడికి వెళ్ళాక పురుడు ఆస్పత్రిలో పోసుకోనని చెప్పింది. తండ్రి నవ్వేసి అలాగే లెమ్మన్నాడు. డాక్టరమ్మ చెప్పిన తేదీకి నాలుగు రోజులు ఆలస్యంగా ఆమెకు నొప్పులొచ్చాయి. వచ్చినా చాలా సన్నగా వచ్చాయి. అప్పుడే కాన్పు జరుగుతుందని ఆమెకు నమ్మకం కుదర్లేదు. అయితే నొప్పులు వచ్చాక డాక్టరు దగ్గరికి వెళ్ళడం తప్పనిసరి అని బుజ్జగించి తండ్రి ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్ళాడు. డాక్టరమ్మ పరీక్ష చేసి ఇవి పురిటి నొప్పులే, ఆస్పత్రిలో చేర్చేయమని చెప్పింది.

ఆ విధంగా తనకు ఇష్టం లేకపోయినా ప్రసూతివార్డులో చేరింది అరవింద.

తీరా ఆస్పత్రికి వెళ్ళాక నొప్పులు తగ్గిపోయాయి. కాన్పుకు డాక్టరమ్మ ఇరవై నాలుగు గంటలు టైమిచ్చింది.

అది పదడుగుల వెడల్పు, పన్నెండు అడుగుల పొడవున్న అగ్గిపెట్టెలాంటి గది. పేషెంటుకోసం ఓ పడక, పైన సీలింగు ఫ్యాను, ఓ అరవై కేండిల్సు బల్బు తప్ప మరింకే సౌకర్యం లేదా గదిలో. సున్నం పాతబడి గోడలు నల్లబారాయి. గదివెనక వైపు పెద్ద కిటికీ ఒకటుంది. ముందరి పక్క తలుపు మూస్తే ఆ కిటికీ ఒక్కటే ఆ గది లోకి గాలి వెలుతురు వచ్చే మార్గం. కిటికీ పక్కన బాత్‌రూం, లెట్రినూ గదిలోకే వున్నాయి. కింద సిమెంటు పూత పూసిన నేల. రాత్రిపూట దోమల స్వైరవిహారానికి అక్కడేం కొదవలేదు.

ఈ వర్ణన చూస్తే అది బహుశా గవర్నమెంటాసుపత్రి కాబోలనే అభిప్రాయం ఎవరికైనా కలగొచ్చు. కానీ, అది అక్షరాలా ప్రైవేటు ఆసుపత్రి. ఆ ఆసుపత్రి కట్టిన డాక్టరమ్మ అసలు పేరేమోకానీ ఆ వూళ్ళో అందరికీ ఆమె కాన్పులమ్మగా తెలుసు. ఆవిడ కాన్పుల స్పెషలిస్టు. ఇతర రోగాలకు కూడా ఆవిడ మందు ఇవ్వగలదనే విషయం ఆ వూరివాళ్ళు దాదాపు మర్చేపోయారు. ఆమెకు పోటీగా ఇంకా ఆ వూళ్ళో ఇతర కాన్పులమ్మలు వెలిశారుగానీ ఆ పేరుతో ఆ వూరివాళ్ళు పిలుచుకునే కాన్పులదేవత మాత్రం ఆమే. ఆమెకు కాన్పులు చేయడం మాత్రమే కాదు, కాన్పును ఆపరేషనుగా మార్చేసే విద్య కూడా బాగా తెలుసు. మామూలు కాన్పుకు ఆమె వసూలు చేసే ఫీజు అయిదువందలు. ఆపరేషను ధర రెండున్నరవేలు. కాబట్టి ఆ రెంటిలో ఏది లాభసాటిగా వుంటుందో విజ్ఞులకు వేరే చెప్పాల్సిన అవసరం లేదు.

కాన్పులమ్మ అరవిందకోసం కేటాయించిన గదికి అద్దె రోజుకు డెబ్బై అయిదు రూపాయలు. గది అవసరం లేదనుకుంటే రోజుకు నలభై రూపాయలకు వట్టి పడక కూడా అద్దెకు తీసుకోవచ్చు. తన కోసం ఆ వట్టి పడకే తీసుకొని వుంటే పోయేదనిపించింది అరవిందకు. అక్కడైతే కామన్‌హాలు కాబట్టి చూడ్డానికి నాలుగైదు మొహాలైనా కనిపిస్తాయి. ఇదేమిటిది జైలు!

ఆలోచించగా ఆలోచించగా అరవిందకు ఏదీ తన ఇష్టప్రకారం జరగడం లేదనిపించింది. ఇదేం అన్యాయం? బిడ్డను కనాల్సింది తను. ఇష్టాఇష్టాలన్నీ ఇతరులవి. ఈ పద్ధతేమీ బావుండలేదు.

తన మాట ఒక్కటీ చెల్లడం లేదనే విసుగు క్రమంగా ఒక విధమైన ఆరాటంగా మారిందామెకు. అంతలోనే గది బయట ఎవరివో కిలకిలా నవ్వులు వినిపించాయి. అరవింద దృష్టి ఆ వైపు మళ్ళింది.

అన్నాచెల్లెళ్ళు కాబోలు. గుమ్మంలో ఇద్దరు పిల్లలు నిలబడి వున్నారు. ఆ ఇద్దరిలోనూ మగపిల్లవాడు పెద్దవాడుగా కనిపిస్తున్నాడు. అయిదారేళ్ళుంటాయి వాడికి. చెల్లెలి మెడచుట్టూ చెయ్యివేసి నిలబడ్డాడు. ఆ పాపకు రెండేళ్ళుంటాయి. నోట్లో బొటనవేలుంచుకుని అన్నగారికి తలానించింది. ముద్దులు మూటగట్టే మొహాలు. పెద్ద పెద్ద కళ్ళు ఇంకా పెద్దవి చేసుకుని ఎంతో ఆసక్తిగా తనవైపే చూస్తున్నారు వాళ్ళు. ఇద్దరిలోనూ ఆ మగపిల్లవాడు తనకేదో తెలుసునన్నట్టు చెల్లెలి వైపు తల వాల్చి నవ్వుతున్నాడు.

తన బిడ్డకోసం ఆశపడుతున్న అరవిందకు ఆ ఇద్దరు పిల్లల్ని చూడగానే మాతృప్రేమ ఒక్కసారిగా పొంగుకొచ్చింది. దాంతో ఆమె తన చీకాకులన్నీ మర్చిపోయింది. రెండు చేతులూ ముందుకు చాచి ఆ పిల్లల్ని తన దగ్గరికి రమ్మన్నట్టు చిరునవ్వుతో పిలిచింది.

ఆ పాప బొటనవేలు అలా నోట్లో వుంచుకునే తలపైకెత్తి అన్నగారివైపు చూసింది. అన్నగారు నవ్వుతూనే సిగ్గుపడిపోతూ రానన్నట్టు తల అడ్డంగా ఆడించాడు.

అరవింద మళ్ళీ పిలిచింది.

ఈసారి వాళ్ళిద్దరూ వెనక్కి తిరిగి అక్కడినుంచి తుర్రుమన్నారు.

అరవింద ప్రేమానందభరితమైన మనసుతో దిండుమీద వెనక్కు వాలింది. తన కడుపులో వున్న బిడ్డను అనురాగంగా చేత్తో నిమిరింది. ఆమె కళ్ళముందు స్పష్టాస్పష్టంగా ఒక బోసినవ్వు ప్రత్యక్షమైంది. కడుపులోంచే తన బిడ్డ అమ్మా అని పిలిచినట్టనిపించి వళ్ళు పులకరించింది. అప్రయత్నంగా ఆమె కళ్ళు అర్ధనిమీలితాలయ్యాయి.

అంతలో ఆమె తల్లి ఆ చుట్టుపక్కలేం జరుగుతుందో ఒకసారి సర్వేచేసి కూతురి గదికి తిరిగి వచ్చింది. గదిలోకి అడుగు పెడుతూనే ఆమెకు అరవింద తన్మయత్వంగా కళ్ళు మూసుకుని లోలోపలే ముసిముసిగా నవ్వుకుంటూ వుండడం కనిపించింది. ఆ సమయంలో కూతురి మొహం సృష్టిలో అన్నిటికంటే సుందరమైందనిపించిందామెకు. బిడ్డను తల్చుకు మురిసిపోతున్న తల్లిని గన్న తల్లి. సంభ్రమంతో రెండడుగులు ముందుకు వేసి ప్రేమ పట్టలేక కూతురి చుట్టూ చేతులు తిప్పి ఆప్యాయంగా మెటికలు విరుచుకుంది.

అరవింద కళ్ళు తెరిచింది. తల్లిని చూస్తూనే నిండుగా నవ్వింది. "ఎక్కడికెళ్ళావమ్మా? ఇందాక ఎవరో ఇద్దరు పిల్లలు వచ్చి వెళ్ళారు. కడిగిన ముత్యాల్లా ఎంత బావున్నారో తెలుసా?" అంది.

"చూశాను. ఆ ఇద్దరూ అవతల మూడోగదిలో వున్నామె పిల్లలు," నిట్టూర్చింది అరవింద తల్లి.

ఆ నిట్టూర్పు ఎందుకో అరవిందకు అర్థంకాక "ఏమైంది?" అనడిగింది.

"పాపం చూడ్డానికెంత ముద్దొస్తేనేం? ఆ ఇద్దరు పిల్లలకీ తల్లి ప్రేమ లేదు, తండ్రి ప్రేమ ముందే లేదు," చెప్పింది అరవింద తల్లి.

అరవింద మాతృహృదయం కలవరపడింది. "అదేమిటమ్మా?" అందామె.

"ఆ పిల్లల తండ్రి మహానికృష్టుడిలా వున్నాడు. భార్యకు కాన్పయినా చూడ్డానికి రాలేదు."

"ఎందుకని?"

"ఆడపిల్ల పుట్టిందనట."

అరవింద ప్రశ్నార్థకంగా చూసింది.

"ఇందాక నువ్వు చూసిన ఇద్దరు పిల్లలకూ మొన్న ఒక చిట్టి చెల్లెలు పుట్టింది," చెప్పింది అరవింద తల్లి. "అసలిదివరకు ఆ నోట్లో బొటనవేలు పెట్టుకునే పిల్ల పుట్టినప్పుడే

అతగాడు భార్యని నానామాటలూ అన్నాట్ట. తమకందరూ మగపిల్లల్నే కనివ్వాలని అత్తింటివాళ్ళు పాపం ఆ ఆడకూతురికి పెట్టిన షరతు. ఈసారి మళ్ళీ ఆడపిల్ల పుడితే భార్యని వదిలేసేది ఖాయమని ముందే బెదిరించాడా పురుషుడు. అలాగని ఈ తొలిచూలుకు మగపిల్లాడు పుట్టినప్పుడైనా భార్యని సరిగ్గా చూసుకున్నాడా అంటే అదీ లేదట. రోజూ తాగొచ్చి భార్యాబిడ్డల్ని చావబాదడం అతనికి మామూలేనట. ఇప్పుడా తల్లి తన మొగుడిమీదున్న కోపమంతా ఆ పుట్టిన పసికందు మీద చూపిస్తోంది. పాపం ఆ బిడ్డ ఎంత గుక్కపెట్టి ఏడ్చినా పాలివ్వదు. ఆమెకు పాలు తక్కువున్నాయా అంటే అదీ లేదు. పాలు పొంగి పొంగి గుండెలు బరువెక్కి ఆ నొప్పికి తట్టుకోలేక తను కూడా ఏడుస్తుంది. వార్డులో ఈ మూలనుంచి ఆ మూలకు అంతా ఆమెను తిట్టేవాళ్ళే. నర్సులు కూడా తిట్టిపోస్తూనే ఆ పాలు తోడేస్తున్నారు. ఇక ఆ ఇద్దరు పిల్లలూ తల్లి దగ్గరికి వెళ్ళే ధైర్యం లేకే దిక్కులేనివాళ్ళలా వార్డులో అటూ ఇటూ తిరుగుతూ గడిపేస్తున్నారు."

అరవిందకు మనసంతా పాడైపోయింది. ఆ పిల్లల్ని చూసి ఇందాక తను పొందిన ఆనందం అర్థం లేనిదనిపించింది. కడుపులో వున్న బిడ్డ కదుల్తున్నట్టనిపించి గబుక్కున రెండు చేతుల్తో పొదివి పట్టుకుంది.

అరవింద తల్లి మరింక ఆ పిల్లల సంగతి వదిలిపెట్టి ఆ వార్డులో వార్తా విశేషాలు చదవనారంభించింది. "ఇదంతా ఆడపిల్లల ఋతువులా కనిపిస్తోందే అమ్మా. వార్డులో ఈ వారమంతా వరసగా ఆడపిల్లలే పుడుతున్నారు. ఎవరికో ఒకామెకు మాత్రం మగపిల్లాడు పుట్టాడంటున్నారు. అందుకే వార్డులో అందరి మొహాలు ముడుచుకునే వున్నాయి," అంది.

అరవిందకు మరింక వినాలంటే విసుగు పుట్టింది. "చాల్లే అమ్మా! అంత మొహాలు ముడుచుకోవడానికి ఆ కన్నతల్లులు మాత్రం ఆడవాళ్ళు కారా?" అంది.

అరవింద తల్లి జ్ఞానిలా నవ్వింది. "ఆడపిల్లలు పుడితే అంతేనమ్మా. ఆ బాధేమిటో కూతుర్ని కన్నవాళ్ళకే తెలుస్తుంది," అంది.

అరవిందకు అలసటగా అనిపించి అవతలికి తల తిప్పుకుని కళ్ళు మూసుకుంది. తల్లి చెప్పిన మాట ఆమెకు రుచించలేదు. కాసేపటికి అలాగే ఆమెకు నిద్రపట్టింది.

సాయంకాలం అయిదుగంటల ప్రాంతంలో మళ్ళీ మెలకువ వచ్చిందామెకు. తల్లి ఫ్లాస్కులోంచి కాఫీ పోసి ఇచ్చింది. అరవింద కాఫీ తాగుతుండగా ఒక పెద్దావిడ వచ్చిందక్కడికి.

"కూతురా అమ్మా?" అడిగింది అరవింద తల్లిని.

అరవింద తల్లి అవునన్నట్టు తలూపింది.

ఆవిడ లోపలికి వచ్చి అడక్కుండానే తల్లి పక్కన చాపమీద బైఠాయించింది.

"ఎన్నో కాన్పు?"

"ఇదే తొలిచూలు," చెప్పింది అరవింద తల్లి.

"అలాగా! పెళ్ళయి ఎన్నేళ్ళు?"

"నాలుగేళ్ళు," చెప్పింది అరవింద.

"అయ్యో, అలాగా! నాలుగేళ్ళదాకా బిడ్డలు పుట్టలేదేమ్మా?"

అరవిందకు చిరాకనిపించి, "ఇప్పుడు పుడుతున్నారు గదండీ!" అంది.

అరవింద తల్లి ఆ పెద్దావిడకి గ్లాసులో కాఫీ పోసి ఇచ్చింది.

కాఫీ చప్పరిస్తూ ఆవిడ అరవింద కడుపుకేసి పరిశీలనగా చూసింది. ఆ తర్వాత ఆమె మొహంవైపు చూపు మళ్ళించింది.

"కడుపు ఎత్తుగా వుంది. అమ్మాయి మొహంలో లక్ష్మీకళ ఉట్టిపడుతోంది. కడుపులో వున్నది ఆడపిల్లా అమ్మా?" అంది.

"నాకేం తెలుసు?" అంది అరవింద.

పెద్దావిడ చోద్యంగా చూసింది, "అదేమిటమ్మా, టీవీలో చూపించుకోలేదూ?" అడిగింది.

"టీవీలో చూపించుకోవడం అంటే స్కానింగు చేయించుకోవడమా అండీ? చేయించుకున్నాను. బిడ్డ పరిస్థితి బావుందని చెప్పారు. అయితే ఆడపిల్లా మగపిల్లవాడా అనేది అడగలేదు. ఆ విషయం ముందే తెలిసిపోతే ఏం బావుంటుందండీ? తొమ్మిది నెలలు ఎదురు చూశాక బిడ్డ పుట్టినప్పుడు తెలిస్తేనే అందం."

పెద్దావిడ మొహం అదోలా పెట్టి "ఏమోనమ్మా! నా కూతురికి మాత్రం చూపించుకున్నాం. మగపిల్లవాడని చెప్పారు." అంది.

"అలాగా!" అరవింద తల్లి సంతోషిస్తూ అంది.

పెద్దావిడ మొహం చింకి చాటంత చేసుకుంది, "ఈ వార్డులో అంతా ఆడపిల్లలే పుట్టుకొచ్చేస్తున్నారట. మా అమ్మాయికి మాత్రం మగపిల్లవాడే పుట్టబోతున్నాడు," అంది ఆర్భాటంగా.

అరవిందకు ఆమెను చూసి జాలేసింది.

ఆవిడ అంతలోనే ఏదో రహస్యం చెబుతున్నట్టుగా ముందుకు వంగింది. "ఈ పక్క గది లేదూ? ఆ గదిలో వున్నామెకు అయిదో నెల. కడుపు తీయించేసుకుంటోంది," అంది.

అరవింద గుడ్లు తేలేసింది.

"ఎందుకని?" అనడిగింది.

"ఎందుకని ఏమిటమ్మా? టీవీలో చూపించుకుంటే పుట్టబోయేది ఆడపిల్ల అని చెప్పారు," అంది అదేదో మామూలు విషయమే అయినట్టు. ఆమె ధోరణి చూస్తే తన కూతురికీ ఆడపిల్లేనని డాక్టరు చెప్పి వుంటే ఆమె కడుపు తీయించడానికైనా ఈవిడ రెడీయే అనిపించింది అరవిందకు.

"అందుకామె ఒప్పుకుందా?" అదో విధమైన అపనమ్మకంతో అడిగింది.

"ఒప్పుకోవడం ఏమిటీ? ఆడపిల్ల అని తెలియగానే కడుపు తీయించేసుకుంటానని ఆమె స్వయంగా వచ్చి ఆస్పత్రిలో చేరింది."

అరవిందకు ఊపిరి పీల్చుకోవడం కష్టమవుతున్నట్టనిపించింది. తల్లికేసి తిరిగి, "ఇక్కడ నాకు గాలాడ్డం లేదే అమ్మా! కాసేపు బయటికి వెళ్తాను," అంది.

అరవింద తల్లి ఆమె చెయ్యి పట్టి మంచం దిగడంలో సాయపడింది. అరవింద వరండాలోకి వెళ్ళింది. ఆమె తల్లీ, ఆ పెద్దావిడా ఆమె వెనకే ఆ గదిలోంచి బయటికి వచ్చారు.

వరండాలో ఒకామె కనిపించింది. ఒక మగవాడితో ఆమె లోగొంతుకలో ఏదో సీరియస్‌గా వాదిస్తోంది.

"అదిగో, ఆమే కడుపు తీయించుకుంటోంది," గుసగుసగా అంది పెద్దావిడ.

అరవింద ఆ వాదులాడుతున్నామెవైపు ఒకేసారి తేరిపారా చూసింది. ఆమె కళ్ళు జిగేలుమన్నాయి. ఆవిడెవరో సినిమా హీరోయిన్లకంటే అందంగా వుంది. ఇంత చక్కని మనిషి అంత నిర్దయకు పాల్పడగలదంటే అరవిందకు నమ్మబుద్ధి కాలేదు.

పెద్దావిడ ఇంకా గుసగుసలాడుతూనే వుంది. "ఆ ఎదురుగా వున్నది ఆ అమ్మాయి మొగుడు. భార్య కడుపు తీయించుకోవడం అతగాడికి ఇష్టం లేదు. అందుకే ఇద్దరూ గొడవ పడుతున్నారు."

అరవిందకు హఠాత్తుగా ఆ వాదులాడుతున్నామె మొహంలో అందమంతా అదృశ్యమైపోయినట్టనిపించింది. అదే సమయంలో తన కడుపులో వున్న బిడ్డ కిందికి జారిపోతున్నట్టనిపించి ఒక్కసారిగా కంపరం పుట్టుకొచ్చింది.

"అమ్మా, నేను లోపలికి వెళ్తున్నాను," అంటూ కంగారుగా తన గదిలోకి తిరిగి వచ్చేసింది.

ఆ సాయంత్రం బాగా చీకటిపడుతున్న వేళకు ఆమె తండ్రి వచ్చాడు.

"మీ ఆయనకు ఫోన్ చేశానమ్మా. ఇవాళో రేపో నీకు కాన్పు జరగొచ్చని చెప్పాను," అన్నాడాయన.

భర్త ఊసు వింటూనే అరవింద మొహం ప్రసన్నమైంది.

"ఏమన్నారు?" అడిగింది.

"ఆఫీసులో చాలా పనుందట. వీలు చూసుకుని సెలవు పెట్టి వస్తానన్నాడు."

"అంతేనా? నాగురించి ఏమీ అడగలేదా?"

"అడిగాడు. ఎలా వున్నావని అడిగాడు. ఏమైనా స్కానింగులో ఆడపిల్లో మగపిల్లవాడో తెలుసుకోనందుకు ఇంకా అలిగినట్టే వున్నాడు," నవ్వాడాయన.

స్కానింగు అనే మాట వింటూనే అరవింద గుండె మండిపోయింది.

"ఎందుకట? ఆడపిల్ల అని తెలిస్తే కడుపు తీయించేయడానికా?" విసురుగా అనేసింది.

ఆమె తండ్రి నివ్వెరపోయాడు. "అదేమిటమ్మా? పాపం అతను అలా ఎందుకుంటాడు?" అన్నాడు.

"కాకపోతే ఏమిటి నాన్నా?" అంటూ ముభావంగా మొహం అవతలికి తిప్పుకుంది అరవింద.

ఆ రోజున ఆమెకు నొప్పులు రాలేదు.

ఆ మర్నాడు కూడా రాలేదు.

ఆ రెండో రోజున తన గది పక్కనున్నామె గర్భస్రావం చేయించుకుంది. వెళ్ళేటప్పుడు ఆమె సరిగ్గా తన గది ముందునుంచే వెళ్ళింది. గర్భస్రావం చేయించుకున్నాక మళ్ళీ ఆమెను తన గదిముందు నుంచే తీసుకెళ్ళారు. కళంతా హరించుకుపోయి ప్రేతంలా కనిపించిన ఆమె మొహంలోకి చూడ్డానికి భయమేసి అరవింద గట్టిగా కళ్ళు మూసుకుంది.

ఆ సాయంత్రమే మరో సంఘటన జరిగింది.

కాన్పులమ్మ ఆసుపత్రికి కొంత దూరంలో పెద్ద మురుగు కాలువ ఒకటుంది. ఒకనొక కాలంలో అది పంట కాలువ. క్రమేపీ కాలదోషం పట్టి మురుగు కాలువగా రూపాంతరం చెందింది. ఆ మురుగు కాలవలో ఒక పసిబిడ్డ శవం బయటపడింది.

నలుగురూ చేరి అక్కడ ఎందుకో గొడవ గొడవగా మాట్లాడుకోవడం అరవిందకు కిటికీలోంచి కనిపించింది.

"ఏమిటమ్మా అది? ఏం జరిగింది?" తల్లిని అడిగింది.

అరవింద తల్లి గబుక్కున ఆమె మొహం పట్టుకుని బలవంతంగా అవతలికి తిప్పేసింది. "పాడు మనుషులు! అక్కడేం జరుగుతోందో మనకెందుకులెమ్మా! వరండాలోకి పోదాం పద," అంది.

తల్లి చెయ్యి విడిపించుకుని కిటికీలోంచి మళ్ళీ అవతలికి చూసిన అరవిందకు ఓ పసిబిడ్డ శవాన్ని పోలీసులు గోనెసంచిలోకి ఎక్కిస్తుండడం స్పష్టంగా కనిపించింది.

ఆ దృశ్యం చూస్తూనే ఆమె కెవ్వున కేకేసి మంచం ఎక్కేసింది. కళ్ళు రెండూ గట్టిగా మూసుకుని వణికిపోతున్న కూతుర్ని ఆమె తల్లి ఆత్రంగా గుండెకు హత్తుకుంది.

"నేనీ నరకంలో వుండనంటే తెచ్చి నన్నిక్కడ పడేశారు," అంటూ ఏడ్చింది అరవింద.

ఆ రాత్రి ఆమెకు భయంతో సరిగ్గా నిద్ర పట్టలేదు. తనకు కాన్పు సరిగ్గా జరుగుతుందా? తన బిడ్డ సజీవంగా పుడుతుందా. అసలు కాన్పు జరిగాక తను బ్రతికి వుంటుందా? ఇలా రకరకాల ఆలోచనలతో ఆమె రెపరెపలాడింది. భర్త ఉద్యోగానికి సెలవు పెట్టి వెంటనే తనకోసం ఎందుకురాడని ఆమె హృదయం ఆక్రోశించింది. చాలాసార్లు కలత నిద్రలోంచి ఉలిక్కిపడి లేచి కడుపులో వున్న బిడ్డను నిమిరి ఏదైనా కదలికకోసం చూసి చూసి మళ్ళీ కలత నిద్ర పోయింది.

ఆ మర్నాడు కూడా ఆమెకు కాన్పు నొప్పులు రాలేదు.

ఆ రోజు ఉదయమే తమ మొదటి రోజు చూసిన పిల్లల తల్లిని డిశ్చార్జి చేశారు. ఆ పిల్లల తండ్రి ఆ రోజున వచ్చాడు. ముటముటలాడే మొహంతో తమకు పుట్టిన బిడ్డను చేతుల్లోకి తీసుకున్నాడు. "సర్లే, ఆడపిల్ల పుడితే పుట్టింది. పాలు తాగించడానికి నీకేం రోగం?" అంటూ నలుగురి ముందూ భార్యను కసురుకోనూ కసురుకున్నాడు. అది ప్రేమా నాటకమా అనేది అక్కడున్న వాళ్ళెవరికీ అర్థం కాలేదు.

వాళ్ళు వెళ్ళిపోతుండగా తన గది గుమ్మం దగ్గర నిలబడిచూసింది అరవింద. ఆ ఇద్దరు పిల్లలు పోతూ పోతూ తనవంక అలా చూస్తూనే వెళ్ళారు. ముఖ్యంగా ఆ నోట్లో బొటనవేలు పెట్టుకున్న పాప తనకేసి అమాయకంగా చూసిన చూపు అరవింద మనసులో ముద్ర పడిపోయింది.

వాళ్ళిద్దరికీ టాటా చెబుతున్నట్టు నవ్వుతూ చేయూపింది.

వాళ్ళిద్దరూ యథాప్రకారంగానే సిగ్గు పడిపోయి ముందుకు పరిగెత్తారు.

ఆ పిల్లల నవ్వు మొహాలు చూశాక అరవింద మనసు ప్రశాంతంగా మారింది. కడుపులో వున్న బిడ్డ గిలిగింతలు పెడుతున్నట్టుగా తోచి నవ్వుకుంది.

ఆ రోజు కాన్పులమ్మ అరవిందను పరీక్ష చేసి ఆమె తండ్రిని పక్కకు పిలిపించి "కడుపులో బిడ్డ పూర్తిగా ఎదిగింది. మీ అమ్మాయికేమో నొప్పులు రావడం లేదు. ఇంకా ఆలస్యం చేస్తే ప్రమాదం. ఆపరేషన్ చేసి బిడ్డను బయటికి తీయడం ఒక్కటే మార్గం," అంది.

అరవింద తండ్రికి ఏమనాలో తోచక కళ్ళనీళ్ళు పెట్టుకుని అలాగే చేయమన్నట్టు తలూపాడు. ఆమె పెట్టమన్న కాగితం మీద సంతకం పెట్టాడు.

ఆపరేషన్ గదికి తీసుకుపోతున్నప్పుడు కూడా తనకు సిజేరియన్ చేయబోతున్నట్టు అరవిందకు తెలీదు. తనకు లోకల్ అనెస్తీషియా ఇవ్వడం అదీ చూసి విషయం అర్థం చేసుకుంది.

"డాక్టర్! నాకసలు బిడ్డ పుడుతుందా?" భయం భయంగా అడిగింది.

ఆపరేషను గదిలో కాన్పులమ్మ టెంపరు జగద్విఖ్యాతం. "నువ్వు నోరు మూసుకుంటావా లేదా?" అంటూ కసిరిందామె. అరవింద కళ్ళ వెంబడి కన్నీళ్లు జారిపోనారంభించాయి. ఆ సమయంలో తన దగ్గరలేని భర్తను ఆమె మనసు పలువిధాలుగా తూలనాడింది.

ఆపరేషను జరుగుతుండగా ఆమెకు ఆక్సిజన్ ఇవ్వలేదు. గుండె బండరాయిగా మారిపోతున్నట్టూ, ఊపిరి ఆగిపోతున్నట్టూ ఉక్కిరిబిక్కిరై ఆమె ప్రాణం పోతోందనే అనుకుంది. అయితే ఆమె ప్రాణాలు పోలేదు. డాక్టరు చేస్తున్న పనులన్నీ ఆమెకు కనిపిస్తూనే ఉన్నాయి.

ఆపరేషను జరిగాక బిడ్డను బయటికి తీయడం ఆమెకు తెలుస్తూనే వుంది. బిడ్డను తలకిందులుగా పట్టుకుని కాన్పులమ్మ గట్టిగా చరిచింది. ఒకసారి కాదు, రెండుసార్లు కాదు, మూడు నాలుగు సార్లు చరిచింది. మొదటి సారి బిడ్డ కేరుమనకపోయేసరికి అరవిందకు పై ప్రాణాలు పైనే ఎగిరిపోతున్నట్టనిపించింది. నాలుగోసారికి బిడ్డ కేరుమనడంతోగానీ ఆమె గుండె కుదుటపడలేదు.

"కూతురు గొంతు వినిపిస్తోందా?" అడిగింది కాన్పులమ్మ.

కూతురు!

అరవింద మనసు చిత్రంగా స్పందించింది. ఆమెకు వళ్ళంతా ఒక్కసారిగా అదోలా అయిపోయింది. ఎక్కడో గాలిలోకి తేలిపోతున్న అనుభూతి.

"వినిపిస్తోందండీ" బలహీనంగా చెప్పింది.

ఆపరేషను చేశారు కాబట్టి వారం రోజులపాటు ఆసుపత్రిలోనే వుండాలని చెప్పింది కాన్పులమ్మ.

బిడ్డ మొహం మొదటిసారి చూసుకున్నప్పుడు తను ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోయినట్టూ, దేవుడు తనకేదో అమరత్వం ప్రసాదించినట్టూ అనిపించిందామెకు. పదే పదే బిడ్డను తడిమి చూసుకుంది. భర్త తన పక్కన లేనందుకు మరోసారి ఆమె మనసు కలతపడింది.

అరవింద తండ్రి హైదరాబాదుకు ఫోన్ చేసి ఆడపిల్ల పుట్టిన విషయం తెలియజేశాడు. ఆడపిల్ల పుట్టినందుకు అల్లుడు నిరుత్సాహపడ్డం ఆయనకు ఫోన్లో తెలుస్తూనే వుంది.

"సర్లెండి, సెలవు దొరకడం కష్టంగా వుంది, త్వరలో వస్తాను," అని టెలిఫోను పెట్టేశాడతను. ఆడపిల్ల పుట్టినందుకు అల్లుడు నిరుత్సాహపడ్డ విషయం కూతురికి చెప్పలేదాయన. సెలవు దొరగ్గానే వస్తానన్న విషయం మాత్రం చెప్పాడు. అయినా అరవింద పరిస్థితిని అర్థం చేసుకుంది.

"ఆడపిల్ల కదా! అందుకే నిదానంగా వస్తానంటున్నారు. అదే మగపిల్లవాడైతే రాత్రి బండికే బయల్దేరతాననేవారు," అంది.

బిడ్డను చూడ్డానికి ఎవరెవరో వస్తున్నారు.

"ఆడపిల్లా? ఎవరైతే ఏంలే!" అంటూ చప్పరించేసి వెళ్తున్నారు.

"నాన్నా! ఆడపిల్ల పుట్టినందుకు నాకేం బాధ లేదు. మధ్యలో వీళ్ళెందుకు బాధపడ్డం? వీళ్ళ సానుభూతి నాకేం అక్కర్లేదు," అంది అరవింద.

తండ్రి ఆప్యాయంగా ఆమె తల నిమిరాడు.

పాపకు మొదటి మూడురోజులు చక్కెరనీళ్ళు పట్టారు. మూడోరోజుకు అరవిందకు పుష్కలంగా పాలు పడ్డాయి. ముర్రు పాలు తోడి పారేద్దామని అరవింద తల్లి ఆత్రపడిందిగానీ అరవింద పడనివ్వలేదు. తొలిసారి పడ్డ పాలు బిడ్డకు శ్రేష్ఠమని వాదించి ఈసారి మాత్రం తన పంతం నెగ్గించుకుంది.

కనీసం బిడ్డకు మొదటిసారి తల్లిపాలు పట్టే రోజైనా భర్త వస్తాడని ఆమె ఆశపడింది. అయితే అతను ఆ రోజు రాలేదు. ఆ మర్నాడు కూడా రాలేదు. క్రమంగా ఒకవిధమైన ఉదాసీనత అరవింద మనసును ఆక్రమించుకుంది. దాంతో భర్తకోసం ఎదురు చూడ్డం మానేసింది.

అతను మర్నాడు, అవతలి మర్నాడు కూడా రాలేదు. చివరికి అరవిందని రేపు డిశ్చార్జి చేస్తారనగా ఉదయం పూట దిగాడు. ఆ దిగడం నేరుగా ఆసుపత్రికి రాలేదు. బస్టాండునుంచి తిన్నగా అత్తగారింటికి వెళ్ళి స్నానాదులు పూర్తయ్యాక టిఫిన్ చేసి మరీ తీరుబడిగా వచ్చాడు. వస్తూనే పెద్ద సంజాయిషీ కూడా చెప్పుకోలేదు.

"సెలవు దొరకలేదోయ్. అందుకని ముందుగా రాలేకపోయాను."

"ఫర్వాలేదు."

అరవింద గొంతులో ద్యోతకమైన తిరస్కార భావం అతను గమనించకపోలేదు. దాంతో కొంత అపరాధభావం పట్టి పీడించింది.

"పాపకు గౌను తెచ్చాను, ఏదీ పాప?" అన్నాడు.

అరవింద పాపను చూడకుండా పైట చెంగు బిడ్డమీద నిండుగా కప్పేసింది. దాంతో అతను ఆత్రంగా ముందుకు జరుగుతున్నవాడల్లా వెనక్కి తగ్గి, "ఇదేమిటి?" అన్నాడు మొహం చిన్నబుచ్చుకుంటూ.

అరవింద సాంతం అతనివైపు తిరిగింది.

"ఆడపిల్ల పుట్టినందుకు మీరేం బాధపడనక్కర్లేదు. నా కూతుర్ని నేను సాక్కోగలను, వెళ్ళండి," అంది.

"ఇది మరీ బావుంది, ఆడపిల్ల పుట్టినందుకు బాధపడిపోతున్నానని నీతో నేను చెప్పానా?" అన్నాడతను.

"చెప్పక్కర్లేదు, తెలుస్తూనే వుంది."

అతనామె చెయ్యి తన చేతిలోకి తీసుకున్నాడు.

"నిజం అరవిందా! ఆడపిల్ల పుట్టినందుకు నాకేం బాధలేదు," అన్నాడు.

అరవింద అతని ముఖంలోకి పరిశీలనగా చూసి, "అయితే నాకో మాటివ్వండి," అంది.

"ఏమిటది?" అన్నాడతను కొంచెం అప్రతిభుడవుతూ.

"పాపకేమీ తక్కువ చేయగూడదు. మగపిల్లాడితో సమానంగా పెంచి ప్రయోజకురాలిని చేయాలి."

ఆమె అడిగిన విధానానికి అతను నవ్వకుండా ఉండలేకపోయాడు.

"సరే, మాట ఇస్తున్నాను. పాపను చూపించు," అంటూ అక్కడెవరూ లేకపోవడం చూసి ఆమె నుదుటిమీద చిన్నగా ముద్దెట్టుకున్నాడు.

*ఆహ్వానం, జులై 1994*

# వ్యర్థజీవి

"అటు చూస్తున్నావా -ఆ బతుక్కి అర్థమేమైనా ఉందంటావా?" అడిగాడు బుల్లి రాజకీయవేత్త.

"ఎవరి గురించి నువ్వు మాట్లాడేది? నేను చూస్తున్నది ఆ అందమైన అమ్మాయిని" అన్నాడు అభ్యుదయ కవి.

"ఈ వయసులో నీకిందే రోగం? మీ ఆవిడకి చెప్పానంటే మూడు రోజులు నీకు మరింక తిండి పెట్టదు,"

"బాబ్బాబు, అంత పని చేయకు! అయినా కవుల దృష్టి వేరులే. నేనా అమ్మాయిని నీలా ఒళ్ళంతా చూస్తున్నాననుకున్నావా? ఆమెలో దాగున్న కవిత్వాన్ని చూస్తున్నాను."

"నీ అభ్యుదయం మండినట్టే ఉంది. నువ్వు భావ కవిత్వంలో ఎప్పుడు పడ్డావ్?"

"భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం అనేవి కవి కల్పించుకునే నిబంధనలు. కవి హృదయానికా నిబంధనలేం లేవు. కవితా వస్తువేది కనిపించినా అది ఆవేశపూరితమవుతుంది. కవి కంటే కవి హృదయం గొప్పది."

"ఆహా! ఏం చెప్పొచ్చావ్! నేను మాట్లాడేది నీ కవితా వస్తువును గురించి కాదు, సమాజానికి ఎందుకూ పనికిరాని ఒక వస్తువు గురించి."

"ఎవరా వస్తువు? ఏమా కథ?"

"అక్కడ పాత పత్రికలు అమ్మజూపుతున్నాడే, ఆ తిరుమలయ్యని చూడు. నా చిన్నప్పట్నుంచీ వాణ్ణి చూస్తున్నాను. అదే అవతారం చిరిగిన చొక్కా, నలిగిన పాంటు. మాసిన గడ్డం, చిక్కిన మొహం, వెళ్ళు కొచ్చిన దవళ్ళు, ఆకలి చూపులు."

"ఆపవోయ్ పొలిటీషియనూ, ఆపు, కవిని నా కంటే నువ్వే వాణ్ణి బాగా వర్ణిస్తున్నావే!"

"వాణ్ణి చూస్తుంటే మరి నాకు నువ్వు చెప్పిన కవి హృదయం లాంటిదేదో పొంగుతోంది. నీకున్నంత భాష నాకూ ఉండి ఉంటే, వాణ్ణి అభిశంసిస్తూ పెద్ద కవిత రాసిపడేసుండేవాణ్ణి."

"అవునవును. వాణ్ణి నేనూ చిన్నప్పట్నుంచీ చూస్తున్నాను. మనకంటే నాలుగైదేళ్ళ పెద్దవాడు. మనం వీధి బళ్లో చదువుకుంటున్న రోజుల్లో వాడు నిశ్శబ్దంగా కిటికీ చాటుకొచ్చి నిలబడేవాడు. ఎందుకో తెలీదు, అందరూ వాణ్ణి దొంగనేవారు. అయితే వాడు దొంగతనం చేయగా నేనెప్పుడూ చూళ్ళేదు."

"వాడి మొహానికి దొంగతనం కూడానా! వట్టి పిరికిగొడ్డు. మాస్టారు కాస్త వాకిట్లోంచి తల బయటపెట్టి చూస్తే చాలు, అక్కణ్ణించి లగెత్తేవాడు."

"అందుకేనేమో వాణ్ణి దొంగనేవారు. మొత్తానికి దొంగ కాదు. ఇంతకీ వాడి గొడవెందుకెత్తావ్?"

"ఇలా ఇక్కణ్ణుంచి చూస్తుంటే ఎందుకో వాడి జీవిత చరిత్రంతా కళ్ళముందు కదిలింది. దాంతో వాడి బతుక్కి అర్థమేమైనా ఉందా అని ప్రశ్న వేసుకోవాల్సి వచ్చింది."

"నీకు వాడి జీవిత చరిత్ర తెలుసా?"

"నీకు తెలీదా?"

"వాడికెవరూ లేరని మాత్రం తెలుసు."

"మీ కవుల్తో వచ్చే ఇబ్బంది ఇదే. ఎప్పుడూ ఆకాశంలో ఉంటారు. అదే మా రాజకీయ నాయకుల్ని చూడు. ఎవడెవడి బతుకంతా మాకు వేళ్లమీదే గుర్తుంటుంది."

"వివాదం లేపకు, వాడి గురించి చెప్పు."

రాజకీయవేత్త చెప్పనారంభించాడు.

"తిరుమలయ్య తిండి లోటు లేని కాస్త మంచి కుటుంబంలోనే పుట్టాడు. అయితే అతని కర్మ ఏమిటో కాని అయిదారేళ్ల వాడయేసరికే దిక్కులేని వాడయ్యాడు. అప్పటినుంచీ పొట్ట పోసుకోవడానికి వాడికి ఒకటే వృత్తి – పాత పత్రికలు అమ్ముకునే వృత్తి. చుట్టుపక్కల ఊళ్లకు వెళ్లి ఇల్లిల్లూ తిరిగి అమ్ముతాడు. అన్నిరకాల పత్రికలూ వాటిలో ఉంటాయి. సినిమా పిచ్చి కుర్రాళ్ళు పావలా, అర్ధరూపాయీ పెట్టి అట్టమీది హీరో కోసమో, హీరోయిన్ కోసమో ఓ పత్రిక కొంటారు. నడివయసు మగరాయుళ్లు కొంతమంది వాటిలో దిగంబర సుందరీమణులెవరైనా ఉన్నారేమో వెతికి కొంటారు. పెళ్ళికాని ఆడపిల్లలు బ్యూటీ టిప్స్ కోసం, పెళ్ళయిన ఆడవాళ్లు కొత్త వంటకాల కోసం కొంటారు. అలా గడుస్తోంది అతని బతుకు."

రాజకీయవేత్త ఆ కథంతా చెప్పి, "నేను లోకంలో ఎందరెందర్నో చూశాను. ఇంత వ్యర్థజీవిని మాత్రం ఎక్కడా చూళ్లేదు. చివరికి అడుక్కుతినేవాడు కూడా భార్యకోసమో, పిల్లల కోసమో ఏవో తిప్పలు పడుతుంటాడు. వీడికి పెళ్లాం పిల్లలు లేరు. లోకంలో

అసలెవరూ లేరు. వీడి పొట్ట వీడిది – అంతే. సమాజంలో మరెవరికీ వీడివల్ల గురివింద గింజంత ప్రయోజనం లేదు. వీడు బతికి అనవసరం," అన్నాడు.

కవి ఆలోచనలో పడ్డాడు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?" అన్నాడు రాజకీయవేత్త.

"మరేం లేదు. వీడి గురించి ప్రస్తావన వచ్చింది గనక ఇప్పుడు నాకూ అనుమానం వస్తోంది. లోకంలో నిజంగా బతుక్కి ఏదైనా అర్థం ఉన్నవాళ్లు ఎంతమంది?"

"ఎంతమందైనా అసలే అర్థంలేని వాడు వీడొక్కడే."

"అంతు నిక్కచ్చిగా చెబుతున్నావ్ – ఒక పిచ్చివాణ్ణి చూపుతాను. వాడి బతుక్కి ఏ అర్థం ఉందంటావ్?"

"అది వాడి చేతుల్లో లేదు. కాబట్టి వాడు నిర్దోషి."

"సరే, ఒకళ్ల గురించి మనం మాట్లాడేటప్పుడు మన గురించి కూడా అనుకోవాలి కదా! మన బతుక్కి అర్థం ఏముందంటావ్?"

"ప్రశ్న వేశావ్ కాబట్టి జవాబు కూడా నువ్వే ముందు చెప్పు. నీ బతుక్కే అర్థం ఉందని నువ్వనుకుంటున్నావ్?"

"నేను కవిత్వంతో లోకాన్ని జాగృతం చేస్తున్నాను."

"నేను ప్రజాసేవ చేస్తున్నాను."

"అమ్మయ్య! అయితే మన జీవితాలకు ఎంతో కొంత అర్థం ఉందన్నమాట!"

"కాబట్టి లోకంలో అందరికంటే వ్యర్థజీవి తిరుమలయ్య."

"నువ్వంటుంటే నాకూ అలాగే అనిపిస్తోంది."

"అనిపించడం ఏమిటి? అక్షరాలా నిజం."

"అలా కాదు. వాడు నిజంగా వ్యర్థజీవి అని ముందు రుజువు చేసుకోవాలి. ఆ తర్వాత వ్యర్థ జీవి మీద నువ్వన్నట్టు కవిత రాయాలి."

"కవిత రాస్తే సరిపోదు. వాడిమీద కథ రాయాలి."

"పోనీ కథే అనుకుందాం. అయితే మనం ఈ రోజునుంచీ వాణ్ణి గమనించాలి."

"మామూలుగా గమనించడం కాదు, జాగ్రత్తగా గమనించాలి."

"ఇటే వస్తున్నాడు ఆ ప్రశ్న వాణ్ణే అడుగుదామా?"

"అడుగు అడుగు."

ఆ మాట పూర్తి చేస్తుండగానే తిరుమలయ్య అక్కడికి రానే వచ్చాడు.

"పత్రిక కొంటారా బాబూ!"

ఎందుకో తెలీదు. వాడికి మనుషుల్ని చూస్తే బెదురు. ఎవర్తో మాట్లాడినా బెదుర్తూ బెదుర్తూ మాట్లాడుతాడు.

"అది సరేగాని తిరుమలయ్యా! ఇందాకేమిటి అక్కడెవర్తోనో చాలాసేపు మాట్లాడుతుండిపోయావ్?" పలకరింపుగా అన్నాడు రాజకీయం.

"ఫర్వాలేదు చెప్పవయ్యా."

"ఏం లేదు బాబూ."

"అరె, చెప్పవయ్యా అంటే!"

వాడు గుటకలు మింగాడు.

"మరేం లేదు బాబూ! నేనేం మాట్లాడలేదు. పత్రిక్కొంటానని చెప్పి ఆయనే చాలాసేపు బొమ్మలు తిరగేస్తుండి పోయాడు."

"కొన్నాడా?"

"ఏదీ, లేదు బాబూ."

"అయ్యో పాపం!" కవి హృదయంతో సానుభూతి వెలిబుచ్చాడు కవి.

ఆ సానుభూతితో వాడికి కొంత ధైర్యం చిక్కింది.

"కొందరెప్పుడంతే బాబూ. పత్రిక కొనరేం చెయ్యరు. ఊరికే బొమ్మలు చూసి సతాయించి చంపుతారు. ఇంకొందరైతే మంచి అమ్మాయి బొమ్మ కనిపించిందంటే చింపేసుకుంటారు. పైసా ఇవ్వరు."

వ్యర్థజీవుల లిస్టులోకి ఇంకొందర్ని చేర్చవచ్చేమోనని సాలోచనగా మొహం పెట్టాడు రాజకీయం.

"వాళ్ల పాపాన వాళ్లే పోతార్లే తిరుమలయ్యా! ఇప్పుడు మాకో ప్రశ్న వచ్చింది. సరిగ్గా సమాధానం చెబుతావా?" అన్నాడు అభ్యుదయం.

వాడు అనుమానంగా చూశాడు.

"అడగండి బాబూ!" అన్నాడు బెదుర్తూనే.

"మనిషిగా పుట్టినవాడి బతుక్కి ఏదైనా అర్థం ఉండాలా?"

తిరుమలయ్య అవునన్లేదు, కాదన్లేదు. ఊరికే వెర్రి మొహం వేసుకుని నిలబడ్డాడు.

"మా బతుక్కి ఏదైనా అర్థం ఉందా, లేదా అని మేమిందాక ఓ చిన్న ప్రశ్న వేసుకున్నాం. ఏదో కొంత అర్థం ఉందనే నిర్ణయానికొచ్చాం. ఇప్పుడదే ప్రశ్న నిన్నడగాలని అనుకుంటున్నాం. నువ్వు చెప్పు. నీ బతుక్కి ఏదైనా అర్థం ఉందని నీకనిపిస్తోందా? అనిపిస్తే దాచకుండా చెప్పు."

ఆ వెర్రి మొహం చూసి తన ప్రశ్న వాడికర్థం కాలేదేమో అనుకున్నాడు కవి. అయితే వాడికా ప్రశ్న అర్థం కావడమే కాదు, ఇందాక వాడి మొహంలో కనిపించిన అనుమానం, బెదురు కూడా లేకుండా పోయాయి. అయితే వాటి స్థానంలో ఒకరకమైన ఉదాసీనత వాడి మొహంలో అలుముకుంది.

"ఈ పాడు బతుక్కి అర్థం కూడానా బాబూ! పాత పత్రికలమ్మి ఈ బతుకు కొంతకాలం గడుస్తుంది. ఆ తర్వాత ఈ జీవుడు కాస్తా పోతాడు. అంతే బాబూ ఈ బతుక్కి అర్థం! అంతకంటే మరేం లేదు," అంటూ అక్కణ్ణించి పోబోయాడు.

నా అభిప్రాయమే వాడి అభిప్రాయం చూశావా అన్నట్టు సాభిప్రాయంగా కొంతా, సగర్వంగా కొంతా చూశాడు రాజకీయం.

అభ్యుదయానికి ఊరికే అలా వాణ్ణి పంపించేయాలనిపించలేదు.

"తిరుమలయ్యా! అలా వెళ్ళిపోతావేమయ్యా? ఇలారా, ఏవో పత్రికలున్నాయన్నావు కదా!" అంటూ వెనక్కి పిలిచాడు.

ఆ మాట వింటూనే వాడి మొహం వికసించింది.

ఆత్రంగా ముందు కొచ్చి, "కొంటారా బాబూ, ఇందండి," అన్నాడు.

వాటిలో కవికి పనికొచ్చేపాటి పత్రిక ఒక్కటీ లేదు. అయినా ఓ పత్రిక ఎంచుకుని "ఎంత?" అన్నాడు.

"రూపాయి బాబూ" అన్నాడు వాడు బెదుర్తూ.

"వార్నీ! తిరుమలయ్యా! నీ అసాధ్యం కూలా! ఎంత తెలివైనవాడివి! పైకంత వెర్రి పీనుగులా కనిపిస్తావ్! నలిగి మాసిపోయిన ఈ చచ్చు పత్రిక రూపాయంటావా?" అన్నాడు రాజకీయం.

తిరుమలయ్య బెదిరిపోయాడు.

"పోనీ, అర్ధ రూపాయివ్వండి బాబూ!"

కవి నవ్వి, "ఇంద రూపాయి," అంటూ వాడి చేతిలో ఓ రూపాయి కాసు పెట్టి పంపించాడు.

బెదురు చూపుల్తో వెనక్కి చూసుకుంటూ చూసుకుంటూ వెళ్లాడు తిరుమలయ్య.

"ఎందుకు వాడికి రూపాయిచ్చావ్?" అన్నాడు రాజకీయం.

"ఇవ్వాలనిపించింది. బతుకు మీద వాడన్నాడే ఆ మాట – ఎంత చక్కగా అన్నాడు!"

"అదిగో, అదే మీ కవుల్తో వచ్చిన ఇబ్బంది. ఇంకేం? వాడి మీద కథో, కవితో రాసిపడెయ్."

"వాణ్ణి సరిగ్గా గమనించకుండానే?"

"ఇంకేం గమనిస్తావ్? వ్యర్థజీవినని వాడే ఒప్పుకున్నాడు".

"అలా కాదు, గమనించాలనుకుంటున్నాం, గమనిద్దాం" అన్నాడు కవి.

ఇద్దరూ కలిసి వాడి దినచర్య నెలరోజులపాటు అదే పనిగా జాగ్రత్తగా గమనించారు. చివరికి వాడు కచ్చితంగా వ్యర్థజీవి అనే నిర్ణయానికి వచ్చేశారు.

కవి వాడి కవిత ఒకటి రాయడం మొదలెట్టాడు–

*"ఒక చేతిలో*
*కాగితాల దొంతరలతో*
*లోకాన్ని తూస్తాడు*
*ఒక చేతిలో*
*ఆకలి మంటలతో*
*బతుక్కి హారతిస్తాడు*
*పొట్ట గడవడం తప్ప*
*వేరేదీ తెలియనివాడు*
*తనకు తాను తప్ప*
*వేరెవ్వరూ లేనివాడు*
*వాడి జీవితం*
*ఒక ఎండిపోయిన బావి*
*వాడొక వ్యర్థజీవి!"*

–అంతకు మించి కవిత్వం ముందుకు సాగలేదు. అతని కా కవిత ఎందుకో నచ్చలేదు. ఎక్కడో, ఏదో అడ్డు తగిలింది. తను రాసిన కవితలో తనకే ఏదో అస్పష్టత ఉందనిపించింది. అదేమిటో అతనికే అర్థం కాలేదు.

అలా జుట్టు పీక్కుంటుండగానే రాజకీయవేత్త చక్కా వచ్చాడు.

"ఇది విన్నావా? మన వ్యర్థజీవి ఆస్పత్రిలో పడ్డాడు."

'ఏమైంది?" అడిగాడు కవి.

"ఏమవుతుందీ, ఊళ్లో అందరికీ అవుతున్నదే అతిసారం."

"అయ్యో పాపం!"

"ఇది విను, ఒక ఆశ్చర్యకరమైన విశేషం జరిగింది."

"ఏమిటది?"

"తిరుమలయ్యకు మనం ఎవరూ లేరనుకున్నామా?"

"అవును."

"ఇప్పుడు ఊళ్ళోని పేదపిల్లలంతా ఒకటై పెద్దాసుపత్రిలో అతనికి వైద్యం చేయిస్తున్నారు. ఏ రాజకీయ నాయకుడు ఆస్పత్రిపాలైనా అంతమంది రారనుకుంటాను."

ఈ వార్త కవికి నిజంగా ఆశ్చర్యం కలిగించింది.

"ఈ విషయం నీకెలా తెలుసు?"

"భలేవాడివే! వాడి వెనక డిటెక్టివ్‌లా నన్ను తగిలించిన వాడివి నువ్వు కాదూ?"

కవి ఆలోచనలో పడ్డాడు.

"పాత పత్రికలమ్ముకునే వాడికోసం అంతమంది ఎలా వస్తారో? నువ్వు చెప్పేది నాకు నమ్మబుద్ధి కావడం లేదు."

"మొదట నేనూ నమ్మలేదు. నువ్వక్కడికి వచ్చి చూస్తే తెలుస్తుంది."

రాజకీయం, అభ్యుదయం రెండూ పెద్దాసుపత్రికి వెళ్ళాయి.

"బాప్‌రే! నువ్వు చెప్పింది నిజమే సుమా! ఎంతమంది పిల్లలు! ఎక్కడెక్కడివాళ్ళంతా వచ్చేశారు," అన్నాడు కవి.

ఇద్దరూ వార్డులోకి వెళ్ళారు.

తిరుమలయ్య బాగా నీరసంగా ఉన్నాడు. అయితే అతిసారం నుంచి మాత్రం కోలుకున్నాడు.

"తమరొచ్చారా బాబూ! అయ్యో కూర్చోమంటానికి కుర్చీ కూడా లేదు."

"ఫర్వాలేదు తిరుమలయ్యా! ఒక మాట చెప్పు. ఈ పిల్లలంతా ఎవరు?" అడిగాడు కవి.

"అంతా మా పిల్లలే బాబూ!"

"ఏమిటి? ఇంతమందా?!"

"అవును బాబూ! వీళ్ళేగా నాకున్నది!"

"మాకు సరిగ్గా అర్థం కాలేదు. ఇంతమంది పిల్లలు నీకోసం ఎందుకొచ్చారు?"

"అదేముంది బాబూ! పాత పత్రికలు దొరికే చోట కొందరికి అక్కర్లేని స్కూలు పుస్తకాలు కూడా నాకు దొరుకుతుంటాయి. ఏవైనా అమ్ముతాను గానీ అయ్యి మాత్రం అమ్మను బాబూ. ఇట్లాంటి బీద పిల్లాళ్లందరికీ పంచేస్తాను."

రాజకీయం, అభ్యుదయం ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

తిరుమలయ్య తన ధోరణిలో తాను చెప్పుకుంటూ పోతున్నాడు.

"చిన్నప్పుడు చదువుకోవాలని నాకు చాలా ఇదిగా ఉండేది బాబూ. చదివించే వాళ్లెవరూ లేకపోయారు. స్కూలు కిటికీల దగ్గర నిలబడి దొంగచాటుగా పాఠాలు వినేవాణ్ణి. అంతా నన్ను 'దొంగ' అనేవారు. అప్పట్నుంచి మనుషులంటే నాకు చాలా భయం బాబూ! ఆ రోజు దొంగచాటుగా విన్న ఆ పాఠాలే కద బాబూ, ఈ రోజు ఈ మాత్రం అక్షరజ్ఞానం నాకబ్బడానికి కారణం! నాకు పనికిరాని పత్రికలన్నీ అమ్మేస్తాను. పనికొచ్చేవన్నీ చదువుతాను. మిగతా మంచి పత్రికలు ఈ పిల్లలకు పంచి పెట్టేస్తాను. వీళ్ళు కూడా నాకు లేకపోతే ఈ పాడు లోకంలో నేనేమైపోయి ఉండేవాణ్ణి బాబూ?"

తిరుమలయ్య ఇంకా ఏదో చెబుతున్నాడు.

కవి వినడం మానేశాడు.

తను గొప్పవాళ్ళని అనుకుంటున్న వారెవరైనా ఇంత నిస్వార్థపూరిత సేవ చేస్తున్నారా?

నెమ్మదిగా అతను జేబులోంచి తను రాసిన కవిత తీసి చింపేశాడు.

లోకంలో ఏ ప్రాణీ వ్యర్థజీవి కాదు!

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఫిబ్రవరి 1995*

# ఏటి ఒడ్డు చేపలు

కొండల్లో ఎక్కడో ఉధృతంగా వాన కురిసినప్పుడు ఎడారి పాయగా మన్ను తిన్న పాములా సచ్చుగా పడుండే పెన్నానది ప్రాణం పోసుకుని బుసబుసా పొంగుతుంది. ఎక్కడెక్కడి కాలువలూ, ఇసుక దిబ్బలూ సజీవ జలాలతో పునీతమై పోతాయి. వరద నీరు పరవళ్ళు తొక్కుతుంది. ముళ్ళ కంపలూ, చెత్తాచెదారం సమూలంగా పెకలించుకుపోతాయి. అంతకాలం చైతన్యం లేకుండా పడి ఉన్నందుకు ఆగ్రహంతో పెన్న మహోగ్ర రూపం ధరించి తనలోని కాలుష్యాన్ని తానే నోరు తెరిచి మింగేస్తుంది. కుబుసం విడిచిన మహాసర్పంలా కొండలమధ్య, గుట్టల మధ్య, అడవుల మధ్య మెలికలు తిరుగుతూ గలగలా జలజలా జరజరా బిరబిరా ఉరకలెత్తిపోతుంది. కొన్ని చోట్ల అణుకువగా సద్దులేక ప్రవహిస్తుంది. కళ్లు మూసుకుని కమ్మని నిద్రలో తేలిపోయే జవరాలిగా తోస్తుంది. కొన్నిచోట్ల నీటి కురులు విరబోసుకుని హెూరుపెడుతూ భయం గొలుపుతుంది. చివరికి మహెూత్సాహంతో పరుగులు పెడుతూ వెళ్లి సముద్రంలో పడి లీనమైపోతుంది.

అయితే ఆ జీవ చైతన్యం ఎప్పుడోగానీ చూసే భాగ్యం కలగదు. పెన్న జీవనది కాదు. వరద వచ్చినప్పుడే ఆ నయనానందకరమైన సుందర దృశ్యం. లేనప్పుడు లేదు. ఏటేటా ఆసల్లేదు. ఎప్పుడో మూడేళ్ళకో, నాలుగేళ్ళకో ఒకసారి, ఒకవేళ వరద వచ్చినా ఆనకట్ట అడ్డుపడి ఆ నీరు అక్కడికక్కడే గింగిరాలు తిరుగుతుంది. ముందుకు వెళ్ళే దారి కోసం వెంపర్లాడుతుంది. దాని ఆగ్రహం హద్దు మీరిందా సరే సరి. ఆనకట్ట తలుపులు తెరుచుకుంటాయి. లేదా పొగరణిగి అది అక్కడికక్కడే సర్దుకుంటుంది. పుట్టలోకి వెళ్ళిన పాములా లుంగలు చుట్టుకు పడుకుంటుంది. మచ్చికైన ఏనుగులా వయ్యారంగా పంట కాలవల గుండా వెళ్ళి ఊసరక్షేత్రాలు పండిస్తుంది. మళ్ళీ ఎండాకాలానికి ఎండిపోతుంది. అది వెళ్ళే మార్గమంతా సన్నని గీత రూపంలో ఉన్న ఎడారిలా పొడవుగా పరుచుకుంటుంది.

నీళ్లు లేని నదిలో మళ్లీ ముళ్ల కంపలు లేస్తాయి. పల్లేరుకాయలు విజృంభిస్తాయి. జనం ఇసక మేటల్లో కరబూజు కాయలు పండించుకుంటారు. ఊరివాళ్లు నదిని విశాలమైన

పాయిఖానా దొడ్డిగా వినియోగిస్తారు. ఏట్లో నేరాలు ప్రబలుతాయి. అక్రమ సంబంధాల వాళ్ళు చీకటిపడ్డాక ఏట్లో రమిస్తారు. బుద్ధిమంతులు ఇంటివాళ్ల గొడవ లేకుండా కులాసాగా ఏట్లో మందు కొడతారు. చీట్ల పేకలవాళ్లు పోలీసుల బెడద లేకుండా ఏట్లోకి వెళ్లి మంగతాయిగా పేరుపడ్డ మూడు ముక్కలాట ఆడతారు. కొందరు జోరుగా గంజాయి దమ్ము కొడతారు. పిల్లల్ని కనిపారేసేవాళ్లు పురిటి బిడ్డల్ని తెచ్చి అక్కడే పడేస్తారు. ఫ్యాక్షనిస్టు పాలిటిక్సుల వాళ్లు మనుషుల్ని నిలువునా చంపి శవాల్ని తెచ్చి అక్కడ పారేస్తారు. ఇవన్నీ తన గుండెమీద జరుగుతున్నా తెలుసుకోలేని పెన్నా నది వెల్లకిలా పడి కుంభకర్ణుడి నిద్రపోతుంది.

పెన్నా నది చాలా చోట్ల ఊళ్ల నానుకుని ప్రవహిస్తుంది. వాటిలో కొన్ని పెద్ద పెద్ద పట్టణాలూ ఉన్నాయి. ఒక మోస్తరు ఊళ్లూ ఉన్నాయి. కొన్ని చిన్న చిన్న పల్లెలూ ఉన్నాయి. పల్లెవాసులు తరతరాలుగా పట్టణాలకు వచ్చి స్థిరపడ్డం అలవాటు చేసుకున్నారు. దానికి చాలావరకు కరువు కాటకాలూ, చేతివృత్తులు గడవకపోవడాల వంటివే కారణం. అలా పట్టణాలకు తరలి వచ్చిన వాళ్ళలో ఎక్కువమంది పొలమూ పుట్రా, ఇల్లూ వాకిలీ లేని నిరుపేద జనమే. అలాంటివాళ్లకు పట్టణం నడిబొడ్డున ఉండడానికి వసతి ఎక్కడ దొరుకుతుంది? అందువల్ల వాళ్లంతా ఊరి చివర్లకు పోతారు. అలా ఊరి చివర్ల కూడా చోటు దొరకని వాళ్లు ఏట్లోకి పోయి ఇసుక దిబ్బల్లోనే కొట్టాలు వేసుకుంటారు. అలాంటివి గతంలో కంటే ఇప్పుడే ఎక్కువ జరుగుతున్నాయి. ఎక్కడెక్కడి జనం పట్టణాలకు రావడం ఎక్కువైపోవడంతో ఒక మోస్తరు ఊళ్లల్లో కూడా ఏటి ఒడ్డున ఇసుక దిబ్బలు అదృశ్యమైపోతున్నాయి. కొన్ని ఇళ్లు ఏకంగా ఏట్లోకే పాక్కుంటూ వెళ్తున్నాయి. ఎప్పుడో ఒకసారి పెన్నా నది వల్ల ముంపు తప్పదని అందరికీ తెలుసు. అయితే అందుకు అంగీకరించడానికి మాత్రం ఎవరూ సిద్ధంగా ఉండరు. ఎప్పుడో రాబోయే ప్రమాదం గురించి ఆలోచించడానికి కూడా ఎవరికీ సమయం లేదు. అదేం విచిత్రమో పెన్నా నదికి వరదలు వచ్చినప్పుడు కూడా ఆ నది ఈ పేదవాళ్ళ కొట్టాల మీద జాలితో కాబోలు వాటి నంటకుండా అల్లంత దూరంలోనే ప్రవహిస్తూ వెళ్ళిపోతుంది. దాంతో ఏటిగట్టు వాళ్ళకు నది మీద గొప్పగా నమ్మకం కుదిరిపోయి పక్కా ఇళ్లు కూడా కట్టేసుకుంటున్నారు. ప్రభుత్వం అలాంటి వాళ్ళకు డీ ఫారాలు కూడా మంజూరు చేస్తోంది.

వరాలు స్వంత ఊరు పెన్నానది ఒడ్డున ఉన్న ఒక మోస్తరు ఊళ్ళలో ఒకటి. వరాలుది సాలె కుటుంబం. వరాలు తండ్రి కాలంలో ఆ ఊళ్లో ఆ వృత్తికి గిరాకీ లేకుండా పోయింది. దాంతో తన వృత్తికి విలువ వున్న చోటుకి వరాలు తండ్రి కుటుంబంతో సహా దేశం

విడిచి వెళ్ళాడు. ఆ వెళ్ళిన చోటే చనిపోయాడు. వరాలుకి ఒక నాయనమ్మ ఉంది. ఆమెకు ఉన్న ఊరు విడిచిపెట్టి వెళ్లడం ఆ కాలంలోనే ఇష్టంలేదు. వరాలు తండ్రి చనిపోయాక ఆమెకూ అవసానకాలం దగ్గరపడింది. "ఒరే వరాలూ! నన్ను మా ఊర్లో పాతిపెట్టరా నాయనా!" అని రోజూ వరాలు చేతులు పట్టుకుని ఏడ్చేది.

వరాలుకు నాయనమ్మ అంటే చాలా ఇష్టం. తను పుట్టి పధ్నాలుగేళ్లు వచ్చేవరకూ పెరిగిన ఊరంటే కూడా ఇష్టం. అదీకాక ఇప్పుడున్న ఊళ్ళో కూడా పరిస్థితులు ఇదివరకటిలా లేవు. ఇక్కడి కష్టాలు అక్కడా ఉన్నాయి. ఎక్కడా కష్టాలు తప్పవు. ఆ కష్టాలేవో కన్నతల్లి లాంటి స్వంత ఊళ్లోనే పడితే? ఆలోచన రావడం ఆలస్యంగా వరాలు తమ ఊరు వెళ్లి అక్కడ వృత్తి ఎలా జరుగుతుందో కనుక్కున్నాడు. అక్కణ్ణించి తిరిగి వస్తూనే ముసలామెకు శుభవార్త చెవిన వేశాడు. "ఇప్పుడక్కడ చేనేత పని పూర్వమంత కనాకష్టంగా లేదంట నాయనమ్మా! ఇక్కడి కన్నా అక్కడ్నే బాగా జరుగుతుంది."

ఆ శుభవార్త వినగానే ముసలామె పొంగిపోయింది. "అయితే బిర్న నన్నాడికి కొండబో నాయనా! ఎన్నాళ్లాయె ఆ ఊరు చూసి? ఈ దినానికి ఇరవై ఏళ్లయిపాయ!" అంది.

వరాలు భార్య మాత్రం ఆ వార్త విని అంతగా సంతోషించలేదు. పైగా కలవరపడింది. "అది కాదు, ఇన్నేండ్లుగా ఈడనే ఉండిపోతిమి. ఇప్పుడు మల్లా ఆటికి పోవాల్నంటే అయ్యే పనేనా? ఎంత సొంతూరైనా అది మనకియ్యాల కొత్తే. ఈ ఇరవై ఏండ్లుగా ఆడ మనుషులెట్టెట్ట మారినారో యేందో మనకు దెల్వకుండగనే ఆటికి పోతానంటం యెర్రి పని గాదేమి? నా మాటిను. ఆటికి పొయ్యే మాట చెల్లుకో! ఈడ తినేదీ ఆ రెండు ముద్దలే. ఆడ తినేది ఆ రెండు ముద్దలే. దానికింత మందిమి ఆటికే బోవాల్నా? మీ నాయనమ్మకు నే జెప్తా, నువ్వు మాత్రం ఆటికి పొయ్యే పని పెట్టుకోగాక."

వరాలు ఆ మాటకు కోపం తెచ్చుకున్నాడు. "థూ, నీ యవ్వ! నువ్వెప్పుడూ యింతే. ఆడ యేందేందుండాదో నీకు తెల్సునా అని. ఎనెన్ని మగ్గాలాడతా వుండాయేంది లెక్క! కరెంటు మగ్గాలు గూడా వచ్చేసినాయి. నువ్వింకేం మాట్లాడగాక. బిర్న సామాను సర్దు. నాయనమ్మనీ, పిల్లకాయల్నీ తీసుకొని మనం ఆటికే బోవాల. ఎల్నాక నువ్వే అంటావు మంచి పని చేసినావూ అని."

వరాలు భార్య ఇక పైకేం మాట్లాడకుండా లోలోపలే సణుక్కుంది. ఆమె పుట్టినిల్లూ ఆ ఊరివైపే. అయితే అవసరం పడితే సాయం రావడానికి తన తరఫువాళ్లు ఇప్పుడక్కడ ఎవరూ లేరు. అంతా పొట్ట చేత పట్టుకొని ఎప్పుడో చెరో దిక్కూ వెళ్లిపోయారు. వరాలుకి తల్లి లేదు. అతని తండ్రి కంటే ముందే పోయింది. అత్తగారైనా ఉండి ఉంటే ఆమెతో

చెప్పి వరాలు ప్రయత్నం ఆపి ఉండేది. తన అత్తగారు అందరి అత్తగార్లలా కాదు. ప్రతిదానికీ తననే వెనకేసుకొచ్చేది. కేవలం ముసలామె చాదస్తంగా ఏడ్చే మాట పట్టుకొని ఇప్పుడు తన భర్త ఇరవై ఏళ్లుగా అన్నం పెట్టిన ఊరు వదిలి తిరిగిపోతానంటున్నాడు. పోయాక ఏమేం జరుగుతుందో! అక్కడి పరిస్థితులు ఇప్పుడెలా మారిపోయాయో! తల్చుకుంటేనే ఆమెకు బెంగగా వుంది.

వరాలు చివరికి తన మాటే నెగ్గించుకున్నాడు. ముసలామెని, భార్యనీ, ముగ్గురు కొడుకులు, ఒక కూతుర్నీ, ఒక పెళ్ళికాని చెల్లెల్నీ – ఇంత కుటుంబాన్ని బయల్దేరదీసి స్వంత ఊరికి ప్రయాణం కట్టాడు.

స్వంత ఊళ్లో అతనుండడానికి గజం స్థలం కూడా లేదు. కొన్నాళ్లు ఊరి మధ్యనే ఇల్లు అద్దెకు తీసుకుని కాపురం పెట్టాడు. తర్వాత కొన్నాళ్లకే అద్దె కట్టలేని పరిస్థితి వచ్చి పడింది. అప్పుడు పెన్నానది తనలోకి ఆహ్వానించిందతన్ని. నేరుగా పెన్నా నదిలోకి వెళ్లిపోయి చాలామందిలా అక్కడ కొంత స్థలం ఆక్రమించుకుని నాలుగు గుంజలు పాతి కొట్టం వేసుకున్నాడు. ఈ స్థలం ఎందుకు ఆక్రమించుకున్నావని అప్పుడతన్ని ఎవరూ అడగలేదు.

ఆ ఊరికి తిరిగొచ్చిన చాలా రోజులకు గానీ అక్కడ కాపురం చేయడంలో అసలైన సాధకబాధకాలేమిటో అతనికి తెలిసిరాలేదు. ఊళ్లో చేనేత పరిశ్రమ గతంలోకంటే ఇప్పుడు మంచి దశలో ఉంది. అయితే పోటీ ఎక్కువగా ఉంది. మధ్య దళారుల బెడద కూడా ఎక్కువగా ఉంది. తాము నేసిన బట్టలు తామే అమ్ముకోడానికి లేదు. వేరే ఎవరి ద్వారానో అవి మార్కెట్లోకి వెళ్ళాలి. గతంలో తమకు తెలిసిన వాళ్లు ఇంకా ఉన్నారు. అయితే వాళ్ళు మాటలు చెప్పినంత తేలిగ్గా చేతల్లో సాయం చేయరు. ఏం చేయబోయినా అంతా కొత్తగానే వుంది. ఎలాగోలా ఊళ్లో ఇంకా పరిచయాలు పెరిగేదాకా సర్దుకుపోవల్సిన పరిస్థితి.

వరాలు పెన్నలో స్థలం ఆక్రమించినప్పుడు కూడా అతని భార్య సణిగింది. “అదికాదయ్యా! ఏటికి నీళ్లొస్తే కొంప మునిగిపోదా?” అని.

“యేం మునిగిపోదులే. ఈడంతా మన్తోపాటే యెంత మంది ఇళ్లేసుకోలేదేంటి? వాండ్లకంతా లేని భయం నీకెందుకంట?” అని కసిరాడు వరాలు.

ముసలామెకు మాత్రం తమ ఊరికి తాము తిరిగి రావడం గొప్ప సంతోషంగా ఉంది. దిగులు పూర్తిగా మర్చిపోయింది. ఇదివరకటి కంటే ఉల్లాసంగా తయారైంది. చావు కూడా ఆమెని చూసి దూరంగా పారిపోయిందా అనిపిస్తుంది. ఈ లెక్కన ముసలామె నూరేళ్లకు పైగానే బతికేలా ఉంది.

పిల్లలకు కూడా మంచి హుషారుగా ఉంది. కొత్త చోటు. కొత్త మొహాలు. కొత్త స్థలం. అంతా వాళ్ళకు అద్భుతంగా కొత్త ప్రపంచంలోకి వచ్చినట్టుగా ఉంది. తాము ఏటి ఒడ్డు నుండడం ఇంకా సరదా కలిగించింది. సాయంత్రమైతే చాలు, వాళ్ళు ఏట్లోకి పరిగెడుతున్నారు. చీకటి పడేదాకా అలుపు లేకుండా ఇసుకలో ఆడుకుంటున్నారు.

తనవాళ్ల మొహాల్లో నవ్వు చూసి వరాలు తన కష్టాలన్నీ మర్చిపోయాడు. తను కూడా ఉల్లాసంగా పనిచేస్తున్నాడు. క్రమంగా మార్కెట్ కూడా అతనికి పట్టుబడనారంభించింది. కొన్నాళ్లకి ఆర్థిక పరిస్థితి కూడా చక్కబడింది. ముఖ్యంగా ఇంటికి అద్దె కట్టాల్సిన అవసరం లేకపోవడం చాలా ఊరట కలిగించింది. చుట్టుపక్కల వాళ్లు కొందరు కొట్టాలు పీకేసి ఇప్పుడు సిమెంటు రేకుల ఇళ్లు కట్టుకుంటున్నారు. తను కూడా ఎప్పుడో ఆ పని చేయాలి. అయితే అందుకు ఇంకా కొన్నాళ్లుంది ఇంకా డబ్బు సంపాయించాలి. పనిలోపడి అతను ప్రపంచాన్నే మర్చిపోయాడు. అతని భార్య కూడా ఇప్పుడు సణగడం లేదు. ఆమె కూడా ఇప్పుడు నవ్వు మొహంతో కనిపించింది. వరాలుకెంతో హాయి నిచ్చింది. అయితే వరాలు భార్యకు మనసులో మాత్రం ఇంకా భయంగానే వుంది. ఎప్పటికైనా ఏరు పొంగితే? వాళ్లక్కడ చేరిన మూడేళ్ల వరకు ఏరు పొంగలేదు.

ఏరు పొంగిన రోజున వరాలు భార్య ఆందోళనకు అంతేలేదు. ఏరు కొంచె ప్రాణం పోసుకోవడం ప్రారంభించగానే ఆమె కంగారు కంగారుగా చుట్టుపక్కల ఇళ్లన్నీ తిరిగింది. ఏరు పొంగితే ఏం చేయాలో అందర్నీ సలహా అడిగింది. ఎవరూ ఏరు పొగుతున్నందుకు చింతిస్తున్నట్లు కనబడలేదు. "మరేం పర్వాలేదు ఏరు పొంగినా యేం కాదు," అనే సమాధానాలు వినిపించాయి. అయినా ఆమెకు భయం తగ్గలేదు. ఇంటికొచ్చాక భర్తకు తన భయం గురించి చెప్పుకుంది.

వరాలు గట్టిగా నవ్వాడు. "ఒసే ఎర్రిదానా! ఏరు పొంగితే మన ఇల్లేనేందే పొయ్యేది? అందరి ఇళ్లూ పోతాయి. ఎవరికీ లేని భయం నీకొక్కదానికీ ఎందుకు? పిల్లకాయలు ఏరు చూస్తామని గోల పెడ్తుండారు. పోదాం పా," అన్నాడు.

వరాలు భార్య తను రాలేనంది. అయినా పిల్లలూ, అతనూ కలిసి ఆమెను లాక్కెళ్లారు. ముసలామె కూడా వచ్చింది.

ఏటిని చూడ్డానికి వచ్చిన జనం కిక్కిరిసిపోయారు. ఏరొచ్చినప్పుడు ఎప్పుడూ ఊళ్ళో ఒక పండగ. ఏదో పెద్ద జాతర జరిగినట్టే. పిల్లల్ని వెంటేసుకుని ఊళ్లో ప్రతి ఒక్కరూ ఏరు చూడ్డానికి వస్తారు. పిల్లలకు బొమ్మలూ, మిఠాయిలూ అమ్మేవాళ్లు, బిచ్చగాళ్లు కూడా జాతరగానే అక్కడ చేరతారు.

వాటిని చూస్తూనే వరాలు పిల్లలు కేరింతలు పెట్టారు. పెళ్లీడొచ్చిన వరాలు చెల్లెలు పసిపిల్లలాగ వాళ్లతో కలిసిపోయింది.

"ఎగుర్లాడాకండిరా, పడతారు!" హెచ్చరించింది వరాలు భార్య.

అయినా పిల్లలు విన్లేదు. "అమ్మా నువ్వూ రా! అయ్యా నాయనా, నువ్వూ రా!" అనరుస్తూ నీటి అంచులదాకా వెళ్లి నీటిలో కాళ్ళు తపతపలాడిస్తూ గెంతారు.

"ఆఁ ఆఁ పడతారు!" కంగారు పడింది వరాలు భార్య.

పిల్లలు అప్పటికే నీళ్లల్లో ముందుకెళ్ళిపోయారు.

పెన్న హెూరుమంటూ పారుతోంది. ఆ పిల్లలకు తెలీదు ఇంకా ముందుకు వెళ్ళారంటే, ఆ హెూరుకు కాళ్లు తేలిపోతాయి, నీటిలో పడ్డారంటే పోటు మీదున్న ఏరు ఈడ్చుకెళ్ళిపోతుంది. వరాలుకు ఆ సంగతి బాగా తెలుసు. తన పిల్లప్పుడు తనూ అలా ఏట్లో గెంతులు వేసినవాడే.

ఏరొచ్చినప్పుడల్లా ఎవరో ఒకరు అందులో కొట్టుకుపోతూనే ఉంటారు. విషయం తెలిసినవాడు కనుక నీళ్లల్లోకి వెళ్లి తలా ఒకటి తగల్నిచ్చి పిల్లల్ని ఇవతలకి లాక్కొచ్చాడు. అప్పుడు గానీ పిల్లల తల్లి ఆరాటం తగ్గలేదు. పిల్లలు సరదా పాడవడంతో బుంగమూతి పెట్టుకు చూస్తున్నారు. అది గమనించి వరాలు వాళ్ళకు మిఠాయిలు ఇప్పించాడు. దాంతో పిల్లల మొహాలు మళ్లీ వికసించాయి. నీళ్లకు బాగా ఇవతలనే నిలబడి గంతులు వేస్తున్నారు.

ఏటిని చూసి ముసలామె చాలా సంబరపడింది. "ఎంతకాలమాయె ఏరు చూసి!" అంటూ జ్ఞాపకాలు నెమరువేసుకుంది.

అందరూ అలసిపోయి ఇంటికి తిరిగొచ్చారు. అందరి మొహాల్లో ఒక విధమైన సంతృప్తిల్లో అయితే వరాలు భార్య మొహంలో మాత్రం తీవ్రమైన ఆందోళన.

"ఎప్పుడో ఏరు పొంగుతుంది, అప్పుడు మనందరం కొట్టుకొని పోతాం."

పిల్లలు ఉలిక్కిపడ్డారు. వరాలు ఆమె మొహంలోకి చూశాడు. ఆమె మంచంమీద కూర్చొనుంది. ఆమె కళ్ళు శూన్యంలోకి చూస్తున్నట్టుగా ఉన్నాయి. ఆమె కళ్ళల్లో దీపం వెలుతురు ప్రతిఫలిస్తోంది.

ఏమనుకున్నాడో ఏమో వరాలు దగ్గరకొచ్చి ఆమె భుజంమీద చెయ్యి వేశాడు. ఆమె కళ్ళు అతని వైపు తిరిగాయి.

"అందరం కొట్టుకొని పోతాం."

"ఛా! ఏం కాదులే, భయపడకు, భయపడకు", వరాలు ఆమె భుజం తట్టాడు.

అప్రయత్నంగా ఎందుకో అతను కూడా గుమ్మంలోంచి ఏటివైపు చూశాడు. అక్కడనుంచి ఏరు కనిపించడం లేదు. అయితే దాని హెూరు మాత్రం చెవులకు గంభీరంగా వినిపిస్తూనే ఉంది.

ఆ ఏడు ఏటి పొంగు తగ్గేవరకు వరాలు భార్య చూపులు దానివైపే వున్నాయి. అయితే ఏరు మాత్రం తమ ఇంటి దరిదాపులకు కూడా రాలేదు. ఎంతో క్రమశిక్షణ కలిగిన సైనిక బృందంలా ఆ నీళ్లన్నీ ఏకాగ్రతతో ముందుకే సాగిపోయాయిగాని పక్కలకు దురాక్రమణ చేయలేదు.

రోజులు గడిచిపోతున్నాయి. వరాలు పని ఇప్పుడు మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంది. ముందుగా అనుకున్నట్టే కొట్టం తీసేసి సిమెంటు రేకుల షెడ్డు వేసుకున్నాడు. ఇంటికి కరెంటు కూడా వచ్చింది. దేవుడు మేలు చేస్తే త్వరలో చెల్లెలి పెళ్లి చేసేయాలని ఉన్నాడు.

ఒకరోజు వరాలు ఇంట్లో లేడు. అతని భార్య వంట చేసుకుంటోంది. మరదలు వదినకు సాయం చేస్తోంది. ముసలామె మూలన పడుకుని కునుకు తీస్తోంది. పిల్లలు వీధి బడికెళ్లారు.

అనుకోకుండా ఎవరో తలుపు కొట్టిన చప్పుడయ్యింది.

"ఎవరు?" కేకేసింది వరాలు భార్య.

ఎవరూ సమాధానం చెప్పలేదు.

ఆమె పొయ్యి ముందు నుంచి లేచి వెళ్లి తలుపు తీసింది. తలుపు తీస్తూనే ఆమె గుండె గుభేలుమంది. పెద్ద పెద్ద మీసాలు పెట్టుకుని చూడ్డానికి కఠోరంగా కనిపిస్తున్న నలుగురైదుగురు వ్యక్తులు బయట నిలబడి ఉన్నారు. వాళ్లలో ఒకతని దగ్గర పొడుగాటి తుపాకీ కూడా ఉంది.

"ఇది ఎవరిల్లు?" అందరికంటే ముందున్నతను కరుగ్గా అడిగాడు. తాగినవాడికి మల్లే అతని కళ్లు ఎర్రగా ఉన్నాయి.

వరాలు భార్య గుడ్లప్పగించి చూసింది. అంతేగాని ఆమె గొంతు మాత్రం పెగల్లేదు. అతని కళ్లు చూసి ముందే బెదిరిపోయిందామె.

"ఎవరిల్లు?" గద్దించాడతను.

"వరాలిల్లన్నా! వరాలిల్లు," తడబాటుగా జవాబిచ్చింది.

"వరాలా? ఏం చేస్తాడు?"

"మగ్గాలు నేస్తామన్నా!"

"మగ్గాలా! సర్సర్లే! రేపటికంతా ఈ ఇల్లు ఖాళీ అయిపోవాల. ఈ స్థలం మాది. తెల్సిందా? రేపటికి ఇల్లు ఖాళీ చేయకపోతే ఎవరూ ఉండరు. జాగ్రత్త!" ఆ మాటనేసి మిగతావాళ్లని వెంటేసుకుని అక్కడ్నుంచి వెళ్లిపోయాడతను.

అతను వెళ్లిపోయాక కూడా బొమ్మలా గుమ్మంలోనే నిలబడి ఉండిపోయిందామె. ఆమె తల తిరుగుతోంది. అలాంటి సంఘటన జీవితంలో ఆమె కెప్పుడూ ఎదురుకాలేదు. మరదలు వెనక నుంచి వచ్చి పట్టుకోకుంటే పడిపోయేదే.

వరాలు ఇంటికి తిరిగొచ్చేదాకా ఆమె గుండె గుండెలో లేదు. కాలు గాలిన పిల్లిలా ఇల్లంతా తిరుగుతోంది. వరాలు రాగానే వణికిపోతూ అతన్ని పట్టుకుని జరిగిందంతా చెప్పింది.

భార్య చెప్పిందాంట్లో వరాలకు తలా తోకా ఏం కనిపించలేదు. ఎవరొచ్చారంటే తెలీదంటుంది. ఇల్లు ఖాళీ చేయమన్నారంటుంది. వరాలు ఆమె చెప్పిందే పదే పదే పదిసార్లు చెప్పించుకున్నాడు. ఆమె చెప్పింది చాలక చెల్లెలి చేత కూడా చెప్పించుకున్నాడు. ఎవరొచ్చారో ఏమిటో అతనికేమాత్రం అర్థం కాలేదు. వెంటనే ఇంట్లోంచి బయటికి పరిగెత్తాడు.

బయట అప్పటికే ఇసకదిబ్బల్లో కాపురం ఉన్న వాళ్లంతా ఒక సమావేశం లాంటిది ఏర్పాటు చేసుకున్నారు. అక్కడ అతనికి తెలిసిందేమిటంటే బుడ్డారెడ్డి వర్గం వాళ్లు అకస్మాత్తుగా వచ్చి అక్కడివాళ్లందర్నీ ఇల్లు ఖాళీ చేయమని బెదిరించారని.

వరాలు పిల్లప్పటికీ ఇప్పటికీ ఆ ఊరు రాజకీయంగా బాగా మారిపోయింది. ఆనాటి సౌమ్యులైన ఊరిపెద్దలు ఇప్పుడు లేరు. ఇద్దరు పెద్ద రెడ్లు ఊరిని నిలువునా చీల్చారు. ఊళ్ళో ఎవరైనా ఏదో ఒక వర్గానికి చెందక తప్పదు. ఒకటి బుడ్డారెడ్డి వర్గం. ఆ నియోజక వర్గం ఎమ్మెల్యేకి బాగా సన్నిహితుడతను. మరొకటి సామంతరెడ్డి వర్గం. ఈ రెండు వర్గాల మధ్య ఎప్పుడూ ఘర్షణ చెలరేగుతూ ఉంటుంది. అదపాదడపా హత్యలు కూడా జరుగుతూ ఉంటాయి.

బెదిరించిన వాళ్లు బుడ్డారెడ్డి వర్గం వాళ్లు కాబట్టి ఇసుక దిబ్బల కాపరస్తులకు మిగిలిన మార్గం ఒక్కటే. సామంతరెడ్డి దగ్గరికి వెళ్లడం. వాళ్లు అదే చేశారు.

సామంతరెడ్డి వాళ్ళు చెప్పినదంతా ఓపిగ్గా విన్నాడు. తర్వాత చిరునవ్వులు చిందించాడు. "బుడ్డారెడ్డి మిమ్మలందరిన్నీ ఖాళీ చేయించి ఆ స్థలంలో ఫ్యాక్టరీ కట్టాలని ఉన్నాడు. అది మనమెందుకు సాగనిస్తాము? ఫ్యాక్టరీ కావాల్నంటే ఇంకో చోటికి పోయి కట్టుకుంటాడు. మీరు మాత్రం ఇళ్లు ఖాళీ చేయొద్దు. ఎవరొస్తారో నేను చూసుకుంటాను," అని హామీ ఇచ్చాడు.

గుంపులోంచి ఒక పెద్ద మనిషి ముందు కొచ్చి – "అన్నా! మేం గొడవలు పడేటోల్లం కాదు, బీదోల్లం. నువ్వు దయచేసి మాకు ఇండ్లకు పట్టాలిప్పించన్నా నీ పేరు చెప్పుకొని బతుకుతాం. ఆ తర్వాత మా జోలికి ఎవరూ రారు!" అన్నాడు.

రెడ్డికి ఆ మాట బాగా నచ్చింది. "సరే! బుడ్డారెడ్డి ఎమ్మెల్యే మనిషి అయితే అయినాడు. మనం మినిస్టర్ దగ్గరికి పోదాం. మీ అందరికీ డీ ఫారాలు నేనిప్పిస్తాను. మరింక వచ్చే ఎన్నికల్లో నేనే ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నాను. మీ ఓట్లన్నీ నాకు వేస్తారా?" అనడిగాడు.

"అయ్యో! ఆ మాట మల్లా అడగాల్నా అన్నా? మేం వేయడం కాదు, ఇంకా వేరేవాండ్ల చేత కూడా వేయిస్తాం. నువ్వు ఎమ్మెల్యే వైతావన్నా. యాభై వేల మెజారిటీతో ఎమ్మెల్యేవౌతావ్".

సామంతరెడ్డి అన్నమాట ప్రకారమే వాళ్లందరికీ డీఫారాలు ఇప్పించగలిగాడు. బుడ్డారెడ్డి వర్గం వాళ్ళ మొహాలు వెలవెలబోయాయి. బుడ్డారెడ్డి ఎమ్మెల్యే మనిషి అయినప్పటికీ సామంతరెడ్డికి మంత్రివర్గం అండదండలున్నాయి. కాబట్టి అన్ని విషయాల్లోనూ మాట నెగ్గించుకు రాగలుగుతున్నాడు. ఎప్పుడో ఆ వర్గభేదాలు ప్రళయంగా మారడానికి సిద్ధంగా వున్నాయి.

సామంతరెడ్డి అందరికీ డీ ఫారాలు పంచిన రోజు అంతా అట్టహాసంగా వెళ్ళి అతనికి పూలదండలు వేశారు. వరాలు కూడా ఒక పెద్ద పూలదండ వేశాడు. అతని కళ్ళకు సామంతరెడ్డి దేవుడిలా కనిపించాడు. ఆ తర్వాత ఇల్లు ఖాళీ చేయమని బెదిరించడానికి ఎవరూ రాలేదు.

ఎన్నికలు ఇంకా చాలా దూరం ఉన్నాయి. ఈ లోగా బుడ్డారెడ్డివర్గం వాళ్ళకీ, సామంతరెడ్డికీ ఊరిపెత్తనం కోసం వైషమ్యం నానాటికీ పెరిగిపోతోంది. అంతర్గతంగా వాళ్ళ మధ్య రగుల్తున్న త్రేతాగ్ని సెగలు వరాలునింకా అంటలేదు. అతని పరిస్థితి ఇప్పుడు బావుంది. ఆనాటి దుస్సంఘటనని పీడకలగా ఎప్పుడో మర్చిపోయాడు. డీ ఫారం చేతికి రావడంతో ఇక దేనికీ భయపడనవసరం లేదనుకున్నాడు.

బుడ్డారెడ్డి ఫ్యాక్టరీ మాత్రం కట్టగలిగాడు. ముందుగా అనుకున్న స్థలానికి దూరంగా ఏటికి కొంచెం దగ్గరగా వెలిసిందా ఫ్యాక్టరీ. శనగనూనె ఆడించే మిల్లది.

ఫ్యాక్టరీ కట్టిన మరుసటేడు ఏరు మళ్ళీ పొంగింది. పోయిన సారికంటే ఉధృతంగా పొంగింది. నీళ్ళు దాదాపు ఫ్యాక్టరీ గోడ అంచుదాకా వచ్చాయి. అప్పటికి వరాలు పిల్లలు కొంచెం పెద్దవాళ్ళయ్యారు. ఇప్పుడు హైస్కూలుకు వెళుతున్నారు. వరాలు చెల్లెలికి కూడా సంబంధం చూశాడు. ముహూర్తం ఇంకా నిర్ణయించుకోలేదు.

ఏరు పొంగిన సందడి ఊళ్లో మళ్లీ ప్రారంభమైపోయింది. ఊళ్లో జనమంతా ఏరు చూడ్డానికి తరలి వస్తున్నారు. ఇసుక దిబ్బలకి కొంచెం దూరంలో ఏటి ఒడ్డునే మామిడి తోట ఒకటుంది. అది సామంతరెడ్డి వర్గం వాళ్ళది. ఆ తోట యజమాని సామంతరెడ్డికి కుడిభుజం లాంటివాడు. ఏరు పొంగినప్పుడట్లా ఆ తోట యజమాని కొడుకు స్నేహితులందరితో కలిసి మందు పార్టీ చేసుకుంటాడు. ఆ స్నేహితులంరదిలోకి ముఖ్యుడు సాక్షాత్తు సామంతరెడ్డి కొడుకు శేఖర్.

ఎప్పట్లాగే ఆ ఏడు కూడా ఏరు పొంగిన సందర్భంలో మందు పార్టీ జరిగింది. స్నేహితులందరూ చిత్తుగా తాగేశారు. తాగిన మైకంలో శేఖర్‌కీ, తోట యజమాని కొడుక్కి కాలేజీ బ్యూటీ ఎవరనే విషయంలో అనుకోకుండా వాగ్వివాదం ప్రారంభమైపోయింది.

"రేయ్! అయితే నా రజని బాగలేదంటావురా! నీ సరళే కర్రి మొహంది."

"నా సరళని కర్రి మొహం అంటావురా! చూడు నిన్నేం చేస్తానో!" అంటూ తోట యజమాని కొడుకు రివాల్వర్ చేతిలోకి తీసుకున్నాడు. రాజకీయ నాయకుల కొడుకుల దగ్గర ఎప్పుడూ ఒక రివాల్వర్ ఉండడం ఈ రోజుల్లో ఫ్యాషన్. అందులోనూ అతను తీసుకున్న రివాల్వర్ నిండుగా ఉంది. లైసెన్సు లేని రివాల్వర్ అది.

అతను రివాల్వర్ తీయడం చూసి శేఖర్ కూడా కోపంతో తన రివాల్వర్ బయటికి తీయబోయాడు. అయితే ఆలోగా అతని స్నేహితుడి చేతుల్లో రివాల్వర్ పేలడం, గుండు సూటిగా వెళ్ళి శేఖర్ గుండెలో గుచ్చుకోవడం జరిగిపోయినాయి.

ప్రాణాలు పోయి కట్టెలా తన కాళ్ళ దగ్గర విరుచుకుపడ్డ శేఖర్ని చూశాకగానీ ఆ స్నేహితుడి తలకెక్కిన మత్తు దిగిరాలేదు. తాగిన మైకంలో ఏం చేశాడో అర్థం చేసుకునేసరికి అతని గుడ్లు భయంతో వెళ్ళుకొచ్చేశాయి. కాళ్లూ చేతులూ వణకనారంభించాయి. అప్పటికే అతని మిగతా స్నేహితుల మత్తు కూడా దిగిపోయింది. "ఒరే! ఏందిరా! ఏం చేసినావురా!' గజగజా వణికిపోతూ అంటున్నారు వాళ్లు.

అతను వణికిపోతూనే రివాల్వర్ వాళ్లందరివైపూ పిచ్చివాడిలా తిప్పాడు. "హుష్! ఎవ్వరూ మాట్లాడకండి. ఈ విషయం ఎక్కడైనా బయట చెప్పినారా, చంపేస్తా! పట్టండి, శవాన్ని పట్టండి!" బెదిరించాడు.

ఆ అర్ధరాత్రి నుంచే వానపడ్డం ప్రారంభమైంది. ఎప్పుడో గాని పడని ఉధృతమైన వాన. ఆ రాత్రంతా పడుతూనే వుంది. ఆ మర్నాడు వాన తగ్గే సమయానికి ఇసుక దిబ్బల్లో బుడ్డారెడ్డి కట్టిన ఫ్యాక్టరీ వెనకే బురదలో తేలుతూ ఒక శవం కనిపించింది. ఆ శవం ఎవరిదో తెలుస్తూనే ఊరంతా అలజడి ప్రారంభమైపోయింది.

శేఖర్ శవం దొరికింది బుడ్డారెడ్డి ఫ్యాక్టరీ దగ్గరే కాబట్టి ఆ హత్య చేయించింది బుడ్డారెడ్డే ననే అభిప్రాయం ఊరంతటికీ కలిగింది. ఊరి జనం గుండెలు అరచేత పట్టుకున్నారు. వాన వల్ల పోలీసు కుక్కలు వాసన పసిగట్టడంలో విఫలమయ్యాయి.

కొడుకు శవాన్ని చూస్తూనే సామంతరెడ్డి- నిలువెత్తు మనిషి - ఒక్కసారిగా కూలబడ్డాడు. అంతలోకే పళ్లు పటపటా కొరుకుతూ మహోద్రేకంతో లేచి నిలబడిపోయాడు. "పొండి, నా కొడుకుల్ని నాశనం చేయండి. బుడ్డారెడ్డి మనుషులు ఎక్కడ కనిపిస్తే అక్కడ అడ్డంగా నరికిపారేయండి!" అంటూ ఆదేశమిచ్చేశాడు.

ఇంకేముంది, ఊళ్ళో గగ్గోలు చెలరేగిపోయింది. శేఖర్నెవరో చంపేశారన్న వార్త విన్న వెంటనే బుడ్డారెడ్డి మనుషులు ఇళ్లకు తాళాలు వేసుకుని అప్పటికే పరారీ అయిపోయారు. మిగిలింది ఊరి జనం మాత్రమే. బజార్లోని ప్రతి అంగడి షట్టరూ దించేశారు. సామంతరెడ్డి మనుషులు ఊరిమీద పడ్డారు. బుడ్డారెడ్డి వర్గం వాళ్ళ అంగడని అనిపించిన చోటల్లా తలుపులు పగలగొట్టి లోపలికి దూరారు. పెద్ద పెద్ద జవుళీ షాపులు తగలబడిపోయాయి. టీ.వీలు. టేప్ రికార్డర్లు ఎవరు పడితే వాళ్లు దోచుకున్నారు. ఒక సినిమా హాలు కాల్చేశారు. స్వయంగా బుడ్డారెడ్డి ఇంటికి సమీపంలోనే నాటు బాంబులు పేలాయి. ఎవరికీ దెబ్బలు తగల్లేదు. కొన్ని చోట్ల హత్యాప్రయత్నాలు జరిగాయి.

ఇసక దిబ్బల్లో బుడ్డారెడ్డి ఫ్యాక్టరీ కూడా తగలబడిపోయింది. మేనేజర్తో సహా ఫ్యాక్టరీలో పనిచేస్తున్నవాళ్ళు పారిపోయారు. అందినవాళ్ళు అందినట్టుగా కేన్లకు కేన్లు వేరుశెనగ నూనె ఇళ్ళకు పట్టుకెళ్లిపోయారు. అలాంటి వాళ్లలో వరాలు చెల్లెలు కూడా ఉంది. ఆమె రెండు కేన్లు పట్టుకొచ్చింది. తమాషా చూడ్డానికి వెళ్లినట్టే వెళ్ళి ఆ కేన్లు పట్టుకొచ్చిందామె.

వరాలు భార్య అది చూసింది.

"పాడు ముండా! అవెందుకు తెచ్చినావే!" అంది వణికిపోతూ.

"ఫో, వదినా! అందరూ లారీల్లో వేసి కొండబోతాన్నారు. నేను రెండు కేన్లు తెచ్చినానంతే!" నవ్వుతూ అందామె.

ముసలామె కూడా మనవరాలికే సపోర్టిచ్చింది. "పిల్లదాన్ని ఏమనాకే! సామంతరెడ్డి మనకోసం ఎంత చేసినాడేంది లెక్క. ఆ నా బట్ట బుడ్డారెడ్డికి కావాల్సిందే ఇదంతా! వరాలుకి కూడా ఏం చెప్పాకు!" అంటూ ఆంక్ష పెట్టింది.

ఆ సాయంకాలమే వరాలు ఇంటిముందు పోలీసు జీపు ఆగింది. ఫ్యాక్టరీ కాల్చిన వాళ్ల గురించి ఆరాలు తీస్తూ వస్తున్నారు వాళ్లు.

"ఏయ్! ఎవరు లోపల? బయటకు రండి?"

వరాలు ఇంట్లోంచి బయటికి వచ్చి ఎస్సైకి నమస్కారం పెట్టాడు.

"నమస్కారంసార్!"

"రేయ్ ఎవర్రా ఫ్యాక్టరీ కాల్చింది."

"నాకు తెలీదు సార్!"

"పిలు, ఇంట్లో ఆడోల్లని బయటికి పిలు!"

ఆడవాళ్ళు బిక్కు బిక్కుమంటూ బయటికొచ్చారు.

"మర్యాదగా చెప్పండి. ఫ్యాక్టరీ నుంచి నూనె తెచ్చారా? లేదా?"

ఆ ప్రశ్న వింటూనే వరాలు భార్య బిర్రబిగుసుకుపోయింది.

"మేమా! ఎవరు సార్ చెప్పింది? నూనె ఎవరు తీసుకెళ్లారో మాకు తెల్వనే తెల్వదు!" అన్నాడు వరాలు.

యస్సై వరాలు కళ్లల్లోకి సూటిగా చూశాడు. ఆ కళ్ళల్లో అతనికి నిజాయితీ కన్పించింది. దాంతో కొంచెం తగ్గి తిరిగి వెళ్ళిపోవడానికి సిద్ధమైనవాడల్లా ఎందుకో వరాలు భార్య వంక చూశాడు. దాంతో ఆమె మరింత కంగారు పడిపోయింది. ఆమె వాలకం యస్సైకి అనుమానం కలిగించింది.

"నిజం చెప్పండి. ఇంట్లో నూనె కేన్లు కనిపించాయా మీ చర్మం వొల్చేస్తాను."

ఆ బెదిరింపుతో అసలు దొంగ బయటపడిపోయింది. వరాలు చెల్లెలు బిత్తర చూపులు చూస్తూ, "మేం తెచ్చింది రెండు కేన్లే సార్! అందరూ లారీలు లారీలు కొండబోయినారు!" అనేసింది.

వరాలు చివాల్న తల తిప్పి చెల్లెలి వంక నమ్మ శక్యం కానట్టు చూశాడు. వెనకనుంచి యస్సై అతని మెడ పట్టుకున్నాడు. "దొంగ నా కొడకా! అబద్ధాలు చెబ్తావా?"

"సార్ నిజంగానే తప్పు చేయలేదు సార్! నాకేం తెలియదు!"

"ఛుప్! నోర్ముయ్! పద జీపెక్కు!"

ఊళ్ళో జరిగిన విధ్వంసకాండకు పోలీసులు మొత్తం నలభైమందిని అరెస్టు చేశారు. వాళ్ళల్లో వరాలొకడు. పది కేసులు అతని మీద రిజిస్టరయ్యాయి. దొమ్మీ, దోపిడీ, దహనకాండ, హత్యా ప్రయత్నం – రెండు కేన్ల వంట నూనెకు బదులుగా ఇన్ని కేసులు అతనిమీద బనాయించారు.

కేసు విచారణ పేరుతో వరాలు నెలరోజులు జైల్లో పడున్నాడు. పోలీసులు అతని భార్యను కూడా అతన్ని చూడనివ్వలేదు. సామంతరెడ్డి తమకు డీఫారాలు ఇప్పించడమే

ఇప్పుడతనికి ప్రాణంమీదికి తెచ్చింది. ఆ సహాయం పొందినందుకు అతన్ని పోలీసులు సామంతరెడ్డి మనిషి కిందే జమ కట్టేశారు.

సామంతరెడ్డి ఏర్పాటు చేసిన లాయరు ముద్దాయిలందర్నీ బెయిలుమీద విడిపించాడు. జైలు నుంచి వరాలు నేరుగా ఇంటికి వెళ్ళలేదు. సామంతరెడ్డి దగ్గరికి వెళ్ళాడు. "అన్నా! నేనే తప్పు చేయలేదన్నా! పోలీసులు నామీద యేందేందో కేసులు పెట్టినారన్నా!" అంటూ భోరుమని ఏడ్చేశాడు.

సామంతరెడ్డి అతని భుజం తట్టాడు.

"నీ పేరు?"

"వరాలన్నా వరాలు."

"నీకేం భయం లేదు, వరాలూ! పోలీసులు నీ మీదనే కాదు, మా వాళ్ళింకా ముప్పై తొమ్మిది మంది మీద కేసులు బనాయించినారు. నా మాటిను, ప్రతి వాయిదాకి తప్పకుండా వెళ్ళు! నిన్ను విడిపించే పూచీ నాది. సరేనా?"

"ఏమోన్నా! నిన్నే నమ్ముకుండేటోణ్ణి!।" అని చెప్పి బరువెక్కిన మనసుతో వరాలు ఇంటికొచ్చాడు.

ఇంటి పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. పిల్లలు కూడా బిక్కచచ్చిపోయున్నారు. ఇంట్లో పొయ్యి వెలిగించి రెండు రోజులైంది. వరాల్ని చూడగానే ఇంటిల్లిపాదీ అతన్ని చుట్టుకుని భోరుమన్నారు.

సామంతరెడ్డి సలహా ప్రకారమే వరాలు ప్రతి వాయిదాకూ కోర్టుకు హాజరవుతున్నాడు. అతనిమీద కేసు కొట్టేస్తారని లాయరు హామీ ఇస్తున్నాడు.

అది అలా ఉండగా ఒక రోజు బుడ్డారెడ్డికి బాగా కావాల్సిన వ్యక్తి ఇంటిమీద సామంతరెడ్డి మనుషులు దాడి చేశారు. ఆ మనిషి ఎలాగో ప్రాణాల్తో బయటపడ్డారు.

అది జరిగిన మర్నాడే వరాలు ఇంటికో పోలీసు కానిస్టేబుల్ వచ్చాడు. "వరాలు నువ్వే కదా! పోలీసు స్టేషన్‌కి పద."

"నేనేం చేశాను?" అన్నాడు వరాలు.

"అదంతా నాకు తెలీదు. యస్సై నిన్ను పిల్చుకోని రమ్మన్నాడు."

వరాలు పోలీసు స్టేషన్‌కే వెళ్లడానికి నిరాకరించాడు.

"నేను రాను."

"నీ ఇష్టం. తర్వాత బాధపడతావ్?"

“ఈసారి నా మీదేం కేసు పెట్టబోతావున్నారో నాకు తెల్సు. తప్పు చేసినోల్లని పట్టుకోండయ్యా!”

“మేం పట్టుకునేదేంది? సామంతరెడ్డే నీ పేరు రాసుకోమని చెప్పినాడు.”

“సామంతరెడ్డా?!” వరాలు నోరు తెరిచాడు.

“మరేందనుకుంటావుండావు? రాజకీయాల్లో అయ్యి మామూలే. చేసేటోల్లు వేరే ఉంటారు. ఫలానా వాళ్ల పేర్లు రాసుకోమని నాయకులే చెప్తారు. నువ్వింకా పిచ్చోడివి. నీకేం తెలిసినట్టు లేదు.”

వరాలు నిర్ఘాంతపోయి వింటున్నాడు.

కానిస్టేబుల్ విసుక్కున్నాడు. “వస్తే రా! లేదంటే ఆ మాట యస్సైతో పోయి చెప్తాను. ఆ తర్వాత యస్సయ్యే వచ్చి నిన్ను తన్ని యీడ్చుకొని బోతాడు.”

వరాలు నెమ్మదిగా తేరుకొని “నేను రాను!” అన్నాడు అస్పష్టంగా.

“నీ ఇష్టం,” అని కానిస్టేబుల్ సైకిలెక్కి వెళ్లిపోయాడు.

వరాలు నిద్రలో నడుస్తున్నవాడిలా ఇంట్లోకి వెళ్లాడు. అక్కడ జరిగిన సంభాషణంతా అతని భార్య వింటూనే వుంది. “ఏరు పొంగుతాదని చెప్పినానా! అందరం కొట్టుకొని పోతాం!” అందామె మగతగా.

వరాలు ఆమె మాటలు వినిపించుకోలేదు. నేరుగా వెళ్లి ముసలామె ముందు కూలబడ్డాడు. “నాయనమ్మా! నీ కట్టె ఈడ కాలదు నాయనమ్మా! ఇంకో చోటికి తీస్కపోతా రా!” అన్నాడామె చేతులు పట్టుకుని.

ఆ వయసులో కూడా ముసలామె కళ్లలో ఇంకా కన్నీళ్లు మిగిలే ఉన్నాయి.

వరాలు చెల్లెలి దగ్గరికి వెళ్లాడు. “నీ పెళ్లి కూడా ఇక్కడ జరగదమ్మా! యాడ్నించి వచ్చినామో ఆటికే పోదాం, పద!”

అతని భుజం మీద నెమ్మదిగా ఒక చెయ్యి పడింది. వెనక్కి తిరిగి చూశాడు. భార్య. ఆమె కళ్ళల్లోంచి కన్నీళ్ళు జలజలా రాలిపోతున్నాయి.

పిల్లలు జాలిగా వాళ్లిద్దరి దగ్గరా చేరారు.

వరాలు ఇల్లూ, వాకిలి వదిలేసి వెళ్లిపోయిన విషయం సామంతరెడ్డికి ఆలస్యంగా తెలిసింది.

“యాడికి పోయినాడ్రా వాడు?”

“ఏమోన్నా! ఎవరికీ చెప్పనేల్యా!” రాత్రికి రాత్రి పరారీ అయిపోయినాడు.

“నా కొడుకు చంపినాడు గదరా! బెయిలుమీంద వాన్ని విడిపించడం తప్పైపాయ. ఇప్పుడు వాని బదులుగా వాయిదా కెవడు బోతాడ్రా?”

"నువ్వు చెప్పన్నా!"

"నన్నడుగుతావేందిరా ఎర్రినాకొడకా! ఎవడ్నో ఒకడ్ని నువ్వే చూడు!"

"మేజిస్ట్రేటు కనుక్కోడా అన్నా?"

"నలభైమందిలో ఒకడు మారిపోతే నేనే కనుక్కోలేను. మేజిస్ట్రేటు కేమన్నా మూడో కన్నుందా? పోరా నా కొడకా! ఎవర్నో ఒకణ్ణి చూడు!"

ఆ ఏడు అలా పొంగిన పెన్న నెమ్మదిగా ఉపశమించింది. మళ్ళీ కొంతకాలం దానికి సుషుప్తి. మూడేళ్లకో నాలుగేళ్లకో మళ్లీ పొంగుతుంది. మళ్లీ కొన్ని కథలు దాని వరదలో కొట్టుకుపోతాయి.

మరోసారి.

మరో రోజు.

అంతవరకూ ఆ ఊరి జనం పెన్నానది పొంగుకోసం ఎదురు చూస్తూ ఉంటారు.

*ఆంధ్రప్రభ, సచిత్రవారపత్రిక, ఏప్రిల్ 1995*

# పేదవాడి దీపావళి

దీపావళి టపాకాయలు అట్టహాసంగా పేలుతున్నాయి.

ఎవరో గొప్పింటి పిల్లలు సరాలకు సరాలు పెట్టి కాలుస్తున్నారు. మరొకవైపు కాకరపువ్వొత్తులూ చిచ్చుబుడ్లూ, భూచక్రాలూ, విష్ణు చక్రాలు – దేవలోకంలోని ఆనందమంతా ఆ పిల్లల మొహాలపైనే తాండవిస్తోంది.

ఆ రోజే దీపావళి. అమావాస్య రాత్రి. ఎప్పుడూ ఆకాశంలో కనిపించిగానీ పిల్లల్ని ఆనందపరచలేని చందమామ ఆ రోజు ఎవరికీ కనిపించకుండా పోయి ఆనందపరిచే పండుగ. పసిపిల్లల మొహాల్లో చిరుదివ్వెలు వెలిగించే పండుగ.

అయితే ఆ పూట ఎందుకో ఒక పేద పిల్లవాడి మొహంలో వెలగాల్సిన దీపాలు వెలగడం లేదు. ఎందుకో ఏమిటీ, పండుగ జరుపుకోవడానికి ఆ పిల్లవాడి దగ్గర ఒక్క టపాకాయ కూడా లేదు.

దీపాలతో వెలిగిపోతున్న వీధుల వెంట ఒంటరిగా తిరుగుతూ మిగతా పిల్లలు జరుపుకుంటున్న పండుగను ఆశ నిండిన కళ్లతో చూస్తున్నాడు వాడు. ఆ కళ్ళ వెనక చిన్న కథ ఒకటుంది. వాడి తండ్రి బజార్లో బస్తాలు మోసి డబ్బు సంపాయిస్తాడు. వాడి తల్లి జబ్బు మనిషి. ఏ పనీ చేయలేదు. వాడికో అక్క వుంది. చింతకాయలు అమ్మి డబ్బు తెస్తుంది. వాళ్ళ సంపాదన ఇంట్లో తిండి గింజలకే సరిపోదు. ఇంక వాడికి టపాకాయలు ఎలా వస్తాయ్?

అంతా కలిపి వాడికి అయిదేళ్లు కూడా సరిగ్గా లేవు. తనకు టపాకాయలెందుకు రావో చూచాయగా అర్థం చేసుకోగల ఇంగిత జ్ఞానం వాడికుంది. అయితే ఈ లోకంలో కొందరు పిల్లలకే టపాకాయలు కాల్చుకోగల అవకాశం ఎందుకుందో తెలుసుకోగల తెలివే లేదు. కనీసం ఒక్కరైనా దగ్గరికి పిలిచి తనతో ఆనందం ఎందుకు పంచుకోరు?

అలా ఒంటరిగా ఒక్క స్నేహితుడు కూడా లేకుండా వాడు వీధుల వెంట తిరుగుతూ సరాలు కాలుస్తున్న ఆ పిల్లల ఇంటి ముందుకొచ్చి నిలబడ్డాడు.

టపాకాయలు పేలుతుంటే కేరింతల్లో లోకమే మరచిన ఆ పిల్లలు వాణ్ణి గమనించనైనా గమనించలేదు.

సరం సర్రున కాలిపోతుంటే టపాకాయలు ఎడతెరిపి లేకుండా పేల్తున్నాయ్. అది చూస్తున్న వాడి గుండెలో చిత్రమైన అనుభూతి నిండిపోయింది. మంత్ర ముగ్ధుడిలా ఆ కాలుతున్న సరంవైపు చూస్తున్నాడు.

చూస్తుండగానే ఒక సరం అయిపోయింది. వాళ్లు మరో సరం పెట్టారు. మళ్లీ మోతలు. మళ్లీ కేరింతలు. వందలా? వేలా? ఎన్ని టపాకాయలు పేలుతున్నాయో లెక్క తెలీదు.

అది చూస్తున్న వాడి మనసులో ఒక చిన్న ఆలోచన ప్రవేశించింది. ఇన్ని టపాకాయలు పేలుస్తున్నారు. అడిగితే వాళ్ళు తనకు ఒక్క టపాకాయ ఇవ్వకుండా పోరు.

ఆ ఆలోచన కలుగుతూనే వాడు కాలుతున్న టపాకాయల్ని తప్పించుకుంటూ ఆ పిల్లల పంచన వెళ్లి నిలబడ్డాడు.

"బాబూ!" అన్నాడు సిగ్గుపడుతూ.

టపాకాయల మోతలో వాళ్లకు ఆ గొంతు వినిపించలేదు.

"బాబూ!" ఈసారి కాస్త ధైర్యం తెచ్చుకొని మరింత గట్టిగా పిలిచాడు.

ఆ పిల్లల చేత టపాకాయలు కాల్పిస్తున్న పెద్ద మనిషి తల పక్కకు తిప్పి చూశాడు.

ఎదురుగా చిరుగు పాతల్లో మసిబొగ్గులా దర్శనమిస్తున్న వామనావతారం. ఆ అవతారమే ఆ పెద్దమనిషికి చిరాకు తెప్పించింది.

చెయ్యి చాచి ఏదో అడగబోయాడు వామనుడు.

వాడు మూడడుగులే అడుగుతాడేమోనని భయపడిపోయాడేమో ఆ పెద్ద మనిషి! చాచిన ఆ చెయ్యి చూస్తూనే అమాంతం కసురుకున్నాడు.

"రేయ్! పోరా! పోరా అవతలికి."

'టపాకాయ' అనే మాట నోట్లో వుండగానే ఆ తిరస్కారానికే వాడు ఖిన్నుడైపోయాడు. ఎంతో ఆశగా వచ్చిన వాడి పసి మనసు చివుక్కుమంది.

పండగ పూట ఆనందంలో ఈ పీడాకారం ఎదురు పడ్డం ఆ పెద్దమనిషికి సహించరానిదైంది.

"పొమ్మంటే పోవేరా? పో అవతలికి."

వాడి కళ్లలో నీళ్లొచ్చాయ్. అంత తిరస్కారం ఎదురవుతుందని వాడు ఊహించలేదు. ఆ కసురుకు నిశ్చేష్టుడైనవాడు కాస్తా నెమ్మదిగా తేరుకున్నాడు. ఇంకా అక్కడే నిలబడితే తన్నులు తప్పవని గ్రహించాడు. నెమ్మదిగా ఇవతలికి వచ్చేశాడు. గొంతుకేదో అడ్డు పడ్డట్టయ్యింది.

పండగ పూట దానం చేస్తే పరంలో మోక్షం వస్తుందంటారు. ఆ మోక్షం మీద ఆ పెద్ద మనిషికి పెద్ద ఆసక్తి ఉన్నట్టు లేదు. ఇహమే ఇంత ఆనందదాయకంగా వుంటే పరం గురించి ఆలోచించడం దేనికి?

వామనుడటు వెళ్లగానే తన రాజ్యం తనకు దక్కిందని బలిచక్రవర్తి ఎంత సంతోషించి వుండేవాడో అంతగానూ సంతోషిస్తూ ఆ పెద్ద మనిషి తన పిల్లల్తో కలిసి ఆనందం పంచుకోవడంలో మునిగిపోయాడు.

విరిగిన హృదయంతో వాడు పేలుతున్న టపాకాయల వంక చూస్తున్నాడు.

భుజంమీద ఎవరిదో చెయ్యి పడింది.

తల పైకెత్తి చూశాడు.

అక్క!

చండికలా కళ్లెర్ర జేసి చూస్తోంది.

"అడుక్కోవడానికి వెళ్తావురా! ఉండు అమ్మతో చెబుతాను!" వాడు బెదిరిపోయాడు.

"అది కాదక్కా! అదీ... అదీ... టపాసు...!"

"టపాసు అడగడానికి వెళ్లావా?"

వాడు గుటకలు మింగాడు.

"ఉండు నీ పని చెప్తాను!"

వాడి కళ్ళలో భయం కనిపించింది.

ఆ భయం చూసి ఆ అక్కకు జాలి కలిగింది.

"అడుక్కోకూడదురా! అమ్మ కొడుతుంది. చెప్పు, అడుక్కుంటావా ఇంకోసారి?"

"లేదక్కా."

ఆ పసివాడి మొహంలో దైన్యం చూసి ఆమెలో ప్రేమ పొంగుకొచ్చింది.

"నీకు టపాకాయలు కావాలి కదా! నాతోరా."

వాడి మనసులో ఆశ ఒక్కసారిగా వెల్లివిరిసింది.

ఉత్సాహంతో ఎగిరి గంతేసి అక్క వెంట పడ్డాడు.

ఆమె వాణ్ణి నేరుగా ఓ పెద్ద మర్రిచెట్టు దగ్గరికి తీసుకెళ్లింది.

వాడికేం అర్థం కాలేదు.

చుట్టూ నిర్మానుష్యంగా వుంది. "ఇక్కడికొచ్చావేం? టపాసేది?" ఆశగా అడిగాడు.

"ఇదిగో టపాసు."

ఆ మర్రిచెట్టు చాలా పెద్దది. ఊడలు పాతుకుంది. దాని కొమ్మలు చేతికి అందుబాటులో ఉన్నాయి. ఆమె వరసగా కొన్ని ఆకులు కోసింది.

"టపాసిస్తావని ఆకులు కోస్తావేందక్కా? టపాసు కావాలి," వాడు మారాం చేశాడు.

"ఇదిగోనంటుంటే టపాసు!"

ఆమె గుప్పిలి మూసి బోలుమీద ఆకు పరిచింది. రెండో చేత్తో ఆకుమీద బలంగా చరిచింది.

ఠాఫ్‌మనే శబ్దం.

అచ్చం టపాకాయ పేల్చినట్టే పేలింది.

"ఇదా టపాసు?" ఒక్కసారిగా వాడి ఉత్సాహమంతా నీరుగారిపోయింది. కళ్లల్లో మళ్ళీ నీళ్లు తిరిగాయి.

అక్క తమ్ముణ్ణి ప్రేమగా దగ్గరికి తీసుకుంది.

"పిచ్చి వెధవా! ఇదేరా మన దీపావళి!"

ఆమె మరో ఆకు పెట్టి టపాకాయ మోగించింది. వాడు చాలాసేపు బుంగమూతి పెట్టుక్కూచున్నాడు. ఆమె చేతిలో టపాకాయలు వరసగా పేల్తున్నాయ్. క్రమంగా వాడికి చిన్న ఆసక్తి పుట్టుకొచ్చింది.

తనూ ఓ ఆకు తీసుకుని ఠపీమని పేల్చాడు.

"అద్దీ!" సంతోషంగా అందక్క.

ఆమె సంతోషం చూసి వాడికీ సంతోషం కలిగింది. తన విషాదమంతా మర్చిపోయి మరో టపాకాయ పేల్చాడు.

ఆ అక్క చిన్నతనంలో దీపావళి అలాగే గడిచింది.

అదే ఆమె తమ్ముడికి నేర్పింది.

వాడూ తన సంతానానికి అదే నేర్పుతాడు.

దూరంగా ఊళ్లో ఉడ్డున్నవాడి దీపావళి.

ఊరవతల మర్రిచెట్టు కింద పేదవాడి దీపావళి.

*మందాకిని, నవంబర్ 1994*

# మురళి వూదే పాపడు

ఆవులు ఆనందంగా గడ్డి మేస్తున్నాయి.

కొంత దూరంగా ఒక పిల్లవాడు చెట్టు కొమ్మమీద కూర్చొని పిల్లనగ్రోవి ఊదుతున్నాడు. ఆవులు పాట వింటూ తలూపుతున్నాయి. గాలిలో తేలిపోతున్న పిట్టలు ఎగరడం ఆపి ఆ చెట్టు కొమ్మలమీద వాలుతున్నాయి. ఆకాశంలో ప్రయాణం చేస్తున్న మేఘాలు పాట కోసం దిగొచ్చి సన్నని చినుకులు రాలుస్తున్నాయి.

ఒక అమ్మాయి బండెక్కి వెళ్తున్నదల్లా ఆగి పరుగెత్తుకుంటూ వచ్చింది.

పిల్లవాడు మురళి ఊదడం ఆపి ఆమెవంక చూశాడు.

"పాపడా పాపడా, నువ్వెవరివి?" అడిగిందా అమ్మాయి మెరిపించే కళ్లతో.

"నేనీ ఆవులు కాసే పిల్లవాణ్ణి!" కొమ్మమీంచి చెప్పాడు మురళి ఊదే పిల్లవాడు.

"పాపడా పాపడా, ఆవుల పాపడా! పాట ఎందుకు ఆపావు?" అందా అమ్మాయి.

"సూర్యుడు పడమట కుంగిపోతున్నాడు. ఆవులు మళ్లించే వేళయింది," అన్నాడు మురళి ఊదే పిల్లవాడు.

"పాపడా పాపడా, మురళి ఊదే పాపడా! నాకోసం ఆ పాట మళ్ళీ పాడవూ?" అందా అమ్మాయి.

ఆవుల పాపడు మళ్లీ మురళి పాట పాడాడు.

ఆ అమ్మాయి పాట విన్న ఆనందంలో మైమరచి ఆడింది.

"పాపడా, పాపడా, మురళి ఊదే పాపడా! రేపు మళ్ళీ వచ్చి పాట పాడతావా?" అడిగిందా అమ్మాయి.

"రోజూ ఇక్కడికొస్తాను. ఈ చెట్లలో, పుట్టల్లో ఆడతాను. గడ్డి బయళ్లలో ఆవుల్ని మేపుతాను. ఈ కొమ్మనెక్కి మురళి పాట పాడతాను," అన్నాడు మురళి ఊదే పాపడు.

"పాపడా పాపడా, అయితే రేపు మళ్లీ వస్తాను," అందా అమ్మాయి.

మర్నాడు ఆ పిల్లవాడు అదే చెట్టు కొమ్మమీద మురళి పాట పాడుతున్నాడు.

బండిమీద ఆ అమ్మాయి మళ్లీ వచ్చింది.

"పాపడా పాపడా, మురళి ఊదే పాపడా! కొత్త పాట పాడు!" అంది.

మురళి ఊదే పాపడు ఆమెకోసం కొత్త పాట పాడాడు.

ఆ తర్వాత ఇద్దరూ కలిసి చెట్లలో, పుట్టల్లో ఆడుకున్నారు. పచ్చిక బయళ్ళలో పరుగులు తీశారు.

సాయంత్రం మురళి ఊదే పాపడు చెట్టు కొమ్మనెక్కి మళ్లీ మురళి పాట పాడాడు.

"పాపడా పాపడా, మురళి ఊదే పాపడా! నేను రోజూ వస్తాను, రోజూ నాకోసం నువ్వో కొత్త పాట పాడు!" అందా అమ్మాయి.

ఆ రోజునుంచీ ఆ అమ్మాయి మురళి పాట కోసం ప్రతిరోజూ అక్కడికొస్తుంది. మురళి ఊదే పాపడు రోజూ ఆమెకో కొత్త పాట వినిపిస్తాడు. ఇద్దరూ చెట్లల్లో, పుట్టల్లో, పచ్చిక బయళ్లలో మళ్లీ మళ్లీ ఆడతారు. మళ్ళీ మళ్ళీ మురళి ఊదే పాపడు ఆ అమ్మాయికి పాట పాడి వినిపిస్తాడు.

వసంతం వెళ్లిపోయింది. ఎండాకాలం వచ్చింది. ఎండాకాలం వెళ్లిపోయింది. వానాకాలం వచ్చింది.

వానాకాలం వచ్చింది – వానలు మాత్రం రాలేదు.

ఆవులు ఆకాశం వంక చూశాయి. వానలు మాత్రం రాలేదు.

పచ్చిక బయళ్లు వట్టిపోయాయి. వానలు మాత్రం రాలేదు.

పిట్టలు దాహంతో అల్లాడిపోయాయి. వానలు మాత్రం రాలేదు.

ఒకరోజు అమ్మాయి ఎప్పట్లాగే బండిమీద వెళ్లింది.

మురళి ఊదే పాపడు గమ్మున కూర్చున్నాడు. అతని చేతుల్లో మురళి జాలిగా చూస్తోంది.

"పాపడా పాపడా, మురళి ఊదే పాపడా! ఎందుకు ఊరికే కూర్చున్నావు?" అడిగిందా అమ్మాయి.

"గడ్డి బయళ్లు వట్టిపోయాయి. ఆవుల డొక్కలు ఎండిపోయాయి. నేనింక పాడలేను!" అన్నాడు మురళి ఊదే పాపడు.

"పాపడా పాపడా, మురళి ఊదే పాపడా! ఎందుకు గడ్డిబయళ్లు వట్టిపోయాయి? ఎందుకు ఆవుల డొక్కలు ఎండిపోయాయి?" అడిగిందా అమ్మాయి.

"వానాకాలం వచ్చింది. వానలు మాత్రం రాలేదు. నేల నెర్రలు చీలింది. వానలు మాత్రం రాలేదు. గడ్డి బయళ్ళు వట్టిపోయాయి. ఆవుల డొక్కలు ఎండిపోయాయి. నా చేతి మురళి మూగవోయింది. నా పాట కూడా ఆగిపోయింది!" అన్నాడు మురళి ఊదే పాపడు.

"పాపడా పాపడా! గడ్డి బయళ్లు వట్టిపోతే పోయాయి. ఆవుల డొక్కలు ఎండిపోతే పోయాయి. నువ్వు మాత్రం పాట ఆపకు!" అందా అమ్మాయి.

"ఆవుల డొక్కలు ఎండిపోతే నా మురళి కూడా మూగవోయింది. నా పాట కూడా ఆగిపోయింది. నువ్వు మళ్లీ రావద్దు. పాట పాడమని నన్నడగొద్దు," అన్నాడు మురళి ఊదే పాపడు.

ఆ అమ్మాయి చిన్ని గుండె బాధతో మూలిగింది.

అమాయకమైన నల్లని కళ్లు నీళ్లతో నిండిపోయాయి.

"పాపడా, పాపడా, మురళి ఊదే పాపడా! నేల ఎందుకు చీలింది? వాన ఎందుకు రాలేదు?" అని అడిగింది.

"చెట్లూ పుట్టలూ నరికేస్తున్నారు. మబ్బుకు అలక తెప్పిస్తున్నారు. వానలు అందుకు రామంటున్నాయి. నేలలు అందుకు చీలిపోతున్నాయి!" అన్నాడు మురళి ఊదే పాపడు.

"పాపడా పాపడా, చెట్లూ, పుట్టలూ ఎందుకు నరికేస్తున్నారు? మబ్బుకు కోపం ఎందుకు తెప్పిస్తున్నారు?" అని అడిగిందా అమ్మాయి.

"అదేమో నాకేం తెలుసు? అది మీవాళ్లనే అడుగు. చెట్లూ, పుట్టలు వాళ్లే నరుకుతున్నారు. మబ్బుకు కోపం వాళ్లే తెప్పిస్తున్నారు," అన్నాడు మురళి ఊదే పాపడు.

"అయితే మరి వాళ్లేనా! పాపడా, పాపడా, మరేం దిగులుపడకు. వాళ్లంతా నావాళ్లేలే. మా నాన్నగారు ఊళ్లేలే నాన్నగారు. ఆయన్తో చెప్పి చెట్లూ పుట్టలు నరకడం ఆపిస్తాను. నువ్వేం దిగులు పడకేం!" అని చెప్పి ఆ అమ్మాయి తన ఊళ్లేలే నాన్నగారి దగ్గరికి వెళ్ళింది.

"నాన్నగారూ నాన్నగారూ, ఊళ్లేలే నాన్నగారూ! చెట్లూ పుట్టలు ఎందుకు నరికిస్తున్నారు? మబ్బుకు కోపం ఎందుకు తెప్పిస్తున్నారు?" అని అడిగింది.

"ఎందుకు చెట్లు? ఎందుకు పుట్టలు? భవనాలు కడితే బోలెడు డబ్బొస్తుంది. నా చిట్టితల్లికి వంటినిండా బంగారం వస్తుంది!" అన్నారు ఊళ్లేలే నాన్నగారు.

"నాన్నగారూ నాన్నగారూ, ఊళ్లేలే నాన్నగారూ! నాకు భవనాలొద్దు. నాకు బంగారం వద్దు. చెట్లు నరకడం ఆపించండి. మళ్లీ వానలు కురిపించండి!" అందా అమ్మాయి.

"ఇలాంటివి చిన్నపిల్లలకు తెలుస్తాయా? నాలుగు చెట్లు నరకనందుకే మబ్బులు మెచ్చి కురుస్తాయా? మబ్బుల విషయం ఆలోచించకు. వెళ్లి ఆడుకో, ప్రశ్నలు వేయకు!" అన్నారు ఊళ్లేలే నాన్నగారు.

ఆ అమ్మాయి వెళ్లి ఆడలేదు, విచారపడడం మానలేదు.

మర్నాడు ఆమె వెళ్లేసరికి మురళి ఊదే పాపడు ఎక్కడికో బయల్దేరుతున్నాడు.

"పాపడా! పాపడా, మురళి ఊదే పాపడా! ఎక్కడికి నువ్వు వెళుతున్నావు?" అనడిగిందా అమ్మాయి.

"నేనెక్కి కూర్చునే చెట్టు కూడా నిన్నటితో మీ వాళ్లు నరికిపారేశారు. రాతి మిద్దెలు లేవబోయే ఈ చోట నాకూ, నా మురళికీ ఇంకేం పని లేదు. అది చెప్పడానికే ఉన్నాను. ఇంక నేను వెళతాను!" అన్నాడు మురళి ఊదే పాపడు.

"పాపడా పాపడా, మురళి ఊదే పాపడా! నువ్వెక్కడికీ వెళ్ళకు. నువ్వు మరి వెళ్లిపోతే నాతో కలిసి ఆడేదెవరు? మురళి పాట పాడేదెవరు?" అందా అమ్మాయి.

"చెట్లలో పుట్టల్లో పచ్చిక బయళ్ళలో గాలిమీద సాగుతూ తేలిపోయే నా పాట రాతిగోడల కేసి తల బాదుకోలేదు. నేను వెళ్లక తప్పదు. నువ్వు నన్నాపకు!" అన్నాడు మురళి ఊదే పాపడు.

"పాపడా పాపడా, మురళి ఊదే పాపడా! నువ్వు మళ్లీ ఎప్పుడొస్తావు?" కన్నీళ్లతో అడిగిందా అమ్మాయి.

"చెట్లూ చేమలతో ఈ నేలంతా మురిసిపోవాలి. ఆకాశంలో సాగిపోయే మబ్బులు కిందికి దిగి రావాలి. వానజల్లుతో ఈ నేల తడిసి పునీతం కావాలి. అప్పుడే మళ్లీ వస్తాను. నా పాట నీకు వినిపిస్తాను," అన్నాడు మురళి ఊదే పాపడు.

"పాపడా పాపడా నన్ను మాత్రం మరచిపోకు!" చెయ్యి ఊపుతూ అందా అమ్మాయి.

నేలమీద చెట్లూ పుట్టలు అన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ఏవైపు చూసినా రాతిగోడలు వెలిశాయి. ఊళ్లేలే నాన్నగారికి డబ్బులు చాలా వచ్చాయి. అమ్మాయికి వంటినిండా బంగారు నగలు తెచ్చాయి.

అమ్మాయి మాత్రం వాటిని తొడగలేదు. దూరంగా నగలు విసిరేసింది.

రోజూ ఆమె ఇంటి మేడమీద పడుకుని ఆకాశం వంక విప్పారిన కళ్లతో చూస్తుంది. ఒక్క మబ్బు తునకైనా లేదు. ఒక్క వాన చినుకైనా రాదు.

వానాకాలం వెళ్లింది. మళ్లీ వానాకాలం వచ్చింది. ఆ వానాకాలం వెళ్లింది. ఇంకో వానాకాలం వచ్చింది. వానలు మాత్రం రాలేదు. మురళి ఊదే పాపడి జాడ లేదు.

ఒకరోజు ఊళ్లేలే నాన్నగారు కూతురికి ఇష్టమని ఒక పిల్లనగ్రోవి పట్టుకొచ్చాడు.

అది చూస్తూనే ఆ అమ్మాయి "వచ్చాడా?" అంటూ ఆత్రంగా గుమ్మంవైపు పరిగెత్తింది.

ఊళ్లేలే నాన్నగారు ఆమెను పట్టుకున్నారు.

"ఎక్కడికలా పరిగెడతావ్? పరిగెడితే పడిపోతావ్! ఇదిగో పిల్లనగ్రోవి. ఇది చూసైనా దిగులు మానుకో. పారేసిన నగలు తీసి వంటినిండా పెట్టుకో!" అన్నాడు.

ఆ అమ్మాయి ఆ రోజు ఆ పిల్లనగ్రోవిని దగ్గర పెట్టుకు పడుకుంది. మబ్బు తునకకోసం ఆకాశం కేసి చూసింది. చిత్రంగా ఆకాశం ఆమె కళ్లముందు ఒక్కసారిగా తెరుచుకుంది. ఎక్కడో తారల దారుల వెంట ఆకాశానికెంతో అవతల ఒక సుందరనందనవనం ఆమె కళ్లకు కనిపించింది.

ఆ నందనవనం నిండా ఎన్నో చెట్లు, ఎన్నో పూలు, ఎన్నో పక్షులు, మురళి ఊదే పాపడు ఒక చెట్టు కొమ్మమీద కూర్చుని మురళి ఊదుతున్నాడు. చుట్టూ కొన్ని వందల వేల ఆవులు పాటకు తలూపుతూ పచ్చిక మేస్తున్నాయి.

అది చూస్తూనే, "పాపడా పాపడా, మురళి ఊదే పాపడా!" అని అమ్మాయి కేక వేసింది.

మురళి ఊదే పాపడు పాట ఆపి అమ్మాయి వంక చూశాడు. అతని పెదవుల మీద ఎంతో అందమైన చిరునవ్వు లాస్యం చేస్తోంది. దివ్య తేజస్సుతో అతను వెలిగిపోతున్నాడు.

"పాపడా పాపడా, మురళి ఊదే పాపడా! నువ్వక్కడ ఆకాశంలో ఏం చేస్తున్నావు?" అని అడిగిందా అమ్మాయి.

"ఇది ఆకాశం కాదు. ఆకాశం కంటే ఇంకా ఎంతో దూరం. ఇక్కడ రాతి మేడలు లేవు. ఎటు చూసినా చెట్లు. ఎటు చూసినా పచ్చిక బయళ్లు. ఇక్కడ మబ్బులు అలగవు. రోజూ అమృతం కురుస్తూ ఉంటుంది. ఇదొక అద్భుతమైన చోటు," అన్నాడు మురళి ఊదే పాపడు.

"పాపడా పాపడా, మురళి ఊదే పాపడా! అక్కడికి నువ్వెలా వెళ్లావు?" అని అడిగిందా అమ్మాయి.

"రాతి గుండెల మనుషుల మధ్య ఎన్నో దేశాలు తిరిగాను. ఎటు చూసినా రాతిగోడలు లేవడం చూశాను. ఎవరూ కూల్చలేని గొప్ప గొప్ప రాతిగోడలు, మనుషులకూ మనుషులకూ మధ్య రాతిగోడలు. కొట్టుకు చావడంలో కొందరు, డబ్బు సంపాయించడంలో కొందరు మునిగి తేలుతున్నారు. ప్రకృతిని ప్రేమించలేని వాళ్ల మధ్య నాకూ, నా మురళికీ చోటు లేదు. అందుకే ఇక్కడికి వచ్చేశాను. ఇదే నా చోటు. ఇంకెప్పుడూ నేను మళ్లీ అక్కడికి రాను. కలకాలం ఇక్కడే మురళి పాట పాడుకుంటాను!" అంటూ మురళి ఊదే పాపడు మళ్లీ పిల్లనగ్రోవి అందుకున్నాడు.

ఆ పాత మధురమైన సంగీతానికి మళ్లీ ఆవులు తలూపనారంభించాయి. మళ్లీ పిట్టలు గంతులేస్తూ ఎగరనారంభించాయి. మబ్బులు అమృతం కురిపిస్తున్నాయి.

"పాపడా! నేనూ అక్కడికి వస్తాను!" కేకేసిందా అమ్మాయి.

సరిగ్గా అదే సమయంలో ఆకాశం మళ్లీ మూసుకుపోయింది. పాట మళ్లీ ఆగిపోయింది.

"పాపడా!" అని అరుస్తూ ఆ అమ్మాయి చేతులు చాచి ముందుకు పరుగెత్తింది.

ఆ మర్నాడు ఊళ్లేలే నాన్నగారు వచ్చి చూసేసరికి ఆ అమ్మాయి రాతిగోడల మధ్య నిర్జీవంగా పడుంది.

ఆమె విసిరేసిన బంగారు నగలు వెలవెలబోయి చూస్తున్నాయి.

ఊళ్లేలే నాన్నగారు నేలమీద కూలబడ్డారు.

ఆ అమ్మాయిని సమాధి చేసిన చోటనే చిత్రంగా ఒక అందమైన చెట్టు మొలిచింది. వానకారు అవసరం లేని చెట్టు. అమృతంతో పెరిగే చెట్టు.

భూమండలం మీద మిగిలిన ఒకే ఒక చెట్టు.

ఆ చెట్టు నీడలో విశ్రమించడానికి ఎక్కడెక్కడి నుంచో జనం వస్తుంటారు.

అలా విశ్రమించినవారికి రహస్యంగా ఒక పిల్లనగ్రోవి పాట వినిపిస్తుందని చెబుతారు.

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, అక్టోబర్ 1995*

# చరిత్ర

పక్కపక్కనే వున్న మూడు గొప్ప దేశాలు ఒకేసారి స్వాతంత్ర్యం సంపాదించుకున్నాయి. ఎన్నో కష్టనష్టాలకోర్చి, ఇంకెన్నెన్నో త్యాగాలు చేసి ఆ మూడు దేశాల ప్రజలూ నిరంకుశ ప్రభుత్వాన్ని కూకటి వేళ్ళతో సహా పెళ్లగించి పడేశారు. ఒకే రోజు ఒకే సమయంలో స్వాతంత్ర్యం సంపాదించుకున్న సంబరంలో మూడు దేశాల ప్రజలూ మునిగిపోయారు. ఎవరి రాజకీయ విశ్వాసాల కనుగుణంగా వాళ్లు వొక్కో దేశంలోనూ వొక్కో రకమైన కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నారు.

మూడు దేశాల్లోనూ ముగ్గురు స్నేహితులున్నారు. స్నేహితులంటే ప్రత్యక్ష స్నేహం కాదు వాళ్ళది. కలం స్నేహితులు. ముగ్గురు స్నేహితులూ స్వాతంత్ర్యానికి ముందు నిరంకుశ ప్రభుత్వాల చేతుల్లో వొకే రకమైన బాధలు పడ్డారు. ఎవరి దేశంలో వాళ్ళు స్వాతంత్ర్య పోరాటంలో దూకి విప్లవాల్లో పాలు పంచుకున్నారు. ఆ పోరాటకాలంలో ఎవరి బాధలు వాళ్లు మరొకళ్ళకి వుత్తరాల్లో రాసుకునేవాళ్ళు. ముగ్గురూ మూడు రకాల రాజకీయ విశ్వాసాలున్న వాళ్ళు. రాజకీయ విశ్వాసాల్లో ఏకత్వం వల్ల తాము పడ్డ కష్టాల మూలంగా వాళ్ళు మానసికంగా బాగా దగ్గరయ్యారు.

స్వాతంత్ర్యం వచ్చేశాక మొదటి సంవత్సరమంతా కష్టాలకి తగిన ఫలితం దక్కించుకున్న ఆనందంలో గడిచిపోయింది. ముగ్గురూ స్వాతంత్ర్య గాలులు పీలుస్తూ ఎవరికి వాళ్ళు కొత్త జీవితాలు ప్రారంభించారు. మొదటి సంవత్సరం గడిచిపోయాక కూడా విజయగర్వం వాళ్ళ గుండెల్ని పొంగించడం మానలేదు. మొదటి స్వాతంత్ర్య దినోత్సవం రోజున ముగ్గురు స్నేహితులూ వోచోట కలుసుకుని తమ అనుభవాలు వొకళ్ళకొకళ్ళు చెప్పుకోవాలని వుత్తరాలు రాసుకున్నారు. సయ్యంటే సయ్యనుకున్నారు. ముగ్గురూ వో చోట కలుసుకున్నారు. వొకళ్ళ నొకళ్ళు కౌగిలించుకున్నారు. చేతులూ చేతులూ కలుపుకున్నారు. ఆనంద బాష్పాలు రాల్చుకున్నారు. వొకళ్ల నొకళ్ళు అభినందించుకున్నారు. గంటల తరబడి

తమ అనుభవాలు చెప్పుకున్నారు. చివరికి తమ దేశాల భవిష్యత్ గురించి చర్చ మొదలైంది. అప్పుడు పుట్టింది వివాదం.

"మీరిద్దరూ చెప్పేది సరేనయ్యా! కాని ప్రజాస్వామ్య దేశమే దేశం. జీవితంలో ఎన్ని సదుపాయాలున్నా, ఇంకెన్ని సౌకర్యాలున్నా స్వేచ్ఛ లేని మనిషి ఏం సుఖపడతాడు? స్వేచ్ఛ లేని బతుకు ఒక బతుకేనా? ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులు. ప్రజలెన్నుకున్న ప్రతినిధులే ప్రభుత్వానికొస్తారు. ప్రజలు తమని తామే పాలించుకుంటారు. 'గవర్నమెంట్ ఆఫ్ ది పీపుల్, బై ది పీపుల్ అండ్ ఫర్ ది పీపుల్' అంటాడు అబ్రహాం లింకన్. అందుకే మేం ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నాం. అన్ని విధానాల కంటే ప్రజాస్వామ్య విధానమే గొప్ప," అన్నాడు మొదటి స్నేహితుడు.

"ఆ మాట నేనొప్పుకోను. ఏవుంది ప్రజాస్వామ్య ప్రభుత్వంలో? అంతా నేతి బీరకాయ వ్యవహారం. ప్రజాస్వామ్యంలో నిజంగా స్వేచ్ఛ యెక్కడుంది? అయిదేళ్ళకోసారి మీరు వోట్లు పెట్టుకున్నారు. వోట్లేసి ఏదో పార్టీని గద్దె నెక్కిస్తారు. అయిదేళ్ళ దాకా వాళ్ళాడిందాట, పాడింది పాట. సీట్లు సంపాదించుకోవడం కోసం నువ్వంటున్న ప్రజాప్రతినిధులు నానా గడ్డీ కరుస్తారు. ప్రజల బలహీనతల్ని మస్తుగా వాడుకుంటారు. నోట్ల కోసం ధనిక వర్గం మీద ఆధారపడతారు. ధనిక వర్గం కోసమే చట్టాలు చేస్తారు. నిరుపేద వర్గాన్ని అట్టడుక్కి తోస్తారు. కుబేరులు మరింత కుబేరులౌతారు. పేదవాళ్ళు మరింత పేదవాళ్ళవుతారు. శ్రామికుడి చెమటికి విలువే లేకుండా పోతుంది.

"అదే మా దేశం చూడు. మా దేశంలో పేదా గొప్పా తేడాల్లేవు. ప్రైవేటు ఆస్తులన్నీ ప్రభుత్వం జాతీయం చేస్తుంది. దేశ సంపద అందరికీ సమానంగా పంచుతుంది. అందరూ కష్టించి పని చెయ్యాల్సిందే. బద్ధక స్వాములకి మా దేశంలో ఇప్పుడు విలువ లేదు. 'శ్రమ యేవ జయతే' మా జీవనవిధానం. ప్రతి మనిషికి శ్రమకు తగ్గ ఫలితం దక్కుతుంది. కులమతాల పేరిట యుద్ధాలు జరగవు. మనిషి మనిషిగా గుర్తింపు పొందుతాడు. పూట కూటి కోసం అగచాట్లు పడనక్కర్లేదు. శ్రమ దోపిడీ అసలే లేదు. పూటగ్గతిలేని స్వేచ్ఛ స్వేచ్ఛ కాదు – ప్రచ్ఛన్న బానిసత్వం. శ్రామికుడి చెమటలో మేం ఎరుపుని చూస్తాం. ఆ ఎరుపు మెరుపువైపే సాగిపోతాం. కమ్యూనిజం కంటే గొప్ప విధానం వేరేదీ ప్రపంచంలో లేదు. ప్రజలందరికీ సమానత్వం కావాలంటే కమ్యూనిజాన్ని ఎంచుకోక తప్పదు. అందుకే మేం కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నాం. మీరే చూస్తారుగా మేమెలా అభివృద్ధి సాధిస్తామో!" అన్నాడు రెండో స్నేహితుడు.

మూడో స్నేహితుడు ఆ రెండు వాదాలూ వొప్పుకోలేదు. 'భగవంతుడు ఈ సృష్టి చేశాడు. భూమ్యాకాశాలు సృష్టించి అంతరిక్షం ఏర్పాటు చేసి భూమ్మీద గాలీ నీరూ పుట్టించి

మట్టితో మనిషిని చేసి నేలమీద వదిలాడు. మానవుడు పీలుస్తున్న ప్రతి గాలీ ఆయన ప్రసాదమే కాబట్టి మనిషి భగవంతుడి ఆజ్ఞానుసారమే నడుచుకోవాలి. భగవంతుడేం చెప్పాడో అదే చెయ్యాలి. మత స్వామ్యానికి విలువ నిచ్చే ప్రభుత్వం సరైన ప్రభుత్వం. ప్రజాస్వామ్యం మత విశ్వాసాలు వద్దనకపోయినా అదో పెద్ద అయోమయం. కమ్యూనిజం సరే నాస్తిక వాదం. భగవంతుడి రాజ్యంలోనే మానవుడు ఇహపరాలు రెండూ సాధించుకోగలుగుతాడు. మా దేశంలో ఇదివరకటి ప్రభుత్వం దైవభీతి లేకుండా క్షుద్రంగా ప్రజల్ని దోచుకునేది. అందుకే మేమా ప్రభుత్వాన్ని కూల్చేసి దేవుడి రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాం. మా దేశంలో ప్రజలకు లభించే మనశ్శాంతి మీకెక్కడిది? ఆధ్యాత్మిక చింతనతో మేం పరిపూర్ణ మానవులమై వున్నత స్థితి కెదుగుతాం. చూస్తుండండి – మీరే ఆశ్చర్యపోతారు," అన్నాడతను.

మొదటి ఇద్దరూ మూడోవాడి మీద విరుచుకుపడ్డారు. అతని దేశం మధ్యయుగం వైపు తిరోగమిస్తుందని తిట్టి పోశారు. వొక విధమైన బానిసత్వాన్ని వదిలించుకుని మరో విధమైన బానిసత్వాన్ని వరించిందని దుయ్యబట్టారు. దాని దుష్ఫలితాలు త్వరలోనే చూడగలవు లెమ్మని హెచ్చరించారు. ఎవరికి వాళ్లు ఎదుటి వాళ్ళ రాజకీయ విశ్వాసాన్ని తీవ్రంగా ఖండించుకున్నారు. అలా చాలాసేపు వాదించుకున్నాక ముగ్గురూ చివరకో నిర్ణయానికొచ్చారు.

"మన ముగ్గురి రాజకీయ విశ్వాసాలూ, సిద్ధాంతాలూ మూడు రకాలైనా వొక్క విషయంలో మాత్రం మన ముగ్గురికీ పోలికుంది – ఇది వరకటి కంటే మంచి జీవితాలు కోరుకునే మనం పాత ప్రభుత్వాల్ని కూలదోసి కొత్త ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకున్నాం. ఈ విషయంలో మాత్రం మన ముగ్గురికీ వివాదం లేదు. ఎవరికి వాళ్లు తమ సిద్ధాంతాలు గొప్పవనే నమ్ముతున్నారు. ఎవరి సిద్ధాంతాలు విజయం సాధిస్తాయో వేచి చూద్దాం. ముగ్గురం పందెం కాద్దాం.

"మన ముగ్గురికి ఇప్పుడు దాదాపు ముప్పై ఏళ్ళున్నాయి. వో యాభై ఏళ్ళ కాలాన్ని మన పరీక్షా సమయంలో నిర్ణయించుకుందాం. వొక దేశ చరిత్రలో యాభై యేళ్ళు పెద్ద కాలం కాకపోయినా అంతకంటే ఎక్కువ రోజులు మనం బతికుంటామో లేదో తెలీదు కాబట్టి యాభైఏళ్ళ కాలంలో మన ముగ్గురి దేశాలూ ఎంత అభివృద్ధి సాధిస్తాయో, యే దేశం తన ఆశయం సాధించుకోవడంలో విజయం పొందుతుందో మనం పక్షపాతం లేకుండా గమనించాలి. యాభై యేళ్ళ తర్వాత కూడా మనం బతికే వుంటే ఎంత కష్టమైనా సరిగ్గా ఇదే రోజున ఇదే చోట కలుసుకోవాలి. యాభై యేళ్ళ తర్వాత ఎవరి సిద్ధాంతం

గెలుస్తుందో వాళ్ళకి మిగతా ఇద్దరూ షేక్ హ్యాండివ్వాలి. అదీ పందెం. యాభై యేళ్ళ తర్వాత మనం బతికుంటే ఇక్కడే ఇదే రోజున మళ్ళీ కలుసుకోవాలని ప్రమాణాలు చేసుకుందాం!"

ముగ్గురూ సరేనంటే సరే అనుకున్నారు.

ముగ్గురూ ప్రమాణాలు చేసుకున్నారు.

ముగ్గురూ విడిపోయారు.

యెవరికి వాళ్ళు తమ సిద్ధాంతమే నెగ్గుతుందన్న ఆత్మవిశ్వాసంతో యెవరి దేశానికి వాళ్లు తిరిగి వెళ్ళిపోయారు.

❖ ❖ ❖

కాలం గడుస్తోంది.

కాలం చాలా వేగంగా గడుస్తోంది.

కాలం గడిచిపోతున్న కొద్దీ మూడు దేశాల ప్రజలూ విజయాల మత్తులోంచి నెమ్మది నెమ్మదిగా తేరుకుని వర్తమాన దృశ్యాల వైపు వాస్తవికతా దృక్పథంతో చూడనారంభించారు.

విప్లవాల తర్వాత మొదటి నాలుగైదేళ్ళూ మూడు దేశాల్లోనూ రాజకీయ సుస్థిరత ఏర్పాటుకావడంలో గడిచిపోయాయి.

మొదటి దేశంలో ప్రజాస్వామ్య సూత్రాల కనుగుణంగా పటిష్టమైన రాజ్యాంగ రచన జరిగింది. ఆ రాజ్యాంగం ప్రకారం దేశంలో తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. భారీ ఎత్తున పోలింగ్ జరిగింది. ప్రజలు ఆనందోత్సాహాలతో వోట్లు వేశారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన పార్టీ బ్రహ్మాండమైన మెజార్టీతో అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీ నాయకుడు దేశానికి ప్రధానమంత్రి అయ్యాడు. అధికారంలోకొస్తూనే దేశంలో అభివృద్ధి కార్యక్రమాలకు తగిన ప్రణాళికలు తయారు చేయడంలో మునిగి పోయాడాయన.

దీర్ఘకాలిక ప్రణాళికలు తయారయ్యాయి. కొత్త కొత్తగా భారీ పరిశ్రమలూ పెద్ద పెద్ద ప్రాజెక్టులూ కార్యరూపం దాల్చడం మొదలెట్టాయి. ప్రభుత్వంలో ఎన్నడూ లేనంత మంది నిజాయితీపరులైన మహా నాయకులు చేరి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి కృషి చేస్తున్నారు. జాతీయాదాయం క్రమపద్ధతిలో పెరుగుతూ వచ్చింది. జాతీయోత్పత్తి పెరిగింది. ప్రతిపక్షాలు కూడా దేశంలో త్వరత్వరగా జరుగుతున్న అభివృద్ధికి హర్షిస్తూ ప్రభుత్వం పొరపాట్లు చేసినప్పుడల్లా ఆ పొరపాట్లేమిటో ఎత్తి చూపి దేశాభివృద్ధికి సహకరించారు. యుగాల తరబడి నిరంకుశ పాలనలో మగ్గిపోయిన ఆ దేశంలో అంతర్గతంగా ఎన్ని

కుంపట్లు ఉన్నప్పటికీ రాజకీయంగా అయిదారేళ్ళ కాలం వో స్వర్ణయుగంగా రూపొందింది. దేశం పారిశ్రామికీకరణ వైపు సాగిపోవడంతో కొత్త కొత్త పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. అణుశక్తి పరిశోధనలూ, అంతరిక్ష పరిశోధనలూ, వ్యవసాయ శాస్త్ర పరిశోధనలూ, ఎలెక్ట్రానిక్స్ వంటి శాస్త్రాల్లో దేశం క్రమంగా అభివృద్ధి సాధించడం ప్రారంభించింది. ప్రజాస్వామ్యం అంటే ఇదీ అనిపించే విధంగా దేశ పరిస్థితులు మెరుగుపడుతున్నాయి.

రెండో దేశంలో విప్లవం సాధించిన కమ్యూనిస్టు పార్టీ అధికారంలో కొచ్చింది. కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడైతే అధికారంలోకొచ్చిందో దేశంలోని పెట్టుబడిదారీ వర్గానికి మూడింది. దేశంలోని ప్రైవేటు ఆస్తులన్నీ ప్రభుత్వం జాతీయం చేసింది. ఎదురు తిరిగిన కాపిటలిస్టుల్లో మరీ బలవంతులందర్నీ ప్రభుత్వం వురి తీసింది. కొంచెం తక్కువ బలవంతుల్ని కఠినమైన ద్వీపాంతర వాస శిక్షలు విధించి కాన్సన్‌ట్రేషన్ క్యాంపులకు పంపించింది. ఇంకొంచెం తక్కువ బలవంతుల్ని జైళ్ళలో పెట్టింది. పారిపోగలిగినవాళ్ళు పిక్కబలం చూపించి దేశం నుంచి పారిపోయారు. దాంతో దేశానికి అంతరంగిక శత్రువుల పీడ వదిలిపోయింది. దేశంలో మత స్వాతంత్ర్యం పూర్తిగా రద్దైపోయింది. పూజారి వర్గాలు ఇంటిదారి పట్టాయి.

మొట్టమొదటిసారిగా ఆ దేశంలో శ్రామికుడికి విలువొచ్చింది. దేశాభివృద్ధి కోసం కొత్త ఫ్యాక్టరీలు తెరిచారు. కొత్త పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయి. జాతీయ సంపద ప్రజలందరికీ సమానంగా పంచడంతో దేశంలో దరిద్రులు లేకుండా పోయారు. నిరుద్యోగం పూర్తిగా రూపు మాసిపోయింది. పనిచేయని వాడికి పుట్టగతుల్లేవు. దేశంలో ప్రతివొక్కరూ ఆడుతూ పాడుతూ చెమటోడ్చి పనిచేసి దేశాన్ని ముందుకు తీసుకెళ్ళడానికి కంకణం కట్టుకున్నారు. శ్రమకు తగ్గ ఫలితానికి తోడు అన్ని సౌకర్యాలూ లభించడంతో ఫ్యాక్టరీ వర్కర్లు దేశాన్ని పారిశ్రామికీకరణ వైపు తీసుకెళ్ళారు. రైతులు మహోత్సాహంతో పంటలు పండించి దేశంలో హరిత విప్లవం తెచ్చారు. ఎన్నడూ లేనంత భారీ ఎత్తున ఆహార ధాన్యాలు వుత్పత్తి చేశారు. విప్లవం తర్వాత మొదటి అయిదారేళ్ళ కాలంలోనే మిగతా రెండు దేశాల కంటే ఈ దేశమే బాగా అభివృద్ధి చెందుతున్న దాఖలాలు కనిపించనారంభించాయి.

మూడో దేశంలో ప్రజలు తీవ్రంగా దైవభక్తిలో మునిగిపోయారు. మత వ్యతిరేకులందర్నీ ప్రభుత్వం కఠినంగా అణచివేసింది. కమ్యూనిస్ట్ దేశంలో కంటే భారీ ఎత్తున వురి తీయడాలు జరిగాయి. ఆధునిక భావాలున్న రేషనలిస్టులు దేశం విడిచి పారిపోవలసి వచ్చింది. దేశంలో అధికారయంత్రాంగం మొత్తం మతాధిపతుల హస్తగతమైపోయింది. భారీ ఎత్తున

అధికారమంతా ఒకేచోట కేంద్రీకృతమైపోయింది. మత స్వామ్య వ్యతిరేకులందర్నీ ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేయడంతో దేశంలో ఇదివరకెన్నడూ లేనంత రాజకీయ సుస్థిరత స్థాపించగలిగింది. ప్రభుత్వం ఏం చేసినా ప్రజలు భగవంతుడి పేరు మీద మనస్ఫూర్తిగా సమర్థిస్తూ వచ్చారు.

దేశంలో ఎక్కడ చూసినా ప్రార్థనా మందిరాలు వెలిశాయి. ప్రజలు దైవ ప్రార్థన చేయడం తప్పనిసరైంది. దైవ దూషణ చేసేవాళ్ళకి కఠిన శిక్షలు పడేలా చేసే చట్టాలొచ్చాయి. ప్రజలు మతంలో శాంతిని వెతుక్కోవడం మొదలెట్టారు. ప్రెసిడెంటుని దేవదూతగా నమ్మడం ప్రారంభమైంది. చెప్పుకోదగ్గ ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు గానీ ప్రజాభివృద్ధి కార్యక్రమాలు గానీ ప్రభుత్వం చేపట్టడం మొదటి అయిదారు సంవత్సరాల్లోనూ జరగనేలేదు. ఆ విషయంలో మిగతా రెండు దేశాలకంటే ఈ దేశం బాగా వెనకబడ్డట్టే కనిపించింది. అయినా ప్రజలు బాధపడలేదు. దేవుడికోసం పేదరికాన్ని చిరునవ్వుతో స్వీకరించారు. దేవుణ్ణి చేరుకోవడానికి పేదరికం కూడా ఓ మార్గమని మనస్ఫూర్తిగా నమ్మారు. దేవుడికోసం వ్యక్తిగత సౌఖ్యాలేమిటి, ప్రాణాలు కూడా ధారపోయడానికి సిద్ధపడ్డారు. మనిషి చేసే ప్రతి పని దేవుణ్ణి చేరుకోవడానికే అనే సిద్ధాంతానికి విలువొచ్చింది. దాంతో మూడో స్నేహితుడు చెప్పినట్టు ఆధ్యాత్మిక చింతనతో ఆ దేశ ప్రజలు ఔన్నత్యం సాధించే దిశలోనే సాగిపోతున్నట్టుగా కనిపించారు.

స్వాతంత్ర్యం వచ్చాక మొదటి అయిదారు సంవత్సరాలలోనూ మూడు దేశాల ప్రజలకీ తమ తమ ప్రభుత్వాల మీద ఎలాంటి అవిధేయతా లేదు. మూడు దేశాల ప్రజలూ సంపూర్ణ తృప్తితో వున్నారు. ఆ మాటకొస్తే స్వాతంత్ర్యం వచ్చాక మొదటి పాతికేళ్ళ కాలంలోనూ అభివృద్ధి కార్యక్రమాలు సాగుతూనే వచ్చాయి. మొదటి అయిదేళ్ళ కాలంలో ఎలాంటి అభివృద్ధి కనిపించని మత స్వామ్య దేశంలో కూడా పాతికేళ్ళ కాలంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి కనిపించింది. ఏ దేశంలోనైనా సుదీర్ఘ కాలంలో ఎంతో కొంత అభివృద్ధి కనిపించక తప్పదు. మూడు దేశాల్లోనూ వివిధ నిష్పత్తుల్లో అదే జరిగింది.

కాలం గడిచిపోతూనే వుంది.

కాలంతో పాటు వొకతరం గడిచిపోయింది.

వొకదేశ చరిత్రలో వొకతరం అంటే పాతికేళ్ళ కాలంగా తీసుకోవచ్చు. పాతికేళ్ళ కాలంలో వొక దేశంలో చాలా మార్పులొస్తాయి. ఆధునిక కాల పరిస్థితుల్లో పాతికేళ్ళలోనే చరిత్రగతిలో మార్పొస్తుంది.

పాతికేళ్ళ తర్వాత ఈనాటి యువకులు ఆనాడు ముసలాళ్ళౌతారు. మళ్ళీ కొత్త యువతరం పుట్టుకొస్తుంది. కొత్త యువతరంతో పాటు కొత్త భావాలు పుట్టుకొస్తాయి. నిన్న పురోగమనంగా కనిపించిన చర్య ఈ రోజు తిరోగమనంగా కనిపించవచ్చు.

మన ముగ్గురు స్నేహితులు కూడా పాతికేళ్ళ తర్వాత ముసలాళ్ళయ్యారు. వాళ్ళ పిల్లలు పెద్దవాళ్ళై కొత్తతరం వచ్చింది. అప్పటికీ ప్రజల గుండెల్లో విప్లవకాలం నాటి పొంగు చల్లారిపోయింది. విప్లవం తర్వాత పుట్టిన యువకుల్లో విప్లవకాలం నాటి భావాలు లేవు. పాత తరానికి చెందిన ముసలాళ్లలో ఇంకా ఆనాటి జ్ఞాపకాలు చెరిగిపోకుండా వున్నాయి. కొత్తతరాన్ని చూసి ముసలాళ్ళు సణుక్కోవడం మొదలెట్టారు. ముసలాళ్ళని చూసి కొత్తతరం విసుక్కోవడం మొదలెట్టింది. యుగసంధిలో అలాగే జరుగుతూ వుంటుంది. పాతికేళ్ళ తర్వాత మూడు దేశాల్లోనూ పరిస్థితులు చాలా మారిపోయాయి.

ప్రజాస్వామ్య దేశంలో అప్పటికైదుసార్లు ఎన్నికలు జరిగాయి. దాంతో ప్రజలకిప్పుడు ఎన్నికల పట్ల మోజు పోయింది. విప్లవకాలం నాటి దేశ నాయకులు మరణించడంతో కొత్త నాయకులొచ్చారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన అధికార పార్టీలో చాలా చీలికలొచ్చాయి. పూర్వపు నాయకుల మీదుండిన ప్రేమ ప్రజలకు కొత్త నాయకుల మీద లేకుండా పోయింది. కొత్త నాయకుల్లో కూడా ప్రజలమీద కంటే అధికారం మీదే ప్రేమ పెరిగింది.

ప్రభుత్వం దీర్ఘకాలిక దేశాభివృద్ధి కార్యక్రమాలకు స్వస్తి చెప్పి వోట్ల కోసం ప్రజల్ని ఆకర్షించడానికి చిట్కాలు వెతకడం మొదలెట్టింది. ప్రజల్ని మురిపించడానికి అప్పటికప్పుడు చిచ్చుబుడ్లలా వెలిగి ఆరిపోయే తాత్కాలిక పథకాలు అమలు చేయడం మొదలెట్టింది. దేశానికో ఖచ్చితమైన ఆర్థికాభివృద్ధి కార్యక్రమం లేకుండా పోయింది. రెండో స్నేహితుడు చెప్పినట్లు ధనవంతులు మరీ ధనవంతులయ్యారు. బీదవాళ్లు మరీ బీదవాళ్ళయ్యారు. నిరక్షరాస్యతా నిరుద్యోగమూ తీవ్ర రూపం ధరించాయి. యేయేటి కాయేడు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పోనారంభించాయి. కరెన్సీ విలువ బాగా పడిపోయింది. దేశ సంపద కొద్దిమంది పెట్టుబడిదార్ల చేతుల్లో కేంద్రీకృతమైపోయింది. నిరుత్సాహంతో ప్రజలు దేశం కోసం పనిచేయడం మానేసి ఎప్పటికప్పుడు కొత్తగా పుట్టుకొచ్చే నిత్యావసరాలు తీర్చుకోవడానికే జీవితకాలం ఖర్చు పెట్టేయడంలో మునిగిపోయారు. నిరాశతో రాజకీయ చైతన్యం పోగొట్టుకుని మనసుకు తాత్కాలిక వుపశమనం కలిగించే దారులు వెతుక్కోనారంభించారు. దాంతో దేశంలో యెంటర్‌టైన్మెంట్ యుగం ప్రారంభమైంది. సినిమాలకీ, నైటు క్లబ్బులకీ విపరీతమైన గిరాకీ వచ్చింది. సినిమా హీరోలు దేవుళ్ళయ్యారు.

కాల్పనిక సాహిత్యం వెర్రి తలలు వేసి కదం తొక్క నారంభించింది. అన్నింటినీ మించి యువత మత్తు పదార్థాలకూ మాదక ద్రవ్యాలకూ అలవాటు పడిపోయింది. దేశంలో జాతి మత కుల భాషా భేదాలు విపరీతంగా పెరిగిపోయాయి. అవన్నీ వర్గ ద్వేషాలకు దారితీశాయి. చిల్లర రౌడీలు చిల్లర నాయకులయ్యారు. చిల్లర నాయకులు చిల్లర దేవుళ్ళయ్యారు. అధికార పార్టీ సీటుకి అంటిపెట్టుకునుండడానికే తీవ్ర ప్రయత్నాలు చేస్తే ప్రతిపక్షాలు కేవలం ఆ పార్టీని గద్దె దింపడానికే తమ శక్తియుక్తులన్నీ ప్రదర్శింప నారంభించాయి. ఈ రాజకీయ బేతాళంలో ప్రజల నిజమైన సమస్యలకి విలువ లేకుండా పోయింది. నిజంగా ప్రజలకు దగ్గరవడానికే పార్టీ ప్రయత్నించడం లేదు. పోరాట కాలం నాటి స్పిరిట్ అందర్లోనూ పోయింది. ప్రజలు రాజకీయాలంటేనే యేవగించుకోవడం మొదలెట్టారు.

అది అలా వుంటే దేశం మీద తక్కిన రెండు దేశాల ప్రభావం ఎక్కువైంది.

చదువుకున్న మేధావి యువతరం కమ్యూనిస్టు సిద్ధాంతాలవైపు సులభంగా మొగ్గు చూపనారంభించారు. కమ్యూనిస్టు సిద్ధాంతాలు బోధిస్తూ మహాకవులు విప్లవ గీతాలు రాయడం మొదలెట్టారు. ఈ వర్గం యువకులకి ప్రజాస్వామ్యం వెగటు పుట్టనారంభించింది. ఆవేశపరులైన యువకులు తుపాకి గొట్టం ద్వారా మాత్రమే విప్లవం సాధ్యమౌతుందన్న నమ్మకంతో తీవ్రవాద కార్యకలాపాలకు పూనుకుని ఎర్రబాటవైపు సాగిపోయారు.

ఈ దేశంలో కూడా మతవాదులు బయల్దేరారు. యే మతానికా మతం వాళ్లు తమ మతానికన్యాయం జరిగిపోతోందంటూ గోల పెట్టేశారు. ఎవరికి వాళ్లు తమ మత విశ్వాసాల కనుగుణంగా దేశంలో మత స్వామ్యం తేవడానికి కంకణం కట్టుకున్నారు. కొన్ని మతాలవాళ్ళు ప్రత్యేక దేశం ఏర్పాటు చేసుకుని దేశం నుంచే విడిపోతామన్నారు. దాంతో దేశ పటిష్టతకే భంగం వాటిల్లే ప్రమాదం వచ్చిపడింది.

స్వాతంత్ర్యం వచ్చాక దేశం అవలంబించిన సెక్యులరిజాన్ని మతవాదులు స్వప్రయోజనాలకు బాగా వాడుకోవడం మొదలెట్టారు. ఎవరికి వాళ్ళే ఆయుధాలు ధరించి టెర్రరిజానికి పూనుకున్నారు.

కమ్యూనిస్టు దేశంలో మరో విధమైన పరిణామాలొచ్చాయి. యేళ్ళ తరబడి వ్యక్తి స్వాతంత్ర్యం కోల్పోయిన ప్రజలు రొటీన్ జీవితంలో విసుగెత్తిపోయారు. పొద్దున్నే లేవడం పన్లోకెళ్లడం, సాయంత్రం రేషన్ తెచ్చుకోవడం, వండుకు తినడం, నిద్ర పోవడం – ఇదే జీవితమైంది. ప్రభుత్వం అనుమతించిన పుస్తకాలే చదవాలి. ప్రభుత్వం అనుమతించిన సినిమాలే చూడాలి. జీవితంలో ఎంటర్‌టైన్మెంట్ లేక ముఖ్యంగా యువతరం వాళ్ళు స్తబ్దుగా మారిపోయారు.

కాపిటలిజాన్ని దేశం నుంచి పూర్తిగా తరిమేయడం మొదట్లో గొప్ప ఫలితాలనిచ్చినా దీర్ఘకాలంలో ఆ దేశం ఆర్థిక పరిస్థితి కాపిటలిస్టు దేశాల్లో కంటే వెనుకబడి పోవడం ప్రారంభించింది. కాపిటలిస్టు దేశాల కరెన్సీతో పోలిస్తే ఈ దేశం కరెన్సీ విలువ నానాటికీ తగ్గిపోసాగింది. దేశంలో తలసరి ఆదాయం క్రమంగా పడిపోయింది. నిత్యావసర వస్తువులకు మాత్రమే ప్రజలు తమ కోరికల్ని పరిమితం చేసుకోవల్సి వచ్చింది. అవి కూడా కంట్రోల్ పద్ధతిలోనే లభించడంతో రేషన్ షాపుల ముందు పొడవాటి క్యూలు నానాటికీ పెరిగిపోనారంభించాయి. రోజూ గంటల తరబడి క్యూలో నిలబడ్డం ప్రజల జీవితంలో భాగమైపోయింది. ప్రజలందరూ కమ్యూనిటీ గృహాల్లో నివసించవలసి రావడంతో వొక్కో అపార్టుమెంట్లో నాలుగైదు కుటుంబాల వాళ్ళు కలిసి రోజులు గడపాల్సి వచ్చింది. యేయేటి కాయేడు పెరిగిపోతున్న జనాభాకి కొత్తిళ్లు నిర్మించలేక ప్రభుత్వం హైరానా పడసాగింది. దాంతో ఈ కమ్యూనిస్టు దేశంలో కూడా వొకవిధమైన వర్గభేదం బయల్దేరింది. మంచిళ్ళలో వుండే వాళ్ళు, పోర్షన్స్‌లో తలదాచుకునేవాళ్ళు.

కాపిటలిస్టు – ప్రజాస్వామ్య దేశాల్లో ప్రబలిపోయిన కలర్ టీవీలు, వీడియో క్యాసెట్ రికార్డర్ల వంటి విలాస వస్తువులు కమ్యూనిస్టు దేశాల ప్రజలకు అందని మ్రానిపళ్ళై పోయాయి. దాంతో ఎలెక్ట్రానిక్ వస్తువులు దొంగతనంగా దేశంలోకి స్మగుల్ కావడం మొదలైంది. పాశ్చాత్య సంగీతం కోసం యువత వెర్రెత్తి పోనారంభించింది. బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా తన చుట్టూ ఇనపతెర కట్టుక్కూచోవడంతో ఆధునిక విద్యా సౌకర్యాలు తగ్గనారంభించాయి.

విదేశాల నుంచి మేధావులైన ప్రొఫెసర్లు రావడం ఈ దేశం విద్యార్థులకు పాఠాలు చెప్పడం గానీ ఈ దేశం విద్యార్థులు పై దేశాలకెళ్ళి చదువుకోవడం గానీ లేనేలేదు. మేధావుల్తో సహా ఎవర్ని తమ దేశానికాహ్వానించినా వాళ్లు తమతో కాపిటలిస్టు భావాలు మోసుకొస్తారని ఈ దేశపు ప్రభుత్వం వాళ్లెవర్నీ తన గడ్డమీదకి రానియ్యలేదు. దాంతో ఆ దేశంలో మేధావుల కొరత లేకపోయినా బయటి దేశాల్లో విజ్ఞానం ఎలా అభివృద్ధి చెందుతున్నదో ఈ దేశం విద్యార్థులకు సరైన అవగాహన లేకుండా పోయింది.

చుట్టూ ఇనపగోడ కట్టుక్కూచున్న దేశ ప్రజల పరిస్థితి అద్దాల మేడలో అబ్బురంగా పెరుగుతున్న చిట్టి పాపాయిల కంటే మెరుగేం కాదు. బైటికెళ్తే చెడిపోతారని పిల్లల్ని ఇంట్లో కట్టడి చేసి పెంచితే బయటికెళ్ళే అవకాశం వచ్చినప్పుడు బయటి ఇంద్రధనుస్సు లాంటి రంగు రంగుల మిథ్యా ప్రపంచాన్ని చూసి వాళ్ళు విభ్రాంతి పాలుకాక తప్పదు.

మూడో దేశంలో పరిస్థితి మరీ అన్యాయమై పోయింది. ప్రజలు మతవిధానం మీద రెండు వర్గాలుగా చీలిపోయారు. ఎలాంటి మినహాయింపులకూ తావులేని కరుడు గట్టిన

మత విధానాలు పాటించడం మొదటి వర్గం పాలసీ. దేశ ప్రభుత్వం ఈ మొదటి వర్గానికి చెందిందే. ఆధునిక కాల పరిస్థితులకు అనుగుణంగా మత విధానంలో కొన్ని సడలింపులు రావాలని కోరడం రెండో వర్గం పాలసీ. మత విధానంలో సోషలిస్టు దృక్పథం చోటు చేసుకోవాలని ఈ వర్గం డిమాండ్. అధికార వర్గం ఈ డిమాండ్ పూర్తిగా తోసిపారేసి రెండో వర్గం వాళ్ళని అణచివేయడానికి పూనుకుంది.

అణిచివేత కార్యక్రమాలు ప్రభుత్వం ఎంత తీవ్రంగా చేపట్టిందో రెండో వర్గం పట్ల సామాన్య ప్రజల సానుభూతి అంతగానూ పెరిగింది. రోజుకి రోజు రెండో వర్గంతో సభ్యులు చేరడం ఎక్కువైంది. ప్రభుత్వాన్ని కూలదోయడానికి రెండో వర్గం వాళ్ళు ఆయుధాలు ధరించి మిలిటెంట్ గ్రూప్‌గా తయారవసాగారు. ప్రభుత్వానికీ వీళ్ళకీ మధ్య ఘర్షణ తీవ్రమైపోయింది. రోజు రోజుకీ జైళ్ళు నిండిపోసాగాయి. ఖైదీల మీద అధికార్ల జులుం అమానుషంగా పెరిగిపోయింది. లెక్కలేనన్ని రాజకీయ హత్యలు జరిగాయి. మధ్యలో సామాన్య ప్రజలు నలిగిపోసాగారు.

ఇక మూడు దేశాల్ని వొకేవిధంగా జలగలా పట్టి పీడించడానికి వో కొత్త మహమ్మారి తయారైంది.

కరప్షన్ - లంచగొండితనం

ప్రజాస్వామ్య దేశంతో పాటు అటు కమ్యూనిస్టు దేశంలోనూ ఇటు మతస్వామ్య దేశంలోనూ లంచగొండితనం విపరీతంగా పెరిగిపోయింది.

ప్రజాస్వామ్య దేశంలో నిత్యావసరాలు తీరక కొంతా విలాసవంతమైన జీవితాల కోసం కొంతా అధికారులు లంచగొండితనానికి పాల్పడ్డారు.

కమ్యూనిస్టు దేశంలో ఏళ్ళు గడుస్తున్నా మారని లైఫ్‌స్టైల్ని విలాసాల వైపు మళ్ళించుకోవడానికి అధికార్లు తాపత్రయపడసాగారు. ఎంత పెద్ద పదవిలో వున్న అధికారికైనా సామాన్య ప్రజల్తో పాటే ఆదాయం కాబట్టి కాపిటలిస్టు దేశాల్నించి స్మగులౌతున్న విలాస వస్తువులు కొనడానికి వాళ్లు లంచగొండులయ్యారు.

మతస్వామ్య దేశంలో విపరీతమైన అధికార కేంద్రీకరణ లంచగొండితనానికి దారితీసింది. ఆధునిక భావాల్తో ఎదురు తిరిగిన ప్రజల్ని అణిచేయడమే పనిగా పెట్టుకున్న ప్రభుత్వం అధికార్లకి మితిలేని అధికారాలిచ్చేయడంతో అధికార్లు అధికార దుర్వినియోగం చేస్తూ బాహాటంగా విచ్చలవిడిగా లంచగొండితనానికి పాల్పడ్డారు.

దానికి తోడు మూడు దేశాల్లోనూ విపరీతంగా పెరిగిపోతున్న జనాభా తలసరి ఆదాయాన్ని బాగా పడిపోయేలా చేసి ఆర్థికాభివృద్ధి దెబ్బతీయడంతో మూడు దేశాలూ వొకే రకమైన బరువు కింద కుంగిపోనారంభించాయి.

ఎవర్నీ అడక్కుండా కాలం గడచిపోతూనే వుంది.

యాభై ఏళ్ళు పూర్తి కావస్తున్నాయి.

ముగ్గురు స్నేహితులూ కలుసుకోవల్సిన రోజు దగ్గర పడుతోంది.

అదృష్టవశాత్తూగానో దురదృష్టవశాత్తుగానో ముగ్గురు స్నేహితులు ఇంకా బతికే వున్నారు. యెనభై యేళ్ళు మీద పడుతున్నా ఇంకా బలంగానే వున్నారు. ముగ్గురికీ మూడు విధాల అయోమయం.

తమ దేశాలు పురోగమిస్తున్నాయా? తిరోగమిస్తున్నాయా?

వొక్కటి మాత్రం నిజం. మూడు దేశాలూ సగటున నాలుగడుగులు ముందుకేస్తే ఆరడుగులు వెనక్కి వేస్తున్నాయి. అడుగులేసే నిష్పత్తిలో తేడా – అంతే!

వాళ్లు కల్సుకోవాల్సిన తేదీ మరీ దగ్గరయ్యే సమయానికి హఠాత్తుగా మూడు దేశాల్లోనూ కొన్ని భయంకర సంఘటనలు జరిగిపోయాయి.

ప్రజాస్వామ్య దేశంలో అటు విప్లవకారుల తీవ్రవాదం, ఇటు మతోన్మత్తుల తీవ్రవాదం హద్దు మీరిపోయాయి. తీవ్రవాదులు విచక్షణ పోగొట్టుకుని దారుణంగా హత్యలు చేయడం మొదలెట్టారు. ప్రభుత్వం వాళ్ళని అణిచివేయడానికి తీవ్రంగా ప్రయత్నించసాగింది. పోలీసులు తీవ్రవాదుల్ని అరికట్టలేక తామూ పోరాడుతున్నామని బుకాయించడానికి అమాయకులైన ప్రజల్ని పట్టుకొచ్చి తీవ్రవాదులనే పేరుతో వేల సంఖ్యలో కాల్చి చంపడం మొదలెట్టారు. పోలీసుల్తో పని కాక పోయేసరికి ప్రభుత్వం మిలిటరీని రంగంలోకి దించడానికి సిద్ధపడింది.

కమ్యూనిస్టు దేశంలో నానాటికీ దిగజారి పోతున్న ఆర్థిక పరిస్థితిని సరిదిద్దకపోతే విషమ పరిస్థితుల్ని ఎదుర్కోవల్సిన ప్రమాదం ఏర్పడింది. దాంతో ప్రభుత్వం కొంతవరకైనా ఇనప తెరలు కూల్చక తప్పలేదు. రెండు చేతులూ చాచి కాపిటలిస్టు ప్రపంచాన్ని వ్యాపారం సంబంధాలకు ఆహ్వానించింది. కాపిటలిస్టు దేశాలు తమ వస్తువుల్ని అమ్ముకోవడం కోసం ఈ దేశాన్ని సువిశాలమైన మార్కెట్‌గా వుపయోగించుకొందుకు యెగబడ్డాయి. దాంతో దశాబ్దాలుగా వొకే విధంగా సాగుతూ వచ్చిన ప్రజల జీవన విధానం వొక్కసారిగా స్పీడందుకుంది.

విద్యార్థులకు విదేశాలకెళ్ళి చదూకునే అవకాశం వచ్చింది. అక్కడి ప్రజల స్వేచ్ఛా జీవితం చూశాక, అక్కడి ధనవంతుల విలాసాలు గమనించాక విద్యార్థుల్లో తీవ్రమైన ప్రతిస్పందన కలిగింది. అద్దాల మేడలోంచి అబ్బురాల చిట్టి పాపాయి బయటికొచ్చాడు. రంగు రంగుల ఇంద్రధనుస్సు చూసి విభ్రాంతి పాలయ్యాడు.

ఆ స్వేచ్ఛా ప్రపంచం తమక్కూడా కావాలని వాళ్లు అర్రులు చాచడం మొదలెట్టారు. సహజంగానే కాపిటలిస్టు దేశాల్లో పేద ప్రజల కన్నీళ్ళు వాళ్ళ దృష్టికందలేదు. తమకూ ప్రజాస్వామ్యం కావాలని పట్టుబట్టారు. దేశ రాజధాని నగరంలో వేలకొద్దీ విద్యార్థులు గుమికూడి కమ్యూనిస్టు సిద్ధాంతాలకు తిలోదకాలు వదిలేసి ప్రజాస్వామ్యం కోసం వుద్యమం లేవదీశారు. కొద్ది రోజుల్లోనే రాజధాని నగరం వాళ్ళ స్వాధీనమై పోయింది. దాంతో ప్రభుత్వం అదిరిపోయి బలప్రయోగంతో యువతరాన్ని అణిచివేయాలని తీర్మానించుకుంది.

మతస్వామ్య దేశంలో కూడా పరిస్థితి విషమించింది. ప్రభుత్వ వ్యతిరేక శక్తులు ఆయుధాలు ధరించి పసిపిల్లల్ని కూడా తమ వుద్యమంలో చేర్చడం మొదలెట్టారు. దాంతో ప్రభుత్వం ఒకే దెబ్బతో వుద్యమ కారులందర్నీ తుడిచి పెట్టేయాలని నిర్ణయించుకుంది.

ప్రజాస్వామ్య దేశంలో కమ్యూనిజం కోసమూ మతస్వామ్యం కోసము వుద్యమాలు లేచాయి. కమ్యూనిస్టు దేశంలో విద్యార్థులు ప్రజాస్వామ్యం కావాలన్నారు. మతస్వామ్య దేశంలో వుద్యమ కారులు పరిమిత మత సిద్ధాంతాలూ కమ్యూనిజమూ కలబోసిన ప్రజాస్వామ్య వ్యవస్థ కోరుకున్నారు. పొరుగింటి పుల్లకూర సామెతగా తయారైంది కథ.

❖ ❖ ❖

చివరికో రోజు...

ముగ్గురు స్నేహితులు కలుసుకోవల్సిన రోజింకా కొన్ని వారాలుందనగా...

మూడు దేశాల్లోనూ వొకేసారి ప్రళయం లాంటిది సంభవించింది. ప్రజాస్వామ్య దేశంలో మిలిటరీని రంగంలోకి దించింది. మిలిటరీ వాళ్ళు వొక్కసారిగా మతవాదులు దాక్కున్న దేవాలయాల్లోకి, విప్లవకారులు తలదాచుకున్న అడవుల్లోకి బెటాలియన్లు, బెటాలియన్లు మెషిన్‌గన్లతో దూసుకుపోయారు. రోజులు తరబడి విచక్షణారహితమైన కాల్పులు జరిగాయి. తీవ్రవాదులు వందల సంఖ్యలో హతమయ్యారు. సామాన్య ప్రజలు వేలసంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకున్నారు.

కమ్యూనిస్టు దేశంలో అటు రాజధాని నగరంలోనూ ఇటు విద్యార్థులు ఆందోళన చేస్తున్న ఇతర ముఖ్య పట్టణాల్లోనూ బెటాలియన్లకు బెటాలియన్ల సేన మోహరించింది. విద్యార్థులు రకరకాల ప్రదర్శనలు జరిపి సేనల్ని తిరిగిపొమ్మని కోరారు. కొద్ది రోజుల వరకూ సేనలు ఏమీ చెయ్యలేదు. కొన్ని బెటాలియన్లు విద్యార్థుల మాట విని తిరిగి బారాక్స్‌కి వెళ్ళిపోతున్నట్టుగానే కనిపించాయి. ప్రభుత్వ సైనికుల్ని చూసి విద్యార్థులెంత మాత్రం బెదర్లేదు. దాంతో ప్రభుత్వం నరకానికి ఆహ్వాన గీతం పాడింది.

హఠాత్తుగా ప్రభుత్వ సేనలు విద్యార్థుల మీద విరుచుకుపడ్డాయి. నిండా ఇరువై యేళ్ళు నిండని వేల కొద్దీ పసివాళ్ళ మీదికి టాంకులు నడిచాయి. ఆయుధాల్లేకుండా ప్రశాంతంగా ప్రదర్శనలు జరుపుతున్న విద్యార్థుల మీద మిషన్‌గన్ తూటాలు మిడతల దండులా కమ్ముకున్నాయి. టాంకులు అగ్నివర్షం కురిపించాయి. ఆనాటి సాయంత్రం ప్రారంభమైన మారణకాండ మర్నాడు మధ్యాహ్నం దాకా నిర్విరామంగా సాగుతూనే వుంది. ఆ కాళరాత్రి రాజధాని నగర వీధుల్లో వేలకొద్దీ శవాలు గుట్టలుగా పడ్డాయి.

ఆ తర్వాత కొన్ని గంటల వ్యవధిలోనే రాజధాని నగరాన్ని ప్రభుత్వ సేనలు పూర్తిగా హస్తగతం చేసుకున్నాయి. ప్రజాస్వామ్యం కోసం విద్యార్థుల వుద్యమాన్ని ప్రభుత్వం రాక్షసంగా అణచి పారేసింది. వీధుల్లో పడున్న శవాల గుట్టలన్ని పూడ్చిపడేయడానికి అన్ని బెటాలియన్ల సేనలకూ నాలుగు రోజులకు పైగా పట్టింది.

మతస్వామ్య దేశ ప్రభుత్వం కూడా అందుకేమీ తీసిపోలేదు. వేలకొద్ది సైనికులు ఆందోళన కారుల్ని పట్టుకోవడానికి వీధుల్లోకి నడిచారు. మిలిటరీ వ్యాన్లూ టాంకులూ కవాతు చేస్తున్న సైనికుల్తో పాటు ముందుకు సాగిపోయాయి. వుద్యమకారులు దాక్కున్నారని అనుమానించిన ప్రతి ప్రదేశంలోనూ సైనికులు ప్రవేశించారు. ఈ మెరుపుదాడిలో సామాన్య ప్రజల హాహాకారాలు ఆకాశాన్నంటాయి.

సైనికులు కురిపించిన అగ్నివర్షంలో పసిపిల్లలు సైతం మలమలమాడిపోయారు. వందలాది మంది నిస్సహాయులైన స్త్రీలని ప్రభుత్వ సైనికులు నడివీధుల్లో మానభంగం చేశారు. వీధి వీధిలోనూ మృత్యుదేవత పైశాచిక నృత్యం చేసింది.

విప్లవకాలంలో ప్రజా జీవితాన్ని స్వర్గతుల్యం చేస్తామని శపథాలు చేసుకున్న మూడు దేశ ప్రభుత్వాలూ ప్రజలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయి. ప్రజలకు భద్రత కల్పించే విషయం అటుంచి తామే పూనుకుని నేలమీద నరకాన్ని సృష్టించాయి. మూడు దేశాల్లోనూ వొకే సమయంలో రక్తపుటేరులు ప్రవహించి చరిత్ర పుటల్ని ఎరుపెక్కించాయి.

❖ ❖ ❖

ఆకాశం ఎరుపెక్కింది.

యాభై సంవత్సరాల తర్వాత వాళ్ళు ముగ్గురూ తిరిగి అదే ప్రదేశంలో అదే చోట కలుసుకున్నారు.

తొలినాటి వుత్సాహమూ, వుత్తేజమూ ముగ్గురి వదనాల్లోనూ మచ్చుకైనా లేవు. వృద్ధాప్యంతోనూ, నిరాశతోనూ ముగ్గురూ కుంగిపోయారు.

యెరుపెక్కిన ఆకాశం కొత్తతరానికీ కొత్త పోరాటానికి నాంది పలుకుతున్నట్లుగా వుంది.

అవును కొత్తతరం!

కొత్త పోరాటం!

తమ తరం ముగిసింది!

తమ పోరాటం ముగిసింది!

కొత్త తరం వచ్చింది!

కొత్త పోరాటం వచ్చింది!

వాళ్ళు ముగ్గురి కళ్ళనుంచీ ఒకేసారి కన్నీటి చుక్కలు నేలరాలాయి.

ముగ్గురూ ఒక్కమాట కూడా మాటాడుకోలేదు.

ముగ్గురి చేతులూ కలుసుకున్నాయి.

ఆనందంతో కాదు.

ఆశయ సాధనలో విజయం సాధించామన్న గర్వంతో కాదు.

తాము ముగ్గురూ వోడిపోయారు–

వోడిపోయామన్న దిగుల్తో అంతకన్నా కాదు.

చరిత్ర సత్యం కనుక్కున్న విభ్రమంతో విస్మయంతో చేతులు కలుపుకున్నారు.

ఆ తర్వాత నెమ్మదిగా వెనక్కి తిరిగి ఎవరికి వాళ్లు తమ అంతిమ గమ్యాలవైపు భారంగా సాగిపోయారు.

వాళ్ళ కళ్ళ నుంచి రాలిన కన్నీటి చుక్కలు వాళ్లు కనుక్కున్న చరిత్ర సత్యాన్ని నేలమీద ఆర్ద్రంగా లిఖించాయి.

ఏ దేశంలోనైనా ఎంత గొప్ప ఆశయాలతో ఏర్పాటైన సమాజంలోనైనా – పాలకవర్గం ప్రజల్ని అణిచిపెట్టడానికే ప్రయత్నిస్తుంది.

ప్రజా పోరాటం అనునిత్యం అనివార్యం, ఇదే.... చరిత్ర.

*'ఉదయం' నవతరం వారపత్రిక, 22-9-89*



## దాదా హయాత్ కథలు

ఈ కథలు భారతదేశచరిత్రలో స్వాతంత్ర్యానంతర రెండవదశకు చెందినవి. అంటే అత్యవసరపరిస్థితి చీకటిరోజుల తర్వాతి కాలానికి చెందినవి. స్వాతంత్ర్యానంతర రెండవదశలో భారతదేశంలో రాజకీయంగా చాలా చాలా పరిణామాలు వచ్చాయి. ప్రాంతీయ పార్టీల సుడిగాలి వీచింది. అణగారిన వర్గాల ప్రజల, కుల, మత, జండర్, ప్రాంత, భాషా చైతన్యాలు పెల్లుబికాయి. ఆధిపత్యధోరణి కూడా తక్కువ తినలేదు. రాజకీయ అస్థిరత పెరిగింది. ఏవేవో రాజకీయ పరిణామాలు సంభవిస్తున్నా సామాజిక సమస్యలు మాత్రం అలాగే మిగిలిపోయాయి. పాలకులు మారుతున్నా, నినాదాలు, విధానాలు మారుతున్నా సమస్యలు సమస్యలుగానే కొనసాగుతున్నాయి. కుర్చీలలో కూర్చునేవాళ్ళు మారుతున్నారుగానీ, కుర్చీ స్వభావం మారలేదు. పునాదిలో మార్పులేని రాజ్యస్వభావం ఇలాగే ఉంటుంది. ఈ రాజ్య స్వభావాన్నే హయాత్ తన కథల్లో చిత్రించారు. శాసన, కార్యనిర్వహణ, న్యాయవ్యవస్థలనే మూల స్తంభాలకింద నలిగిపోతున్న మనుషుల బతుకుల చిత్రాలు హయాత్ కథలు.....

◆◆◆

సమాజంలోని ఆర్థిక రాజకీయ సాంఘిక సాంస్కృతిక తాత్విక రంగాలన్నిటినీ అర్థం చేసుకొని, సమాజంలోని అవలక్షణాలనూ, వాటికి మూలాలు గుర్తించి ఆవిష్కరించే అభ్యుదయ సాహిత్య ధోరణకి రాయలసీమ ప్రతినిధి దాదాహయాత్. అక్కడక్కడ కొంత ఊహల్లో విహరించే ఆదర్శీకరణ గుణమున్నా అది అపాయకరం కాదు. కాని హయాత్ కథలలో కొట్టొచ్చేగుణం ఏ సామాజికాంశం పట్ల కూడా పాఠకులను భ్రమకులోను చెయ్యకపోవడం, వాస్తవికతా హద్దులు దాటకపోవడం, కథాశిల్పిగా పాఠకులతో చెలగాటమాడకపోవడం, కథలో పాత్రలలోకి పరకాయ ప్రవేశం చేసి నిమిషనిమిషానికి ఒక తత్వం చెప్పడం, వ్యాఖ్యానాలు చేయడం వంటి అసాహిత్య సాహసాలకు పూనుకోకపోవడం దాదాహయాత్‌లోని మరో సుగుణం.

– డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

అమరావతి పబ్లికేషన్స్
సాయిబాబారోడ్, గుంటూరు-522007